

ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల
ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ
పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో
ఒక పూర్తి పేజీ



epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

గుంటూరు

: fb.com/vaartha Digital

Published from Guntur, Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Ongole, Nizamabad, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

30-5-2026 శనివారం సంపుటి: 32 సంచిక: 119 పేజీలు: 12 వెల: 6.50


## భారత్‌లో ఇక ప్లాస్టిక్ కరెన్సీ!

9లో

## అన్ని అత్యవసర సేవలకు ఒకే నంబర్..112

## సిద్దరామయ్య రాజీనామాకు గవర్నర్ ఆమోదం

9లో



ఢిల్లీకి మారిన కర్ణాటక రాజకీయం

1 లేదా 4న కొత్త సిఎంగా డికె ప్రమాణం

## తీర్పులపై జాప్యం చేయొద్దు



రిజర్వ్ చేసిన కేసులపై 3 నెలల్లో వెలువరించాలి

బెయిలు ఉత్తర్వులపై అదే రోజు నిర్ణయించాలి

హైకోర్టులకు సుప్రీం మార్గదర్శకాలు

**న్యూఢిల్లీ, మే 29:** సకాలంలో న్యాయం జరిగేలా చూడటానికి, రాజ్యాంగంలోని ఆర్టికల్ 21 ప్రకారం వేగవంతమైన విచారణ పొందే ప్రాథమిక హక్కును పరిరక్షించడానికి ఒక ముఖ్యమైన చర్యగా, తీర్పు కోసం రిజర్వ్ చేసిన మూడు నెలల్లోగా తీర్పులను వెలువరించాలని అన్ని హైకోర్టులను ఆదేశిస్తూ సుప్రీంకోర్టు శుక్రవారం సమగ్రమైన, తప్పనిసరి మార్గదర్శకాలను జారీ చేసింది. తీర్పులు వెలువరించడంలో ఆలస్యాన్ని అరికట్టడానికి అన్నిహైకోర్టులకు ఈ తప్పనిసరి ఆదేశాలను జారీ చేయడా >>2

# గోదావరిని కాపాడుదాం



కాలుష్యరహిత గోదావరి పుష్కర నిర్వహణకు కార్యాచరణ ప్రణాళిక

6 జిల్లాల్లో 262 పుష్కర పంచాయతీల గుర్తింపు

పిసిబి నిధులు రూ.100 కోట్లు కూడా

గోదావరి శుద్ధికే వినియోగం: డి.సిఎం పవన్

**విజయవాడ, మే 29,ప్రభాతవార్తప్రతినిధి:** గోదావరి పుష్కరాలను అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించాలని ఏపీ డీసీఎం పవన్ కల్యాణ్ అన్నారు. 'స్వచ్ఛగోదావరి –పవిత్ర పుష్కరాలు' పేరిట రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కార్యాచరణ ప్రణాళికను ప్రకటించారు. పుష్కరాల నిర్వహణ నిమిత్తం ఆరు జిల్లాల పరిధిలో గుర్తించిన 262 పంచాయతీలను మురుగు రహితంగా తీర్చిదిద్దడంతోపాటు గోదావరి నదిలో కాలుష్య కారక వ్యర్థాల విడుదలను నిలువరించేందుకు నిరంతర పర్యవేక్షణా వ్యవస్థలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. గ్రామాలు, పట్టణాల్లో మురుగు నిర్వహణతోపాటు పారిశ్రామిక కాలుష్య పర్యవేక్షణకు ఆర్టీజీఎస్ తరహా కంట్రోల్ రూం ఏర్పాటు చేసి, నిరంతర ప్రత్యక్ష పర్యవేక్షణ వ్యవస్థను ఏర్పాటు చేయాలని సూచించారు. పర్యవేక్షణ బాధ్యతను ప్రధాన నదుల కాలుష్య నివారణకు ఏర్పాటుచేసిన అత్యున్నత స్థాయి టాస్క్ ఫోర్స్‌కి అప్పగించనున్నట్టు స్పష్టం చేశారు. గ్రామాలు, పట్టణాల్లో చేపట్టాల్సిన మురుగు నివారణా చర్యలపై అధికారులకు పవన్ కళ్యాణ్ కీలక ఆదేశాలు జారీ చేశారు. అందుకోసం అవసరం అయితే వీబీజీ రాంజీ, స్వచ్ఛాంధ్ర, కాలుష్య నియంత్రణ మండలి నిధులను కూడా వినియోగించుకోవాలని తెలిపారు. గోదావరి పరీవాహక ప్రాంతంలోని ఆరు జిల్లాల పరిధిలో పుష్కరాల నిర్వహణ నిమిత్తం 262 పుష్కర పంచాయతీలను గుర్తించారు. వీటిని పుష్కరాల నాటికి మురుగు విడుదల రహిత పంచాయతీలుగా తీర్చిదిద్దాలని నిర్ణయించారు. ప్రతి రోజూ గోదావరిలో గ్రామీణ ప్రాంతాల మురుగు 8.38మిలియన్ లీటర్లు కలస్తున్నట్లు గుర్తించారు. ఈ మురుగు నిర్వహణకు అవసరమైన ప్రణాళిక సిద్ధంచేయాలని ఉపముఖ్యమంత్రి స్పష్టంచేశారు. గృహ వినియోగమురుగు నీటి నియంత్రణ, నిర్వహణ కోసం వీబీజీ రాంజీ పథకం కింద మ్యాజిక్ డ్రెయిన్ల నిర్మాణం చేపట్టాలని సూచించారు. బ్లాక్ వాటర్ నిర్వహణ కోసం సామాజిక ఇంకుడు >>2

# ప్రత్యేక గ్రీన్ ఎనర్జీ కారిడార్

18 గిగావాట్ల విద్యుత్ ప్రధాన గ్రిడ్‌కు అనుసంధానం

ప్రభుత్వ భవనాలపై సోలార్ పరికరాలు

'పిఎం సూర్యఘర్' పెద్దఎత్తున అమలు

విద్యుత్‌శాఖపై సమీక్షలో సిఎం చంద్రబాబు



శుక్రవారం అధికారులతో విద్యుత్‌శాఖపై సమీక్షిస్తున్న సిఎం చంద్రబాబు

**విజయవాడ, మే 29,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలో గ్రీన్ ఎనర్జీ కారిడార్ ఏర్పాటు చేసి,ఆ మేరకు విద్యుత్ నెట్ వర్క్‌ను మరింత బలోపేతం చేసే దిశగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని సీఎం చంద్రబాబు నాయుడు స్పష్టం చేసారు. 18 గిగావాట్ల గ్రీన్ ఎనర్జీని ప్రధాన గ్రిడ్‌కు అనుసంధానించేందుకు గ్రీన్ ఎనర్జీ కారిడార్3లో భాగంగా సుమారు రూ.22 వేల కోట్లతో ప్రతిపాదనలు సిద్ధం చేసిందన్నారు. రాష్ట్ర సచివాలయంలో శుక్రవారం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు విద్యుత్ శాఖపై సమీక్షించారు. గ్రీన్ ఎనర్జీ కారిడార్ అంశం సహా విద్యుత్ సరఫరా పరిస్థితి, వచ్చే ఆరునెలల ప్రణాళిక, పీఎం సూర్య ఘర్, పీఎం కుసుమ్, పీఎంఈడ్రైవ్ పథకాల పురోగతి, ఏపీఐఈసీ పాలసీ కింద ఆమోదించిన వివిధ ప్రాజెక్టుల పరిస్థితి, నెడ్‌క్యాప్ బలోపేతం, డిజిటల్ ట్విన్ గ్రిడ్ నిర్మాణం వంటి అంశాలపై చర్చించారు. గ్రీన్ ఎనర్జీ కారిడార్‌లో భాగంగా ట్రాన్స్ మిషన్ నెట్‌వర్క్ విస్తరించే అంశంపై ఎలాంటి చర్యలు తీసుకున్నారని సీఎం చంద్రబాబు అధికారులను అడిగారు. గ్రీన్ ఎనర్జీ కారిడార్ ఫేజ్3 కింద సుమారు 18 గిగావాట్ల గ్రీన్ ఎనర్జీని ప్రధాన గ్రిడ్‌కు అనుసంధానించేందుకు చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. ఈ మేరకు కొత్త ట్రాన్స్ మిషన్ లైన్లు, పూలింగ్ స్టేషన్లను నిర్మించనున్నట్టు వెల్లడించారు. మొత్తంగా 18 గిగావాట్లల్లో సోలార్ ద్వారా ఉత్పత్తి అయ్యే 11 గిగా వాట్ల విద్యుత్‌ను, అలాగే పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్టుల ద్వారా ఉత్పత్తి అయ్యే సుమారు 7 గిగావాట్ల విద్యుత్‌ను ప్రధాన గ్రిడ్‌కు అనుసంధానించేలా చర్యలు తీసుకుంటున్నట్టు అధికారులు వివరించారు. ఈ మేరకు 2,261 కిలో మీటర్ల మేర కొత్తట్రాన్స్ మిషన్ లైన్లు వేయనున్నట్టు వెల్లడించారు. ఈ కారిడార్లో భాగంగా 9,500మెగా వాట్ల సామర్థంతో 5భారీ పూలింగ్ స్టేషన్లను నిర్మించేలా ప్రణాళికలు సిద్ధం చేసినట్టు అధికారులు వెల్లడించారు. ముదిగుబ్బ, తలుపుల, రామాయపట్నం, పోరుమామిళ్ల, కొప్పాక ప్రాంతాల్లో పూలింగ్ స్టేషన్లను నిర్మించనున్నట్టు అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ గ్రీన్ ఎనర్జీలో 160 గిగా వాట్ల ఉత్పత్తికి లక్ష్యం నిర్దేశించుకున్నామని, దానికి అనుగుణంగా నెట్ వర్క్‌ను కూడా అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. ఏపీ గ్రీన్ ఎనర్జీ కారిడార్ పూర్తి అయితే రాష్ట్రంలో డేటా సెంటర్లకు అవసరమైన విద్యుత్‌ను సరఫరా చేసేందుకు ఈ నెట్‌వర్క్ బాగా ఉపకరిస్తుందని అభిప్రాయపడ్డారు. ఇక విద్యుత్ >>2

## అమరావతిలో 'నిఫ్ట్' ఏర్పాటు చేయండి

కేంద్రమంత్రి గిరిరాజ్ సింగ్‌ను కోరిన సిఎం చంద్రబాబు

**విజయవాడ, మే 29,ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్‌లో వేర్వేరు ఉద్యాన పంటల ద్వారా ఉత్పత్తి అవుతున్న ఫైబర్ కు ప్రోత్సహం కల్పించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కేంద్రానికి స్పష్టం చేశారు. ఈ మేరకు సచివాలయంలో శుక్రవారం తనను కలిసిన కేంద్ర జౌళిశాఖ మంత్రి గిరిరాజ్ సింగ్‌తో సీఎం ఈ ప్రతిపాదనలు సమర్పించారు. రాయలసీమ సహా కోస్తాంధ్ర ప్రాంతాల్లో సాగు చేస్తున్న వివిధ పంటల ద్వారా పీచు, నార, ఫైబర్ ఉత్పత్తి అవుతుందని, దీనిని వాణిజ్య స్థాయిలో విలువ జోడించేందుకు ఉన్న అవకాశాలు పరిశీలించాలని సీఎం కోరారు. పీచు వెలికితీతతో పాటు వస్త్ర పరిశ్రమకు ఉపయోగపడే ఉద్యానవన పంటల నివేదికను సీఎం చంద్రబాబు కేంద్ర మంత్రికి సమర్పించారు. కడప, అనంతపురం, నంద్యాల, పశ్చిమ గోదావరి, కృష్ణా, తూర్పుగోదావరి లాంటి అరటి >>2

# జౌళి రంగంలోఎపి కీలకం

రాష్ట్రంలో పత్తి ఉత్పత్తి పెంచేందుకు చర్యలు

మొత్తం రూ.11వేల కోట్ల ప్రోత్సాహకాల్లో ఎపికి అధిక భాగస్వామ్యం

ఎగుమతులు, మౌలిక వసతుల్లో పురోగతి: కేంద్ర జౌళి మంత్రి గిరిరాజ్ సింగ్



శుక్రవారం గోశాలను పరిశీలిస్తున్నకేంద్ర చేనేత జౌళి మంత్రి గిరిరాజ్ సింగ్

**విజయవాడ, మే 29,ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని జౌళి రంగంలో ప్రముఖ కేంద్రంగా తీర్చిదిద్దేందుకు అన్ని విధాల కృషి చేస్తామని కేంద్ర చేనేత జౌళిశాఖ మంత్రి గిరిరాజ్ సింగ్ పేర్కొన్నారు. రాష్ట్రంలో రెండు రోజుల పర్యటనలో భాగంగా తొలిరోజు శుక్రవారం ఉదయం కేంద్ర మంత్రి కృష్ణాజిల్లా గన్నవరంలోని విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయానికి చేరుకొని అటు నుంచి నేరుగా బాపులపాడు మండలంలోని మల్లవల్లి పారిశ్రామికవాడలో ఉన్న స్పిన్ టెక్స్ ఇండియా ప్రైవేట్‌లిమిటెడ్ పరిశ్రమను సందర్శించారు. రాష్ట్ర బీసీ ఈడబ్ల్యూఎస్ సంక్షేమం చేనేత జౌళిమంత్రి సవిత, స్పిన్ టెక్స్ ఇండియా లిమిటెడ్ ఎండి వల్లభనేని సుధాకర్ చౌదరి మంత్రికి పుష్పగుచ్ఛాలు అందజేసి స్వాగతం పలికారు అనంతరం కేంద్రమంత్రి స్పిన్ టెక్స్ ప్రాంగణంలో పారిశ్రామికవేత్తలతో సమావేశం నిర్వహించి పట్టు పరిశ్రమ తదితర పరిశ్రమల ఏర్పాటుపై చర్చించారు.గోశాలలను పరిశీలించారు.ఈ సందర్భంగా కేంద్రమంత్రి మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో రెండురోజుల పర్యటనకు వచ్చానని అందులో మొదటిరోజు విజయవాడలోనూ రెండవ రోజు విశాఖపట్నంలో పర్యటిస్తున్నామన్నారు. ముఖ్యమంత్రినీ కలిసి, ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్‌ను ఒక జౌళిరంగ ప్రముఖ రాష్ట్రంగా ఎలా అభివృద్ధి చేయవచ్చనే విషయంపై చర్చిస్తామన్నారు. ముఖ్యంగా పత్తి (కాటన్) విషయంలో ప్రపంచవ్యాప్తంగా హెక్టారుకు 2000 కిలోల దిగుబడి వస్తుండగా, భారతదేశంలో మాత్రంసగటు 450కిలోల మాత్రమే వస్తోందన్నారు. ఈ పరిస్థితిని ఎలా మార్చాలి? విత్తనాల (సీడ్స్ )విషయంలో ప్రత్యేక విధానం అవసరమా? రాష్ట్రంలో పత్తి ఉత్పత్తి >>2



## జూన్ 1 నుంచి విశాఖ జోన్

దక్షిణ మధ్య రైల్వే కుదింపు

**ప్రభాతవార్త విశాఖపట్నం:** దేశ రైల్వే వ్యవస్థలో తెలుగు రాష్ట్రాలకు కీలక ప్రాధాన్యం కల్పిస్తూ కేంద్ర రైల్వేశాఖ సంచలన నిర్ణయాలు తీసుకుంది. విశాఖపట్నం కేంద్రంగా కొత్త దక్షిణ కోస్తా రైల్వే జోన్ కార్యకలాపాలకు జూన్ 1నుంచి శ్రీకారం చుట్టనుండగా, దక్షిణ మధ్య రైల్వే జోన్ పరిధి భారీగా కుదించబడుతోంది. ఈ మేరకు రైల్వే శాఖ అధికారికంగా కీలక ప్రతిపాదనలను ఖరారు చేసింది. ఇప్పటి వరకు దక్షిణ మధ్య రైల్వే పరిధిలో ఉన్న విజయవాడ, గుంటూరు, గుంతకల్ డివిజన్లు కొత్తగా ఏర్పడుతున్న దక్షి ణ కోస్తా రైల్వే జోన్‌లోకి మారనున్నాయి. అలాగే వాల్తేరు డివిజన్ స్థానంలో విశాఖపట్నం డివిజన్‌ను ఏర్పాటు చేస్తున్నారు. దీంతో కొత్త జోన్ పరిధిలో మొత్తం నాలుగు డివిజన్లు ఉండనున్నాయి.ఇకపై దక్షిణ మధ్య రైల్వే జోన్ సికింద్రాబాద్, హైదరాబాద్, నాందేడ్ డివిజన్లకే పరిమితం కానుంది. జోన్ పరిధి 6,637 ట్రాక్ కిలోమీటర్ల నుంచి 3,589 ట్రాక్ కిలోమీటర్లకు తగ్గిపోనుంది. దీంతో దక్షి ణ మధ్య రైల్వే పరిపాలనలో భారీ మార్పులు చోటు చేసుకోనున్నాయి.కొత్త జోన్ ఏర్పాటుతో రైల్వే డివిజన్ల సరిహద్దులు, రైళ్ల నిర్వహణ, ఆదాయం పంపకం, సిగ్నలింగ్ వ్యవస్థలలో >>2

# రాష్ట్రానికి 750 ఎలక్ట్రిక్ బస్సులు



శుక్రవారం క్యాంపు కార్యాలయంలో అధికారులతో సమీక్షిస్తున్న కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్

గుంటూరు, విజయవాడకు 100 చొప్పున, మంగళగిరికి 50 బస్సులు మంజూరు

ప్రధానమంత్రి ఎలక్ట్రిక్ బస్సు సేవ ద్వారా కేటాయింపులు : కేంద్ర మంత్రి పెమ్మసాని

**గుంటూరు, మే 29 ప్రభాత వార్త ప్రతినిధి :** ఆంధ్రప్రదేశ్‌లో ప్రజా రవాణా వ్యవస్థను మరింత ఆధునీకరించే దిశగా కేంద్ర ,రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో ఎలక్ట్రిక్ బస్సుల ప్రవేశానికి కీలక అడుగులు పడుతున్నాయి. ఈ నేపథ్యంలో కేంద్ర గ్రామీణాభివృద్ధి , కమ్యూనికేషన్స్ శాఖల సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ ఆధ్వర్యంలో ఆర్టీసీ, ట్రాన్స్‌కో తదితర శాఖల అధికారులతో సమీక్ష సమావేశం పెమ్మసాని క్యాంపు కార్యాలయంలో శుక్రవారం నిర్వహించారు.ప్రధానమంత్రి ఎలక్ట్రిక్ బస్సు సేవ పథకం ద్వారా అందనున్న ఈ ఎలక్ట్రిక్ బస్సులకు గాను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమన్వయంతో నిధులను అందిస్తున్నాయి. తద్వారా ఆంధ్రప్రదేశ్‌లోని 11నగరాలకు ఈ ఎలక్ట్రిక్ >>2

# నైరుతి 10 రోజులు లేటు!



జూన్ 4,5 తేదీల్లో కేరళ తీరానికి

మరో రెండు రోజులు వడగాడ్పులు

**హైదరాబాద్, మే 29, ప్రభాతవార్త:** నైరుతి రుతుపవనాలు ఈ యేడాది పదిరోజులు ఆలస్యం కానున్నాయి. నైరుతి రాక ఇంకాస్త ఆలస్యం అవుతుందని తాజాగా ఐఎండి ప్రకటించింది. జూన్ 4, 5 తేదీల్లో నైరుతి రుతుపవనాలు కేరళ తీరాన్ని తాకే అవకాశం ఉందని, జూన్ రెండో వారంలో అంటే జూన్ 10 నాటికి తెలంగాణను తాకనున్నాయి. ఈ నేపథ్యంలో రుతుపవనాల రాక గతంలో కంటే పదిరోజులు ఆలస్యమయ్యే అవకాశం ఉంది. గతేడాది మే 31 నుండి జూన్ 1 మధ్య రుతుపవనాలు తెలంగాణను తాకాయి. దేశంలో నైరుతి రుతుపవనాల గమనం రెండు, మూడు రోజుల్లో మరింత ముందుకు సాగడానికి >>2

## మాజీ మంత్రి గాదె వెంకటరెడ్డి కన్నుమూత

ఉమ్మడి ప్రకాశం జిల్లాకు తీరని లోటు

**చీరాల, మే 29, ప్రభాతవార్త :** మాజీ మంత్రివర్యులు, సీనియర్ రాజకీయ నాయకులు గాదె వెంకటరెడ్డి శుక్రవారం హైదరాబాద్ లో కన్నుమూశారు. ఆయన మరణవార్త ఉమ్మడి ప్రకాశం జిల్లా రాజకీయవర్గాలలో తీవ్ర విషాదాన్ని నింపింది. ఆయన మరణవార్త తెలిసిన వెంటనే పలువురు రాజకీయ, సామాజిక ప్రముఖులు సంతాపం వ్యక్తం చేశారు. గాదె వెంకటరెడ్డి (1940) ఉమ్మడి ప్రకాశంజిల్లా ఇంకొల్లు మండలం పావులూరు గ్రామంలోని సాధారణ మధ్యతరగతి వ్యవసాయ కుటుంబంలో >>2



గాదె వెంకటరెడ్డి (ఫైల్)

## ఎపి పిజి సెట్‌లో 91.55% ఉత్తీర్ణత

**విజయవాడ,మే 29,ప్రభాతవార్తప్రతినిధి:** ఏపీ పీజీసెట్ ఫలితాలను విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ విడుదల చేశారు 91.55 శాతం ఉత్తీర్ణత నమోదు కావడం మన యువత కృషి, పట్టుదలకు నిదర్శనమన్నారు. ఉన్నత విద్య, పరిశోధన రంగాల్లో ప్రతివిద్యార్థి ఉన్నత శిఖరాలను అధిరోహించాలనిఆకాంక్షించారు. పరీక్షలను విజయవంతంగా, పారదర్శకంగా నిర్వహించిన అధికారులు, సిబ్బందిని మంత్రి ప్రత్యేకంగా అభినందించారు. వెబ్‌సైట్‌లో ర్యాంకు కార్డులు పొందవచ్చని అలానే వాట్సప్‌నంబర్ 9552300 009ద్వారా కూడా పొందే వీలుందని తెలిపారు.

# సైబర్ నేరాల అడ్డుకట్టకు 'ఎపి సైబర్ గార్డ్'



శుక్రవారం సైబర్ నేరాలపై పోలీసు అధికారులతో సమీక్షిస్తున్న సిఎం చంద్రబాబు

ప్రజలను నిత్యం అప్రమత్తం చేయాలి

సైబర్ పెట్రోలింగ్ జరగాలి

మోసాలపై ఫిర్యాదు అందిన మరుక్షణమే వార్‌రూంలో జీరో ఎఫ్ఐఆర్

పోలీసుశాఖ కార్యాచరణపై సమీక్షలో సిఎం చంద్రబాబు

**విజయవాడ, మే 29, ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలో సైబర్ నేరాల అడ్డుకట్టకు జీరో ఎఫ్ఐఆర్ విధానం అమల్లోకి తేవాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సూచించారు. బాధితులు సైబర్ వార్ రూమ్‌కు ఫోన్ చేసిన వెంటనే జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేయడం ద్వారా బ్యాంకులను అప్రమత్తంచేసి గోల్డెన్ అవర్ టైంను వినియోగించుకుని అకౌంట్ల నుంచి డబ్బులు బదిలీ కాకుండా చూడాలని సూచించారు. సైబర్ నేరాల అడ్డుకట్టకు బ్యాంకులూ సహరించాలన్నారు. సైబర్ నేరాలపై అన్ని వర్గాల ప్రజలను నిత్యం అప్రమత్తం చేయాలని, అవగాహనా కార్యక్రమాలు పెంచాలని సీఎం సూచించారు. పోలీస్ పెట్రోలింగ్ తరహాలోనే సైబర్ పెట్రోలింగ్ జరగాలని, ప్రజలు సైబర్ నేరగాళ్ల బారిన పడకుండా చూడాలని సీఎం సూచించారు. నేరం జరిగిన తరువాత ఫిర్యాదు రావడం, పోలీసులు విచారణ జరపడం కంటే అసలు నేరమే జరిగే అవకాశం లేకుండా ప్రజలను చైతన్య పరచాలని సూచించారు. రిటైర్డ్ ఉద్యోగులను టార్గెట్‌గా చేసుకుని జరుగుతున్న నేరాలపట్ల వారికి >>2

## పెట్టుబడుల ఆకర్షణలో తమిళనాడుకు ఎపి పోటీ

మంత్రి లోకేష్

**విజయవాడ మే 29 ప్రభాతవార్త ప్రతినిధి:** పెట్టుబడుల ఆకర్షణలో ఆంధ్రప్రదేశ్ కచ్చితంగా తమిళనాడుకు ఆరోగ్యకరమైన పోటీ ఇస్తుందని మంత్రి లోకేశ్ పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన ఎక్స్‌లో పోస్ట్ చేశారు. పెట్టుబడిదారులను ఉద్దేశించి తమిళనాడు పరిశ్రమలశాఖ మంత్రి కీర్తన మాట్లాడిన వీడియోను ట్యాగ్ చేశారు. పెట్టుబడులను రాబట్టడంలో చొరవ చూపుతున్న మిమ్మల్ని అభినందిస్తున్నా. ప్రతి మంత్రి తమ రాష్ట్రాన్ని మార్కెటింగ్ చేసుకోవడంపై దృష్టి పెట్టాలి. పెట్టుబడిదారులతో చర్యలు జరపడం, ఉపాధి కల్పించే వారిలో >>2

# సిఎం చంద్రబాబును కలిసిన వరల్డ్ ఎకనమిక్ ఫోరం బృందం

**విజయవాడ,మే 29,ప్రభాతవార్తప్రతినిధి:** వరల్డ్ ఎకనమిక్ ఫోరం ప్రతినిధుల బృందం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతో భేటీ అయింది. ఆంధ్రప్రదేశ్‌లో ఏర్పాటు చేసిన దేశంలోనే తొలి థీమాటిక్ సెంటర్ ఫర్‌ఫోర్త్ ఇండస్ట్రియల్ రెవెల్యూషన్ సీ4ఐఆర్ అమలు చేయాల్సి న కార్యాచరణపై ఈ బృందం చర్చించింది. సీ4ఐఆర్ ఏర్పాటుపై ఏపీ ట్రాన్స్ కోవరల్డ్ ఎకనమిక్ ఫోరంతో గతంలోనే ఒప్పందం కుదిరింది. గ్రీన్ ఎనర్జీ, ఎనర్జీ ట్రాన్సిషన్, సైబర్ రెసిలియెన్స్ వంటి రంగాలపై సీ4ఐఆర్ అధ్యయనం చేయనుంది. రాష్ట్రాన్ని గ్రీన్ ఎనర్జీ, డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్, సైబర్ సెక్యూరిటీ రంగాల్లో ప్రపంచ స్థాయి కేంద్రంగా తీర్చిదిద్దాలని ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు సూచించారు. వివిధ రకాల విద్యుత్ ఉత్పత్తి మోడళ్లను పూర్తి స్థాయిలో అధ్యయనం చేసి బెస్ట్ మోడల్ తయారు చేయాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. విశాఖ డేటా సెంటర్ కారిడార్, గ్రీన్ హైడ్రోజన్ పెట్టుబడులు, పునరుత్పాదక ఇంధన సామర్థ్యాన్ని సీ4ఐఆర్ కార్యాచరణతో అనుసంధానం చేయాలని సూచించారు. రిజల్ట్ ఓరియెంటేషనుతో సీ4ఐఆర్ పని చేయాలని సీఎం ఆదేశించారు. వచ్చే దావోస్ సదస్సు నాటికి ఏపీ సాధించిన పురోగతిని ప్రదర్శించే స్థాయికి తీసుకెళ్లాలని సీ4ఐఆర్‌కు సీఎం సూచించారు. ఈ సమావేశంలో మంత్రి గొట్టిపాటి రవి కుమార్, సీఎస్ సాయిప్రసాద్, విద్యుత్, ట్రాన్స్ కో, జెన్కో, డిస్కంలకు చెందిన ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## ప్రత్యేక గ్రీన్‌ఎనర్జీ కారిడార్

>> మౌలిక సదు పాయాలు పెరిగితే ఆయా రంగాల్లో పెట్టుబడులు కూడా పెద్ద ఎత్తున వస్తాయని సూచించారు. ఈ ప్రాజెక్టును మొదలు పెట్టడంతోపాటు టైమ్ బౌండ్ కార్యక్రమంగా పెట్టుకుని పూర్తి చేయాలని సీఎం ఆదేశించారు. సమీక్షలో భాగంగా పీఎం సూర్యఘర్, పీఎం కుసుమ్ వంటి పథకాల అమలుపై సీఎం అధి కారులతో చర్చించారు. అలాగే ప్రభుత్వ భవనాల సోలారైజేషన్ పనులు ఎంత వరకు వచ్చాయని అధికారులను ముఖ్యమంత్రి అడిగి తెలుసుకున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 200మెగా వాట్ల సామర్థ్యంతో ప్రభుత్వ భవనాల సోలారైజేషన్ ప్రక్రియను మొదలు పెట్టినట్టు అధికారులు వెల్లడించారు. నెట్ మీటరింగ్ విధానంలో సోలార్ ప్యానెల్స్ ఏర్పాటు చేయనున్నట్టు అధికారులు తెలిపారు. పైలట్ ప్రాజెక్ట్ కింద చిత్తూరు జిల్లాలోని 78 గురుకుల పాఠ శాలలు, వసతి గృహాలను ఎంపిక చేసినట్టు చెప్పా రు. అలాగే నెట్ జీరో విధానంలో హెల్తీ క్యాంపస్ లను తీర్చిదిద్దేలా సోలార్ ప్యానెళ్ల ఏర్పాటు చేసేందుకు 2,898 హాస్టళ్లు, స్కూళ్లల్లో గుర్తిం చినట్టు అధికారులు సీఎం దృష్టికి తెచ్చారు. ప్రభుత్వ కార్యాలయాల్లో, స్కూళ్లలో సోలార్ వినియోగం పెరిగితే.. ప్రభుత్వంపై విద్యుత్ భారం తగ్గుతుందని సీఎం చెప్పారు. ఈ విషయంలో అధికారులు పూర్తిగా ఫోకస్ పెట్టాలని స్పష్టం చేశారు. పీఎం సూర్యఘర్ పథకం అమల్లో ఏపీ నాలుగో స్థానంలో ఉందని అగ్రస్థానంలో ఉండేలా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎస్సీ, ఎస్టీలకు సంబంధించి 1,35,821 ఇళ్లకు సోలార్ ప్యానెళ్లు అమర్చామని, మిగిలిన వాటిని ఆగస్టు నెలాఖరులోగా పూర్తి చేయాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు. ఇక బీసీ వర్గాలకు రూ. 20 వేల సబ్సిడీతో 10 లక్షల ఇళ్లకు సోలార్ ప్యానెళ్లను బిగించాలని లక్ష్యంగా పెట్టుకున్నామని, వీటిని కూడా త్వరితగతిన పూర్తి చేయాలని సీఎం సూచించారు. ఇక రాష్ట్రంలో ఈవీ ఛార్జింగ్ స్టేషన్ల ఏర్పాటు ప్రక్రియను వేగవంతం చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. 131 ప్రాంతాల్లో 577 ఈవీ ఛార్జింగ్ స్టేషన్ల ఏర్పాటుకు సంబంధించిన ప్రక్రియను ప్రారంభించినట్టు అధికారులు వెల్లడించారు. స్టాన్‌ఫోర్డ్ యూనివర్సిటీకి చెందిన ప్రవాహ్ సంస్థ ద్వారా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ల్యాబ్ సహకారంతో, ఏపీఈపీడీసీఎల్ పరిధిలో విద్యుత్ సాంకేతిక నష్టాలను తగ్గించేలా చర్యలు తీసుకుంటున్న విధానాన్ని అధికారులు ప్రజెంట్ చేశారు. ఈ తరహాలో విద్యుత్ సరఫరా కోసం దేశంలోనే మొదటిసారిగా డిజిటల్ ట్విన్ గ్రిడ్ రూపొందిస్తున్నట్టు అధికారులు వెల్లడించారు. ఈ సమీక్షలో భాగంగా విద్యుత్ డిమాండ్ ఏ మేరకు ఉందనే విషయాన్ని అధికారులు సీఎంకు వివరించారు. జూన్ 2026 నుంచి నవంబర్ 2026 వరకు రాష్ట్రంలో గరిష్ట విద్యుత్ డిమాండ్ 12,226 మెగావాట్లకు చేరి, రోజువారీ డిమాండ్ 226 నుంచి 261 మెగా యూనిట్లు వరకు ఉండే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. మే 21న రాష్ట్రంలో అత్యధికంగా 15,016 మెగావాట్ల గరిష్ట డిమాండ్ నమోదైందని చెప్పారు. మే 27వరకు 7,060 మెగాయూనిట్ల విద్యుత్ వినియోగం జరిగిందని అధికారులు వెల్లడించారు. 2025తో పోలిస్తే ఏప్రిల్-మే 2026 కాలంలో గరిష్ట డిమాండ్ 14.48శాతం నుంచి 16.77శాతానికి విద్యుత్ వినియోగంపెరిగిందని అధికారులు చెప్పారు.

రైతులకు ఆర్థికంగా లబ్ధికలిగే సీబీజీ(కంప్రెస్డ్ బయో గ్యాస్)ప్లాంట్ల ఏర్పాటును ప్రోత్సహించేలా చర్యలు తీసుకోవాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు.



శుక్రవారం న్యూఢిల్లీలో కాంగ్రెస్ పార్టీ అగ్రనాయకుడు రాహుల్ గాంధీతో వైఎస్ షర్మిల

# రాహుల్ గాంధీతో వైఎస్ షర్మిల భేటీ

**విజయవాడ,మే29,ప్రభాతవార్తప్రతినిధి:** కాంగ్రెస్ పార్టీ అగ్రనాయకుడు రాహుల్ గాంధీతో ఏపీ పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల భేటీ అయ్యారు. కర్ణాటకలో త్వరలో రాజ్యసభ ఎన్నికలు జరుగనున్నాయి. ఇలాంటి సమయంలో ఆమె పార్టీ అగ్రనాయకుడితో భేటీ కావడం ప్రాధాన్యతను సంతరించుకుంది. ఢిల్లీలో జరిగిన ఈ భేటీలో ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణు గోపాల్ ఉన్నారు. కర్ణాటక నుంచి రాజ్యసభ సీటును షర్మిల కోరుతున్నట్లు మీడియాలో ప్రచారం సాగుతోంది.

వైఎస్సార్‌టీపీని కాంగ్రెస్ పార్టీలో విలీనం చేసిన సమయంలో షర్మిలకు కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానం రాజ్యసభ సీటును హామీ ఇచ్చిందని తెలుస్తోంది. ఇప్పుడు కర్ణాట కలో రాజ్యసభ ఎన్నికలు ఉన్న నేపథ్యంలో, ఏపీలో పార్టీని బలోపేతం చేయడానికి, రాజ్య సభలో కాంగ్రెస్ తరఫున ఏపీ గొంతును విని పించడానికి తనకు రాజ్యసభ సీటును ఇవ్వాలని ఆమె కోరుతున్నారని తెలుస్తోంది.

## అమరావతిలో 'నిఫ్ట్' ఏర్పాటు చేయండి

>> పండించే జిల్లాలలో పోస్ట్‌హార్వెస్ట్ విలువ ఆధారిత ప్రక్రియగా అరటి కాండం పీచు వెలికితీత కేంద్రాలను ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఉద్యాన శాఖ సమన్వయంతో స్వయం సహాయక సంఘాల కోసం క్లస్టర్ ఆధారిత మెకానికల్ డెకోర్టికేటర్ యూనిట్లను ప్రోత్సహించేలా సహకారం అందించాలని సీఎం కోరారు. ప్రస్తుతం ఏపీలో 1,29,931 హెక్టార్లలో అరటి సాగవుతోందనీ. పంట కోత తర్వాత కాండం పూర్తిగా వృధాగా పోకుండా. సెల్యులోజిక్ పీచు ద్వారా పర్యావరణ అనుకూల ఫైబర్ తయారు అవుతుందనివివరించారు. వస్త్ర పరిశ్రమలో జనపనారతో సమానంగా ఇది ఉపకరిస్తుందని తెలిపారు. హస్తకళలు, జియో టెక్స్‌టైల్స్, ప్రత్యేక పేపర్, ఎగుమతి రకం దుస్తుల తయారీకి వనరుల లభ్యత ఉందని వివరించారు. వస్త్ర పరిశ్రమతో పీపీపీ భాగస్వామ్యాల ద్వారా వెదురుకు సంబంధించిన మెకానికల్ ఫైబర్ ప్రాసెసింగ్ యూనిట్లనుఏర్పాటు చేయాలని సీఎం ప్రతిపాదించారు. తద్వారా గిరిజన, మెట్ట ప్రాంత రైతులకు 30 ఏళ్ల పాటు నిరంతర ఆదాయం లభిస్తుందనీ సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు.

**కుప్పంలో పీఎం మిత్రా పార్కు,అమరావతిలో నిఫ్ట్ ఏర్పా టుకు సహకారం:** ఏపీతో పాటు తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల వస్త్ర పరిశ్రమ క్లస్టర్లకు సమీపంలో ఉన్న కుప్పంలో పీఎం మిత్రా పార్కును ఏర్పాటు చేయాలని సీఎం విజ్ఞప్తి చేశారు. 35 వేల పవర్ లూమ్ లు, 100కు పైగా స్పిన్నింగ్ మిల్లులు ఉన్నాయని తెలిపారు. ఫైబర్ టు ఫ్యాషన్ కు అనుకూలించేలా ఈ పీఎం మిత్రా పార్కు 2.0 ఏర్పాటు చేయాలని కోరారు. అమరావతిలో నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫ్యాషన్ టెక్నాలజీని ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు కోరారు. దీనికి అవసరమైన రూ.280 కోట్ల నిధులు విడుదల చేయాలని కేంద్ర మంత్రిని సీఎం కోరారు. నిఫ్ట్ కోసం అమరావతిలో 10 ఎకరాల భూమిని కేటాయించినట్టు వివరించారు. అలాగే ఏపీలోని వివిధ వస్త్ర పరిశ్రమ క్లస్టర్లలో ఇంటిగ్రేటెడ్ వెట్ ప్రాసెసింగ్ పార్కులు ఏర్పాటు చేయాలని కోరారు. ఈ పార్కుల ద్వారా ఎండ్ టూ ఎండ్ ప్రాసెసింగ్ పెరిగి రవాణా ఖర్చులు తగ్గుతాయని వివరించారు. నేషనల్ న్యూ ఏజ్ ఫైబర్ మిషన్ కింద ఏపీని ప్రాధాన్యతా రాష్ట్రంగా గుర్తించాలని కోరారు. తద్వారా అరటి పీచు లాంటి ఫైబర్ కు విలువ జోడించేందుకు ఆస్కారం ఉంటుందని అన్నారు. వివిధ చేనేత క్లస్టర్లలో అరటి ఫైబర్ తో బ్లెండ్ చేసిన నూలు వినియోగించేందుకు అవకాశం ఉంటుందని అన్నారు. నేషనల్ హ్యాండ్లూమ్ డెవలప్మెంట్ ప్రోగ్రామ్ కింద మంగళగిరి లో 22.36 కోట్ల తో చేనేత పార్కు ఏర్పాటు చేయాలని సీఎం చంద్రబాబు కోరారు.

అలాగే అమరావతిలో చేనేత హస్త కళల మ్యూజియం ఏర్పాటుకు సహకారం ఇవ్వాలని విజ్ఞప్తిచేశారు. ఈ ప్రతిపాదనలపై సానుకూలంగా స్పందించిన కేంద్ర మంత్రి ఏపీకి పూర్తి సహకారం అందిస్తామని స్పష్టం చేశారు.



శుక్రవారం సిఎం చంద్రబాబుతో భేటీ అయిన కేంద్రమంత్రి గిరిరాజ్ సింగ్

# గోదావరిని కాపాడుదాం

>> గుంతల తరహా నిర్మాణాలు, ఇండివిడ్యువల్ హౌస్ హోల్డ్ ట్విన్ పిట్స్ చేపట్టాలని తెలిపారు. మున్సిపాలిటీలు, పారిశ్రామిక, గ్రామీణ ప్రాంతాలతో పాటు గోదావరి నదిలో కలుపుతున్న ఆక్వా కాలుష్యం ప్రమాదకర స్థితికి చేరినట్టు పీసీబీ అధికారుల పరిశీలనలో తేలింది. ఆరు జిల్లాల పరిధిలోని మున్సిపాలిటీల నుంచి సుమారు రోజుకి 104మిలియన్ లీటర్ల మురుగునీరు జీవ నదిని కలుషితం చేస్తోంది. గ్రామీణ ప్రాంతాల నుంచి ప్రతిరోజు మరో 8.38 మిలియన్ లీటర్ల మురుగు నీరు, పారిశ్రామిక వ్యర్థాలు కూడా పెద్ద ఎత్తున నదిలో కలిపేస్తున్నారు. అందులో ఒక్క ఆంధ్రపేపర్ మిల్స్ నుంచే రోజుకి 32మిలియన్ లీటర్ల వరకు వ్యర్థాలు విడుదల అవుతున్నాయి. కోనసీమ, పశ్చిమ గోదావరి జిల్లాల నుంచి నిత్యం విడుదల అవుతున్న 13.24 మిలియన్ లీటర్ల ఆక్వా కాలుష్యం వీటికి అదనం. ప్రజారోగ్యం, భద్రత దృష్ట్యా గోదావరి జలాలను కలుషితం చేస్తున్న మురుగు, పారిశ్రామిక, ఆక్వా వ్యర్థాల రూపంలో వెదజల్లే కాలుష్య నివారణకు అధికారులు తక్షణం చర్యలు తీసుకోవాలని ఉప ముఖ్యమంత్రి ఆదేశించారు. ప్రస్తుతం రాజమహేంద్రవరం కార్పొరేషన్ నుంచి రోజుకి 75 మిలియన్ లీటర్ల మురుగు ఉత్పత్తి అవుతుండగా అందులో 50 మిలియన్ లీటర్లు నేరుగా గోదావరి నదిలోకి విడుదల చేస్తున్నారు. తణుకు మున్సిపాలిటీల నుంచి రోజుకి సుమారు 11.1 మిలియన్ లీటర్లు, భీమవరం నుంచి 14 మిలియన్ లీటర్లు, నరసాపురం నుంచి 8.5 మిలియన్ లీటర్లు, కొవ్వూరు నుంచి 6 మిలియన్ లీటర్ల వ్యర్థ జలాలు యనమదుర్రు, గోస్తనీ తదితర డ్రెయిన్ల ద్వారా గోదావరిలోకి విడుదల చేస్తున్నారు. ఇతర మున్సిపాలిటీల నుంచి కూడా గోదావరి నదిలోకి నిత్యం మురుగునీటి విడుదల కొనసాగుతోంది. పట్టణ ప్రాంతాల నుంచి విడుదలయ్యే మురుగునీటిని శుద్ధి చేసిన అనంతరం మాత్రమే గోదావరిలోకి విడుదల చేసే విధంగా చర్యలు తీసుకోవాలని పవన్ కళ్యాణ్ సూచించారు. ఇందుకోసం ప్రతి మున్సిపాలిటీ పరిధిలో సామర్థ్యానికి అనుగుణంగా మురుగు శుద్ధి కేంద్రాల (ఎస్టీపీ) నిర్మాణం చేపట్టాలని ఆదేశించారు. ఇప్పటికే గోదావరి కాలుష్య నియంత్రణ నిమిత్తం కాలుష్య నియంత్రణ మండలి ద్వారా మంజూరు చేసిన రూ. 100 కోట్ల నిధులతోపాటు అవసరం అయితే స్వచ్ఛాంధ్ర నిధులు కూడా వినియోగించుకుంటూ దశల వారి ప్రణాళికలు అమలు చేయాలని తెలిపారు. సింగిల్ యూజ్డ్ ప్లాస్టిక్ వినియోగంపై దశలవారీ నిషేధాన్ని కట్టుదిట్టంగా అమలు చేయాలని గోదావరి పరివాహక మున్సిపాలిటీలన్నింటిలో ఆదేశాలు జారీచేశారు. కంట్రోల్ రూంలో ప్రాంతాలవారీగా స్క్రీన్లు ఏర్పాటు చేసి, వాటిని సీసీ కెమెరాలతో అనుసంధానించాలని తెలిపారు. ఎక్కడెక్కడ మురుగు శుద్ధిచేస్తున్నారు. ఎక్కడైనా నేరుగా గోదావరి నదిలోకి మురుగుని వదులుతున్నారా తెలుసుకుని, ఎప్పటికప్పుడు ఆదేశాలు ఇచ్చేవ్యవస్థలు ఏర్పాటు చేయాలని సూచించారు.

## రాష్ట్రానికి 750 ఎలక్ట్రిక్ బస్సులు

>> బస్సులు మంజూరయ్యాయి.మొత్తం వెరసి 750 బస్సులను ఆంధ్రప్రదేశ్ కు తీసుకురాబోతున్నారు. ఈ సమీక్షలో ఎలక్ట్రిక్ బస్సుల వివరాలు, మౌలిక వసతుల ఏర్పాటు, ఛార్జింగ్ స్టేషన్లు, విద్యుత్ సరఫరా అంశాలపై విస్తృతంగా చర్చించారు. ముఖ్యంగా పట్టణ ప్రాంతాల్లో కాలుష్యాన్ని తగ్గించడంతో పాటు, ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు కల్పించే దిశగా ఈ ఎలక్ట్రిక్ బస్సులు ఉపయోగపడనున్నాయని అధికారులు అభిప్రాయపడ్డారు.అదేవిధంగా బస్సుల నిర్వహణకు అవసరమైన డిపోలు, ఛార్జింగ్ మౌలిక వసతులు, విద్యుత్ లోడ్ సామర్థ్యంపై ట్రాన్స్కో అధికారులు వివరాలు సమర్పించారు. త్వరితగతిన అన్ని ప్రక్రియలు పూర్తి చేసి, 2026 ఏడాది చివరికల్లా ఈ బస్సులను ప్రజలకు అందుబాటులోకి తీసుకు రావాలని అధికారులను పెమ్మసాని చంద్రశేఖర్ ఆదేశించారు. ఈ బస్సులకుగానూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా అందించబోవు నిధులలో గుంటూరుకు సంబంధించిన సివిల్ వర్క్ లకు రూ. 16.3 కోట్లు, ఎలక్ట్రికల్ కు సంబంధించి రూ. 11.19 కోట్లు వెరసి గుంటూరుకు రూ. 27.49 కోట్లు, మంగళగిరికి కేటాయించిన బస్సులలో సివిల్ వర్కులకు రూ. 9.24 కోట్లు, అలాగే ఎలక్ట్రికల్ వరకులకుగానూ రూ. 7.01 కోట్లు వెరసి రూ. 10.98 కోట్లు నిధులు అందనున్నాయి. విశాఖపట్నం, విజయవాడల,గుంటూరు, నెల్లూరు నగరాలకు 100 చొప్పున. కర్నూలు, కాకినాడ, రాజమహేంద్రవరం, కడప, అమరావతి, తిరుపతి, అనంతపురం పట్టణాలకు 50 చొప్పున మొత్తం 750 బస్సులు మంజూరు అయ్యాయి. ఈ సమీక్ష సమావేశంలో ఏపీ సీపీడీసీఎల్ టెక్నికల్ డైరెక్టర్ మురళీకృష్ణ యాదవ్, ఏపీఎస్ఆర్టీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ జి.వి రవివర్మ, చీఫ్ ఇంజనీర్ వెంకటరమణ, గుంటూరు ఎలక్ట్రికల్ ఎస్ఈ రమేష్, ఏపీ ట్రాన్స్‌కో ఎస్ ఈ సి.హెచ్.ఎన్. వెంకట్రావు, ఏపీసీపీడీసీఎల్ ఎస్ ఈ ఎం శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

# జౌళి రంగంలో ఏపి కీలకం

>> అత్యధికంగా ఎలా పెంచాలి? అనే అంశాలపై చర్చించామన్నారు. ఆంధ్రప్రదేశ్ చేనేత రంగానికి ఎంతో ప్రసిద్ధి చెందిందన్నారు. ఇటీవల ఒక క్లస్టర్‌ను తాము ఆమోదించామన్నారు. మరో క్లస్టర్‌ను కూడా అభివృద్ధి చేయాలని భావిస్తున్నామన్నారు. ఇప్పటివరకు చేనేత రంగానికి పేరుగాంచిన ఆంధ్రప్రదేశ్, ఇకపై జౌళి రంగంలో కూడా ప్రముఖ కేంద్రంగా ఎదగాలన్నది తమ లక్ష్యమన్నారు. ముఖ్యంగా సాంకేతిక పరంగా జౌళి రంగం ప్రపంచవ్యాప్తంగా వేగంగా అభివృద్ధి చెందుతోందన్నారు. రేపు తాను విశాఖపట్నంలో గ్లాస్ ఫైబర్ యూనిట్‌ను ప్రారంభించబోతున్నానన్నారు. గ్లాస్ ఫైబర్, కార్బన్ ఫైబర్, గ్రాఫీన్ వంటి ఆధునిక రంగాల్లో అవకాశాలు ఎక్కువగా ఉన్నాయన్నారు. భారత ప్రభుత్వం జౌళి రంగానికి రూ.10,860 కోట్ల పీఎల్ఐ (ప్రొడక్షన్ లింక్డ్ ఇన్సెంటివ్) ప్రకటించిందన్నారు. అందులో ఆంధ్రప్రదేశ్ ఎక్కువ వాటా పొందాలని ముఖ్యమంత్రినీ కోరబోతున్నామన్నారు. మొత్తం రూ.11 వేల కోట్ల ప్రోత్సాహకాల్లో రాష్ట్రం అధిక భాగస్వామ్యం పొందడం అవసరమన్నారు. ఈ విషయాన్ని చెప్పేందుకే తాను వచ్చానని. ఇంకా కొన్ని చిన్న చిన్న అంశాలపై కూడా చర్చిస్తామన్నారు. భారత ప్రధాని నరేంద్ర మోదీ ప్రభుత్వ 12 ఏళ్ల పాలనలో ప్రజల్లో ఆశను నింపారన్నారు. దేశ ఆర్థిక వ్యవస్థ ఎంతగానో అభివృద్ధి చెందిందన్నారు. కరోనా సమయంలో ప్రపంచవ్యాప్తంగా ఆర్థిక వృద్ధి ఆగిపోయిందనీ, మోదీజీ నాయకత్వంలో భారత్ అభివృద్ధిని కొనసాగించిందన్నారు. మోదీజీ 2047 లక్ష్యంగా పని చేస్తున్నారనీ. అనాటికి భారత్ ప్రపంచంలో అగ్రగామి దేశాల్లో ఒకటిగా నిలుస్తుందనే నమ్మకం తనకు ఉందన్నారు.

తదుపరి స్పింటెక్స్ పరిశ్రమ ప్రాంగణంలో కేంద్ర మంత్రి మొక్కలు నాటి, పుంగనూరు ఆవులను, దూడలను ఎంతో ఆప్యాయంగా నిమురుతూ ప్రతి ఇంట్లోనూ చిన్న పాటి పరిమాణంలో ఉన్న ఇటువంటి పుంగనూరు ఆవులను పెంచుకోవాలన్నారు. అనంతరం పుంగనూరు ఎద్దులను, ఒంగోలు గిత్తలను పరిశీలించారు. తదనంతరం కేంద్ర మంత్రి ప్రాంగణంలోని జౌళి పరిశ్రమ యూనిట్ సందర్శించి తయారీ విధానాన్ని అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో కేంద్ర మంత్రిని అనుసరించి రాష్ట్ర చేనేత జౌళి శాఖ కమిషనర్ రేఖారాణి, కృష్ణ జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ, కేంద్ర సిల్క్ బోర్డ్ సభ్య కార్యదర్శి సిఈఓశివకుమార్, డైరెక్టర్ గిరీష, కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ప్రతినిధి నీరబ్ కుమార్, కేంద్ర జౌళి కార్పొరేషన్ గుంటూరు డివిజనల్ కార్యాలయ డిప్యూటీ డైరెక్టర్ ధనశేఖరన్, చేనేత జౌళి శాఖ సహాయ సంచాలకులు వనజ, సాయిప్రసాద్, డిఐసి జీఎం వెంకటరావు, ఏపీఐఐసీ డిప్యూటీ జోనల్ మేనేజర్ జ్యోతి, డి ఎల్ డి ఓ సునీత శర్మ, డిఎల్ పి ఓ సంపత్ కుమారి, గన్నవరం డిఎస్పి శ్రీనివాస్, స్పెంటెక్స్ డైరెక్టర్ రవికుమార్, స్పిన్నింగ్ మిల్ అసోసియేషన్ మాజీ ఛైర్మన్ పున్నయ్య చౌదరి తదితర అధికారులు, అనధికారులు పాల్గొన్నారు.

# సైబర్ నేరాల అడ్డుకట్టకు 'ఏపి సైబర్ గార్డ్'

>> అవగాహన కల్పించాలని సీఎం సూచించారు. సైబర్ నేరాల అడ్డుకట్టకు తీసుకుంటున్న చర్యలపై సీఎం చంద్రబాబు సచివాలయంలో ఉన్నతాధికారులతో సమీక్షి ంచారు. 6 పిల్లర్ రెస్పాన్స్ టీమ్స్‌తో వివిధ రకాల సైబర్ నేరాలకు అడ్డుకట్ట వేసేందుకు తాము సిద్ధం చేస్తున్న ప్రణాళికలను ముఖ్యమంత్రికి డీజీపీ వివరించారు.

**28 జిల్లాల్లో సైబర్ యూనిట్లు, 4 రీజనల్ హబ్‌లు :** ఈ సమావేశంలో డీజీపీ హరీష్ కుమార్ గుప్తా మాట్లాడుతూ "సైబర్ నేరాలను అరికట్టేందుకు సిక్స్ పిల్లర్ వ్యవస్థలతో ఏపీ సైబర్ గార్డ్ అనే సమగ్ర సైబర్ భద్రతా వ్యవస్థను ఏర్పాటు చేస్తున్నాం. 6 పిల్లర్ సైబర్ భద్రతా వ్యవస్థలో సైబర్ వార్ రూం, 1930 కాల్ సెంటర్ డాష్ బోర్డ్, టెక్నాలజీ ఏఐ, కెపాసిటీ బిల్డింగ్, 3టైర్ ఆర్కిటెక్చర్, ప్రజా చైతన్యం వంటి కార్యక్రమాలు చేపడతామన్నారు. 6 పిల్లర్స్ కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర స్థాయిలో ఒక సైబర్ వార్ రూంను ఏర్పాటు చేస్తున్నాం. దీని కోసం మంగళగిరిలోని ప్రభల టెక్ పార్క్‌లో ఇప్పటికే భవనాన్ని ఎంపిక చేశాం. 1930 హెల్ప్‌లైన్‌తో సమగ్ర డ్యాష్‌బోర్డ్ తీసుకువస్తున్నాం. ఫిర్యాదు వచ్చిన 10 నిమిషాల్లో బ్యాంకును సంప్రదించి నిందితుని అకౌంట్లో డబ్బులు ఫ్రీజ్ చేసేలా వ్యవస్థను ఏర్పాటు చేస్తున్నాం. సైబర్ నేరాలపై టెక్నాలజీ ఏఐ ఉపయోగించుకునేందుకు ఆర్బీఐ, ప్రముఖ బ్యాంకులతో కలిసి మూల్‌హంటర్ ఏఐ అమలు దిశగా చర్యలు తీసుకువస్తున్నామన్నారు. కెపాసిటీ బిల్డింగ్‌లో భాగంగా ఏడాది కాలంలో 500 మంది పోలీసు అధికారులకు సైబర్ క్రైంపై ట్రైనింగ్ ఇస్తాం. 3 టైర్ ఆర్కిటెక్చర్ ద్వారా 28 జిల్లాల్లో సైబర్ యూనిట్లతో పాటు 4 చోట్ల రీజనల్ హబ్‌లను ఏర్పాటు చేస్తామన్నారు. అధికారులు ఇచ్చిన సమాచారంపై సీఎం చంద్రబాబు మాట్లాడుతూ రాష్ట్రాన్ని సైబర్ నేరాల రహిత రాష్ట్రంగా మార్చాలి. దీని కోసం అన్ని బ్యాంకర్లు,పోలీసు విభాగం, ఏపీటీఎస్, ఆర్థిక శాఖలు సమన్వయంతో పనిచేయాలి. ముఖ్యంగా డిజిటల్ అరెస్టు విషయంలో విద్యావంతులు సైతం మోసపోతున్నారని డిజిటల్ అరెస్టులేదనే విషయాన్ని ప్రజల్లో నాటుకుపోయేలా చేయాలి.డిజిటల్ అరెస్టులని ఫోన్ చేసేవాళ్ల అరెస్టై తీరాలన్నారు.

సచివాలయంలో జరిగిన సమీక్షకు సీఎస్ సాయి ప్రసాద్, డీజీపీ హరీష్ కుమార్ గుప్తా, సీఐడీ చీఫ్ రవిశంకర్ అయ్యన్నార్, ఈగల్ చీఫ్ ఆకే రవికృష్ణ, స్పెషల్ సెక్రటరీ విజయ్ కుమార్ పాటు పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# తీర్పులపై జాప్యం చేయొద్దు

>> నికి సుప్రీంకోర్టు రాజ్యాంగంలోని ఆర్టికల్ 142 కింద తన అధికారాలను ఉపయోగించుకుంది. జార్ఖండ్ హైకోర్టు క్రిమినల్ అప్పీళ్లలో తీర్పులు వెలువరించడంలో చూపుతున్న విపరీతమైన ఆలస్యానికి సంబంధించిన రిట్ పిటిషన్‌పై విచారణ జరుపుతున్నప్పుడు, భారత ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్, జస్టిస్ జయమాల్య బాగ్చి, జస్టిస్ విపిన్ ఎం. పంచోలిలతో కూడిన ధర్మాసనం ఈ ఆదేశాలను జారీ చేసింది. రిజర్వ్ చేసిన తీర్పులను వెలువరించడంలో ఆలస్యం వ్యాజ్యదారులకు, ముఖ్యంగా వ్యక్తిగత స్వేచ్ఛ ప్రమాదంలో ఉన్నవారికి నష్టం కలిగిస్తుందని కోర్టు నొక్కి చెప్పింది. ఒక విషయాన్ని తీర్పు కోసం రిజర్వ్ చేసిన తర్వాత, హైకోర్టు రిజర్వేషన్ తేదీ నుండి మూడు నెలలలోపు తీర్పును వెలువరించాలని సుప్రీంకోర్టు ఆదేశించింది.

## తమిళనాడుకు ఏపి పోటీ

>> నమ్మకాన్ని పెంపొందించడం చాలా అవసరం దేశ అభివృద్ధిని వేగవంతం చేయడంలో రాష్ట్రాలు చొరవ చూపడాన్ని ప్రధాని నరేంద్ర మోదీ కూడా ప్రోత్సహిస్తారు అని లోకేశ్ పేర్కొన్నారు. లోకేశ్ పోస్టుకు కీర్తన స్పందించారు. తమిళనాడు ప్రజలకు ముఖ్యంగా నేను ప్రాతినిధ్యం వహిస్తున్న యువతకు అవకాశాలు కల్పించడానికి చిత్తశుద్ధి వినయం పట్టుదలతో కష్టపడి పనిచేస్తూనే ఉంటాను అని పేర్కొన్నారు.

# నైరుతి పది రోజులు లేటు

>> పరిస్థితులు పూర్తిగా అనుకూలంగా ఉన్నట్లు వాతావరణ శాఖ వెల్లడించింది. ప్రస్తుతం నైరుతి, ఆగ్నేయ అరేబియా సముద్రంలోని మరికొన్ని ప్రాంతాలు, లక్షద్వీప్ పరిసరాలు, అలాగే నైరుతి, తూర్పుమధ్య, పశ్చిమమధ్య బంగాళాఖాతంతో పాటు ఆగ్నేయ బంగాళాఖాతంలోని మిగిలిన భాగాలు, ఈశాన్య బంగాళాఖాతంలోని కొన్ని ప్రాంతాలకు రుతుపవనాలు మరింత విస్తరించేందుకు మార్గం సుగమమైంది. దేశవ్యాప్తంగా పలు ప్రాంతాల్లో ఎల్‌నినో ప్రభావంతో ఈ యేడాది వర్షపాతం తక్కువగా నమోదయ్యే అవకాశం ఉందని వాతావరణశాఖ పేర్కొంది. జూన్‌లోనూ యుపి, హరియాణా, పంజాబ్, బిహార్, ఆంధ్రప్రదేశ్, ఒడిశా, గుజరాత్, ఛత్తీస్‌గఢ్‌లోని పలు ప్రాంతాల్లో వడగాలులు వీచే అవకాశం ఉందని తెలిపింది. ఈ పరిస్థితుల్లో రుతుపవనాలు వచ్చే లోపు తెలుగు రాష్ట్రాల్లో ఎండల తీవ్రత మరింత పెరిగే ప్రమాదం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించింది.

## జూన్ 1 నుంచి విశాఖ జోన్

>> మార్పులు అమలులోకి రానున్నాయి. గుంటూరు డివిజన్‌లోని పగిడిపల్లి- విష్ణుపురం-జాన్‌పహాడ్ సెక్షన్, గుంతకల్ డివిజన్ పరిధిలోని రాయచూరు-వాడి సెక్షన్‌ను సికింద్రాబాద్ డివిజన్‌లో విలీనం చేయాలని అధికారులు నిర్ణయించారు.తాజా మార్పులతో సికింద్రాబాద్ డివిజన్ పరిధి మరో 204 కిలోమీటర్ల మేర పెరగనుంది. దీంతో రైళ్ల రాకపోకలు, సిగ్నలింగ్ సమన్వయం వంటి అంశాల్లో అదనపు ఒత్తిడి పెరిగే అవకాశం ఉందని రైల్వే వర్గాలు భావిస్తున్నాయి.ఇప్పటికే దక్షి ణ కోస్తా రైల్వే జోన్‌కు జనరల్ మేనేజర్‌తో పాటు వివిధ విభాగాధిపతుల నియామకాలు పూర్తయ్యాయి. 128 గెజిటెడ్, 1100 నాన్‌గెజిటెడ్ పోస్టులను రైల్వే బోర్డు మంజూరుచేయగా, ఉద్యోగుల కేటాయింపు ప్రక్రియ కూడా పూర్తయింది. దీంతో జూన్ 1నుంచి కార్యకలాపాలు ప్రారంభించనుంది.

# మాజీ మంత్రి గాదె వెంకటరెడ్డి కన్నుమూత

>> జన్మించారు. న్యాయశాస్త్ర పట్టా పొందిన అనంతరం ఒంగోలు కేంద్రంగా కొంతకాలం న్యాయవాద వృత్తిని నిర్వహించారు. రాజకీయాలపై ఆసక్తితో కాంగ్రెస్ పార్టీలో చేరి ప్రజాసేవలో అడుగుపెట్టారు. 1967లో పర్చూరు నియోజకవర్గం నుండి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేసి తొలిసారిగా ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. అనంతరం మరో రెండుసార్లు పర్చూరు నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహించారు. 2004లో రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో డాక్టర్ దగ్గుబాటి వెంకటేశ్వరరావుకు పర్చూరు కాంగ్రెస్ టికెట్ కేటాయించడంతో, బాపట్ల నియోజకవర్గం నుండి 2004 మరియు 2009 అసెంబ్లీ ఎన్నికలలో పోటీచేసి వరుస విజయాలు సాధించారు. కోట్ల విజయభాస్కర్ రెడ్డి, నేదురుమల్లి జనార్దన్ రెడ్డి, డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి, కొణిజేటి రోశయ్య మంత్రివర్గాలలో ఎక్సైజ్, దేవాదాయ ధర్మాదాయ, స్టాంపులు తదితర శాఖల మంత్రిగా సేవలందించారు. ప్రజా సమస్యల పరిష్కారంలో చురుకైన నాయకుడిగా గుర్తింపు పొందారు. వీరాంజనేయమ్మతో కలిసి కుటుంబ జీవితాన్ని కొనసాగించిన గాదె వెంకటరెడ్డి దంపతులకు ముగ్గురు కుమారులు ఉన్నారు. దీర్ఘకాలం కాంగ్రెస్ పార్టీలో కొనసాగిన గాదె వెంకటరెడ్డి రాష్ట్ర విభజన అనంతర రాజకీయ పరిణామాలతో మనస్తాపానికి గురయ్యారు. ఆ సమయంలో నారా చంద్రబాబు నాయుడు ఆహ్వానంమేరకు తెలుగుదేశం పార్టీలో చేరారు. అనంతరం కొన్ని రాజకీయ కారణాలవల్ల 2020లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరడం జరిగింది. ఏ పార్టీలో ఉన్నా మానవతా విలువలు, ఇచ్చిన మాట నిలబెట్టుకునే నిబద్ధత ఆయన ప్రత్యేకతగా నిలిచాయి. డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో క్యాబినెట్ సమావేశాల మధ్యలో కూడా గాదె వెంకటరెడ్డి వచ్చిన విషయం తెలిసిన వెంటనే వారిని ప్రత్యేకంగా లోపలకు ఆహ్వానించి, తన పక్కనే కూర్చోబెట్టి మాట్లాడేవారని ఆయనకు ఉన్న ప్రత్యేక గౌరవాన్ని పలువురు గుర్తు చేస్తున్నారు. సాధారణంగా క్యాబినెట్‌సమావేశాలకు ఎమ్మెల్యేలను కూడా అనుమతించని పరిస్థితుల్లో గాదె వెంకటరెడ్డికి దక్కిన ఆత్మీయత ఆయన రాజకీయ ప్రాధాన్యతకు నిదర్శనమని పేర్కొంటున్నారు. ఆయన అడుగుజాడల్లో నడిచి రాజకీయంగా ఎదిగిన నాయకులు నేడు సమాజంలో ఉన్నత స్థానాల్లో కొనసాగుతున్నారు. ఉమ్మడి ప్రకాశంజిల్లా, ప్రస్తుత బాపట్ల జిల్లాలో అనేక మంది ప్రముఖ నాయకులు ఉన్నప్పటికీ, సామాన్య ప్రజలను ఆప్యాయంగా పలకరించి దగ్గరికి తీసుకునే వ్యక్తిత్వం గాదె వెంకటరెడ్డి ప్రత్యేకతగా నిలిచిందని ప్రజలు భావోద్వేగంతో స్మరించుకుంటున్నారు. గాదెవెంకటరెడ్డి మరణం ఉమ్మడి ప్రకాశంజిల్లా రాజకీయాలకు తీరని లోటని పలువురు నేతలు, అభిమానులు ఆవేదన వ్యక్తం చేశారు.

## మద్యం కేసులో శివశంకర్‌రెడ్డిని విచారించిన సిట్

**విజయవాడ,మే 29,ప్రభాతవార్తప్రతినిధి:** మద్యం కేసులో శివశంకర్‌రెడ్డిని సిట్ విచారించింది. శివశంకర్‌రెడ్డిని 8 గంటలపాటు సిట్ అధికారులు విచారించగా, శివశంకర్‌రెడ్డి పేరుతో కేఎన్‌ఆర్ ఆస్తులు కొనుగోలు చేసినట్లు సిట్ భావిస్తుంది. మద్యం ముడుపుల సొమ్ముతో కేఎన్‌ఆర్ ఆస్తులు కొనుగోలు చేసినట్లు సిట్ భావించింది. ఆస్తుల వివరాలు, డబ్బు ఎలా తెచ్చారంటూ శివశంకర్‌రెడ్డిని సిట్ అధికారులు ప్రశ్నించినట్లు సమాచారం.

## ఉచ్చులు, ట్రాప్‌లను తొలగించిన సిబ్బందికి అభినందనలు తెలిపిన డి.సిఎం పవన్

**విజయవాడ,మే 29,ప్రభాతవార్తప్రతినిధి:** రంపచోడవరం అడవుల్లో ఉచ్చులు, ట్రాప్‌లను తొలగించిన సిబ్బందికి డిప్యూటీ సీఎం పవన్ అభినందనలను తెలియజేశారు. వన్యప్రాణి సంరక్షణలో అటవీ సిబ్బంది పని తీరు ప్రశంసనీయమని కొనియాడారు పవన్ కల్యాణ్ కొనియాడారు. హనుమాన్ ఫౌండేషన్ స్ఫూర్తితో క్షేత్రస్థాయి సిబ్బంది కృషి చేస్తున్నారన్నారు. రంపచోడవరం అడవుల్లో దుండగులు ఉచ్చులు, ట్రాప్‌లను ఏర్పాటు చేశార న్నారు. ఉచ్చులు, ట్రాప్‌లు నిర్వీర్యం చేసి వన్యప్రాణాలకు రక్షణ కల్పించారన్నారు. మూడురోజుల పాటు కఠినమైన పరిస్థితుల మధ్య శ్రమిం చారని వివరించారు. మెత్తంగా 242 ఉచ్చులు, 10 ఫుట్ ట్రాప్‌లను నిర్వీర్యం చేశారన్నారు. 10 కిలోమీటర్ల పొడవు ఉన్న కరెంటు తీగలు తొలగించారని ప్రశంసించారు. అయితే అడవుల రక్షణ, వన్యప్రాణుల సంరక్షణ పట్ల సిబ్బంది అప్రమత్తతో ఉండాలని పవన్ సూచించారు. ఒక రెస్క్యూ ఆపరేషన్ అని ఈ సందర్భంగా పవన్ అభిప్రాయపడ్డారు.

## వారం - వర్జ్యం

30-05-2026, అధికజ్యేష్ఠ శనివారం
శ్రీ పరాభవ నామ సంవత్సరం,
అధిక జ్యేష్ఠమాసం, ఉత్తరాయణం
గ్రీష్మ ఋతువు, శుక్లపక్షం, రోహిణి కార్తె
చతుర్దశి ఉ.11.59
విశాఖ మ.1.21
వర్జ్యం : సా.5.49-రా.7.37
దు.తె.5.33-ఉ.7.13
రాహుకాలం - ఉ.9.00-10.30

## వార్తాఫలం

**మేషం:** కొన్ని అవినీతి కాండలకు సంబంధించిన విషయముల సెగ మిమ్ములను ఇబ్బంది పెడుతుంది.

**వృషభం:** కుటుంబము నందు ముఖ్య అనుబంధము కలిగిన వారి ఆరోగ్యము కుదుట పడుతుంది. వస్త్రలాభం.

**మిథునం:** ఆలోచనలతో మీ మనస్సును ఆందోళనకు గురిచేయకండి. పెద్దలతో సంభాషించునప్పుడు సంయమును పాటించండి.

**కర్కాటకం:** ఉద్యోగము నందు బదిలీకి పెట్టుకున్న అభ్యర్థన అనుకూలిస్తుంది. ఆర్థికముగా పరిస్థితి మెరుగు పడుతుంది.

**సింహం:** ఆహారమును స్వీకరించుటయందు తగిన జాగ్రత్తలను పాటించండి. క్రయ విక్రయాలలో ప్రోత్సాహము.

**కన్య :** గతములో మీరు పోగొట్టుకున్న ఉద్యోగము తిరిగి పొందుగలుగుతారు. విందు, వినోదాలలో పాల్గొంటారు.

**తుల:** చాలా కాలముగా పరిష్కారము గాని ఆర్థిక సమస్య ఈ రోజు నెరవేరుతుంది. సేవా కార్యక్రమములో పాల్గొంటారు.

**వృశ్చికం:** మీ మాటకు మంచితనమునకు బంధువులో మంచి పేరు లభిస్తుంది. స్థిరాస్తి విషయములో ఒక నిర్ణయమునకు వస్తారు.

**ధనుస్సు:** వ్యాపార సంబంధమైన కాగితములు, డాక్యుమెంట్‌లు మొదలగు నవి అందుతాయి. జీవిత భాగస్వామ్య నుండి ధనలాభం.

**మకరం:** సభలకు, సమావేశములకు, ఆహ్వానములకు అందుకుంటారు. స్త్రీల ఆభరణములను గురించి శ్రద్ధను వహిస్తారు.

**కుంభం:** వ్యక్తిగత సంభాషణల ద్వారా, ప్రత్యర్థుల రహస్య కార్యకలాపములను బయటపడతాయి. భూములు కొనుగోలు.

**మీనం:** మనస్సుకు ఇష్టము లేకపోయినా వృత్తిపరమైన బాధ్యతలను అశ్రద్ధ చేయవలసి ఉంటుంది. వివాదాలకు దూరంగా ఉండండి.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

30-5Pg3exHMNWJQER_30-5Pg3exHMNWJQER.qxd 5/30/2026 12:34 AM Page 1



## తిరుమల సమాచారం



### దివ్యరథంపై బంగారు గొడుగు

**తిరుపతి, మే 29 ప్రభాతవార్త ప్రతినిధి:** తిరుపతి గోవిందరాజస్వామికి జరుగుతున్న వార్షిక బ్రహ్మోత్సవాల్లో భగవంతుడు ఊరేగే వాహనాల్లో రథోత్సవం అన్నివిధాలా శ్రేష్టమైంది. "రథస్తం కేశవం దృష్ట్వా పునర్జన్మ విద్యతే" అనే ఆర్షవాక్కులు రథోత్సవం మోక్షప్రదాయకమని వివరిస్తాయి. ఆత్మరథికుడు, శరీరమే రథం. బుద్ధి సారధి, మనస్సు పగ్గం. ఇంద్రియాలే గుర్రాలు. విషయాలే వీధులు. ఈ రీతిలో శరీరాన్ని రథంలో పోల్చడంతో స్థూలశరీరం వేరని, సూక్ష్మశరీరం వేరని, ఆత్మ అందుకు భిన్నమనే ఆత్మానాత్మ వివేకం కలుగుతుంది. గోవిందరాజస్వామి అధిరోహించే రథంపై బంగారు గొడుగును అమర్చారు. కల్యాణకట్టమిరాశీదారుడు పంతులుగారి రామనాథం ఆధ్వర్యంలో బంగారు గొడుగును ఊరేగింపుగా ఆలయ మాఢవీధుల్లో తీసుకొచ్చి రథంపై ప్రతిష్టింపజేశారు. ఈ కార్యక్రమంలో రాయలసీమ రంగస్థల ఛైర్మన్ గుండాల గోపీనాథరెడ్డి, నాయీబ్రాహ్మణ కార్పొరేషన్ ఛైర్మన్ సదాశివం తదతరులు పాల్గొన్నారు.

### తిరుమల కొండంతా జనం

**తిరుమల, మే 29 ప్రభాతవార్త ప్రతినిధి:** వేసవి సెలవులు ముగుస్తుండటం, వారాంతం రావడంతో తిరుమలలో భక్తుల రద్దీ విపరీతంగా ఉంది. శుక్రవారం కూడా శిలాతోరణం వరకు సర్వదర్శనం క్యూలైన్లు వ్యాపించాయి. ఉదయం 6 గంటల సమయానికే ఉచిత సర్వదర్శనం కోసం వచ్చిన భక్తులతో వైకుంఠం క్యూ కాంప్లెక్స్ కంపార్ట్‌మెంట్లు అన్నీ నిండిపోయి, క్యూలైన్లు శిలాతోరణం వరకు కిలోమీటర్ల మేర విస్తరించాయి. ఉదయం 8 గంటల తర్వాత క్యూలైన్లలోకి ప్రవేశించిన భక్తులకు శ్రీవారి సర్వదర్శనానికి దాదాపు 24గంటల సమయం పడుతుంది. ఎస్ఇడి దర్శనాలు ఆరుగంటలు సమయం పడుతుండగా టైమ్‌స్లాట్ భక్తులకు పదిగంటలపైగానే నిరీక్షిస్తున్నారు. శుక్రవారం సాయంత్రం వరకు 49వేలమంది భక్తులు మహాలఘులో స్వామివారిని దర్శించుకున్నారు.



### టిటిడికి విరాళాల వెల్లువ

**తిరుమల, మే 29 ప్రభాతవార్త ప్రతినిధి:** ధార్మికసంస్థ టిటిడికి దాతలు తమ వంతూగా పలు రకాలుగా విరాళాలందించారు. శుక్రవారం హైదరాబాద్‌కు చెందిన ఇందు డ్రగ్స్ ప్రైవేట్ లిమిటెడ్ డైరెక్టర్ తలశిల వేంకటేశ్వరరావు తిరుపతిలోని టిటిడి సెంట్రల్ ఆసుపత్రికి రూ.7.50 లక్షల విలువైన ఔషధాలను విరాళమిచ్చారు. దాత తరఫున టిటిడి బోర్డు సభ్యుడు నన్నపనేని సదాశివరావు టిటిడి చైర్మన్ క్యాంపు కార్యాలయంలో చైర్మన్ బి.ఆర్. నాయుడుకు విరాళాన్ని అందజేశారు. గుంటూరుకు చెందిన డాక్టర్ అన్నం శ్రీనివాస్ టిటిడి వేంకటేశ్వర ప్రాణదాన ట్రస్టుకు రూ.15,00,116 లక్షలు విరాళంగా అందించారు. దాత తరఫున టిటిడి బోర్డు సభ్యుడు నన్నపనేని సదాశివరావు శ్రీవారి ఆలయంలోపల రంగనాయకుల మండపంలో టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్య చౌదరికి విరాళం డిడిని అందజేశారు.



### గోకులానందుడి రూపంలో కల్యాణ వేంకటేశ్వరుడు

**తిరుమల, మే 29 ప్రభాతవార్త ప్రతినిధి:** టిటిడి ఆధ్వర్యంలోని తిరుపతి జిల్లా నారాయణవనంలో పద్మావతి సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో రెండో రోజు శుక్రవారం ఉదయం స్వామివారు వేణుగోపాల కృష్ణుడి అలంకారంలో ఐదు తలల చిన్నశేష వాహనంపై భక్తులకు అభయ ప్రదానం చేశారు. ఉదయం 7.30 గంటలకు ప్రారంభమైన ఈ వాహన సేవలో భక్తి పారవశ్యం అలుముకుంది. వేణునాదంతో గోపికామనసులను హరించిన శ్రీకృష్ణుని రూపంలో కల్యాణ శ్రీనివాసుడు చిన్నశేషునిపై విహరించగా భక్తులు అడుగడుగునా కర్పూర హారతులు సమర్పించి "గోవిందా.. గోవిందా" నామస్మరణతో ఆలయ వీధులను మార్మోగించారు. భక్తజన బృందాల కోలాటాలు, చెక్కభజనలు, మంగళవాయిద్యాలు, సాంప్రదాయ సాంస్కృతిక కార్యక్రమాలు ఆధ్యాత్మిక వాతావరణాన్ని మరింత శోభాయమానం చేశాయి. రాత్రి 7 గంటలకు స్వామివారు హంసవాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. ఈవాహనసేవలో ఆలయ సూపరింటెండెంట్ శ్రీనివాసులు రెడ్డి, ఆలయ ఇన్‌స్పెక్టర్లు నాగరాజు, చంగల్ రాయులు, ఆలయ అర్చకులు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# మహిళల భద్రతకు 'ఆపరేషన్ దండాయన'

- నేరస్థులకు త్వరితగతి శిక్షలే లక్ష్యం
- 60 రోజుల్లో ఛార్జిషీట్లు.. ప్రత్యేక నిఘా
- స్త్రీపై నేరాలకు జీరో టాలరెన్స్ పాలసీ
- స్పీడ్ ట్రయల్ మానిటరింగ్ సిస్టమ్‌తో నిరంతర పర్యవేక్షణ
- బాధితులకు న్యాయ సహాయం, కౌన్సెలింగ్ సేవలు
- పునరావృత నేరస్థులపై జియో ట్యాగింగ్ ద్వారా ప్రత్యేక నిఘా
- 'నైబర్‌హుడ్ వాచ్'తో ప్రజల భాగస్వామ్యం
- అవగాహన కార్యక్రమాలతో నేరాల నివారణకు చర్యలు
- డిజిపి హరీష్‌కుమార్ గుప్తా వెల్లడి

**విజయవాడ, మే 29 ప్రభాతవార్త ప్రతినిధి:** మహిళలు, బాలికలపై జరుగుతున్న నేరాలను పూర్తిగా అరికట్టేందుకు, బాధితులకు వేగవంతమైన న్యాయం అందించేందుకు ఆంధ్రప్రదేశ్ పోలీసు శాఖ రాష్ట్రవ్యాప్తంగా 'ఆపరేషన్ దండాయన' పేరుతో ప్రత్యేక కార్యాచరణను ప్రారంభించింది. మహిళల భద్రతను అత్యంత ప్రాధాన్య అంశంగా పరిగణిస్తూ డిజిపి హరీష్‌కుమార్ గుప్తా ఆధ్వర్యంలో, మహిళా శిశు భద్రత విభాగం ఐజి బి. రాజకుమారి నేతృత్వంలో ఈ కార్యాచరణ అమల్లోకి వచ్చింది. దీనికి సంబంధించిన పోస్టర్‌ను డిజిపి హరీష్ కుమార్ గుప్తా శుక్రవారం ఎపి పోలీసు ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన ఒక కార్యక్రమంలో ఆవిష్కరించారు. నేరాల నివారణలో భాగంగా సమాజంలో అవగాహన పెంచేందుకు ప్రత్యేక ప్రచార కార్యక్రమాలు నిర్వహించనున్నారు. పాఠశాలలు, కళాశాలలు, యువజన సంఘాలు, మహిళా సంఘాలతో కలిసి చట్టాలపై అవగాహన సదస్సులు ఏర్పాటు చేయనున్నారు. అలాగే ప్రింట్, ఎలక్ట్రానిక్, సోషల్ మీడియా వేదికల ద్వారా మహిళల భద్రత, చట్టపరమైన హక్కులు, శిక్షల తీవ్రతపై విస్తృత ప్రచారం చేపట్టనున్నారు. ఇటీవలి కేసుల్లో కోర్టులు విధించిన శిక్షలను ప్రజల్లోకి తీసుకెళ్లడం ద్వారా నేరస్థుల్లో భయాన్ని, సమాజంలో చట్టంపై నమ్మకాన్ని పెంపొందించడమే లక్ష్యంగా చర్యలు కొనసాగనున్నాయి. ఈ సందర్భంగా డిజిపి హరీష్ కుమార్ గుప్తా మాట్లాడుతూ, 'మహిళలపై నేరాల విషయంలో ఏ మాత్రం ఉపేక్ష ఉండదు. ప్రతి బాధితురాలికి న్యాయం జరిగే వరకు ఆపరేషన్ దండాయన నిరంతరంగా కొనసాగుతుంది. నిందితులు ఎంతటి శక్తివంతులైనా చట్టపరమైన చర్యల నుంచి తప్పించుకోలేరు' అని స్పష్టం చేశారు. మహిళల భద్రతకు ప్రభుత్వం, పోలీసు శాఖ అత్యున్నత ప్రాధాన్యం ఇస్తోందని, ప్రజలు కూడా పోలీసులకు సహకరించి నేరరహిత సమాజ నిర్మాణంలో భాగస్వాములు కావాలని డిజిపి పిలుపునిచ్చారు.



**మహిళలపై నేరాలకు ప్రత్యేక కార్యాచరణ:** ఆపరేషన్ దండాయన కార్యక్రమంలో భాగంగా మహిళలపై జరిగే అత్యాచారాలు, లైంగిక వేధింపులు, పోక్సో కేసులు తదితర నేరాల్లో నిందితులకు త్వరితగతిన శిక్షలు పడేలా ప్రత్యేక కార్యాచరణ చేపడుతున్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా నమోదయ్యే మహిళా సంబంధిత ప్రతి కేసును ప్రత్యేకంగా పర్యవేక్షించనున్నారు. దర్యాప్తు ప్రక్రియలో జాప్యం లేకుండా చూసేందుకు 'స్పీడ్ ట్రయల్ మానిటరింగ్ సిస్టమ్' అమలు చేయాలని నిర్ణయించారు. కేసుల పురోగతిని జిల్లా నుంచి రాష్ట్ర స్థాయి వరకు నిరంతరం సమీక్షి స్తూ న్యాయ ప్రక్రియను వేగవంతం చేయనున్నారు. ముఖ్యంగా ప్రతి కేసులో 60 రోజుల్లోగా ఛార్జిషీట్ దాఖలు చేయడం తప్పనిసరిగా పేర్కొన్నారు. సంచలనాత్మక కేసులను ఫాస్ట్‌ట్రాక్ కోర్టులకు బదిలీ చేసి, నిందితులకు కఠిన శిక్షలు పడేలా చర్యలు తీసుకోనున్నారు.

**జీరో టాలరెన్స్ పాలసీ అమలు:** మహిళలపై నేరాల విషయంలో 'జీరో టాలరెన్స్ పాలసీ'ని ఖచ్చితంగా అమలు చేస్తామని డిజిపి శ్రీ హరీష్‌కుమార్ గుప్తా స్పష్టం చేశారు. నిందితులు ఎంతటి రాజకీయ, ఆర్థిక లేదా సామాజిక పరిపుష్టి కలిగిన వారైనా చట్టం ముందు అందరూ సమానమేనని తెలిపారు. ప్రతి బాధితురాలికి పూర్తి న్యాయం జరిగే వరకు పోలీసు శాఖ అండగా నిలుస్తుందని పేర్కొన్నారు. బాధిత మహిళలకు కేవలం న్యాయ సహాయం మాత్రమే కాకుండా, మానసిక ధైర్యం కల్పించేలా కౌన్సెలింగ్ సేవలను కూడా అందించనున్నారు. ఇందుకోసం స్వచ్ఛంద సంస్థలు, న్యాయవాదులు, మహిళా సంక్షేమ సంస్థల సహకారాన్ని తీసుకోనున్నారు. బాధిత కుటుంబాలకు అవసరమైన అన్ని రకాల సహాయ సహకారాలు అందించేందుకు ప్రత్యేక యంత్రాంగాన్ని ఏర్పాటు చేయనున్నారు.

**పునరావృత నేరస్థులపై ప్రత్యేక నిఘా:** మహిళలపై పదేపదే నేరాలకు పాల్పడే నేరస్తులు, అనుమానాస్పద వ్యక్తులపై జియో ట్యాగింగ్, ఎఫ్ఆర్ఎస్ (ముఖాధారిత గుర్తింపు) ద్వారా వారి కదలికలపై ప్రత్యేక నిఘా ఉంచాలని అధికారులను డిజిపి ఆదేశించారు. లైంగిక నేరస్తులపై సెక్సువల్ అఫెండర్స్ షీట్స్ తెరచి, వారి కదలికలను నిరంతరం పర్యవేక్షించాలని, పెండింగ్‌లో ఉన్న కేసులను పునః సమీక్షించి, దర్యాప్తును వేగవంతం చేయాలని ఆదేశించారు.

**'నైబర్‌హుడ్ వాచ్'తో ప్రజల భాగస్వామ్యం:** ప్రజల భాగస్వామ్యంతో మహిళల భద్రతను మరింత బలోపేతం చేయడానికి 'నైబర్‌హుడ్ వాచ్' కార్యక్రమాన్ని అమలు చేయనున్నారు. గ్రామాలు, పట్టణాల్లో స్థానిక ప్రజల సహకారంతో అనుమానాస్పద వ్యక్తుల కదలికలను గుర్తించి వెంటనే పోలీసులకు సమాచారం అందించే విధానాన్ని ప్రోత్సహించనున్నారు. ఆధునిక సాంకేతికతను వినియోగిస్తూ జియోట్యాగింగ్, డిజిటల్ మానిటరింగ్ వ్యవస్థల ద్వారా నేరస్థులపై మరింత సమర్థవంతమైన నిఘా కొనసాగించనున్నారు. ఈ కార్యక్రమంలో డిజిపి రాజీవ్‌కుమార్ మీనా అదనపు డిజి శాంతిభద్రతలు ఎన్. మధుసూదన్‌రెడ్డి, నిఘా విభాగాధిపతి మహేష్ చంద్ర లడ్డా, ఐజిలు సిహెచ్. శ్రీకాంత్,

# మహానాడు సూపర్ సక్సెస్

- తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు

**విజయవాడ, మే 29 ప్రభాతవార్త ప్రతినిధి:** మహానాడు2026 ఘన విజయంపై తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షులు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు హర్షం వ్యక్తం చేసారు. ఈ మహానాడు గిన్నిస్ రికార్డు స్థాయిలో విజయవంతం అవుతుందని తాను ముందుగానే చెప్పానని, అయితే తన అంచనాలకు మించి కార్యకర్తలు చరిత్ర సృష్టించారని పేర్కొన్నారు. ఇది కేవలం ఒక రాజకీయ సమావేశం కాదని, తెలుగుదేశం పార్టీ కార్యకర్తల అంకితభావం, క్రమశిక్షణ, సాంకేతికత పట్ల ఉన్న అవగాహన, పార్టీపై ఉన్న ప్రేమకు ప్రతీకగా నిలిచిందన్నారు. దేశ రాజకీయ చరిత్రలోనే ఒక ప్రాంతీయ పార్టీ నిర్వహించిన అతిపెద్ద డిజిటల్ రాజకీయ మహాసభగా మహానాడు2026 నిలిచిందని పల్లా శ్రీనివాసరావు పేర్కొన్నారు. 1,875 క్లస్టర్లు, 12 దేశాల నుంచి వేలాదిమంది నాయకులు, కార్యకర్తలు పాల్గొనగా 24.50 లక్షల మంది వర్చువల్‌గా భాగస్వామ్యం కావడం ద్వారా మహానాడు సరికొత్త రికార్డులు సృష్టించిందన్నారు.

**మహిళలకు 33శాతం రిజర్వేషన్ చారిత్రాత్మక నిర్ణయం:** మహానాడు2026లో తీసుకున్న అత్యంత విప్లవాత్మక నిర్ణయాల్లో మహిళలకు 33శాతం రాజకీయ రిజర్వేషన్ ఒకటని పల్లా శ్రీనివాసరావు పేర్కొన్నారు. మహిళా సాధికారతకు ఎన్టీఆర్ పునాది వేయగా, చంద్రబాబు ఆర్థిక స్వావలంబన కల్పించారని, ఇప్పుడు నారా లోకేష్ మహిళలను నేరుగా రాజకీయ నిర్ణయాధికార కేంద్రంలోకి తీసుకువచ్చే చారిత్రాత్మక నిర్ణయం ప్రతిపాదించారన్నారు. దేశ వ్యాప్తంగా మహిళా రిజర్వేషన్ల గురించి చర్చలు జరిగినా ఒక రాజకీయ పార్టీ తన సంస్థాగత నిర్మాణంలో, ఎన్నికల రాజకీయాల్లో 33 శాతం ప్రాతినిధ్యం కల్పిస్తామని ప్రకటించడం గొప్ప సంస్కరణ అని పేర్కొన్నారు. ఇది కేవలం రిజర్వేషన్ కాదని మహిళలకు రాజకీయ అధికారం పంచిపెట్టే నిర్ణయమని అభివర్ణించారు.

**21 తీర్మానాలు.. భవిష్యత్ కార్యాచరణకు మార్గదర్శనం:** మహానాడు వేదికగా 21 కీలక తీర్మానాలు ఆమోదించామని, ఎన్టీఆర్‌కు భారత రత్న ఇవ్వాలని కేంద్రాన్ని కోరడం నుంచి మహిళా సాధికారత, యువత ఉపాధి, బీసీల అభ్యున్నతి, సామాజిక న్యాయం, సాంకేతిక అభివృద్ధి వరకు అన్ని అంశాలపై విస్తృత చర్చ జరిగిందన్నారు. 88మంది నాయకులు, కార్యకర్తలు వివిధ తీర్మానాలపై ప్రసంగించడం మహానాడుకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచిందన్నారు.

**మహానాడు విజయాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలి:** మహానాడు విజయంతో ప్రయాణం ముగియలేదని, ఇక్కడ తీసుకున్న తీర్మానాలు, ప్రభుత్వ విజయాలు, పార్టీ సిద్ధాంతాలను ప్రతి ఇంటికి తీసుకెళ్లాల్సిన బాధ్యత కార్యకర్తలపై ఉందని పల్లా శ్రీనివాసరావు పేర్కొన్నారు. అభివృద్ధి, సంక్షేమం, సామాజిక న్యాయం, మహిళా సాధికారత అంశాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. మహానాడు2026ను ఘన విజయవంతం చేసిన పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబునాయుడు, జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేష్, నాయకులు, కార్యకర్తలు, సాంకేతిక బృందాలు, ప్రపంచవ్యాప్తంగా పాల్గొన్న తెలుగుదేశం కుటుంబ సభ్యులందరికీ పల్లా శ్రీనివాసరావు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.



## పురపాలక వ్యర్థాలను స్వచ్ఛమైన శక్తిగా మార్చడమే ప్రభుత్వ లక్ష్యం

మంత్రి నారాయణ

**విజయవాడ, మే 29 ప్రభాతవార్త ప్రతినిధి:** పురపాలక వ్యర్థాలను స్వచ్ఛమైన శక్తిగా మార్చడమే ప్రభుత్వ లక్ష్యమని పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణ తెలిపారు. పట్టణ వ్యర్థాల నిర్వహణలో విప్లవాత్మక మార్పు తీసుకొస్తాం. సుస్థిర వ్యర్థాల నిర్వహణ, స్వచ్ఛమైన ఇంధన ఉత్పత్తి దిశగా కీలక అడుగు వేశాం. డంపింగ్ యార్డుల భారాన్ని తగ్గించేందుకు సిబిజి ప్లాంట్లు దోహదపడతాయి. పట్టణ ఇంధన భద్రతను బలోపేతం చేసే ప్రాజెక్టుగా సిబిజి ప్లాంట్లు ఉపయోగపడతాయి. దీర్ఘకాలిక పర్యావరణ, ఆర్థిక సుస్థిరతకు ఈ ప్రాజెక్ట్ భరోసా ఇస్తుంది. స్వచ్ఛాంధ్ర లక్ష్య సాధనలో భాగంగా సిబిజి ప్లాంట్లు ఏర్పాటు చేస్తున్నాం. వ్యర్థాల నుంచి సంపద సృష్టించడమే కూటమి ప్రభుత్వ విధానం అని పేర్కొన్నారు. ఎన్టీఆర్ జిల్లా కొండపల్లి, ఇబ్రహీంపట్నంలో మంత్రి నారాయణ, ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ పర్యటించారు. కొండపల్లిలో కొత్తగా నిర్మిస్తున్న ఫ్రెష్ వేస్ట్ ప్లాంట్‌ను పరిశీలించగా, ఇబ్రహీంపట్నంలో కంప్రెస్డ్ బయోగ్యాస్ ప్లాంట్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి నారాయణ మాట్లాడుతూ ఎపి ప్రజల నుంచి గత ప్రభుత్వం చెత్త పన్ను వసూలు చేసింది. అయినా 150 లక్షల టన్నుల చెత్తను వదిలి వెళ్లిపోయింది. ఆ చెత్తను కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత తొలగిస్తున్నాం. వచ్చే నెలాఖరు నాటికి అన్ని ప్లాంట్లు పూర్తి చేసి అందుబాటులోకి తీసుకువస్తాం. ఆంధ్రప్రదేశ్‌లో మున్సిపాలిటీలను డంపింగ్ యార్డుల రహితంగా మార్చేందుకు కృషి చేస్తున్నామని మంత్రి పొంగూరు నారాయణ తెలిపారు. ప్రస్తుతం విశాఖపట్నం, గుంటూరులో వేస్ట్ టు ఎనర్జీ ప్లాంట్లు ఉన్నాయని, కొత్తగా మరో ఆరు ప్లాంట్లను నెలకొల్పుతున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ లోగా 107 మున్సిపాలిటీల్లో ఉత్పత్తి అయ్యే చెత్త నిర్వహణ కోసం ఫ్రెష్ వేస్ట్ ప్లాంట్లు ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. ఈ ప్లాంట్ల ద్వారా ప్రతి రోజూ 5,385 టన్నుల చెత్తను కంపోస్ట్, బయోగ్యాస్‌గా మారుస్తామని తెలిపారు. ఐదు కంప్రెస్డ్ బయోగ్యాస్ (సిబిజి) ప్లాంట్ల కోసం ఏపీ ప్రభుత్వం రూ.59.85 కోట్లు మంజూరు చేసింది. రాజమహేంద్రవరం, నెల్లూరు, గుంటూరు, ఒంగోలు, ఇబ్రహీంపట్నంలో నూతన సిబిజి ప్లాంట్లు ఏర్పాటు చేస్తున్నాం. విజయవాడలో ఉన్న ప్లాంట్‌ను కూటమి ప్రభుత్వం రూ.9.45 కోట్లతో ఉన్నతీకరిస్తోంది. మొత్తం ఐదు ప్లాంట్ల ప్రాసెసింగ్ సామర్థ్యం రోజుకు 125 టన్నులు. ప్రతి యూనిట్‌ను రోజుకు 25 టన్నుల సామర్థ్యంతో రూపకల్పన చేశాం. ఒక్కో నూతన ప్లాంట్‌కు రూ.12.60 కోట్ల వ్యయం అవుతుందని అంచనా. ఇందుకు కేంద్రం, రాష్ట్రం, పట్టణ స్థానిక సంస్థలు, ప్రైవేట్ డెవలపర్లు నిధులు సమకూర్చనున్నారు.





## ఇన్‌ఫ్రా ప్రాజెక్టుల పూర్తికి కాల పరిమితిని నిర్దేశించండి

- ఆర్టీసీ ఆస్తుల సద్వినియోగంతో సంస్థ బలోపేతానికి ప్రణాళికలు: ముఖ్యమంత్రి చంద్రబాబు

**విజయవాడ, మే 29 ప్రభాతవార్త ప్రతినిధి:** రాష్ట్రంలోని పోర్టులు, ఎయిర్ పోర్టుల నిర్మాణాలను పూర్తి చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశించారు. ఇన్ఫ్రా ప్రాజెక్టుల పూర్తికి కాలపరిమితిని నిర్దేశించుకుని పని చేయాలని స్పష్టం చేశారు. శుక్రవారం రాష్ట్ర సచివాలయంలో పెట్టుబడులు, మౌలిక సదుపాయల కల్పన, ఆర్టీసీపై ముఖ్యమంత్రి సమీక్షించారు. పోర్టులు, ఎయిర్ పోర్టులు, ఫిషింగ్ హార్బర్ల నిర్మాణం పురోగతిపై సమావేశంలో చర్చించారు. మూలపేట, రామాయపట్నం, మచిలీపట్నం పోర్టుల నిర్మాణాలపై సీఎం సమీక్షించారు. అలాగే జువ్వలదిన్నె, నిజాంపట్నం, మచిలీపట్నం ఫిషింగ్ హార్బర్ల నిర్మాణాల పురోగతిపై ముఖ్యమంత్రి సమీక్షించారు. దగదర్తి, కుప్పం, శ్రీకాకుళం ఎయిర్ పోర్టుల నిర్మాణం, భూ సేకరణ, నిధుల సమీకరణ, కేంద్రం నుంచి అనుమతులు వంటి అంశాలపై అధికారులకు ముఖ్యమంత్రి దిశా నిర్దేశం చేశారు. ఈవీ బస్సుల కొనుగోళ్లపై అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు మాట్లాడుతూ "ఇరిగేషన్ ప్రాజెక్టుల నిర్మాణానికి సంబంధించి ప్రారంభోత్సవాల తేదీని ప్రకటించేశాం. రాష్ట్రంలో పెట్టే పెద్దపెద్ద పరిశ్రమలను కూడా 18 నెలల్లో గ్రౌండ్ చేసి ఉత్పత్తి మొదలు పెట్టాలని చెబుతున్నాం. ఇదే తరహాలో ఇన్ఫ్రా ప్రాజెక్టులనూ పూర్తి చేయాలి. ప్రస్తుతం వివిధ దశల్లో ఉన్న పోర్టులు, ఎయిర్ పోర్టులు, ఫిషింగ్ హార్బర్ల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలి. అనుమతులు, సాంకేతిక అంశాలు, టెండర్ ప్రక్రియ, నిర్మాణాలన్నింటికీ టైమ్ బౌండ్ పెట్టుకని పని చేయాలి. దశాబ్దాల తరబడి ప్రాజెక్టులను పూర్తి చేయకుండా... జాప్యం చేస్తూ ఉండడం సరైన విధానం కాదు. ఇక ఈ ప్రాజెక్టుల నిర్మాణానికి అవసరమైన నిధుల సమీకరణపైనా ప్రధానంగా ఫోకస్ పెట్టాలి. ఆర్టీసీ ఆస్తులను సద్వినియోగం చేసుకుని.. ఆ సంస్థను మరింత బలోపేతం చేసుకునేలా ప్రణాళికలు సిద్ధం చేయాలి అని సీఎం చంద్రబాబు సూచించారు. ఈ సమీక్షలో మంత్రులు బీసీ జనార్దన్ రెడ్డి, మండిపల్లి రామ్ ప్రసాద్ రెడ్డి, సీఎస్ సాయి ప్రసాద్, ఆయా శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## భోగాపురం విమానాశ్రయం ప్రధానమంత్రిచే ప్రారంభిస్తాం

### మంత్రి శ్రీనివాస్ వెల్లడి

**విజయనగరం, మే 29 ప్రభాతవార్త:** జూలై మొదటి వారంలో భోగాపురం విమానాశ్రయం ప్రారంభించేందుకు ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ వస్తారని మంత్రి శ్రీనివాసరావు వెల్లడించారు. అక్కడ చిన్న చిన్న అప్రోచ్ రోడ్లు మించి అన్ని పనులు పూర్తి చేసుకుని ప్రారంభానికి సిద్ధం చేస్తామన్నారు. మహానాడు లాంటి పెద్ద పండగలో భాగస్వామ్యం కావడం నాకు ఎంతో సంతోషంగా ఉంది. మహానాడు వేదికగా స్త్రీ శక్తి నినాదంతో అనేక తీర్మానాలు చేయడం, మహిళలకు 33 రిజర్వేషన్లు, వుమెన్ సేఫ్టీ, వుమెన్ ఎంపవర్‌మెంట్ అన్నీ టీడీపీలో మహిళా సాధికారితకు నిదర్శనం. తెలంగాణ రాజధాని హైదరాబాద్ మైత్రీవనంలో ఎన్టీఆర్ విగ్రహావిష్కరణ పట్ల హర్షం వ్యక్తం చేసిన మంత్రి. గరివిడి ఫ్యాక్టరీని ఎవరు టేకోవర్ చేసినా ఫ్యాక్టరీ కొనసాగించేందుకు కృషి చేస్తున్నామని మంత్రి శ్రీనివాసరావు వెల్లడించారు. జూన్ 1 నుంచి విశాఖ రైల్వే జోన్ అమల్లోకి వస్తోంది. జూన్ 30 నాటికి భోగాపురం ఎయిర్‌పోర్ట్ యాక్సెస్ రోడ్స్, రైతుల సమస్యలు పూర్తి చేస్తామని మంత్రి శ్రీనివాసరావు తెలిపారు. జిల్లాలో నిరుద్యోగిత తగ్గించాలంటే పరిశ్రమలు జిల్లాకు రావాలి. భూసేకరణ విషయంలో రైతులను ఒప్పించాలి. వారికి భరోసా కల్పించడంతో పాటు నష్టపోకుండా పరిహారం ఇవ్వాలి. రైతులకు కష్టం లేకుండా భూసేకరణ చేసేలానే ముందుకు వెళతాం. అని స్పష్టం చేసిన మంత్రి. ముఖ్యమంత్రిగా చంద్రబాబు తొలి సంతకం మెగా డీఎస్సీపై పెట్టి ప్రతిపక్షం 200 కేసులు వేసినా విజయవంతంగా 16 వేలమందికి ఉపాధ్యాయ ఉద్యోగాలు ఇచ్చారు. గ్రూప్ 1 పేపర్ల వాల్యూషన్ ప్రైవేటు రిసార్ట్స్‌లో చేసింది వైసీపీ ప్రభుత్వమే. ఇది ఎంత వరకు సమంజసమో ఆ పార్టీ నేతలే ఆలోచించుకోవాలి. ఐఏఎస్ అధికారుల చర్యలపై నా పాత్ర లేదు. తప్పుచేసిన వారి విషయంలో కలెక్టర్ చర్యలు తీసుకున్నారని మంత్రి శ్రీనివాసరావు తెలిపారు.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం
జలవనరుల శాఖ
నెం.05 మరియు 09/2026-27 ఇ-ప్రొక్యూర్‌మెంట్ షార్ట్ టెండరు నోటీసు తేది: 29.05.2026
పని పేరు: కృష్ణా పశ్చిమ డెల్టాలోని కాలువలు మెరుగుపరచటం మరియు బలోపేత పనులు చేపట్టుట. 5 పనుల విలువ: రూ.74.10 లక్షలు. టెండరు షెడ్యూల్స్ ఆన్‌లైన్‌లో లభ్యమగు తేది: 01.06.2026 ఉ.10.30 గం.ల నుండి 08.06.2026, మ.2.00 గం.ల వరకు. మిగతా వివరాలను https://tender.apeprocurement.gov.in లో చూడగలరు. ఫోన్ నెం: 7901093255.
సం/- కార్యనిర్వాహక ఇంజినీరు, కృష్ణా పశ్చిమ భాగం, తెనాలి
DIPR.No.20495/CL/Advt/1/1/2022-23, తేది: 29.05.2026

## సూర్యప్రభ వాహనంపై గోవిందరాజస్వామి



**తిరుమల, మే 29 ప్రభాతవార్త ప్రతినిధి:** టిటిడి ఆధ్వర్యంలోని తిరుపతిలో గోవిందరాజస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో శుక్రవారం ఉదయం గోవిందరాజస్వామి సూర్యప్రభ వాహనంపై భక్తులకు దివ్య దర్శనమిచ్చారు. సూర్యభగవానుని తేజస్సును ప్రతిబింబించే ఈ వాహనసేవ భక్తులను ఆధ్యాత్మిక పరవశంలో ముంచెత్తింది. ఉదయం 7 గంటల నుండి 9 గంటల వరకు స్వామివారు తిరుమల నాలుగు మాడ వీధుల్లో విహరిస్తూ భక్తులను కటాక్షి ంచారు. భక్తజన బృందాల చెక్కభజనలు, కోలాటాలు, కేరళ కళాకారుల డ్రమ్స్, మంగళవాయిద్యాల నడుమ వాహనసేవ వైభవంగా సాగింది. అడుగడుగునా భక్తులు కర్పూరహారతులు సమర్పిస్తూ గోవిందనామస్మరణతో వీధులను మార్మోగించారు. సూర్యుడు తేజోమయుడు, సకలరోగ నివారకుడు, జగత్తుకు చైతన్యప్రదాతగా పురాణాలు వర్ణిస్తున్నాయి. వర్షాలు, పంటలు, ఓషధులు, జీవజాలం అన్నీ సూర్యుని కరుణాకటాక్షంతోనే అభివృద్ధి చెందుతాయని వేదాలు తెలియజేస్తున్నాయి. అటువంటి సూర్యతేజస్సు స్వరూపుడైన శ్రీమన్నారాయణుడు సూర్యప్రభ వాహనంపై దర్శనమివ్వడం విశేష ఆధ్యాత్మిక సందేశాన్ని అందించింది. ఉదయం 10గంటల నుండి 11గంటల వరకు శ్రీదేవి, భూదేవి సమేత గోవిందరాజస్వామికి స్నపన తిరుమంజనం శాస్త్రోక్తంగా నిర్వహించారు. సాయంత్రం స్వామివారు కల్యాణకట్ట మండపానికి వేంచేసి, అక్కడ తేరుచూపు అనంతరం తిరిగి వాహనమండపానికి చేరుకున్నారు. రాత్రి 7 గంటల నుండి 9 గంటల వరకు చంద్రప్రభ వాహనంపై స్వామివారు భక్తులకు దర్శనమిచ్చారు. ఈ వాహనసేవలో పెద్దజీయర్‌స్వామి, చిన్నజీయర్‌స్వామి, ఆలయ డిప్యూటీ ఇఒ శాంతి, ఎఇఒనారాయణ చౌదరి, ఏవిఎస్ఒ శ్రీనివాస రావు, సూపరింటెండెంట్లు చిరంజీవి, శేషగిరి, ఆలయ ఇన్‌స్పెక్టర్ ధనుంజయ, రంజిత్, భక్తులు పాల్గొన్నారు.



## శ్రీవాణి విరాళాలిచ్చిన దాతలకు అదనంగా 300 దర్శన టిక్కెట్లు

- నూతన విధానం అమలుకు టిటిడి శ్రీకారం

**తిరుమల, మే 29 ప్రభాతవార్త ప్రతినిధి:** ఏరోజుకారోజు ఆన్‌లైన్‌లో, ఆఫ్‌లైన్‌లో దర్శనాలు కేటాయిస్తున్న శ్రీవాణి ట్రస్ట్ బ్రేక్ దర్శనాల టిక్కెట్లు కేటాయింపుల్లో తిరుమల తిరుపతి దేవస్థానం నూతన విధానం అమలుకు చర్యలు తీసుకుంది. రోజువారీగా తిరుమలకు వచ్చే భక్తులకేగాక తిరుమలలో ఉన్న భక్తుల సౌకర్యార్థం శ్రీవాణి ట్రస్ట్‌కు సంబంధించిన దర్శన టికెట్ల కేటాయింపులో పలు మార్పులు చేపట్టింది. ప్రస్తుతం రోజుకు 1,500 శ్రీవాణి టికెట్లను ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంచింది. ఇందులో 500 దర్శన టికెట్లను మూడు నెలల ముందుగా ఆన్‌లైన్‌లో అడ్వాన్స్ బుకింగ్ కింద అందుబాటులో విడుదల చేస్తుంది. అదేవిధంగా మరో 800 టిక్కెట్లు ఆన్‌లైన్‌లో ఏరోజుకారోజు ఉదయం విడుదల చేస్తోంది. అలాగే మరో 200 శ్రీవాణి దర్శన టికెట్లను తిరుపతి/ రేణిగుంట విమానాశ్రయంలో కరెంట్ బుకింగ్ కింద జారీ చేస్తుంది. ప్రస్తుతం రోజువారీ కరెంట్ బుకింగ్ కోటాలో అందుబాటులో ఉన్న 800 శ్రీవాణి దర్శన టికెట్లలో ఇప్పటికే రూ.10 వేలు విరాళం చెల్లించి దర్శన టికెట్ కోసం వేచి ఉన్న దాతలకు ప్రతిరోజూ 300 టికెట్లు ప్రత్యేకంగా కేటాయించాలని నిర్ణయించింది. ఈ సదుపాయం మే 1వ తేదీ నుండి విరాళం చెల్లించిన అర్హులైన దాతలకు వర్తింపజేస్తోంది. ఈ టికెట్లు ప్రతిరోజూ ఉదయం 9 గంటలకు విడుదల చేయబడతాయి. మధ్యాహ్నం 1 గంటలోపు బుక్ చేసుకున్న భక్తులకు అదే రోజు సాయంత్రం 4 గంటలకు దర్శనం కల్పించబడుతుంది. ఈ విధానం జూన్ 10 నుండి అమలులోకి రానుంది. ఈ కోటాలో బుకింగ్ కాని టికెట్లను తిరిగి కరెంట్ బుకింగ్ కోటాలో కలపబడతాయి. ఈ విధానం 2027 మార్చి 31 వరకు అమల్లో ఉంటుందని టిటిడి తెలిపింది. ఆంధ్రప్రదేశ్‌లో ఎంపిక చేసిన నాలుగు విమానాశ్రయాల్లో విజయవాడ, రాజమండ్రి, తిరుపతి, విశాఖలోనూ శ్రీవాణి టికెట్లను ఆఫ్‌లైన్‌లో అందుబాటులో ఉంచాలని టిటిడి భావిస్తోంది. ప్రస్తుతం రేణిగుంట విమానాశ్రయంలో మాత్రమే అందుబాటులో ఉన్న శ్రీవాణి టికెట్లు ఇక ఆ మూడు వినామాశ్రయాల్లోనూ భక్తులకు అందేవిధంగా ఏర్పాట్లు చేస్తున్నారు.

వార్త

తమ కాళ్ల మూలంగా పక్షులు వలలో చిక్కుకుంటాయి. అలాగే తమ మాటల మూలంగానే మనుషులు చిక్కుల్లో ఇరుక్కుంటారు.

- థ్రోయ్‌గార్డెన్

# సత్వర న్యాయం కోసమే!

కేసు ఓడిన వాడు కోర్టులో ఏడిస్తే.. గెలిచిన వాడు కోర్టు బయట ఏడుస్తాడన్న లోకరీతి ఎల్లప్పుడూ సజీవంగానే ఉంటుంది. దీని నడక మార్చేందుకు కోర్టులు ఎప్పుడూ సంస్కరణలు చేస్తూనే ఉంటాయి. కోర్టు న్యాయ ప్రక్రియ సజావుగా నడిపించే విషయంలో ఎప్పుడూ కింది కోర్టులకు దేశ కాలమాన పరిస్థితులకు అనుగుణంగా సుప్రీం కోర్టు మార్గదర్శకాలు జారీ చేస్తూనే ఉంటుంది. అన్నీ తమ ముందుకొచ్చిన కేసుల విచారణ ప్రక్రియలో అనుసరించదగిన మార్పులను సూచించడం సర్వోన్నత న్యాయపీఠం ఎప్పటికప్పుడు సూచిస్తూనే ఉంటుంది. అలాగే సహజ న్యాయసూత్రాల నేపథ్యంలో సాటి మేధావి వర్గంతో సమాలోచన చేసి సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి ప్రత్యేక సర్క్యులర్ ఆదేశాల ద్వారా గాని, కోర్టు వ్యవహారశైలి, కేసుల పరిష్కారంలో జాప్యాన్ని నివారించడంలో ఔచిత్యాలను మార్గదర్శకాల రూపంలో జారీ చేస్తుంది. ఈ దేశ సర్వోన్నత న్యాయస్థానం శుక్రవారం రెండు ప్రధాన అంశాలకు సంబంధించి జాప్యాన్ని నివారించి కక్షిదారులకు ఉపశమనం కలిగించే నియమావళిని పేర్కొంటూ తగు సూచనలు పాటించాలని ఆదేశాలను జారీ చేసింది. కోర్టులో పెండింగ్ కేసులు అపరిష్కృతంగా ఉండిపోవటం ఒక సమస్య అయితే కోర్టుల్లో అనుసరించాల్సిన విధి విధాన ప్రక్రియలో స్పష్టమైన మార్గదర్శకాలు లేక నాన్పుడు వైఖరిలో కూరుకుపోవడం మరోప్రధాన అంశం. కోర్టుల్లో విచారణ పూర్తయినా తీర్పు వెలువరించాల్సిన అంశాల్లో వ్యవహరించాల్సిన విధి విధానాలు, మానవ అక్రమ రవాణా నిరోధంపై కొన్ని చారిత్రాత్మక మార్గదర్శకాలను సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్ మరో ఇద్దరు న్యాయమూర్తులు జస్టిస్ జోయ్ మాల్యా బాగ్చీ, జస్టిస్ విపిన్ పంచోలితో కూడిన ధర్మాసనం మార్గదర్శక సూత్రాలను నిర్దేశించింది. ఏళ్ల తరబడి అపరిష్కృతంగా ఉన్న కేసుల్లో కక్షిదారులు జాప్యాన్ని భరించలేక సహనం కోల్పోతాడు. తీరావిచారణ తర్వాత సాగే ప్రక్రియల్లోనూ జాప్యం జరుగుతోంది. ఇలాంటి సందర్భాల్లో కక్షిదారు సరైన ఉపశమనం లభించక నిరుత్సాహంతో కృంగిపోతాడు. ఇలాంటి కేసులకు సంబంధించిన అంశాల పరిష్కారంలో సుప్రీం ధర్మాసనం పలు పరిష్కారాలు చూపింది. ఏదేని కేసులో విచారణ పూర్తయ్యాక వెలువరించాల్సిన తీర్పుకు మూడు నెలల్లోగానే కోర్టు తీర్పు వెలువరించాలి. తీర్పు వెలువరించిన మరుసటి రోజునే కోర్టు వెబ్‌సైట్‌లో ఆదేశాల కాపీ అప్‌లోడ్ చేయాలి. సాధారణంగానే తీర్పుల్లో కలిగే ఆలస్యం సామాన్యునికిఆవేదన కలిగిస్తుంది. న్యాయస్థానాలపై, వాటి తీరుతెన్నులపై ఆవేశాన్ని రగిలిస్తుంది. అయినా పేదవాని కోపం పెదవికి చేటు అన్న చందాన కోర్టుల్లో ఏమి జరిగినా నిస్సహాయంగా, మౌనంగా ఉండిపోవడమే తప్ప మరో మాట్లాడలేని పరిస్థితి ఉంటుంది. ఖైదీల విడుదలలో కూడా ఎలాంటి జాప్యం కలుగనీయ వద్దు. బెయిల్ ఉత్తర్వులు రద్దుచేస్తే వెంటనే ట్రయల్ కోర్టుకు తెలిపే బాధ్యత హైకోర్టులదేనని స్పష్టం చేసింది. ఇన్నాళ్లకైనా తీర్పులకు సంబంధించి ఎన్నో సందిగ్ధాలకు సమాధానాలిచ్చినందున కనీసం కొన్ని కేసుల్లోనైనా కాస్త ఊరట లభిస్తుంది. ఇటీవల కాలంలో కారణం ఏదైతేనేం కోర్టులు తీర్పులను వెలువరించడం, తీర్పు పూర్తి పాఠాలను అప్‌లోడ్ చేయడంలో విపరీతమైన జాప్యం జరగడంపై కక్షిదారులకు న్యాయస్థానంపై నమ్మకం సన్నగిల్లుతోందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఈ నేపథ్యంలోనే తీర్పులు జాప్యానికి చెక్ పెట్టే దశగా సర్వోన్నత న్యాయస్థానం తాజా నిర్ణయాలు తీసుకొంది. వాటిని హైకోర్టులకు, కింది కోర్టులకు పంపింది. తగు నిబంధనలు పాటించనట్లయితే సదరు కేసులను ఇతర బెంచ్‌లకు బదలీ చేసే అవకాశముందని పేర్కొంది. బెయిల్ ఉత్తర్వును మరుసటి రోజే ప్రకటించాలని, అదే రోజు జైలు అధికారులకు ఆ ఆదేశాలను పంపాలి. బెయిల్ పొందిన అండర్ ట్రయల్ ఖైదీలను ఏ మాత్రం అవకాశంలేకున్నా అదే రోజుకానీ మరుసటిరోజు కానీ విడుదల చేయాలని సూచించింది. తీర్పు రోజున కోర్టు తీర్పు ప్రధాన భాగాన్ని పూర్తయిన 7 రోజుల్లోగా తీర్పు పూర్తి పాఠాన్ని అప్‌లోడ్ చేయాలి. ఇవన్నీ పాటించేందుకు వీలుగా సహకరించే అన్ని అంశాలలో వెబ్‌సైట్‌లను మార్చవలసి వస్తే మార్చాలి. గత యేడాది జార్ఖండ్ హైకోర్టు వెలువరించిన ఒక తీర్పును వెబ్‌సైట్‌లోఅప్‌లోడ్ చేయకపోవడంపై ధర్మాసనం ఆగ్రహించింది. ఈ విషయమైదాఖలైన పిటిషన్‌ను పరిష్కరిస్తూ కోర్టులో న్యాయ ప్రక్రియ, ఆదేశాల అమలు నవ్వులు పాలు కాకుండా ఉండే దిశగా పలు నిర్ణయాలు ప్రకటించింది. సాధారణ పౌరులకుండే అన్నిహక్కులూ సెక్స్‌వర్కర్లకు ఉంటాయని వారి పట్ల గౌరవప్రదంగానే వ్యవహరించాలని పోలీసు శాఖను సుప్రీంకోర్టు ఆదేశించింది. వారికి ధృవపత్రాలున్నా లేకున్నా ఆధార్ కార్డులివ్వాలంది. వారికీ సంక్షేమ పథకాలందించడం విధియని పేర్కొంది. స్వచ్ఛందంగా సెక్స్ వర్కర్లుగా జీవనాన్ని గడుపుతున్నవారిపై కేసులుపెట్టడం, వారి ఫొటోలు, వీడియోలతో అల్లరి పెట్టడమో సమంజసం కాదని ప్రభోదించింది. మానవ అక్రమ రవాణా ద్వారా బలవంతంగా సెక్స్‌వర్కర్ల కూపంలోకిదింపబడిన వారి పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించి భద్రత కల్పించాలని సుప్రీంకోర్టు కీలకమార్గదర్శకాలను జారీ చేసింది. తాజాగా సుప్రీం జారీ చేసిన మార్గదర్శకాలు దగాపడిన మహిళలపై పోలీసు దాడులు లేకుండా ఊరట కలిగిస్తోంది. ఇకపై సెక్స్ వర్కర్లపై అనుచిత దాడులుండవని ఆశిద్దాం. కోర్టు కేసుల్లో చిక్కుకుని విలవిల్లాడుతున్న కక్షిదారులలో కొందరికైనా తీర్పు అనంతర పర్యవసాన ఫలితాలు త్వరితగతిన దక్కే అవకాశముంది.

ఏమీ చేయకుండానే చేశాననేవాడు అధముడు. కొద్దిగా చేసి కొండంత చేశానని చెప్పేవాడు గర్వపోతు. ఎంతో చేసి కొంచెమే చేశానని చెప్పేవాడు సజ్జనుడు.



ఆదిశంకరాచార్యులు

జ్ఞానం వంశపారంపర్య హక్కు కాదు. ఎవరికి వారు కష్టపడి ఆర్జించుకోవాల్సిందే.



స్వామి వివేకానంద

## ప్రజావాక్కు

### వడదెబ్బ ముప్పు

ఈ ఏడాది సూర్యుడి ప్రతాపం మునుపెన్నడూ లేనంత తీవ్రంగా ఉంది. ఎల్‌నినో ప్రభావం వల్ల ఈ వేసవి ఎండలు మండుతున్నాయి. ప్రస్తుత పరిస్థితి ఒక జాతీయ విపత్తును తలపిస్తోంది. ఈతీవ్రమైన వడగాల్పుల నుండి ప్రజలను రక్షించడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్థానిక సంస్థలతో కలిసి సమగ్ర ప్రణాళికలు రూపొందించాలి. వడదెబ్బపైఅవగాహన కల్పించడంతో పాటు చికిత్స సౌకర్యాలను అందరికీ అందుబాటులోకి తీసుకురావాలి. ముఖ్యంగా భవన నిర్మాణ కార్మికులు, వీధివ్యాపారులు, వ్యవసాయ కూలీలు వంటి పేద వర్గాలపై ఎండ ప్రభావం ఎక్కువగా ఉంటుంది. వీరికి సామాజిక భద్రతా చర్యలు కల్పించడం ప్రభుత్వాల తక్షణ బాధ్యత. ప్రతి చోటా సురక్షితమైన తాగునీరు అందేలా చూడాలి. బహిరంగ ప్రదేశాలలో తాత్కాలిక నీడ కేంద్రాలు ఏర్పాటు చేయాలి. చలివేంద్రాల ద్వారా మజ్జిగ, ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేయడం ద్వారా వడదెబ్బ ముప్పును తగ్గించవచ్చు.

- సి.హెచ్.ప్రతాప్, శ్రీకాకుళం

### అతి నిద్ర ప్రమాదకరం

మానవ జీవితంలో నీరు, ఆరోగ్యం, ఆహారం, నిద్ర చాలా విలువైనవి. ప్రధానంగా సాధారణ మనిషికి 8 నుండి 10 గంటల నిద్ర చాలు అయినప్పటికీ కొందరు వ్యక్తులు అతి నిద్ర పోతుంటారు. ఇలాంటి వ్యక్తుల ఆరోగ్యం సమతుల్యత లేకపోవడంతో భవిష్యత్తులో దెబ్బతినే అవకాశాలు మెండుగా ఉంటాయి. అతి నిద్ర వల్ల ఉబకాయం, ఇతర ఆరోగ్య సమస్యలు ఎక్కువగా వచ్చే ప్రమాదం ఉంది. ఒకసారి ఆరోగ్యపరంగా దెబ్బతింటే కోలుకోవడం కష్టం. కనుక ప్రతి రోజు సమంతరమైన నిద్ర సమయాన్ని పాటిస్తేనే ఆరోగ్యం బాగుంటుందనీ వైద్యులు సూచిస్తున్నారు. శరీరానికి వ్యాయామం కూడా చాలా అవసరం. కొంత సమయాన్ని వ్యాయామానికి కేటాయించాలి.

- మోతె శివకుమార్, రంగారెడ్డిజిల్లా

### శేషన్‌కి ఎవరూ సాటిరారు

**పశుసంవర్ధక** ఇప్పటికిప్పుడు కాకపోయినా కొంత కాలం తరువాత ఎలక్షన్‌కమిషన్ జ్ఞానేష్‌కుమార్ తప్పుకోవలసిందే. ఆ పదవిలోకి మరొకరు రావలసిందే. అలా వచ్చిన వారు ఆరోపణలు ఎదుర్కొంటూ వివాదాలకు కేరాఫ్ అడ్రస్‌లా కాకూడదు. నిజాయితీగా, నిష్పక్షపాతంగా పని చేస్తూ ప్రజాస్వామ్య విలువలను కాపాడాలి.

-ఎం.ఎస్.శర్మ, హైదరాబాద్

### ఉసురు తీస్తున్న అకాల వర్షాలు!

గత 5 సంవత్సరాలుగా వాతావరణం అదుపు తప్పి ఎండాకాలంలో సైతం అకాలవర్షాలు కురుస్తూ, మన రాష్ట్రంలోని కొన్ని ప్రాంతాలలో రైతన్నల కష్టానికి తూట్లు పొడుస్తూ చేతికొచ్చిన పంటను ఈ అకాల వర్షాలు చాలా తీవ్ర స్థాయిలో నష్టాలు చేకూరుస్తున్నాయి అనే మాట సత్య దూరం కాదు. దీంతో ఎండాకాలంలో మొక్కజొన్న, కొర్ర, వరి పంటలు వేసిన రైతుల పరిస్థితి దినదిన గండంగామారుతున్నది. ఎందుకంటే ఎప్పుడు ఎలా ఏరూపంలో దాపురిస్తాయో తెలియని ఈ అకాల వర్షాల మూలాన రైతన్నల కంటి మీద కునుకు లేకుండా పోతున్నది. ఒక్కొక్కసారి కొంతమంది రైతన్నల తలరాత బాగుండి నాలుగు ఐదురోజులు వర్షాలు కురువకపోతే తాము పండించిన పంటలను త్వరగా అరబెట్టి మిషన్‌లలో వేసి ధాన్యాన్ని వ్యాపారస్తులకు అమ్మడమోలేదా ఇంటికి చేర్చుకోవడమే జరిగి సురక్షితంగా బయట పడుతూ వుంటారు.

- బుగ్గన మధుసూదనరెడ్డి, నంద్యాల జిల్లా

### మౌలిక సదుపాయాలు కల్పించాలి

ప్రస్తుత ఏపిలోని అన్ని ప్రభుత్వ పాఠశాల భవనాలు దాదాపుగా ఆధునీకరించబడినవి. ఏ ప్రభుత్వ కార్యాలయం అయినా మార్పులు చేసేటప్పుడు ప్రధానంగా పారిశుధ్యపు వసతి, నీటి సరఫరా, విద్యుత్ కలిపే చేస్తారు. మరి మహిళలకు ఒకటి వేరేగా వాష్‌రూమ్ ఉంటేనే సిబ్బంది, మహిళ విద్యార్థినీలకు ఇబ్బందిలేకుండా ఉంటుంది. ఇవి లేనందున కొందరు అమ్మాయిలు వేరే ప్రైవేట్ పాఠశాలకు వెళ్ళే ప్రయత్నం చేస్తున్నారు. ఇది అతి సహజమైనది. కొందరు బడి మానివేయడం బాధాకరం. వీరు చెప్పే ధైర్యం లేక అలా చేస్తున్నారు. ఇది చిన్న సమస్య. విద్యాశాఖ ఈ వసతి కూడా లేని పాఠశాలల్లో వాష్‌రమ్‌ల ఏర్పాటుకు చర్యలు చేపట్టాలి.

- బొల్లోజు మేఘనాదం, విశాఖపట్నం

### బడిబాటకు వెళాయె..

మరికొద్ది రోజుల్లో స్కూళ్లు ప్రారంభమవుతాయి. వేసవి సెలవుల్లో ఆటపాటలతో ఉల్లాసంగా గడిపిన బాల బాలికలు ఇక పుస్తకాలతో కుస్తీ పట్టే సమయం ఆసన్నమయింది. మొదటిసారి బడికి వెళ్లే పిల్లలు మారం చేయడం సహజం. అలాగే అల్లరి కూడా. ప్రథమ గురువు తల్లి అంటారు. కీలక పాత్ర మాతృమూర్తిదే అంటే అతిశయోక్తి కాదు. పాఠశాలలో స్నేహితులకుకొరతలేదు. క్రమంతప్పకుండా సమయపాలన పాటిస్తూ బడికి వెళ్లి చదివేలా చేయాలి. బిడ్డ బంగారు భవిష్యత్తుకై అహర్నిశలు పోరాడే తల్లిదండ్రుల బాధ్యత వెలకట్టలేనిది.

- ఆర్. వెంకటేశ్ చరన్, బెంగళూరు

గమనిక: ఎడిటోరియల్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలలోని అంశాలు, విశ్లేషణలు వ్యాసకర్త సొంత అభిప్రాయాలు. వాటితో పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. -ఎడిటర్

మన వి ఎడిట్ పేజీకి..
ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు
మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్
(e-mail: editpage@vaartha.com)

# మాటల్లోనే వ్యవ'సాయం'

**మనదేశంలో మొత్తం భూభాగంలోనలభైఐదు శాతం పైగా వ్యవసాయ యోగ్యమైనదని అంచనా. పొరుగునున్న చైనాలో పదిపన్నెండు శాతానికి మించి లేదు. కానీ అక్కడ వూహించిన రీతిలో దిగుబడులు సాధిస్తున్నది. నిజమైన భారతదేశం గ్రామాల్లో ఉందని, గ్రామస్వరాజ్యం సాధించిన నాడే నిజమైన స్వాతంత్ర ఫలాలు అందినట్లని మహాత్ముడు చేసిన ప్రవచనం నేటికి ప్రామాణికమైనదే. మనదేశానికి వ్యవసాయమే జీవనాధారమన్న నిజాన్ని గుర్తుపెట్టుకోవాలి. ఈ విషయం మొన్నటి కరోనాతో పాటు ఎన్నోసార్లు రుజువు అయింది. ఏదిఏమైనా రైతుల కష్టాలు రోజురోజు పెరుగుతున్నాయి. అందుకే ఒకనాడు వ్యవసాయం చేయడం గర్వంగా భావించే రైతులు నేడు ఏజన్మలో చేసుకొన్న పాపమో వ్యవసాయమే జీవనాధారంగా జీవించాల్సి వస్తున్నదని అన్నదాతలు వాపోయే దురదృష్టపరిస్థితులు దాపురించాయి.**

దామెర్ల సాయిబాబ

ఒక్క మాట

ఉన్నత పదవులు అధిష్టించేకొద్దీ, బాధ్యతలు పెరిగే కొద్దీ, వారి మాటలకు విలువ పెరుగుతుంది. అందులోనూ కీలక పదవుల్లో ఉన్నవారు మాట్లాడే ప్రతి మాటకు ఎంతో విలువ ఉంటుంది. అందుకే బాధ్యత కలిగిన కీలకమైన మంత్రి పదవుల్లో ఉన్నవారు ఆచి తూచి ఆలోచించి మాట్లాడాలి. వారి నోట వెంట వెలువడే ప్రతి పలుకు ప్రభుత్వ ఉద్దేశ్యంగా ప్రజలు భావిస్తారు. ఆ మాటల వల్ల వచ్చే మంచి, చెడుల ప్రభావం పాలనపై పడుతుంది. ఎందుకోఏమోకానీ రైతుల విషయంలో పాలకులు ఇస్తున్న హామీలు, వాగ్దానాలకు, చేతలకు పొంతన లేకుండాపోతున్నది. విత్తన కొరత ఉండదు, సకాలంలో రుణాల పంపిణీ చేస్తాం, ఎరువుల సమస్య ఉండదు, అవసరం మేరకు అన్ని గోదాముల్లో నిల్వ ఉంచుతాం, అవసరమైతే అదనపు నిల్వలు తెప్పిస్తాం, ఏ రైతు విత్తనాలు, రుణాలకు, ఎరువులకు ఇబ్బంది పడకుండా చూస్తాం, నకిలీ, నాసిరకంపై ఉక్కుపాదం మోపి రైతులు మోసపోకుండా పకడ్బందీగా చర్యలు తీసుకుంటామని ఖరీఫ్ ముందు పెద్దపెద్ద మాటలు చెప్తారు. ఇదేదో ప్రస్తుత ప్రభుత్వాలు వచ్చిన తర్వాత చెబుతున్నారని చెప్పడం లేదు. ఏనాటి నుంచో జరుగుతున్నది. వ్యవసాయం, బ్యాంకు తదితర సంబంధిత శాఖలకు చెందిన ఉన్నతాధికారులందరూ ఖరీఫ్ ఆరంభానికి ముందే ఒక ప్రణాళిక తయారు చేసి సుదీర్ఘంగా చర్చించి ముసాయిదాను రూపొందిస్తారు. ఎరువులు ఎంత కావాలి? విత్తనాలు ఎన్ని కావాలి? బ్యాంకు నుంచి రుణాలు ఎంత ఇవ్వాలి? తదితర అంశాలన్నీ పొందుపరిచి పక్కా ప్రణాళికను తయారు చేసి ఆమోదముద్ర వేస్తారు. ఇది ప్రతి సంవత్సరం జరిగే తంతే. అయితే ఈ ప్రణాళిక ఎవరికోసం ఉద్దేశించబడిందో, ఎవరు ఆచరించాలో ఆ అన్నదాతలకే తెలియదు. కనీసం ఆ రైతు ప్రతినిధులకు కూడా అందులో ప్రవేశం ఉండదు. వారిని సంప్రదించే పద్ధతి కూడా లేదు. అసలు నిజానికి రైతులకు తమపై ఒక ప్రణాళిక తయారు చేస్తున్నారనే విషయం కూడా తెలియదు. ఇకపోతే అధికారులు రాత్రింబవళ్లు కష్టపడి తయారు చేసిన ప్రణాళిక వాస్తవంగా రైతుల సాగుకు చాలా సందర్భాల్లో పొంతన ఉండడం లేదు. మనదేశంలో ఇప్పటికీ అధికశాతం సాగు వర్షాధారం మీదనే ఆధారపడి ఉంది. వర్షాలు, నీటి ఆధారాలను బట్టి ఏయే పంటలు ఎప్పుడు వేయాలి? ఏయే విత్తనాలు వాడాలి? తదితర అంశాలు రైతులే ఆయా ప్రాంతాలను బట్టి నిర్ణయించుకుంటున్నారు. అందరు ఊహించినట్లుగానే రోహిణికార్తెలోనే వర్షాలు ఆరంభమై సకాలంలో చెరువులు, కుంటలు, ప్రాజెక్టుల్లోకి నీరు వస్తే విత్తే వంగడాలు వేరు. ఆ వర్షాలు ఆలస్యమైతే నీరు సమృద్ధిగా లేకపోతే విత్తే విత్తనాలు వేరు. ఇలా వర్షాలను బట్టి పరిస్థితులను బట్టి రైతులు సాగు చేసుకుంటున్నారు. ఇవన్నీ అధికారులకు తెలియంది కాదు. వారు జీతభత్యాలు తీసుకుంటున్నారు గనుక వారి పాటికి వారు రికార్డులేవో తయారు చేసి ప్రభుత్వానికి సమర్పిస్తుంటారు. ఈసారి ఖరీఫ్‌కు సంబంధించి రోహిణికార్తె సోమవారం ఆరంభమైంది. వర్షాల ఆగమనంతో రకరకాల అంచనాలు వెలువడుతున్నాయి. ఎల్‌నినో వల్ల ఈ యేడాది వర్షాలు తగ్గుముఖం పట్టొచ్చని కొన్ని అంచనాలు చెబుతుంటే లేదు సాధారణ వర్షపాతం నమోదవుతుందని మరికొందరు శాస్త్రవేత్తలు చెబుతున్నారు. ఇక పంటల విషయానికి వస్తే కూరగాయలు, పప్పుదినుసుల సాగు రాను రాను తగ్గిపోతున్నది. ప్రభుత్వ ప్రోత్సాహకాలు కూడా కాగితాలకే పరిమితమవుతున్నాయి. ఏ పంటలు ఎప్పుడు వేసుకోవాలో రైతులకు కొత్తగా ఉద్బోధించాల్సిన అవసరం ఉండదు. వారికి ఎంతో అనుభవం ఉంది. కానీ నూతనంగా అందుబాటులోకి వచ్చిన, వస్తున్న సాంకేతికత రైతులకు చేర్చడంలో అంతగా సఫలీకృతం కాలేకపోతున్నారు. పత్తి పెట్టొద్దు ప్రాణంమీదకు తెచ్చుకోవద్దు అని ఎందరు ఎన్ని విధాలుగా చెబుతున్నా చావో, బతుకో పత్తిలోనే తేల్చుకోవాలనే ధ్యేయంతో పత్తి సాగు వైపే మొగ్గుచూపుతున్నారు. వరి పంట వేయాలని ఏ రైతూ కోరుకోడు. లాభసాటిగా ఉండి, ప్రకృతి ఆటుపోట్లను తట్టుకోగలిగితే ఏ సాగు అయినా చేయడానికి రైతు వెనుకంజ వేయడు. తెలుగురాష్ట్రాల్లో వాతావరణ పరిస్థితులు అంతగా అనుకూలించడం లేదు. అయితే అనావృష్టి, లేకపోతే అతివృష్టి ఈరెండూ కాకపోతే అకాల వర్షాలతో ప్రకృతి రైతుపై పగబట్టినట్లుగా వ్యవహరిస్తున్నది. విత్తనాలు నాటి నుండి పంట చేతికి వచ్చేవరకు దేవుని మీదనే భారంవేసి గుండెలను అరచేతిలో పెట్టుకొని కాలం గడపాల్సి వస్తున్నది. చీడపీడలు ఆశిస్తేనో, నకిలీ విత్తనాలతో మోసపోతేనో, ఆరంభంలోనే ఆశలు అడుగంటిపోతాయి. ముఖ్యంగా నకిలీ, నాసిరకం విత్తనాలు, పురుగు మందులు వారి జీవితాలతో ఆటలాడుకుంటున్నాయి. అన్నీ బాగుండి కాలం కలిసివచ్చి పంట చేతికంది మార్కెట్లోకి తీసుకువెళ్లితే తూకంలో మోసం, ధరల్లో దగా, ఒకటే మిటి ఎవరికి వీలైతేవారు రైతులను దోచుకుంటున్నారు. రైతులకు ఏమీ మిగలడంలేదు. అందుకే కాస్తోకూస్తో పంట దక్కిన రైతులుకూడా గంపెడు దరిద్రంతో అల్లాడుతున్నారు. రైతులు చారణా రాబడికి బారాణా ఖర్చు అన్నట్లుగా వాణిజ్య పంటల రైతుల పరిస్థితి దయనీయంగా తయారైంది. పండ్లతోటల రైతులపరిస్థితి మరింత దారుణంగా ఉంది. యేడాది పాటు కాయకష్టం అంతా చేసి పంట నోటికి అందుతున్న దశలో అకాల వర్షాలు, కాయలు నేల రాలిపోతే యేడాది శ్రమ నీటిపాలైనట్లే. ఈయేడాది తెలుగు రాష్ట్రాల్లో మామిడి రైతుల పరిస్థితి వర్ణనాతీతంగా ఉంది. పశ్చిమాసియాలో యుద్ధం కారణంగా ఎగుమతులు నిలిచిపోయాయి. ధరలు పాతాలలోకానికి పడిపోయాయి. మహబూబ్‌నగర్ జిల్లా దేవరకద్ర మండలం, డోకూరుకు చెందిన గంగుల నర్సింహములు కుటుంబ విషాద గాధ వింటేఎంతటి కఠినహృదయమైనా కరగక తప్పదు. మామిడి తోటను లీజుకు తీసుకొని గత ఐదారేళ్లుగా రాత్రింబవళ్లు కష్టం చేస్తూనే ఉన్నారు. ఈ యేడాది కూడా కౌలు డబ్బులు చెల్లించారు. ప్రకృతి సహకరించకపోవడం, మరోకపక్క చీడ పీడలు అన్నీకలిపిఆయన్ని నష్టాల ఊబిలోకి దించాయి. అరవై లక్షల వరకు అప్పులు చేస్తే అవి వడ్డీలతో కోటిఇరవై లక్షలవరకు పెరిగింది. ఇంటిపై రుణం తీసుకొని కొన్ని చెల్లించినా ఆ తర్వాత కిస్తులు కట్టలేని పరిస్థితికి చేరుకున్నాడు. ప్రైవేట్ అప్పులు ఆయనకు తలకుమించిన భారంగా తయారయ్యాయి. ఫైనాన్షియర్లు ఆయన ఇంటికి నోటీసులు అంటించి దాదాపు రెండు లక్షల విలువైన ఆయన భార్యపై ఉన్న బంగారు నగలు తీసుకువెళ్లారు. ఒత్తిడిలు భరించలేక వారిపై కేసు పెట్టి కోర్టుకు వెళ్లి ఇంజెక్షన్ ఆర్డర్ తెచ్చుకున్నా వేధింపులు తప్పలేదు. ఇలా తనను వేధిస్తున్న వారి కొందరి పేర్లను ఒక వీడియో ద్వారా వెల్లడించి అప్‌లోడ్ చేశాడు. ఈ బాధలను భరించలేక గత మంగళవారం తన భార్యను, ఇద్దరి పిల్లలనుకాళ్లు చేతులు కట్టివేసి నీటి కుంటలో పడేశాడు. ఇదంతా తన బంధువులకు ఫోన్ ద్వారా తెలిపి తాను ఉరివేసుకున్నాడు. ఇలాఎందరో అన్నదాతలు తాము బలవంతపు మరణాలకు పాల్పడడమే కాదు కుటుంబం వీధిన పడుతుందనే భయంతో తమతో పాటే వారిని కూడా తీసు కుపోతున్నారు. మన దేశంలో మొత్తం భూభాగంలోనలభైఐదు శాతం పైగా వ్యవసాయ యోగ్యమైనదని అంచనా. పొరుగునున్న చైనాలో పదిపన్నెండు శాతానికి మించి లేదు. కానీ అక్కడ వూహించిన రీతిలో దిగుబడులు సాధిస్తున్నది. నిజమైన భారతదేశం గ్రామాల్లో ఉందని, గ్రామస్వరాజ్యం సాధించిన నాడేనిజమైన స్వాతంత్ర ఫలాలు అందినట్లని మహాత్ముడు చేసిన ప్రవచనం నేటికి ప్రామాణికమైనదే. మనదేశానికి వ్యవసాయమే జీవనాధారమన్న నిజాన్ని గుర్తుపెట్టుకోవాలి. ఈ విషయం మొన్నటి కరోనాతో పాటు ఎన్నో సార్లు రుజువు అయింది. ఏదిఏమైనా రైతుల కష్టాలు రోజురోజు పెరుగుతున్నాయి. అందుకే ఒకనాడు వ్యవసాయం చేయడం గర్వంగా భావించే రైతులు నేడు ఏజన్మలో చేసుకొన్న పాపమో వ్యవసాయమే జీవనాధారంగా జీవించాల్సి వస్తున్నదని అన్నదాతలు వాపోయే దురదృష్ట పరిస్థితులు దాపురించాయి. •

# దేశాభివృద్ధికి నూతన ఆవిష్కరణలే పరిష్కారమా?

డి. జయరాం

ప్రపంచం కృత్రిమ మేధ, ఆటోమేషన్, డిజిటల్ విప్లవం గురించి గొప్పగా మాట్లాడుతున్న ఈ కాలంలో కూడా కోట్లాది మంది ప్రజలు ఇంకా ప్రాథమిక సాంకేతిక సేవలకే దూరంగా ఉండటం అభివృద్ధి యుగంలోని అతి పెద్ద వైరుధ్యాల్లో ఒకటి. ఒకవైపు మానవుడు అంతరిక్ష పరిశోధనల్లో కొత్త శిఖరాలను అధిరోహిస్తుంటే, మరోవైపు గ్రామీణ ప్రాంతాల్లో ఒక విద్యార్థి సరైన ఇంటర్నెట్ సౌకర్యం లేక చదువును కొనసాగించలేకపోతున్నాడు. ఒకరైతు మార్కెట్ ధరలు తెలియక నష్టపోతున్నాడు. ఒక పేదరోగి వైద్య సేవలు అందక ప్రాణాలతో పోరాడుతున్నాడు. ఈ దృశ్యాలు మన ముందుకు ఒక అసౌకర్యమైన ప్రశ్నను తీసుకొస్తున్నాయి. అభివృద్ధి నిజంగా అందరికీ చేరుతోందా? ఆర్థిక వృద్ధి అనేది కేవలం గణాంకాల పెరుగుదల కాదు. అది ప్రతిమనిషి జీవితంలో గౌరవాన్ని, అవకాశాన్ని, భద్రతను తీసుకురాగలిగితేనే దానికి అసలు అర్థం ఉంటుంది. లేకపోతే అభివృద్ధి అనే పదం నివేదికలలో కనిపించే సంఖ్యలకే పరిమితమైపోతుంది. ఈ నేపథ్యంలోనే సమ్మిళిత వృద్ధి కోసం బాధ్యతాయుతమైన ఆవిష్కరణలు అనే భావన ప్రాధాన్యం సంతరించుకుంది. సాంకేతికత అందరికీ చేరకపోతే అది అభివృద్ధి కాదు. కొత్త రూపంలో అసమానతకు వేసిన పునాది మాత్రమే. సాంకేతికపురోగతి కేవలం లాభాలకే పరిమితం కాకుండా సామాజిక బాధ్యతను కూడా మోసుకెళ్లాలి. ఎందుకంటే సాంకేతికతకు సామాజిక స్పృహ లేకపోతే అది పురోగతికన్నా అసమానతను మరింత వేగంగా పెంచే ప్రమాదం ఉంది. ఈరోజు ప్రపంచ ఆర్థిక వ్యవస్థ ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యల్లో ఆదాయ అసమానత ఒకటి. సాంకేతిక పురోగతి పెరుగుతున్న కొద్దీ సంపద కొద్దిమంది చేతుల్లోనే కేంద్రీకృతమవుతోంది. ఆవిష్కరణల ఫలాలు అందరికీ చేరకపోతే అభివృద్ధి అనేది కొందరి ప్రత్యేక హక్కుగా మారే ప్రమాదం ఉంది. అందుకే సమ్మిళిత వృద్ధి ఇప్పుడు కేవలం ఆర్థిక చర్చమాత్రమే కాదు, సామాజిక న్యాయానికి సంబంధించిన ప్రశ్నగా మారింది. బాధ్యతాయుతమైన ఆవిష్కరణలు ఎందుకు అవసరం? సమ్మిళిత వృద్ధిని సాధించడంలో బాధ్యతాయుతమైన ఆవిష్కరణలు కీలక పాత్ర పోషిస్తాయి. వ్యవసాయ రంగంలో చిన్న రైతులకు తక్కువ ఖర్చుతో నీటి సంరక్షణ పద్ధతులు, మొబైల్ ద్వారా మార్కెట్ ధరలు, వాతావరణ సమాచారాన్ని అందించడం వంటి చర్యలు వారి ఆదాయాన్ని పెంచడమే కాదు, ఆర్థిక వ్యవస్థలో గౌరవప్రదమైన స్థానాన్ని కూడా కల్పిస్తాయి. మధ్యవర్తులపై ఆధారపడకుండా రైతు నేరుగా మార్కెట్‌ను చేరుకునే స్థితికి చేరుకోవచ్చు. ఆరోగ్య రంగంలో టెలిమెడిసిన్ సేవలు, తక్కువ ధరలో లభించే రోగ నిర్ధారణ పరికరాలు గ్రామీణ ప్రజలకు ప్రాణభరోసాగా మారగలవు. విద్యా రంగంలో డిజిటల్ వేదికలు గ్రామీణ విద్యార్థులకు అవకాశాల తలుపులు తెరవగలవు. సరైన దిశలో వినియోగిస్తే సాంకేతికత సామాజిక అంతరాలను తగ్గించే శక్తిగా మారుతుంది. తప్పు దిశలో ప్రయాణిస్తే అదే సాంకేతికత కొత్త గోడలను కూడా నిర్మించగలదు. పట్టణాల్లో వేగంగా విస్తరిస్తున్న సాంకేతిక సదుపాయాలు గ్రామీణ ప్రాంతాలకు అదే స్థాయిలో చేరడంలేదు. స్మార్ట్‌ఫోన్‌లు పెరిగినావాటినివిద్య, ఉపాధి, వ్యాపార అవసరాలకు సమర్థంగా ఉపయోగించే సామర్థ్యం ఇంకా పరిమితంగానే ఉంది. లాభం మాత్రమే లక్ష్యమైతే సమాజం వెనుకబడుతుంది. పరిశోధనవ్యయాలు పెరగడం వల్ల అనేక సాంకేతిక ఉత్పత్తులుఅధిక ధరలకు అందుబాటులోకి వస్తున్నాయి. ఫలితంగా వాటి ప్రయోజనాలు సామాన్య ప్రజలకు దూరమవుతున్నాయి. మరోవైపు కృత్రిమ మేధ, ఆటోమేషన్ ఉత్పాదకతను పెంచుతున్నప్పటికీ ఉపాధి రంగంపై కొత్త ఒత్తిడులను సృష్టిస్తున్నాయి. ఒకవైపు పరిశ్రమలు నైపుణ్యం కలిగిన ఉద్యోగుల కొరతను ఎదుర్కొంటుంటే, మరోవైపు లక్షలాదిమంది యువతఉద్యోగ అవకాశాల కోసం ఎదురు చూస్తున్నారు. ఉపాధిని కోల్పోయిన వ్యక్తికి 'అభివృద్ధి' అనే పదం తరచుగా శూన్యంగా వినిపిస్తుంది. ఈసవాళ్లను అధిగమించాలంటే డిజిటల్ మౌలిక సదుపాయాలను ప్రజా హక్కుగా చూడాలి. ఇంటర్నెట్‌ను కేవలం సమాచార సాధనంగా కాకుండా విద్య, వైద్యం, వ్యవసాయ సేవలను స్థానిక భాషల్లో అందించే వేదికగా అభివృద్ధి చేయాలి. పరిశోధన, అభివృద్ధిపై పెట్టుబడులను పెంచాలి. గ్రామీణసమస్యలకు పరిష్కారాలు చూపే తక్కువ ఖర్చు ఆవిష్కరణలకు ప్రత్యేక ప్రోత్సాహం అవసరం. ప్రయోగశాలల్లో పుట్టిన ఆలోచనలు సమాజంలో మార్పు తీసుకురావాలంటే పరిశ్రమలు, విశ్వవిద్యాలయాలు, ప్రభుత్వాల మధ్య సమన్వయం పెరగాలి. అలాగే 'రిస్కిల్లింగ్' 'అప్‌స్కిల్లింగ్' కార్యక్రమాలను విస్తృతంగా అమలు చేయాలి. సాంకేతికత ఉపాధిని హరించే శక్తిగా కాకుండా అవకాశాలను విస్తరించే సాధనంగా మారాలి. •

# 'ఆన్‌లైన్' మూల్యాంకనం'లో పారదర్శకత సాధ్యమేనా?

టి.నాగరాజు

దేశంలోనే అతిపెద్ద విద్యా బోర్డు అయిన సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ (సీబీఎస్‌ఈ) ఈసారి అమలు చేసిన డిజిటల్ మూల్యాంకన విధానం తీవ్ర వివాదాలకు కేంద్రబిందువైంది. 'డిజిటల్ ఇండియా', 'న్యూ ఇండియా', 'టెక్నాలజీ విప్లవం' అంటూ కేంద్ర ప్రభుత్వం చేసే ఆర్భాట ప్రచారానికి భిన్నంగా వాస్తవ పరిస్థితులు మాత్రం దేశ విద్యావ్యవస్థలోని ప్రమాదకరమైన బలహీనతలను బయటపెట్టాయి. విద్యార్థుల జీవితాలతో నేరుగా సంబంధం ఉన్న పరీక్షా మూల్యాంకన ప్రక్రియను సరైన సన్నద్ధత లేకుండా డిజిటల్ ప్రయోగంగా మార్చడం వల్ల లక్షలాది కుటుంబాలు తీవ్ర ఆందోళనకు గురయ్యాయి. ఈ ఏడాది క్లాస్ 12 బోర్డు పరీక్షల కోసం తొలిసారిగా ఆన్‌స్క్రీన్ మార్కింగ్ (ఓఎస్‌ఎం) విధానాన్ని అమలు చేశారు. కోటి సంఖ్యలో సమాధాన పత్రాలను స్కాన్ చేసి దేశవ్యాప్తంగా వేలాది ఎగ్జామినర్లతో ఆన్‌లైన్ మూల్యాంకనం నిర్వహించారు. అధికారికంగాచూస్తే ఇది పారదర్శకత, వేగం, సాంకేతిక ఆధునికత పేరుతో తీసుకొచ్చిన సంస్కరణ. కానీ ఫలితాలు వెలువడిన వెంటనే దేశవ్యాప్తంగా విద్యార్థుల ఆవేదన వెల్లువెత్తింది. ప్రత్యేకంగా ఫిజిక్స్, మ్యాథ్స్, కెమిస్ట్రీ, బయాలజీ వంటి సబ్జెక్టుల్లో అనూహ్యంగా మార్కులు తగ్గిపోయాయని వేలాది మంది విద్యార్థులు ఆరోపించారు. రెండేళ్లు కష్టపడి చదివాం.. కానీ బ్లర్ అయిన స్కాన్‌ల ఆధారంగా మా భవిష్యత్తును తీర్పు చెప్పారు' అంటూ విద్యార్థులు సోషల్ మీడియాలో ఆవేదన వ్యక్తం చేశారు. ఈసారి ఉత్తీర్ణత శాతం గణనీయంగా పడిపోవడం కూడా అనుమానాలకు బలం చేకూర్చింది. అసలు సమస్య సాంకేతికతలో కాదు, దాన్ని అమలు చేసేప్రభుత్వ ధోరణిలోనే ఉందని నిపుణులు చెబుతున్నారు. లక్షలాది ఆన్సర్ షీట్లను స్కాన్ చేసే ప్రక్రియలో నాణ్యత నియంత్రణ లేకపోవడం, పోర్టల్ సామర్థ్యం తక్కువగా ఉండటం, ఎగ్జామినర్లకు తగిన శిక్షణ లేకపోవడం వంటి అంశాలు ఇప్పుడు ఒక్కొక్కటిగా బయటపడుతున్నాయి. 'డిజిటల్' అనే పేరుతో వ్యవస్థను ప్రకటించడం సులువు. కానీ దాన్నిప్రజల నమ్మకాన్ని దెబ్బతీయకుండా అమలు చేయడం ప్రభుత్వ బాధ్యత. అదే బాధ్యతలో సీబీఎస్‌ఈ విఫలమైంది. రికార్డు స్థాయిలో విద్యార్థులు రీవెరిఫికేషన్, ఆన్సర్ షీట్ కాపీల కోసం దరఖాస్తు చేయడం సాధారణ విషయం కాదు. ఇది విద్యార్థుల్లో బోర్డుపై పెరుగుతున్న అనిశ్చితికి నిదర్శనం. పోర్టల్లు వరుసగా క్రాష్ కావడం, ఫీజులు పలుమార్లు కట్ కావడం, అప్లికేషన్లు మధ్యలో ఆగిపోవడం వంటి ఘటనలు



'డిజిటల్ ఇండియా' ప్రచారానికి అసలు అద్దం పట్టాయి. ప్రభుత్వ ప్రకటనల్లో కనిపించే సాంకేతిక విజ్ఞానం, ప్రజల అనుభవాల్లో మాత్రం గందరగోళంగా మారుతోంది. ఇక తారుమారైన ఆన్సర్ షీట్ ఘటన పరిస్థితిని మరింత దిగజార్చింది. ఒక విద్యార్థి రోల్ నంబర్‌కు మరో విద్యార్థి సమాధాన పత్రం అప్‌లోడ్ కావడం చిన్న పొరపాటు కాదు. ఇది విద్యార్థుల భవిష్యత్తుతో ఆడుకున్నట్టే. తర్వాత సీబీఎస్‌ఈ తప్పును అంగీకరించినా అప్పటికే వేలాది కుటుంబాల్లో భయం వ్యాపించింది. మా ఆన్సర్ షీట్ నిజంగానే మాదేనా? అనే అనుమానం విద్యార్థుల్లో పెరిగింది. హ్యాకింగ్ ఆరోపణలు పరిస్థితిని మరింత ఆందోళనకరంగా మార్చాయి. ఒక విద్యార్థి తాను కేవలం అరగంటలో మూల్యాంకన వ్యవస్థలోకి ప్రవేశించానని చెప్పడం దేశ విద్యా భద్రతపైనే ప్రశ్నలు లేవనెత్తింది. సీబీఎస్‌ఈ ఈ ఆరోపణలను ఖండించినా, విద్యార్థులు, తల్లిదండ్రుల్లో ఉన్న అనుమానాలు తొలగలేదు. ప్రజల వ్యక్తిగత డేటా, విద్యా రికార్డులు ఎంత భద్రంగా ఉన్నాయన్న ప్రశ్న ఇప్పుడు మరింత తీవ్రమైంది. ఈ మొత్తం వ్యవహారం మరో ప్రమాదకర ధోరణిని కూడా బయటపెట్టింది. ప్రభుత్వ విద్యా వ్యవస్థలను బలోపేతం చేయకుండా, ప్రైవేట్ ఎడ్యూటెక్ కంపెనీలు, కార్పొరేట్ సాంకేతిక వ్యవస్థలపై ఆధారపడటం పెరుగుతోంది. విద్యను హక్కుగా కాకుండా మార్కెట్ ఉత్పత్తిగా మార్చే విధానాల ఫలితమే ఈ పరిస్థితి. సాంకేతికతను విద్యలో ఉపయోగించడం తప్పు కాదు. కానీ విద్యార్థుల భవిష్యత్తును కార్పొరేట్ ప్రయోగాలకు అప్పగించడం ప్రమాదకరం. ఇది కేవలం సాంకేతిక వైఫల్యం మాత్రమే కాదు. ఇది దేశ విద్యావిధాన దిశను ప్రశ్నించే సంఘటన. విద్యార్థులను 'డేటా'గా చూసే విధానం, ఉపాధ్యాయుల పాత్రను తగ్గించే విధానం, ప్రభుత్వ బాధ్యతలను ప్రైవేటు కంపెనీలకు అప్పగించే విధానం ఇవన్నీకలిసి ఇప్పుడు విద్యా వ్యవస్థను సంక్షోభంలోకి నెడుతున్నాయి. కేంద్రప్రభుత్వం 'డిజిటల్ ఇండియా' పేరుతో ప్రచారం చేస్తున్న అభివృద్ధి నమూనా వాస్తవానికి ప్రజల అనుభవాల్లో ఎంత బలహీనంగా ఉందో సీబీఎస్‌ఈ ఘటన మరోసారి నిరూపించింది. ప్రజా వ్యవస్థలను బలోపేతం చేయకుండా కేవలం యాప్‌లు, పోర్టల్లు, ప్రకటనలతో దేశం ముందుకు సాగదు. ముఖ్యంగా విద్య వంటి అత్యంత కీలక రంగంలో ప్రయోగాలు కాదు, బాధ్యతాయుతమైన విధానాలు అవసరం. విద్యార్థుల భవిష్యత్తు ప్రభుత్వ ప్రచార నినాదాల కంటే గొప్పది. 'డిజిటల్ ఇండియా' నిజంగా ప్రజల నమ్మకాన్ని గెలుచుకోవాలంటే ముందుగా విద్యావ్యవస్థలో పారదర్శకత, బాధ్యత, మానవీయ దృక్పథం ఉండాలి. లేకపోతే ఈ డిజిటల్ సంస్కరణలన్నీ కార్పొరేట్ ప్రకటనలుగానే మిగిలిపోతాయి. •

అమరావతి వార్త



## ఆసుపత్రులలో ఫైర్ ఆడిట్ జరగాలి

### - జిల్లా కలెక్టర్ సాయికాంత్ వర్మ

గుంటూరు, మే 29 ప్రభాతవార్త ప్రతినిధి : ప్రభుత్వ, ప్రయివేటు ఆసుపత్రుల్లో అగ్నిప్రమాదాలు సంభవించకుండా అన్ని ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సంబంధిత అధికారులను గుంటూరు జిల్లా కలెక్టర్ యికాంత్ వర్మ ఆదేశించారు. శుక్రవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఆసుపత్రుల్లో అగ్నిప్రమాదాల నివారణ కోసం ఫైర్ ఆడిట్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన



మాట్లాడుతూ అగ్ని ప్రమాదాల నివారణ కోసం ఆసుపత్రుల్లో ఏర్పాటు చేసిన పరికరాలను ఎప్పటికప్పుడు పర్యవేక్షి ంచడంతో పాటు గడువు ముగిసిన వాటి స్థానంలో నూతన పరికరాలు కొనుగోలు చేయటానికి చర్యలు తీసుకోవాలన్నారు. ఫైర్ ఆడిట్ తో పాటు ఆసుపత్రిలో సంబంధిత విద్యుత్ శాఖ అధికారులు విద్యుత్ ఆడిట్ నిర్వహించాలని ఆదేశించారు. ప్రతి నెల ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రులలో మాక్ డ్రిల్ నిర్వహించాలని సూచించినట్లు చెప్పారు. ఫైర్ ఆడిట్ లో కనుగొన్న లోపాలను సంబంధిత ఆసుపత్రులు తక్షణం పునరుద్ధరణ చేయాలని పేర్కొన్నారు. అగ్నిమాపక పరికరాల ఎక్స్పైరీ డేట్ ను కూడా విధిగా పరిశీలించాలని అన్నారు. వేసవి తీవ్రత ఉందని ఈ సమయంలో విద్యుత్తు ఉపకరణాలు వినియోగం అధికంగా ఉంటుందని విద్యుత్ లోడుకు తగిన విధంగా లేనట్లయితే షార్ట్ సర్క్యూట్ అయ్యే ప్రమాదం ఉంటుందని పేర్కొంటూ అటువంటి లోపాలు కనుగొనుటకు విద్యుత్ ఆడిట్ ను నిర్వహించాలని ఆదేశించినట్లు తెలిపారు. అగ్నిమాపక పరికరాల వినియోగం, నిర్వహణ అమలును పర్యవేక్షణ చేయడం జరుగుతుందని చెప్పారు. ఈ సమావేశంలో జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారి విజయలక్షి ్మ, జిల్లా ఫైర్ ఆఫీసర్ ఎం.శ్రీనివాసరెడ్డి, జిజిహెచ్ సూపరింటెండెంట్ ఎస్.ఎస్.వి రమణ, ఎన్.టి.ఆర్ వైద్య సేవ జిల్లా సమన్వయ అధికారి విజయ్ శేఖర్, ఏ.పి.హెచ్.ఎమ్.ఐ.డి.సి అధికారులు పాల్గొన్నారు.

## పర్యావరణశాస్త్రంలో సతీష్‌కు పీహెచ్‌డి ప్రదానం



ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం, మే29, ప్రభాతవార్త: ఏఎన్‌యులోని పర్యావరణ శాస్త్ర విభాగంలో ఆంధ్రప్రదేశ్ రాజధాని ప్రాంతంలో ఉన్న వ్యర్థాలు, మైదానాల నుంచి సేకరించిన నేల, మురుగునీటిలోని బ్యాక్టీరియాను గుర్తించడం అనే అంశంపై అధ్యయనం చేసినందుకు బురదగుంట సతీష్‌కు పీహెచ్‌డి డిగ్రీని ప్రదానం చేసినట్లు రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ సెల్ కోఆర్డినేటర్ డాక్టర్ పి.సుధాకర్‌తెలిపారు. సతీష్‌కు పరిశోధనలో పర్యవేక్షకులుగా ఆచార్య పి.బ్రహ్మాజీరావు వ్యవహరించారు.

## కేరళ మాజీముఖ్యమంత్రి విజయన్ ఇంటిపై దాడులు దుర్మార్గం

గుంటూరు కల్చరల్,మే 29,ప్రభాతవార్త : దేశంలో ప్రతిపక్ష పార్టీలపైనా,నాయకులపైన అవినీతి ఆరోపణలు గుప్పించడం ఆ తర్వాత తన గుప్పెట్లో ఉన్న దర్యాప్తు సంస్థల చేత దాడులు చేయించడం కేంద్ర ప్రభుత్వం చాలా కాలంగా కొనసాగిస్తున్న పద్దతి అని,కేరళ మాజీ ముఖ్యమంత్రి పినరైయి విజయన్ అద్దెఇంటిపై ఈడి దాడులని అవగాహన సంస్థ విమర్శిస్తుంది.గతంలో ఢిల్లీలో అరవింద కేజ్రీవాల్,జార్ఖండ్ హేమంత్ సోరేన్‌ల మీద వేసిన కేసుల్లో నిజం లేదని కోర్టుల్లో నిర్ధోషిత్వం రుజువు అయినా అదే తరహాలో దాడులు కొనసాగిస్తున్న కేంద్ర ప్రభుత్వంపై ప్రజాగ్రహం వెల్లువెత్తక ఆపదని అవగాహన సంస్థ హెచ్చరిస్తుంది.

## డిఎస్‌పి నుండి ఎఎస్‌పిగా పదోన్నతులు



విజయవాడ కార్పొరేషన్,మే 28,ప్రభాతవార్త: రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల డిఎస్‌పిలకు అడిషనల్ ఎస్‌పిలుగా పదోన్నతి కల్పించడంతో ఎన్టీఆర్ జిల్లా టాస్క్‌ఫోర్స్ ఎసిపిగా విధులు నిర్వహిస్తున్న కె.లతాకుమారి, మైలవరం డిఎస్‌పిగా విధులు నిర్వహిస్తున్న వై.ప్రసాదరావు,సెంట్రల్ క్రైం స్టేషన్‌లో ఎసిపిగా విధులు నిర్వహిస్తున్న సిహెచ్ వెంకటేశ్వర్లులు డిఎస్‌పి నుండి అడిషనల్ ఎస్‌పిలుగా పదోన్నతి పొందారు.ఎఎస్‌పిలుగా పదోన్నతులు పొంది భాధ్యతలు స్వీకరించిన పై ముగ్గురు శుక్రవారం సిపి రాజశేఖరబాబును మర్యాదపూర్వకంగా కలిసారు.

## ఫోటో జర్నలిస్ట్ టి.శ్రీనివాస రెడ్డికి అంతర్జాతీయ గుర్తింపు



విజయవాడ, మే 29, ప్రభాతవార్త : విజయవాడకు చెందిన ప్రఖ్యాత ఫోటో జర్నలిస్ట్ డాక్యుమెంటరీ ఫోటోగ్రాఫర్ తమ్మా శ్రీనివాస రెడ్డి ఆస్ట్రేలియన్ ఫోటోగ్రాఫిక్ సొసైటీ నుండి ప్రతిష్టాత్మకమైన మాస్టర్ ఆఫ్ ది ఆస్ట్రేలియన్ ఫోటోగ్రాఫిక్ సొసైటి గౌరవాన్ని అందుకుని భారతదేశానికి అపార గౌరవాన్ని తెచ్చారు. రిస్క్ యాజ్ జాబ్, ది డైలీ సాగా ఆఫ్ ఆర్టిసనల్ కోల్ మైనర్స్ పేరిట ఆయన రూపొందించిన అద్భుత డాక్యుమెంటరీ పోర్ట్‌ఫోలియోకు గుర్తింపుగా ఈపురస్కారం అందించారు. ఈ శక్తివంతమైన డాక్యుమెంటరీ, దక్షిణ భారతదేశంలోని సింగరేణి బొగ్గు గనులలో పనిచేస్తున్న భూగర్భ బొగ్గు కార్మికుల కఠోర వాస్తవాలు, ప్రమాదాలు, ఓర్పు మరియు దృఢత్వాన్ని చిత్రీకరిస్తుంది.2026లో ప్రపంచవ్యాప్తంగా ఎంపికైన ఇద్దరిలో టిఎస్.రెడ్డి ఒకరిగా నిలిచారు.

## ఏపిలో క్షీణిస్తున్న గాలి నాణ్యత

విజయవాడ, మే 29, ప్రభాతవార్త : ఆంధ్రప్రదేశ్‌లో గాలి నాణ్యత గత మూడేళ్లుగా క్రమంగా క్షీ ణిస్తున్నట్లు తమ నివేదిక వెల్లడించిందని కోట్లాది మంది ప్రజలు ప్రతిరోజూ అసురక్షి త గాలిని పీలుస్తున్నారనే విషయాన్ని ఈ గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి" అని రెస్పైరర్ లివింగ్ సైన్సెస్ వ్యవస్థాపకుడు, సీఈఓ రోనక్ సుతారియా అన్నారు. 2017లో స్థాపితమైన తమ సంస్థ భారత్‌తో పాటు విదేశాల్లోని 35 నగరాల్లో 3,500కు పైగా ఎయిర్ మానిటరింగ్ పరికరాలను ఏర్పాటు చేసి, ప్రభుత్వాలు,పరిశ్రమలు,పరిశోధనా సంస్థలతో కలిసి స్వచ్ఛగాలికార్యక్రమాలను నిర్వహిస్తోందన్నారు.

## జూన్ 6 నుంచి జూనియర్ కళాశాలలు పునః ప్రారంభం

గుంటూరు విద్య మే 29 ప్రభాతవార్త :రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న జూనియర్ కళాశాలలు కాంపోజిట్ డిగ్రీ కళాశాలలు ఈనెల 6వ తేదీ నుంచి పునః ప్రారంభం కానున్నట్లు ఇంటర్మీడియట్ బోర్డు కార్యదర్శి విడుదల చేసిన ఉత్తర్వ్యులలో పేర్కొన్నారు. 20262027 విద్యాసంవత్సర అకాడమిక్ క్యాలెండర్ లో కూడా ఈ మార్పు చేయనున్నట్లు తెలిపారు. వాస్తవానికి జూన్ 1 తేదీ నుండి కళాశాలలు ప్రారంభం కావలసి ఉంది. అయితే ప్రస్తుతం ఇంటర్మీడియట్ అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలకు పలు జూనియర్ కళాశాలలు, కాంపోజిట్ డిగ్రీ కళాశాలలు పరీక్షా కేంద్రాలుగా ఉన్నాయి. అడ్వాన్స్ సప్లిమెంట్ పరీక్షలు ఈనెల 5వ తేదీ వరకు కొనసాగనున్నాయి. ఈయన నేపథ్యంలో వేసవి సెలవులను జూన్ 5వ తేదీ వరకు ఇంటర్మీడియట్ బోర్డు పొడిగించింది. 6వ తేదీ నుంచి రాష్ట్రవ్యాప్తంగా అన్ని జూనియర్ కళాశాలలు కాంపోజిట్ కళాశాలలు వేసవి సెలవుల అనంతరం పున ప్రారంభం కానున్నాయి.

## రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ అధికారులతో గుర్తింపు పొందిన ఉపాధ్యాయ సంఘ నేతల సమావేశం

గుంటూరు విద్య మే 29 ప్రభాతవార్త: గుర్తింపు పొందిన ఉపాధ్యాయ సంఘాల సమావేశం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ కమిషనర్ కార్యాలయంలో జరిగింది. సమగ్ర శిక్ష అధికారులతో పాటు విద్యాశాఖ అధికారులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. అధికారుల సమక్షంలో డ్రాపౌట్స్ ను తిరిగి పాఠశాలలో చేర్పించడానికి తీసుకోవాల్సిన విధివిధానాలుపై చర్చ జరిగింది. ఉపాధ్యాయులకు జూన్ 4వ నుండి జరిగే ఎఫ్ఎల్ఎం శిక్షణ తరగతులలో వేసవి దృష్టిలో పెట్టుకుని వాయిదా వేయాలని లేదా ఆయా ఉపాధ్యాయుల హాజరుకు సంబంధించి అవకాశం ఉన్న సెంటర్‌లలో హాజరయ్యే విధంగా వెసులుబాటు ఇవ్వాలని ఉపాధ్యాయ సంఘ నేతలు కోరగా అధికారులు తగు పరిశీలన చేస్తామని తెలిపారు. జీవో నెంబర్ 45 ప్రకారం జిల్లాలలోని పోస్టుల బైపర్కేషన్ సంబంధించి ప్రత్యేక సమావేశం నిర్వహించాలని, అన్ని స్థాయిల పోస్టులను లోకల్ కేడర్ ఆర్గనైజేషన్ చేసే విధంగా తగు చర్యలు తీసుకోవాలని సంఘాల నేతలు కోరారు. దీంత అధికారులు జిఏడీ నుంచి తగు విధివిధానాలు వచ్చిన తర్వాత స్పష్టత ఇస్తామని తెలిపారు. ఈ సమావేశంలో పాఠశాల విద్యాశాఖ కమిషనర్ తమిమ్ అన్సరియా , డైరెక్టర్ పి. పార్వతి , జె డి సర్వీసెస్ సుబ్బారెడ్డి , సుబ్బారావు, ప్రభుత్వ పరీక్షల విభాగం డైరెక్టర్ కె. శ్రీనివాస్ రెడ్డి హాజరయ్యారు.

## 30న శ్రీ కనకదాసు విద్యార్థి ప్రతిభా పురస్కారాలు

గుంటూరు విద్య మే 29 ప్రభాతవార్త : ఈ నెల 30 వ తేదిన ఉదయం 9 గంటలకు సంగడి గుంట వినాయకుడి దగ్గర ఉన్న దేవర సాయి కృష్ణ ఫంక్షన్ హాల్ నందు 5 లక్షల విలువ గల బహుమతులు ఉమ్మడి గుంటూరు, ప్రకాశం జిల్లా విద్యార్థులకు శ్రీ కనక దాస విద్యార్థి ప్రతిభ

## పవర్లిఫ్టింగ్ విజేతలను అభినందించిన జిల్లా కలెక్టర్

గుంటూరు మే 29 ప్రభాతవార్త ప్రతినిధి :చైనాలో ఈ ఏడాది మే 10 నుండి 15 వరకు నిర్వహించిన సబ్ జూనియర్, జూనియర్ పవర్లిఫ్టింగ్ ఏషియన్ ఎక్విప్డ్ ఛాంపియన్‌షిప్‌లో పాల్గొన్న గుంటూరు జిల్లా, తెనాలి ప్రాంతానికి చెందిన క్రీడాకారులు ఇ. లక్షి ్మ వినయశ్రీ , మదిన షారూను బ్రాంజ్ పతకాలు సాధించి జిల్లాకు గౌరవం తీసుకువచ్చారు.అలాగే నేషనల్ విభాగంలో సబ్ జూనియర్ కేటగిరీలో బి. లిఖిత బ్రాంజ్ మెడల్ సాధించారు. ఈ సందర్భంగా గుంటూరు కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ సి.యం.సాయి కాంత్ వర్మ క్రీడా కారులను, వారి శిక్షకులను అభినందించారు.ఈ కార్యక్రమం లో డిస్ట్రిక్ట్ స్పోర్ట్స్ డెవలప్మెంట్ ఆఫీసర్ పి. అఫ్రోజ్ ఖాన్, కోచ్



# నార్ల ఆడిటోరియం మంచి కళలకు వేదికగా నిలవాలి

..ఆడిటోరియంను శ్రీ అన్నమయ్య సేవా సంస్థ ఆధ్యాత్మిక, కళావేదికగా తీర్చిదిద్దాలి

..ఏడాదికి షుమారు రూ.40 లక్షలు జిఎంసికి చెల్లించేలా, ప్రతి ఏడాది 5 శాతం పెంచేలా నిబందనలు

..కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్స్ శాఖ సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్



గుంటూరు కార్పొరేషన్, మే 29 (ప్రభాతవార్త) : గుంటూరు నగరానికి వన్నె తెచ్చేలా నార్ల ఆడిటోరియం మంచి కళలకు వేదికగా నిలవాలని గుంటూరు ఎంపీ,కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్స్ శాఖ సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. సమాజం కోసం పరితపించిన నార్ల వెంకటేశ్వరరావు పేరుతో 26 ఏళ్ల క్రితం మొదలు పెట్టిన శ్రీ నార్ల ఆడిటోరియంను శ్రీ అన్నమయ్య సేవా సంస్థ ఆధ్యాత్మిక, కళావేదికగా తీర్చిదిద్దుతుందని ఆశిస్తున్నామని తెలిపారు. శుక్రవారం బృందావన్ గార్డెన్స్ లోని గుంటూరు నగరపాలక సంస్థ నార్ల ఆడిటోరియంను అభివృద్ధి చేసి పూర్తి చేయుట, తదుపరి నిర్వహణ చేయు కార్యక్రమాన్ని నగర కమిషనర్ కె.మయూర్ అశోక్, ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్, పశ్చిమ నియోజకవర్గ శాసన సభ్యులు గల్లా మాధవి, ప్రజా ప్రతినిధులు, అధికారులతో కలిసి కేంద్ర మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ మాట్లాడుతూ పూర్తి చట్టబద్దత, పారదర్శకతతో నార్ల ఆడిటోరియంను అభివృద్ధి చేసి, నిర్వహణ చేయడానికి శ్రీ అన్నమయ్య సేవా సమితికి 33 ఏళ్ల కాలపరిమితితో నిర్దేశిత మార్గదర్శకాలతో కేటాయించడం జరిగిందన్నారు. నిర్మాణం పూర్తికి గడువు 2 ఏళ్లు ఉన్నప్పటికీ అంతకు ముందే పూర్తీ చేయడానికి కృషి చేయాలని కోరారు. ఏడాదికి షుమారు రూ.40 లక్షలు జిఎంసికి చెల్లించేలా, ప్రతి ఏడాది 5 శాతం పెంచేలా నిబందనలు ఉన్నాయన్నారు. ఆడిటోరియం నిర్మాణంకు అప్పట్లోనే రూ.35 లక్షలు ఇచ్చిన మాజీ మేయర్ డాక్టర్ కొల్లి శారద దాతృత్వం వెల కట్టలేనిదని, నార్ల వెంకటేశ్వరరావు వంటి మంచి వ్యక్తి పేరుతో నిర్మాణం ఆనందంగా ఉందన్నారు. అలాగే ఇటీవల కొందరు జిఎంసి ప్రధాన కార్యాలయంలోని అధికారుల చాంబర్ల అద్దాలు పగల కొట్టడం, అధికారులపై అసంబద్ద ఆరోపణల చేయడంను ఖండిస్తున్నామని, ప్రస్తుత కమిషనర్ నిజాయితీ, సమర్ధత తమకు తెలుసన్నారు. కమిషనర్ మయూర్ అశోక్ మాట్లాడుతూ 1999లో శంఖుస్థాపన జరిగి వివిధ కారణాలతో నిర్మాణం నిలిచిన నార్ల ఆడిటోరియం నిర్మాణ పనుల కోసం రాష్ట్ర ప్రభుత్వం పిపిపి పద్ధతిలో అభివృద్ధికి ఆమోదం తెలిపిందన్నారు. అన్నమయ్య సేవా సమితి బిడ్ వేయడం, వారికే రావడం జరిగిందని, నిర్మాణ పనులు వేగంగా జరిగేందుకు జిఎంసి తరుపున పూర్తీ సహకారం అందిస్తామన్నారు. నార్ల ఆడిటోరియం గుంటూరు నగరానికి మంచి వేదికక నిలుస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ నార్ల ఆడిటోరియం మంచి కళలకు వేదికగా నిలిచేలా అన్నమయ్య సేవా సంస్థ తీర్చిదిద్దుతుందని సంపూర్ణ విశ్వాసం తమకు ఉందన్నారు. ఎన్నో ఏళ్ళ పెండింగ్ సమస్య పరిష్కారానికి కృషి చేసిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు. ఎమ్మెల్యే గల్లా మాధవి మాట్లాడుతూ 25 ఏళ్ల నిరీక్షణకు తెరపడిందని, తాము శాసన సభ్యులుగా ఎన్నికైన వెంటనే అందుకున్న తొలి అర్జీ నార్ల ఆడిటోరియం అభివృద్ధిపైనేనని, అందుకు కేంద్ర మంత్రి చొరవతో సాకారమయ్యేలా కృషి చేశామన్నారు. ఇప్పటి వరకు ఆకతాయిలకు అడ్డాగా ఉన్న అసంపూర్తి ఆడిటోరియం త్వరలో గుంటూరు పశ్చిమ నియోజకవర్గానికి తలమానికంగా నిలిచే ఆధ్యాత్మిక, కళా వేదికగా నిలుస్తుందన్నారు. ఆడిటోరియం పేరుకే పిపిపి అని, ఆచరణలో పి4గా ఉంటుందన్నారు. ఆడిటోరియంలో ప్రతి ఆదివారం పిల్లల కోసం బాల వికాస్ పేరుతో కార్యక్రమాలు నిర్వహించాలని కమిటిని కోరుతున్నామన్నారు. తొలుత నార్ల ఆడిటోరియంను అభివృద్ధి చేసి పూర్తి చేయుట, తదుపరి నిర్వహణ చేయు కార్యక్రమ శిలాఫలకాన్ని ఆవిష్కరించి, అనంతరం రూ.1.32 కోట్లతో అన్నమయ్య పార్క్ లో వివిధ అభివృద్ధి పనులకు శంఖుస్థాపన చేశారు. కార్యక్రమంలో ఏపి లిడ్ క్యాప్ ఛైర్మన్ పిల్లి మాణిక్యాలరావు, ఏపీఐడీసి ఛైర్మన్ దేగల ప్రభాకర్, ఏపీ వడ్డెర కార్పోరేషన్ ఛైర్మన్ మల్లె ఈశ్వరరావు, జిల్లా గ్రంధాలయ సంస్థ చైర్ పర్సన్ బి.వందనాదేవి, మాజీ మేయర్లు డాక్టర్ కొల్లి శారద, కోవెలమూడి రవీంద్ర, అన్నమయ్య సేవా సమితి అధ్యక్షులు సిహెచ్.మస్తానయ్య, మాజీ డిప్యూటీ మేయర్ తాడిశెట్టి మురళీ, జనసేన పార్టీ జిల్లా అధ్యక్షులు గాదె వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## పర్యాటక రంగాన్ని అద్భుతంగా తీర్చిదిద్దుదాం!

- సూర్యలంక బీచ్‌లో రాత్రివేళల్లో మద్యం పూర్తిగా నిషేధం
- ఉల్లంఘిస్తే కేసులు.. ప్లాస్టిక్‌పై ఉక్కుపాదం
- బాపట్ల బ్రాండింగ్ పెంచేలా ఖిబే ఆఫ్ బాపట్లఖి లోగో ప్రచారం
- జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ స్పష్టీకర




బాపట్ల.మే 29: ప్రభాతవార్త ప్రతినిధి: జిల్లాలో పర్యాటక రంగాన్ని సర్వాంగ సుందరంగా అభివృద్ధి చేయాల్సిన బాధ్యత మనందరిపై ఉందని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ తెలిపారు.శుక్రవారం స్థానిక కలెక్టరేట్ వేదికగా ఆయన అధ్యక్షతన జిల్లా టూరిజం కౌన్సిల్ సమావేశం అత్యంత కీలకమైన అజెండాతో నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలోని బీచ్‌లను ఆహ్లాదకరంగా మార్చడంతో పాటు, పర్యాటకులకు అత్యుత్తమ సేవలు అందించేలా పలు కీలక నిర్ణయాలకు కౌన్సిల్ ఏకగ్రీవంగా ఆమోదం తెలిపింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తీర ప్రాంత పర్యాటక రంగానికి మడ అడవులు గుండె వంటివి అన్నారు, వాటి సంరక్షణపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులను ఆదేశించారు. మడ మొక్కలను కాపాడుకుంటూనే పర్యాటకాన్ని ప్రోత్సహించాలన్నారు. జిల్లా టూరిజం కౌన్సిల్ పేరిట ప్రత్యేకంగా బ్యాంకు ఖాతాను తెరవాలని, బాపట్ల బ్రాండ్‌ను విశ్వవ్యాప్తం చేసేలా ఖిబే ఆఫ్ బాపట్లఖి లోగోను విస్తృతంగా ప్రచారంలోకి తీసుకురావాలని నిర్ణయించారు. ఇందులో భాగంగా లోగో ముద్రించిన టోపీలు, జనపనార సంచులు, కీచైన్లు, కాఫీ కప్పులను అందుబాటులోకి తెచ్చి విక్రయాలు చేపట్టాలన్నారు. జిల్లాకు వచ్చే విశిష్ట అతిథులకు వీటినే బహుమతులుగా అందజేయాలన్నారు. ప్రసిద్ధ పర్యాటక ప్రాంతమైన సూర్యలంక బీచ్‌కు వచ్చే పర్యాటకులకు నాణ్యమైన, రుచికరమైన అల్పాహారం, భోజన వసతులు కల్పించాలన్నారు. పర్యాటకులు కోరుకున్న వంటకాలను తక్షణమే సిద్ధం చేసేలా ఏర్పాట్లు ఉండాలన్నారు. అలాగే భద్రత విషయంలో ఎలాంటి రాజీ పడకూడదని స్పష్టం చేశారు. బీచ్ వద్ద ప్రాథమిక వైద్యం (ఫస్ట్ ఎయిడ్), ఫైర్ సర్వీసులను నిరంతరం అందుబాటులో ఉంచాలన్నారు. అగ్నిమాపక సిబ్బందితో పాటు బేసిక్ లైఫ్ సపోర్ట్ డ్రిల్స్ నిర్వహించాలని, గజఈతగాళ్లు అప్రమత్తంగా ఉండేలా చూడాలన్నారు. సూర్యలంక అత్యంత సురక్షి తమైన ప్రాంతమనే నమ్మకాన్ని పర్యాటకుల్లో కల్పించాలన్నారు.

మద్యం తాగితే జైలుకే.. ప్లాస్టిక్ రహిత తీరం

బీచ్ పరిసరాల్లో రాత్రి వేళల్లో మద్యం సేవించడాన్ని పూర్తిగా నిషేధిస్తున్నట్లు కలెక్టర్ తేల్చి చెప్పారు. ఈ నిబంధనను ఉల్లంఘిస్తే కఠినంగా వ్యవహరించి, కేసులు నమోదు చేయాలని పోలీసులను ఆదేశించారు. అలాగే బీచ్‌లలో ప్లాస్టిక్ వాడకంపై పూర్తిస్థాయి నిషేధాన్ని విధిస్తూ కౌన్సిల్ ఏకగ్రీవ తీర్మానం చేసింది. ప్లాస్టిక్‌కు ప్రత్యామ్నాయంగా పర్యావరణహిత ఏర్పాట్లు చేస్తున్నామని, దీనికి ప్రజలు, పర్యాటకులు సహకరించాలని కోరారు.

ఆదాయంలో పంచాయతీకి వాటా..

ప్రభుత్వ భూమిలో పర్యాటకుల కోసం పక్కాగా పార్కింగ్ సౌకర్యం ఏర్పాటు చేయాలని, నాలుగు చక్రాల వాహనాలకు రీజనబుల్ చార్జీలు నిర్ణయించాలని సూచించారు. ఈ పార్కింగ్ ద్వారా వచ్చే ఆదాయంలో 10 శాతం నిధులను స్థానిక పంచాయతీ అభివృద్ధికి కేటాయించాలని కౌన్సిల్ తీర్మానించింది. ఈ ఉన్నత స్థాయి సమీక్షా సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి జి.గంగాధర్ గౌడ్, జిల్లా పర్యాటక శాఖ అధికారి ఆనంద్ సత్యపాల్, మత్స్యశాఖ జెడీ శ్రీనివాస్ నాయక్, అటవీశాఖ అధికారి రవిశంకర్, టూరిజం కమిటీ సభ్యులు, రిసార్ట్స్, హోటల్స్ యాజమాన్యాలు,టూర్ ట్రావె ల్స్ అసోసియేషన్ ప్రతినిధులు మరియు అనుబంధ శాఖల అధికారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు

## కొత్త సిఇ వేటలో ఏఎన్‌యు!

### - ఏసిఇకి పదోన్నతి ఇస్తారా - ఏఫ్ఓగా బదిలీ చేస్తారా

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం, మే29, ప్రభాతవార్త: ఏఎన్‌యు కొత్త కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ (సిఇ) ఎవరనేది ప్రస్తుతం వర్సిటీలో హాట్ టాపిక్‌గా మారింది. ప్రస్తుతం సిఇగా పనిచేస్తున్న ఆలపాటి శివప్రసాదరావు ఈనెల 31న ఉద్యోగ విరమణ చేయనున్నారు. ఆయన స్థానంలో సిఇగా ఎవరు నియమితులౌతారనే విషయంపై అధికారులు అన్ని కోణాల్లో పరిశీలన చేస్తున్నారు. ఆనవాయితీ ప్రకారం ప్రస్తుతం ఏసిఇగా ఉన్న ఎ.వెంకటేశ్వర్లు సిఇగా నియమితులౌతారనేది ఒక వర్గం చేస్తున్న ప్రచారం. అయితే తాను ఒకటి తలిస్తే దైవం మరొకటి చేసిందనే నానుడికి ఏఎన్‌యు వేదికగా మారనుంది. ఏసిఇగా ఉన్న వెంకటేశ్వర్లు ప్రస్తుతం ఇన్‌చార్జ్ ఎఫ్ఓగా కూడా అధనపు బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. వర్క్‌లోడ్ భారం చూపి ఆయనను సిఇగా నియమించేందుకు అధికారులు ఆలోచనలో పడ్డారు. ఆయనను మినహాఇస్తే కూటమి ప్రభుత్వం వచ్చాక



ఏసిఇగా ఉన్న రెడ్డి ప్రకాష్‌ను తొలగించారు. ఆయనకు ఓ అధికారి తనవర్గం పేరుతో కొత్త పోస్టు క్రియేట్‌చేసి నోడల్ ఆఫీసర్‌గా నియమించారు. ఇప్పుడు పరిక్షా బవన్‌లో ఆయన సూచనలను, ఆదేశాలను సిఇ, ఏసిఇ కార్యాలయాలు పాటిస్తుండటం గమనార్హం. సిఇ పోస్టు ఖాళీ అవుతుండటంతో రెడ్డి ప్రకాష్ పేరు కూడా పరిశీలన చేస్తున్నట్లు తెలిసింది. ఇక మరొక అధికారిణి కూడా తనకు అర్హత ఉందని నేనుండే కొద్ది నెలలు తనకు సిఇగా అవకాశం కల్పించాలని కోరుతున్నట్లు సమాచారం. ఏసిఇగా పనిచేస్తు కొద్ది రోజుల్లోనే మృతిచెందిన ఎన్.యోబు సామాజిక వర్గం కూడా తమ వర్గంకు ఏసిఇ హోదా ఇవ్వాలనే డిమాండ్‌ను తెరమీదకి తీసుకొచ్చారు. అసిస్టెంట్ రిజిస్ట్రార్‌లుగా ఉన్న కొందరు అధికారులు కూడా తమకు ఏసిఇగా అవకాశం ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. ఏసిఇగా ఉన్న వారు యూజి కోఆర్డినేటర్ కార్యాలయంతో సమన్వయం చేసుకుని విధులు నిర్వహించాల్సి ఉంది. ఇప్పటి వరకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఇక్కడ పాలన సాగింది. సిఇ కార్యాలయం పీజీ కోఆర్డినేటర్ కార్యాలయంతో కలిసి పనిచేయాల్సి ఉంది. ఇక్కడే కొంత ఇబ్బందికర వాతావరణం ఉన్నట్లు తెలుస్తోంది. పీజీ పరీక్షల నిర్వహణలో లోపాలు, నిర్లక్ష్యం పలుమారు బయటపడింది. పరిక్ష జరిగే రోజు పరిక్షా కేంద్రం మార్చడం, కోఆర్డినేటర్ కార్యాలయానికి సమాచారం ఇవ్వకుండా వన్‌టైం ఆపర్చునిటీ పరీక్షలు షెడ్యూల్ ఇవ్వడం వంటి కొన్ని నిర్ణయాలు కొద్ది రోజులక్రితం వర్సిటీలో పెద్దఎత్తున చర్చకు దారితీశాయి. అలాగే రెండు కార్యాలయాల మధ్య మాటల యుద్ధం సైతం నడిచింది. ఎవరికి వారు నువ్వెంత అంటే నువ్వెంత అంటూ పంచాయితీకి దిగారని ఈ విషయంలో చివరికి అధికారులు కలుగజేసుకుని రాజీ చేయాల్సివచ్చింది. ఇప్పుడు కూడా సఖ్యతలేని వారిని నియమించి వర్సిటీకి చెడ్డపేరు తెచ్చేలా వ్యవహరించ వద్దని వర్సిటీ వర్గాలు కోరుతున్నాయి.

## 31న అవగాహనలో ఆరోగ్యసభ

గుంటూరు కల్చరల్,మే 29,ప్రభాతవార్త : అవగాహన సంస్థ గత 18సంవత్సరాలుగా క్రమం తప్పకుండా ప్రతి ఆదివారం నిర్వహిస్తున్న ఆరోగ్యసభల్లో భాగంగా ఈ ఆదివారం షుగర్,బిపి,థైరాయిడ్ వ్యాధులపై సమగ్ర అవగాహన సభ ఏర్పాటు చేయబడింది.మే 31వ ఆదివారం ఉదయం 11గంటలకు సంస్థ కార్యాలయంలో నిర్వహించే ఆరోగ్యసభలో సీనియర్ షుగర్ వ్యాధి నిపుణులు డాక్టర్ బి.హరికృష్ణ ప్రధాన వక్తగా పాల్గొంటారని సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి తెలిపారు.ఆరోగ్యాభిలాషులందరూ ఈ ఆరోగ్యసభకు హాజరు కావలసిందిగా విజ్ఞప్తి చేస్తున్నారు.

# ప్రతి ఫ్రైడేను డ్రైడేగా పాటించాలి : బయాలజిస్ట్ సత్యన్నారాయణ

విజయవాడ కార్పొరేషన్,మే 28,ప్రభాతవార్త: నగరంలో పెరుగుతున్న దోమల సమస్యను నియంత్రించేందుకు ప్రతి ఇంట్లో ఫ్రైడేను డ్రైడేగా పాటించాలని మున్సిపల్ కార్పొరేషన్ బయాలజిస్ట్ సత్యన్నారాయణ పేర్కొన్నారు. శుక్రవారం ఉదయం ఆయన లూనా సెంటర్,సింగ్‌నగర్‌లో ఫ్రైడే డ్రైడే కార్యక్రమాన్ని నిర్వహించి ఆ ప్రాంతంలోని ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంఅ ఆయన మాట్లాడుతూ నగరంలో దోమల సమస్యలను నియంత్రించేందకు నగరపాలక సంస్థ విస్తృతమైన చర్యలు తీసుకుంటోందని అందులో భాగంగా నగరంలో ఉన్న కాల్వల్లో పూడికలు తొలగించి నీటి ప్రవాహం ఆగకుండా చూసుకుంటున్నారని, ట్రాక్టర్ మెషిన్‌తో, బోట్ల సహాయంతో సిబ్బంది కాలువల్లో పర్యటించి గుర్రపుడెక్కలను వ్యర్థాలను తొలగిస్తున్నారని సిబ్బంది వెళ్ళలేని చోట డ్రోన్‌ని పంపించి ఎంఎల్ ఆయిల్ స్ప్రే చేసి దోమల లార్వా ఉత్పన్నమవకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. నగర పరిధిలో ఫాగింగ్,మరి కొన్ని చోట్ల దోమల లారవ ఆని తినే గంబోఎజియా చేపలను విడుదల చేస్తూ నగరంలో దోమల నియంత్రణకు విస్తృతమైన చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఒకవైపు నగరపాలక సంస్థ చర్యలు తీసుకుంటున్నప్పటికి ప్రతి ఇంట్లో దోమలు




ఉత్పన్నమవకుండా డ్రైడేని పాటించాలని అది ప్రతి శుక్రవారం పాటిస్తే ప్రతి ఇంట్లో దోమల సమస్యలు ఉండవన్నారు. ప్రతి శుక్రవారం తమ ఇంట్లో,ఇంటి చుట్టు పరిసర ప్రాంతాల్లో ఎక్కడా నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని, ముఖ్యంగా తొట్లు, వాడుకలో లేని బక్కెట్లు,మగ్గులు,డ్రమ్ములు, పూల కుండీలు,ఏ వస్తువయినా వాడుకలో లేనివి అందులో నీటి నిల్వ ఉండే అవకాశం ఉన్నవి ప్రతి శుక్రవారం వాటిని గమనించి ఆ నిల్వ ఉన్న నీటిని పారవేస్తే ఇంట్లో దోమల సమస్య తగ్గుతుందన్నారు. అజిత్‌సింగ్‌నగర్ ప్రాంతంలో ఉన్న ప్రజలకు వారి ఇంటి వద్దకు వెళ్ళే నీటి నిల్వలు ఎక్కువగా ఉండే అవకాశం ఎక్కడ ఉన్నాయని చూపించి, వాటిని పారేస్తే అందులో లార్వా చచ్చిపోతుందని వారికి అవగాహన కల్పించి ప్రతి శుక్రవారం దీన్ని పాటిస్తే దోమలను శాశ్వతంగా నియంత్రించవచ్చని అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో బయాలజిస్ట్‌తో పాటు యూనిట్ ఆఫీసర్ రామచంద్రారెడ్డి, శానిటరీ ఇనస్పెక్టర్లు, మలేరియా సిబ్బంది, ఎఎన్ఎంలు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

# నరసరావుపేటలో 100 కోట్లతో అభివృద్ధి చేస్తున్నాం

## - ఎమ్మెల్యే డా. చదలవాడ అరవింద్‌బాబు టిడిపి జిల్లా అధ్యక్షులు జానీ సైదా



**నరసరావుపేట, మే 29 ప్రభాతవార్త**
నరసరావుపేట నియోజకవర్గంలో రూ.100 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టినట్లు ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు వెల్లడించారు. నియోజకవర్గంలో గత వైసీపీ పాలనలో, ప్రస్తుత కూటమి ప్రభుత్వ హయాంలో జరిగిన అభివృద్ధిపై బహిరంగ చర్చకు రావాలని మాజీ ఎమ్మెల్యే గోపిరెడ్డికి, ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు సవాల్ విసిరారు. శుక్రవారం టీడీపీ నియోజకవర్గ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో టీడీపీ జిల్లా అధ్యక్షులు షేక్. జాన్ సైదాతో కలిసి ఎమ్మెల్యే అరవింద బాబు మాట్లాడారు. గత వైసీపీ ప్రభుత్వం అంజుమన్ కాంప్లెక్స్ నిర్మాణాన్ని నిరక్ష ్యం చేస్తే, కూటమి ప్రభుత్వం వచ్చాక ప్రైవేటు నిధులు రూ.50 లక్షలు సేకరించి అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. మాజీ ఎమ్మెల్యే గోపిరెడ్డి కళ్లుండి చూడలేని గుడ్డివాడిగా మారి దుర్మార్గపు ఆలోచనలు కలిగి ఉన్నాడని మండిపడ్డారు. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో జరిగిన అభివృద్ధి, కూటమి ప్రభుత్వం ఏర్పడిన ఈ రెండేళ్లలో జరిగిన అభివృద్ధిపై చర్చించేందుకు సిద్ధంగా ఉన్నానన్నారు. ఊరికే విమర్శలు చేయడం కాదని దమ్ము ధైర్యం ఉంటే నరసరావుపేట సెంటర్లోని డాక్టర్ బిఆర్. అంబేద్కర్ విగ్రహం వద్ద విధానపర చర్చకు రావాలని బహిరంగ చర్చకు రావాలన్నారు. వైసీపీ హయాంలో ఖగరాక్షస పాలనగ కొనసాగిందని, అక్రమ కేసులు, గంజాయి కేసులు పెట్టి అమాయక ప్రజలను హింసించారని ఆరోపించారు. కూటమి ప్రభుత్వం వచ్చాక సంక్షేమం, అభివృద్ధి పరుగులు పెడుతున్నాయని స్పష్టం చేశారు. కూటమి పాలనలో రెండేళ్ల కాలంలో అమరావతి రాజధాని అభివృద్ధి వేగంగా జరుగుతోందని అన్నారు. వైసీపీ మూడు రాజధానుల నినాదంతో రాష్ట్రానికి రాజధాని లేకుండా చేశారని మండిపడ్డారు. విజనరీ లీడర్ చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో వైజాగ్‌లో టెక్నాలజీ పరంగా అభివృద్ధి జరుగుతోందని, గూగుల్ డేటా సెంటర్, క్వాంటం వ్యాలీ ప్రాజెక్టులు వేగంగా జరుగుతున్నాయని వివరించారు. టీడీపీ జిల్లా అధ్యక్షులు షేక్. జాన్ సైదా మాట్లాడుతూ పల్నాడు పార్లమెంటు పరిధిలోని 76 క్లస్టర్లలో డిజిటల్ మహానాడు నిర్వహణకు రాష్ట్రవ్యాప్తంగా మూడవ ర్యాంకు వచ్చిందని తెలిపారు. ఈ సందర్భంగా కార్యకర్తలకు ధన్యవాదాలు తెలిపారు. వైసీపీ పాలన ఖగొడ్డలి పాలనగ అని, కక్షపూరితంగా కులమత రాజకీయాలు చేస్తూ వ్యవస్థను డిస్టర్బ్ చేశారని విమర్శించారు. గత రెండు సంవత్సరాలుగా కూటమి పాలనలో రాష్ట్రంలో ప్రశాంత వాతావరణం నెలకొందని అని అన్నారు. 2029లో కూడా కూటమిదే అధికారం చేపడుతుందని ధీమా వ్యక్తం చేశారు. మాజీ ఎమ్మెల్యేలు బొల్లా బ్రహ్మనాయుడు, గోపిరెడ్డిలు అరాచకవాదులుగా మారారని విమర్శించారు. నిజాయితీగా పనిచేయాలంటే ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబును చూసి నేర్చుకోవాలని హితవు పలికారు. ఈ కార్యక్రమం లో తెలుగుదేశం పార్టీ మహిళా నేతలు పాల్గొన్నారు.

# స్వచ్ఛంద సంస్థలు సమర్థవంతంగా పనిచేయాలి

## - జిల్లా డా.మాధవీలత

**నరసరావుపేట టౌన్,మే 29 ప్రభాతవార్త**
స్థానిక జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో శుక్రవారం సమావేశమందిరంలో స్వచ్ఛంద సంస్థలతో సమావేశం నిర్వహించడం జరిగింది. జిల్లా అధికారి డాక్టర్ మాధవి లత మాట్లాడుతూ హెచ్ఐవి/ఎయిడ్స్ పై క్షేత్ర స్థాయిలో అవగాహన పెంచాలన్నారు.రోజు వారి రిపోర్ట్స్ ఆన్లైన్ చేయాలని హై రిస్క్ ఉన్న వారిని గుర్తించి వారికి సకాలంలో వైద్య పరీక్షలు చేయించాలని సూచించారు., అవసరం ఉన్న వారికి ఏ ఆర్ టి మందులు అనుసంధానం చేయాలన్నారు . మిషన్ ఎయిడ్స్ సురక్ష కార్యక్రమం గురించి సమావేశం లో వివరించడం జరిగింది.దిశ క్లస్టర్ ప్రోగ్రామ్ మేనేజర్ జానీ బాష మాట్లాడుతూ క్షేత్ర సిబ్బంది నుంచి ప్రాజెక్ట్ మేనేజర్ వరకు చేసిన రోజు వారి కార్యకలాపాలు ఆన్లైన్ చేయాలని సూచించారు. పల్నాడు జిల్లాలో హై రిస్క్ ఉన్న గ్రామాలను, ప్రాంతాలను గుర్తించి దాని అనుగుణంగా సిబ్బంది రోజు వారి ప్రణాళికలనురూపొందించుకోవాలని చెప్పడం జరిగింది. ఈ కార్యక్రమం లో జిల్లా దిశ టీమ్,స్వచ్ఛంద సంస్థలు,లింక్ వర్కర్ స్కీమ్,కేర్ సపోర్ట్ సెంటర్, వి హెచ్ ఎస్ నుండి అధిక పాల్గొనడం జరిగింది.

# మూడువేల మందికి ప్రతిరోజు మజ్జిగ పంపిణీ



**నరసరావుపేట టౌన్, మే 29 ప్రభాతవార్త**
పట్టణంలో ప్రతిరోజు 3000 మందికి మజ్జిగ పంపిణీ కార్యక్రమంగత రెండు నెలలుగా నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర బులియన్ మర్చంట్స్ అసోసియేషన్ అధ్యక్షులు కపలవాయి విజయకుమార్ అన్నారు. శుక్రవారం స్థానిక జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో మజ్జిగ పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించి మాట్లాడారు. ప్రకాష్ నగర్ లోని శ్రీ దత్త చైతన్యం, శివుని బొమ్మ సెంటర్ మెయిన్ రోడ్ లోని విజయ్ కుమార్ జ్యువెలరీ షాప్ వద్ద, ప్రభుత్వ వైద్యశాలలోసమావేశంలో మజ్జిగ పంపిణీ కార్యక్రమం నిరంతరంగా జరుగుతుందన్నారు.వేసవిలోప్రయాణికులు,పాదచారులు, రోగులు, వివిధ పనులపై గ్రామీణ ప్రాంతాల నుండి పట్టణానికి వచ్చే వారి కోసం ఈ కార్యక్రమంజరుగుతుందన్నారు. మూడు వేల మందికి మజ్జిగ పంపిణీ చేయడం ఆర్థిక భారమైనప్పటికీ తమతండ్రి కపలవాయి కాశీరామారావు ఇచ్చిన స్ఫూర్తిని కొనసాగిస్తున్నామన్నారు. భగవంతుడు ఇచ్చిన ఆశీర్వాదంతో ఈ కార్యక్రమం ప్రతిఏడాది జరుగుతుందన్నారు. ఎండ తీవ్రత తగ్గేవరకు ఈకార్యక్రమంకొనసాగిస్తామని తెలియజేశారు.సేవా కార్యక్రమాలకు సహకరించే ప్రతి ఒక్కరికి ఈ సందర్భంగా కపలవాయి విజయ్ కుమార్ కృతజ్ఞతలు తెలిపారు.

# థాంక్యూ సీఎం సార్ థాంక్యూ లోకేష్ కార్యక్రమం




**నరసరావుపేట, మే 29 ప్రభాతవార్త**
డిజిటల్ మహానాడు2026 వేదికగా మహిళలకు రాజకీయాల్లో 33 శాతం రిజర్వేషన్ అమలు చేస్తామని తెలుగుదేశం పార్టీ తీర్మానించడాన్ని స్వాగతిస్తూ శుక్రవారం నరసరావుపేటలో మహాశక్తి మహిళలు ప్రదర్శన నిర్వహించారు. ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు ఆధ్వర్యంలో స్థానిక నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ కార్యాలయం వద్ద ఈ కార్యక్రమం జరిగింది. మహిళలు థాంక్యూ సీఎం సార్ థాంక్యూ లోకేష్ అన్న అంటూ నినాదాలు చేస్తూ ఉత్సాహంగా ప్ల కార్డులు ప్రదర్శించి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు మాట్లాడుతూ డిజిటల్ మహానాడు 2026లో మహిళలకు 33 శాతం రాజకీయ రిజర్వేషన్ కల్పిస్తామని చేసిన తీర్మానానికి నరసరావుపేట నియోజకవర్గం తరఫున పూర్తి మద్దతు ప్రకటిస్తున్నట్లు తెలిపారు. ఈ నిర్ణయం తీసుకున్న ముఖ్యమంత్రికి, టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్‌కు కృతజ్ఞతలు తెలియజేశారు. 2029 సాధారణ ఎన్నికలకు ముందే రిజర్వేషన్ స్థానాలను మహిళలకు కేటాయిస్తే వారు మరింత ఉత్సాహంగా ప్రజాసేవలో పాల్గొంటారని, ఈ విషయాన్ని పార్టీ అధిష్టానం దృష్టికి తీసుకెళ్తామని ఆయన పేర్కొన్నారు. ఈ తీర్మానంతో మహిళలు ఢిల్లీ నుంచి గల్లీ వరకు రాజకీయాల్లో క్రియాశీలకంగా వ్యవహరించేందుకు సంతోషంగా ఉన్నారని అన్నారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షులు షేక్ జాన్ సైదా మాట్లాడుతూ పార్లమెంటులో తీర్మానం కంటే ముందే మహిళలకు 33 రిజర్వేషన్ అమలు చేస్తామని ప్రకటించిన మొదటి రాజకీయ పార్టీగా తెలుగుదేశం పార్టీ నిలుస్తుందని అన్నారు. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేష్ ఈ ప్రకటన చేయడం చరిత్రలోనిలిచిపోతుందన్నారు. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో టీడీపీ మహిళా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# పోలేరమ్మ ఆలయంలో డా. గోపిరెడ్డి ప్రత్యేక పూజలు



**రొంపిచర్ల, మే 29 ప్రభాతవార్త**
మండల కేంద్రమైన రొంపిచర్లలో శుక్రవారం మాజీ శాసనసభ్యులు, వైసిపి జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి పర్యటించారు.గ్రామానికి విచ్చేసిన ఆయనకు వైసిపి నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు ఘనంగా స్వాగతం పలికారు.గ్రామంలో పోలేరమ్మ ఆలయంలో మాజీ డీలర్ గెల్లి కోటిరెడ్డి ఆధ్వర్యంలో జరుగుతున్న మొక్కుబడి కార్యక్రమంలో పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా ఆలయానికి విచ్చేసిన డాక్టర్‌గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డిని ఆలయ కమిటీ సభ్యులు ఘనంగా సన్మానించారు.అనంతరం ఆలయ ఆవరణలో భారీ అన్నదాన కార్యక్రమం జరిగింది.ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ యార్డు మాజీ ఛైర్మన్ పచ్చవ రవీంద్రాబాబు , వైసిపి రాష్ట్ర కార్యదర్శి, గురజాల నియోజక వర్గ వైసిపి పరిశీలకులు పడాల శివారెడ్డి,మాజీ సర్పంచులు పడాల చక్రారెడ్డి,గెల్లి చినకోటిరెడ్డి,పొనుగోటి వెంకట్రావు, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# మెగా డీఎస్సీ అవకతవకలు, అవినీతిమయంగా ఉంది

## - డాక్టర్ గోపిరెడ్డి కార్యక్రమంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే బ్రహ్మనాయుడు, డాక్టర్ గజ్జల సుధీర్ భార్గవ్ రెడ్డి






**నరసరావుపేట, మే 29 ప్రభాతవార్త**
రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం నిర్వహించిన మెగా డీఎస్సీ అవకతవకలు, అవినీతి మయంగా మారిందని వైసిపి పల్నాడు జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ డాక్టర్ గోపి రెడ్డి శ్రీనివాసరెడ్డి తీవ్రస్థాయిలో విమర్శించారు. వైసీపీ పల్నాడు జిల్లా విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం నిర్వహించిన మెగా డీఎస్సీలో జరిగిన అవకతవకలపై సిబిఐ దర్యాప్తు నిర్వహించాలని కోరుతూ శుక్రవారం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి, మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు, సత్తెనపల్లి నియోజకవర్గ కన్వీనర్ గజ్జల సుదీర్ భార్గవ్ రెడ్డి, విద్యార్థి విభాగం అధ్యక్షుడు గుజ్జర్లపూడి ఆకాష్ వైసీపీ శ్రేణులు కలిసి స్థానిక గడియార స్తంభం వద్దకు ర్యాలీగా వచ్చి డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా డాక్టర్ గోపిరెడ్డి మాట్లాడుతూ, మంత్రి లోకేష్ సకల శాఖ మంత్రి అని వ్యంగ్యా లు సంధించారు. కంప్యూటర్ సెక్షన్ లో అవుట్సోర్సింగ్ ఉద్యోగిగా పని చేస్తున్న వ్యక్తికి కృష్ణా జిల్లా డీఎస్సీలో ఫస్ట్ ర్యాంకు ఎలా వచ్చిందన్నారు. డీఎస్సీ పేపరు లీక్ అయిన మాట వాస్తవం కాదా అన్నారు. మెగా డీఎస్సీ మెరిట్ లిస్టు ఎందుకు రిలీజ్ చేయలేదని ప్రశ్నించారు. మెరిట్ లిస్టు రిలీజ్ చేయకుండా జాయినింగ్ లెటర్లు ఎలా ఇచ్చారన్నారు. ఆటలాడటమే తెలియని వారికి స్పోర్ట్స్ కోటా కింద 450 ఉద్యోగాలు ఇచ్చారని, ఇందుకు ఒక్కొక్క ఉద్యోగం రూ.15 లక్షలకు మీరు అమ్ముకున్నారని తెలిపారు. మెగా డీఎస్సీ లో జరిగిన అవకతవకలపై సిబిఐ ఎంక్వయిరీ అడుగుతున్నా మీరు ఎందుకు వెనుకంజ వేస్తున్నారని అడిగారు.మంత్రి లోకేష్ విద్యాశాఖ మంత్రిగా బాధ్యతలు తీసుకున్న తర్వాత విద్యాశాఖను పూర్తిగా భ్రష్టు పట్టించారని విమర్శించారు. కూటమి ప్రభుత్వం వచ్చి రెండు సంవత్సరాలైనా గత వైసిపి హయాంలో జగన్మోహన్ రెడ్డి నాడు నేడు కింద ప్రారంభించిన పనులను ఎందుకుపూర్తిచేయలేకపోయారన్నారు.రాబోయే ఎన్నికల్లోజగన్మోహన్ రెడ్డినిముఖ్యమంత్రిగా గెలిపించుకోబోతున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, వైసీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# బీసీ కాలనీలో పోలీసుల అవగాహన కార్యక్రమం




**నరసరావుపేట క్రైమ్, మే 29 ప్రభాతవార్త**
నరసరావుపేట పట్టణంలో ఎస్పీ ఆదేశాల మేరకు రెండవ పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో సీఐ ప్రభాకర్ ఆధ్వర్యంలో యాష్ణ పోలీస్ సిబ్బంది బీసీ కాలనీలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో పిల్లలపై లైంగిక వేధింపులు, సైబర్ నేరాలు, గంజాయి వంటి మత్తు పదార్థాల దుష్ప్రభావాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. అలాగే చిన్నపిల్లలు అధికంగా మొబైల్ ఫోన్లు చూడడం వల్ల కలిగే దుష్ప్రభావాల గురించి కూడా వివరించారు. తల్లిదండ్రులు పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని, మొబైల్ వినియోగాన్నినియంత్రించాలని సూచించారు.అనుమానాస్పద ఘటనలు జరిగినా వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో 100,, మరియు 1930కు డయల్ చేసి పోలీసుల సహాయం పొందవచ్చని చెప్పారు.పిల్లల భద్రతపై తల్లిదండ్రులు అప్రమత్తంగాఉండాలన్నారు.సైబర్ మోసాలకు గురికాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని పోలీసులు సూచించారు. కార్యక్రమంలోసిబ్బంది ప్రజలు, యువత పాల్గొన్నారు

# ఈవిఎం గోడౌన్ ను తనిఖీ చేసిన ఇంచార్జ్ కలెక్టర్ సంజన సింహ




**నరసరావుపేట మే 29 ప్రభాతవార్త**
నరసరావుపేట మార్కెట్ యార్డ్ లోని ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్ల గోడౌన్ ను శుక్రవారం జిల్లా ఇంచార్జి కలెక్టర్ సంజన సింహ తనిఖీ చేశారు. ఈవిఎం గోడౌన్ వద్ద సిసి కెమెరాలతో ఏర్పాటు చేసిన భద్రతా ఏర్పాట్లను ఈవిఎం యంత్రాలు బియు, సియు లు, వివిప్యాట్ లు, అక్కడి భద్రతా ఏర్పాట్లను వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలిసి పరిశీలించారు. అనంతరం పరిశీలన రిజిస్టరులో సంతకం చేశారు. కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాలు మేరకు ఈవీఎం గోడౌన్ తనిఖీలో భాగంగా ఈవిఎం గోడౌన్ కు వేసిన భద్రతా సీళ్లు, సిసి కెమెరాలు పనితీరు, అగ్నిమాపక దళ పరికరాలు, మొదలైనవి పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా ఇంచార్జి కలెక్టరు మాట్లాడుతూ భారతీయ ఎన్నికల సంఘం ఆదేశాలు మేరకు ఈవిఎం గోడౌన్ కు పటిష్ట భద్రత కల్పించామన్నారు. ఎప్పటికప్పుడు గౌడౌన్ ను క్షుణంగా తనిఖీ చేసి ఎన్నికల సంఘానికి నివేదిక పంపిస్తున్నామన్నారు. ఈవిఎం గోడౌన్ వద్ద విధులు నిర్వహిస్తున్న పోలీసు గార్డులు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఆర్డీవో బాలకృష్ణ, అధికారులు పాల్గొన్నారు.

# ఎండల్లో విలవిలలాడుతున్న పక్షులకు నీరు, గింజలను పెట్టి వాటి ప్రాణానికి ఊపిరి పోద్దాం

## - సిఆర్పిఎఫ్ సీనియర్ సబ్ ఇన్స్పెక్టర్ అంకారావు




**పెదకూరపాడు, మే 29 ప్రభాతవార్త**
ఎండల్లో విలవిలలాడుతున్న పక్షులకు నీరు,గింజలను పెట్టి వాటి ప్రాణానికి ఊపిరి పోద్దామని సమస్త జీవరాశి జీవించేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని అస్సాం రాష్ట్రంలోని గోలాఘాట్ జిల్లా సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్ సీనియర్ సబ్ ఇన్స్పెక్టర్ (సిఆర్పిఎఫ్)ఇంటూరి అంకారావు అన్నారు.పెదకూరపాడులోని జన చైతన్య సమితి స్వచ్ఛంద సంస్థ కార్యాలయంలో శుక్రవారం పక్షులకు నీరు,పక్షులకు గిన్నెలలో ఆహారం, పక్షులగూళ్ళపై అవగాహన కల్పిస్తూ ఏర్పాటుచేసిన పోస్టర్లను సబ్ ఇన్స్పెక్టర్ అంకారావు సంస్థ ప్రతినిధులతో కలసి ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోజురోజుకు పెరుగుతున్న ఎండలకు పక్షులు విలవిలలాడుతున్నాయని పక్షులకు గిన్నెల్లో నీరు పోసి, గింజలు వేస్తే వాటి ప్రాణానికి ఊపిరి పోసిన వారమవుతామని అన్నారు. సృష్టిలో ప్రతి జీవికి జీవించే హక్కు కల్పిద్దామని,పక్షుల కోసం గూళ్ళను ఏర్పాటుచేసి నీటిని,ఆహారాన్ని అందుబాటులో ఉంచుదామన్నారు. జనచైతన్య సమితి కార్యదర్శి తుల్లూరి సాంబశివరావు మాట్లాడుతూ వేసవికాలం దృష్ట్యా పెదకూరపాడులో మూడు ప్రాంతాలలో చలివేంద్రాలను ఏర్పాటు తాగునీటికి ఇబ్బంది లేకుండా చూస్తున్నమని,పక్షుల కోసం కూడా గూళ్ళను, గిన్నెలో నీటిని,ఆహారాన్ని అందుబాటులో ఉంచేందుకు ప్రయత్నిస్తున్నామన్నారు.ఈ కార్యక్రమంలో జన చైతన్య సమితి ప్రతినిధులు షేక్ సుభాని,గుడిపూడి బ్రహ్మానాయుడు,రవి,చెంబేటి వీరబాబు,శ్రీనివాసరావు, అచల్ తదితరులు ఉన్నారు.

# కొండవీడు ఈఎన్‌టీ హాస్పిటల్‌లో రెండేళ్ల చిన్నారికి

## విజయవంతంగా హైరిస్క్ కోక్లియర్ ఇంప్లాంట్ సర్జరీ



**నరసరావుపేట, మే 29 ప్రభాతవార్త**
స్థానిక కొండవీడు ఈఎన్‌టీ హాస్పిటల్ వైద్యులు పుట్టుకతోనే వినికిడి లోపంతో బాధపడుతున్న రెండేళ్ల చిన్నారికి అత్యంత సంక్లిష్టమైన కోక్లియర్ ఇంప్లాంట్ సర్జరీని విజయవంతంగా పూర్తి చేశారు. వివరాలను గురు వారం హాస్పిటల్ ఛైర్మన్ డాక్టర్ కంజుల జగన్మోహన్ రెడ్డి, డైరెక్టర్ డాక్టర్ కంజుల శ్రీ వర్షిణి తెలియజేశారు. చిత్తూరు జిల్లాకు చెందిన రాజశేఖర్ భావన దంపతుల 2 సంవత్సరాల కుమార్తె తేజశ్రీ అనే చిన్నారికి వినికిడి శక్తి లోపం ఉంది. గమనించిన తల్లిదండ్రులు కొండవీడు ఈఎన్‌టీ ఆసుపత్రికి తీసుకొచ్చారు. అయితే, ఆ పాప శారీరకంగా చాలా బలహీనంగా ఉండటంతో పాటు, పరీక్షల్లో టార్చ్ (గివీళిదిబీ) ఇన్‌ఫెక్షన్లు ఉన్నట్లు వైద్యులుగుర్తించారు. చిన్నారి ఆరోగ్యం దృష్ట్యా ఇది ఎంతో హైరిస్క్ (ప్రమాదకరమైన) కేసు అయినప్పటికీ, వైద్య బృందం అన్ని రకాల ముందస్తు పరీక్షలు నిర్వహించి, తల్లిదండ్రుల పూర్తి అనుమతితో సర్జరీకి శ్రీకారం చుట్టింది.

### అధునాతన సాంకేతికతతో

హాస్పిటల్‌లో జరిగిన మొట్టమొదటి కోక్లియర్ హైరిస్క్ కేసు అయినప్పటికీ, అత్యాధునిక వైద్య పరికరాలను ఉపయోగించి చిన్నారికి విజయవంతంగా లీనిదీనిలి కోక్లియర్ ఇంప్లాంట్ అమర్చారు. ఈ సర్జరీ కోసం:మెడ్‌ట్రానిక్ ఎం ఆర్ 8 కార్ల్ జైస్ మైక్రోస్కోప్‌మెడ్‌ట్రానిక్ ఫేసియల్ నర్వ్ మానిటర్ వంటి ప్రపంచ స్థాయి అధునాతన ఇన్స్ట్రుమెంట్స్ వాడినట్లు వైద్యులు తెలిపారు. శస్త్ర చికిత్సలో ప్రధాన సర్జన్ డాక్టర్ కంజుల జగన్ మోహన్ రెడ్డి,మెంటార్ డాక్టర్ బయా సుధీర్ (బయా ఇయన్ టి హాస్పిటల్ , గుంటూరు),అసిస్టెంట్ సర్జన్ డాక్టర్ కంజుల శ్రీ వర్షిణి,అనస్థీషియా నిపుణులుడాక్టర్ నాయక్, వైద్యులు డాక్టర్ విష్ణు రాజ్, డాక్టర్ శేఖర్ రెడ్డి, డాక్టర్ సుధీర్ చంద్ర పాల్గొన్నారు.పల్నాడు జిల్లాలోనే ఇలాంటి అత్యాధునిక సాంకేతికతతో వినికిడిలోపంతోబాధపడుతున్న ఎందరో పిల్లల జీవితాల్లో కొత్త వెలుగులు నింపడమే తమ ముఖ్య ఉద్దేశం అని డాక్టర్ కంజుల జగన్మోహన్ రెడ్డి డాక్టర్ శ్రీ వర్షిణి ని తెలియజేశారు.

# బాధితులకు టార్పాలిన్ పట్టాల పంపిణీ



**నరసరావుపేట,మే 29 ప్రభాతవార్త**
మంగళవారం అర్ధరాత్రి నుండి కురిసిన భారీ వర్షాలకు నరసరావుపేట పట్టణం కోటప్పకొండ రోడ్డులో పూరి గుడిసెల్లో నివసిస్తున్న పేదల ళ్లల్లోకి నీరు చేరింది.ఆయా ఇళ్లల్లోని కుటుంబాలు తీవ్రఇబ్బందులు ఎదుర్కొన్న విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు సూచనల మేరకు జిల్లా కలెక్టర్ సంజన సింహా ఆదేశాలతో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ వెంటనే సహాయక చర్యలు చేపట్టింది.జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ మేదరమెట్ల రామ శేషగిరిరావు ఆధ్వర్యంలో బాధిత కుటుంబాలకు బుధవారం టార్పాలిన్ పట్టాలు పంపిణీ చేశారు. ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు చేతుల మీదుగా మొత్తం కుటుంబాలకు సహాయ సామగ్రిని అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మార్ శేషగిరిరావు సందర్భంగా మాట్లాడుతూ ప్రకృతి విపత్తుల సమయంలో పేదలకు అండగా నిలవడం రెడ్ క్రాస్ బాధ్యతన్నారు. అవసరమైన చోట ఆపత్కాల సమయంలో తక్షణ సహాయం అందించేందుకు రెడ్ క్రాస్ సొసైటీ ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటుందని చెప్పారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే, కలెక్టర్, రెడ్ క్రాస్ సొసైటీ ప్రతినిధులకు బాధితులు కృతజ్ఞతలు తెలిపారు.

# ప్రజాసమస్యల పరిష్కారమే కూటమి' పాలన లక్ష్యం

## - సత్తెనపల్లి ఎమ్మెల్యే కన్నా




**సత్తెనపల్లి, మే 29, ప్రభాతవార్త**
ప్రజా సమస్యల పరిష్కార వేదికలో టిడిపి జాతీయ ఉపాధ్యక్షుడు, సత్తెనపల్లి ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ పాల్గొన్నారు. గుంటూరు పట్టణం కార్యాలయం నందు ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ప్రజలు తాము ఎదుర్కొంటున్న సమస్యలపై వినతి పత్రాలు అందించారు. ప్రజల నుండి నేరుగా ఫిర్యాదులను ఆయన స్వీకరించారు. గత ప్రభుత్వం మాదిరిగా కాకుండా ప్రజలకు అందుబాటులో ఉండి సమస్యలు పరిష్కరిస్తామని భరోసా ఇచ్చారుబీ ఈ సందర్భంగా ప్రజలు.తన దృష్టికి కొన్ని సమస్యలు. గృహ,పెన్షన్, వైద్యం,పలు సమస్యలు తీసుకొచ్చారని. సమస్యల తక్షణ పరిష్కారానికి అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.అందరి సమస్యలు పరిష్కరిస్తామని ఎమ్మెల్యే కన్నా హామీనిచ్చారు.

# పమిడిమాళ్ళ కృష్ణకుమారికి నివాళులర్పించిన శ్యామల



**సత్తెనపల్లి, మే 29, ప్రభాతవార్త**
సత్తెనపల్లి పట్టణానికి చెందిన పల్నాడు జిల్లా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ మహిళా అధ్యక్షురాలు డాక్టర్ గీతా హాసంతి మాతృమూర్తి కృష్ణకుమారి ఇటీవల మృతిచెందారు..సమాచారం తెలుసుకున్న వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి శ్యామల సత్తెనపల్లి పట్టణంలోని గీతా హాసంతి నివాసంలో కలిసి వారి మాతృమూర్తి కృష్ణకుమారి చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పట్టణ కన్వీనర్ సహారా మోలాలి,లోక మాధవరావు ,కొనతం స్వాతి ,జానీ జె ఎస్ కే , రేపూడి రవితేజ , షేక్ మోహిద్దిన్,నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# పేదలకు వరం సీఎం సహాయనిధి

## - ఎమ్మెల్యే యరపతినేని



**పిడుగురాళ్ల, మే 29 ప్రభాతవార్త**

సీఎం సహాయనిధి పేదల పాలిట వరమని గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో లబ్ధిదారులకు సీఎం సహాయనిధి చెక్కులను అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే యరపతినేని మాట్లాడుతూ గురజాల మండలానికి సంబంధించి 23 మందికి రూ.29,39,504లు, గురజాల పట్టణానికి చెందిన 9 మందికి రూ.4,93,774, దాచేపల్లి మండలంకు చెందిన 13 మందికి రూ.9,10,740, దాచేపల్లి పట్టణానికి చెందిన ఏడుగురికి రూ.6,99,627, మాచవరం మండలానికి చెందిన 12 మందికి రూ.7,77,650, పిడుగురాళ్ల మండలానికి చెందిన 23 మందికి రూ.27,73,345లు, పిడుగురాళ్ల పట్టణానికి చెందిన 19 మందికి రూ.14,48,927లు, మంచికల్లుకు చెందిన ఒక్కరికి రూ.63,734ల విలువైన చెక్కులను అందించామన్నారు. అన్ని మండలాలకు సంబంధించి 107 మందికి రూ.1,01,07,301ల విలువైన చెక్కులను అందించినట్లు చెప్పారు.



# వ్యవసాయ ప్రణాళిక సమావేశం

**పిడుగురాళ్ల, మే 29 ప్రభాతవార్త**



పట్టణంలోని కె కన్వెన్షన్ మినీ ఫంక్షన్ హాలులో ఖరీఫ్ - 2026 వ్యవసాయ ప్రణాళికా సమీక్షా సమావేశం డీఏవో జగ్గారావు,ఏడీఏ శ్రీకృష్ణదేవరాయులు ఆధ్వర్యాన నిర్వహించారు. వారు మాట్లాడుతూ ప్రతి గ్రామంలో స్థానికుల వనరుల, నేల స్వభావం, పంట సరళిని బట్టి ప్రణాళికలకు రూపొందించి రైతులకు ముందస్తుగా అందుబాటులో ఉంచాలన్నారు. ఇ-పంట నమోదును నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలన్నారు. రైతు సేవా కేంద్రాల్లో సిబ్బంది నిత్యం అందుబాటులో ఉండాలన్నారు. బాధ్యతారాహిత్యం వ్యవహరిస్తే క్రమశిక్షణా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఏడీఏ హనుమంతురావు, ఏవోలు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఓగేరు వాగు బ్రిడ్జిపై విద్యుత్ లైట్లు ఏర్పాటు చేయాలి

### - పురపాలక సంఘ ప్రత్యేకాధికారి పల్నాడు జిల్లా కలెక్టర్ కృత్తికా శుక్ల, మున్సిపల్ కమిషనర్ శ్రీహరిబాబుకు ఏఐటీయూసీ నాయకుల వినతి



**చిలకలూరిపేట, మే 29, ప్రభాతవార్త**

పట్టణంలోని గడియార స్తంభం నుంచి బ్రహ్మంగారి గుడి మీదుగా ఓగేరు వాగుపై నిర్మించిన బ్రిడ్జిపై విద్యుత్ లైట్లు ఏర్పాటు చేయాలని ఏఐటీయూసీ నాయకులు శుక్రవారం మున్సిపల్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. పురపాలక సంఘం ప్రత్యేక అధికారి మరియు పల్నాడు జిల్లా కలెక్టర్ కృత్తికా శుక్ల, మున్సిపల్ కమిషనర్ పి శ్రీహరి బాబు తరపున మున్సిపల్ సీనియర్ అసిస్టెంట్ వై రాజేంద్ర వినతిపత్రాన్ని స్వీకరించారు.ఈ సందర్భంగా ఏఐటీయూసీ అధ్యక్షుడు పేలూరి రామారావు మాట్లాడుతూ, బ్రిడ్జి నిర్మించి మూడు సంవత్సరాలు గడిచినా ఇప్పటివరకు ప్రారంభించలేదని, శిలాఫలకం ఆర్చి ఖాళీగా ఉండటం బాధాకరమని అన్నారు. ప్రజల సౌకర్యార్థం కోట్లాది రూపాయల ప్రజాధనంతో నిర్మించిన బ్రిడ్జిని అధికారులు పట్టించుకోకపోవడం విచారకరమని విమర్శించారు. పేదవారు కూడా తమ ఇంట్లో వెలుతురు కోసం కనీసం జీరో బల్బు ఏర్పాటు చేసుకుంటారని, కోట్ల రూపాయలతో నిర్మించిన బ్రిడ్జిపై విద్యుత్ సౌకర్యం లేకపోవడం దురదృష్టకరమని పేర్కొన్నారు. మున్సిపల్ యంత్రాంగం, డ్రైనేజ్ బోర్డు, ఇరిగేషన్ శాఖలు బ్రిడ్జి నిర్వహణపై నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నాయని మండిపడ్డారు.ప్రతిరోజూ వందలాది మంది రైతులు, పట్టణ ప్రజలు ఆ బ్రిడ్జిని వినియోగిస్తున్న నేపథ్యంలో ఎలాంటి ప్రమాదం జరిగినా బాధ్యత ఎవరిదని ప్రశ్నించారు. జిల్లా కలెక్టర్ కృత్తికా శుక్లా, మున్సిపల్ కమిషనర్ వెంటనే స్పందించి బ్రిడ్జిపై విద్యుత్ వెలుగులు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు నాగబైరు సుబ్బాయమ్మ, నాయుడు శివకుమార్, బొంత భగత్ సింగ్, ఆరాధ్యుల రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## నాదెండ్లలో జిల్లా విద్యాశాఖాధికారి పర్యటన

**నాదెండ్ల, మే 29, ప్రభాతవార్త**



పల్నాడు జిల్లా విద్యాశాఖ అధికారి పివిజె రామారావు శుక్రవారం మండల వనరుల కేంద్రం నాదెండ్లలో సందర్శించారు. మండల స్థాయిలో జరుగుతున్న డ్రాప్ అవుట్ స్టూడెంట్స్ ఎన్రోల్మెంట్, ఒకటవ తరగతి విద్యార్థుల అడ్మిషన్స్, మోడల్ ప్రైమరీ స్కూల్స్ లో విద్యార్థులను చేర్చుట, ట్రాన్సిషన్, మనబడి మన భవిష్యత్తు పనులు ప్రోగ్రెస్ ను పరిశీలించారు ఎంఆర్సి సిబ్బంది, సి.ఆర్.ఎం.టిలు, పిటిఐలు, ఎం.ఈ.ఓ లకు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో నరసరావుపేట డివిజన్ ఉప విద్యాశాఖ అధికారి మెహబూబ్ సుబాని పాల్గొన్నారు.

# ప్రత్తిపాటి పుల్లారావు పుట్టినరోజు సందర్భంగా అన్న క్యాంటీన్‌లో కేక్ కటింగ్ చేసి అన్నదానం

**చిలకలూరిపేట, మే 29, ప్రభాతవార్త**

చిలకలూరిపేట ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు జన్మదినాన్ని పురస్కరించుకుని టీడీపీ నాయకులు, కార్యకర్తలు సేవా కార్యక్రమాలతో ఘనంగా వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలోని అన్న క్యాంటీన్‌లో భారీ స్థాయిలో అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టి ప్రజలకు ఉచితంగా భోజనాలు పంపిణీ చేశారు. ఉదయం నుంచే అన్న క్యాంటీన్ వద్ద టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలోచేరుకుని కార్యక్రమాన్ని ప్రారంభించారు .అనంతరం ప్రజల కోసం పనిచేసే నాయకుడు ప్రత్తిపాటి పుల్లారావు" అంటూ నినాదాలు చేస్తూ వేడుకలను ఉత్సాహంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అన్న క్యాంటీన్‌కు వచ్చిన వృద్ధులు, కార్మికులు, పేద ప్రజలకు ప్రేమతో భోజనాలు వడ్డించారు. కార్యకర్తలు స్వయంగా ప్లేట్లు అందిస్తూ ప్రతి ఒక్కరిని ఆత్మీయంగా పలకరించారు. భోజనం తీసుకున్న ప్రజలు పుల్లారావు సేవా కార్యక్రమాలను అభినందిస్తూ ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. టీడీపీ నాయకులు మాట్లాడుతూ.. రాజకీయాల్లో ప్రజాసేవకు ప్రతీకగా నిలిచిన నాయకుడు ప్రత్తిపాటి పుల్లారావు అని కొనియాడారు. చిలకలూరిపేట అభివృద్ధి కోసం ఆయన నిరంతరం కృషి చేస్తున్నారని, ప్రజా సమస్యల పరిష్కారంలో ఎప్పుడూ ముందుంటారని అన్నారు. పుట్టినరోజు సందర్భంగా సేవా కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా పుల్లారావు గారి సేవా స్ఫూర్తిని కొనసాగిస్తున్నామని పేర్కొన్నారు. అలాగే అన్న క్యాంటీన్ ద్వారా పేద ప్రజలకు నాణ్యమైన భోజనం అందించడం తెలుగుదేశం పార్టీ ప్రభుత్వ సేవా దృక్పథానికి నిదర్శనమని తెలిపారు. ఈ రోజు ప్రత్యేకంగా పెద్ద ఎత్తున అన్నదానం నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు.అన్నదాన కార్యక్రమంలో మహిళలు, వృద్ధులు, కార్మికులు, పాదచారులు భారీ సంఖ్యలో పాల్గొని భోజనం



స్వీకరించారు. కార్యక్రమం మొత్తం సేవాభావంతో, ఉత్సాహభరిత వాతావరణంలో కొనసాగింది. కార్యకర్తలు క్రమబద్ధంగా భోజనాలు వడ్డిస్తూ వచ్చిన ప్రతి ఒక్కరికి సాదరంగా ఆహ్వానం పలికారు.ఈ కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు, పట్టణ నాయకులు, యువత, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. జన్మదిన వేడుకలను సేవా కార్యక్రమాలతో నిర్వహించడం పట్ల ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

# ప్రత్తిపాటి అసలైన బలం ప్రజల విశ్వాసమే



**చిలకలూరిపేట, మే 29, ప్రభాతవార్త**

గొప్ప నాయకుడంటే ప్రజల్లో ఒకడు. ప్రజలకోసం నిలిచేవాడు.. జనం కష్టసుఖాల్లో వెన్నంటి ఉండేవాడు.. వారి తలలో నాలుకలా.. ఆపదలో రక్షణలా.. సమస్యల్లో పరిష్కారంలా.. కుటుంబంలో ఒకడిగా మెలిగేవాడు.. అతనే అసలైన ప్రజానాయకుడు..ప్రజలు మెచ్చిన పాలకుడు.. మనందరి ప్రియతమ నాయకులు మన ప్రత్తిపాటి పుల్లారావు గారు..నాయకత్వం పదవితో కాదు... ప్రజలకోసం పడే కష్టంతో వస్తుందని చాటిచెప్పిన సమర్థులు. పదవులంటే అధికారంతో కూడిన అలంకారాలు కాదు.. భావితరాలకు ఆదర్శంగా నిలవాల్సిన గొప్ప బాధ్యతలని నిరూపించిన నిగర్వి ప్రత్తిపాటి పుల్లారావుఅని పార్టీ నాయకులు, కార్యకర్తలు పేర్కొన్నారు. ప్రత్తిపాటి అసలైన బలం ప్రజల విశ్వాసమే..వారు తనపై పెట్టుకున్న అంతులేని నమ్మకమే. ప్రజల సమస్యల్ని విని, వారి కష్టాల్ని చూసి మిన్నకుండిపోయే నాయకుడు కాదు ప్రత్తిపాటి పుల్లారావు అవి పూర్తిగా తొలగిపోయి, తనకోసం నిలిచినవారి ముఖాల్లో చిరునవ్వులు విరబూసే వరకు వెనకడుగు వేయని ధీరోధాత్తుడు ప్రత్తిపాటి పుల్లారావు . నిస్వార్థమైన సేవా కార్యక్రమాలతో, నిరుపమానమైన ప్రజారోగ్య పరిరక్షణ చర్యలతో అసలైన ప్రజా రక్షకుడిగా నిలిచిన పాలకుడు మన ప్రత్తిపాటి. నియోజకవర్గానికి అభివృద్ధిని, ప్రజలకు సంక్షేమాన్ని పరిచయం చేయడమే గాక, వారి ఆర్థిక, సామాజిక, గౌరవ జీవనానికి సంపూర్ణ సహకారం అందిస్తున్నామని ప్రత్తిపాటి పుల్లారావు కు హృదయ పూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

## ప్రత్తిపాటి పుట్టినరోజు సందర్భంగా వెంకన్నకు ప్రత్యేక పూజలు నిర్వహించిన ఆర్యవైశ్య ప్రముఖులు



**చిలకలూరిపేట, మే 29, ప్రభాతవార్త**

ప్రత్తిపాటి పుల్లారావు జన్మదిన వేడుకలు ఘనంగా.. వెంకటేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన ఆర్యవైశ్య సంఘం నాయకులు ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు జన్మదినాన్ని పురస్కరించుకుని పట్టణంలోని శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో ఆర్యవైశ్య సంఘం నాయకులు ఘనంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఉదయం నుంచే ఆలయానికి చేరుకున్న సంఘం నాయకులు, వ్యాపార వేత్తలు, అభిమానులు స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు నిర్వహించి ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో ఉండాలని, ప్రజలకు మరింత సేవ చేసే శక్తిని భగవంతుడు ప్రసాదించాలని ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణం ఆధ్యాత్మిక వాతావరణంతో కళకళలాడింది. వేద పండితులు మంత్రోచ్చారణల నడుమ ప్రత్యేక పూజలు నిర్వహించగా భక్తులు భక్తిశ్రద్ధలతో పాల్గొన్నారు. అనంతరం నాయకులు కలిసి భారీ కేక్‌ను కట్ చేసి ఒకరికొకరు తినిపించుకుంటూ జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. "హ్యాపీ బర్త్‌డే పుల్లారావు గారు" అంటూ నినాదాలతో ఆలయ పరిసరాలు మార్మోగిపోయాయి. ఆర్యవైశ్య సంఘం నాయకులు మాట్లాడుతూ.. ప్రజల కష్టసుఖాలలో ఎల్లప్పుడూ ముందుండే నాయకుడు ప్రత్తిపాటి పుల్లారావు అని కొనియాడారు. చిలకలూరిపేట అభివృద్ధి, వ్యాపార వర్గాల సంక్షేమం, ప్రజా సమస్యల పరిష్కారంలో ఆయన చేసిన సేవలు మరువలేనివని పేర్కొన్నారు. ప్రజలకు అందుబాటులో ఉండే నాయకుడిగా ఆయన ప్రత్యేక గుర్తింపు పొందారని అన్నారు. అలాగే నియోజకవర్గ అభివృద్ధికి ప్రత్తిపాటి పుల్లారావు చేస్తున్న కృషి ప్రశంసనీయమని, రానున్న రోజుల్లో మరింత ఉన్నత స్థానాలకు ఎదగాలని ఆకాంక్షించారు. దేవుని ఆశీస్సులతో ఆయనకు దీర్ఘాయుష్షు కలగాలని కోరుతూ ప్రత్యేక హారతులు సమర్పించారు. పూజల అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం ప్రతినిధులు, వ్యాపార వేత్తలు, పార్టీ నాయకులు, అభిమానులు, మహిళలు, యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొని జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు.

## ప్రత్తిపాటికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన మండలనేని చరణ్

**చిలకలూరిపేట, మే 29, ప్రభాతవార్త**



చిలకలూరిపేట ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు జన్మదినాన్ని పురస్కరించుకొని నియోజకవర్గంలో పండుగ వాతావరణం నెలకొంది. ఈ సందర్భంగా ప్రముఖ ప్రదాత, మండలనేని చరణ్ తేజ ఆయనకు కలిసి హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రత్తిపాటి పుల్లారావు నిరంతరం ప్రజల శ్రేయస్సు కోరే నాయకుడని కొనియాడారు. ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయం ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ, వారి సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పనిచేసే గొప్ప వ్యక్తిత్వం ప్రత్తిపాటి పుల్లారావుదని చరణ్ తేజ కొనియాడారు.

## ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు జన్మదిన వేడుక సందర్భంగా భారీ అన్నదానం

**చిలకలూరిపేట, మే 29, ప్రభాతవార్త**



చిలకలూరిపేట నియోజకవర్గ ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు జన్మదినాన్ని పురస్కరించుకుని,పట్టణంలోని గడియారం స్తంభం సెంటర్ వద్ద అన్న క్యాంటీన్‌లో టిడిపి మైనార్టీ సెల్ వైస్ ప్రెసిడెంట్ ఖాజా ఆధ్వర్యంలో గురువారం ఘనంగా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి మైనార్టీ సెల్ వైస్ ప్రెసిడెంట్ ఖాజా నేతృత్వం వహించారు. ఈ సందర్భంగా సుమారు 300 మందికి భోజన వసతి కల్పించేందుకు అవసరమైన నిధులను నిర్వాహకులు అన్నదాన ట్రస్టుకు అందజేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ ఛైర్మన్ కరిముల్లా, మున్సిపల్ మాజీ ఛైర్మన్ రఫాని, మాజీ మార్కెట్ యార్డ్ ఛైర్మన్ సదాశివరావు, పట్టణ అధ్యక్షుడు సమస్కాన్, కార్యదర్శి రవి, జిల్లా నాయకురాలు అమర రమాదేవి,మైనార్టీ నాయకులు అజారుద్దీన్, కరీముల్లా, రియాజ్ తదితరులు పాల్గొన్నారు.

### సేవా దృక్పథమే మా లక్ష్యం : టిడిపి నాయకులు

ఈ సందర్భంగా ముఖ్య అతిథులుగా పాల్గొన్న మార్కెట్ యార్డ్ ఛైర్మన్ కరిముల్లా, మాజీ ఛైర్మన్ సదాశివరావు, మాజీ మున్సిపల్ ఛైర్మన్ రఫాని మాట్లాడుతూ.. ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు నిరంతరం ప్రజల కోసం, నియోజకవర్గ అభివృద్ధి కోసం కృషి చేస్తున్నారని కొనియాడారు. ఆయన జన్మదినాన్ని పురస్కరించుకుని ప్రజలకు, పేదలకు సహాయం చేసే రీతిలో అన్నదాన కార్యక్రమం నిర్వహించడం అభినందనీయమని అన్నారు. ప్రజా సేవలో పుల్లారావు అడుగుజాడల్లో నడుస్తూ, పార్టీని మరింత బలోపేతం చేసేందుకు అందరం కలిసికట్టుగా పనిచేస్తామని వారు పేర్కొన్నారు.

## చిలకలూరిపేటలో ఘనంగా ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు జన్మదిన వేడుకలు

### - మెగా వైద్యశిబిరానికి విశేష స్పందన

**చిలకలూరిపేట, మే 29, ప్రభాతవార్త**



చిలకలూరిపేట ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు జన్మదిన వేడుకలను చిలకలూరిపేటలో ఘనంగా నిర్వహించారు. ప్రత్తిపాటి గార్డెన్స్‌లో భారీ మెగా మెడికల్ క్యాంపును ఏర్పాటు చేశారు. పుట్టినరోజు వేడుకల్లో పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొని సందడి చేశారు. పుట్టినరోజు సందర్భంగా పార్టీ సీనియర్ నాయకుల ఆధ్వర్యంలో భారీ కేక్‌ను కట్ చేసి అందరికీ పంపిణీ చేశారు. నాయకులు, అభిమానులు ప్రత్తిపాటి పుల్లారావుకు పూలమాలలు వేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు."ప్రజల సేవే లక్ష్యంగా పనిచేస్తున్న నాయకుడు ప్రత్తిపాటి పుల్లారావు" అంటూ నాయకులు కొనియాడారు. అనంతరం ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు మెగా మెడికల్ క్యాంపును ప్రారంభించారు. ఈ వైద్య శిబిరంలో ముఖ్యంగా వృద్ధులకు ఉచిత కంటి పరీక్షలు నిర్వహించారు. అనుభవజ్ఞులైన వైద్యులు కంటి సమస్యలను పరీక్షించి అవసరమైన వారికి సూచనలు అందించారు. కొంతమందికి ఉచిత మందులు కూడా పంపిణీ చేశారు. చిలకలూరిపేట నియోజకవర్గ పరిధిలోని పలు గ్రామాలు, పట్టణ ప్రాంతాల నుంచి వృద్ధులు భారీ సంఖ్యలో తరలి వచ్చి వైద్య సేవలను వినియోగించుకున్నారు. మెడికల్ క్యాంపులో ఆరోగ్య పరీక్షలు నిర్వహించడం పట్ల ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, అభిమానులు, వైద్య సిబ్బంది, స్థానిక ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. జన్మదిన వేడుకలను సేవా కార్యక్రమాలతో నిర్వహించడం అభినందనీయమని పలువురు పేర్కొన్నారు.

## గణపవరం,చిలకలూరిపేట పట్టణంలో ఘనంగా ప్రతిపాటి పుల్లారావు జన్మదిన వేడుకలు

**చిలకలూరిపేట, మే 29, ప్రభాతవార్త**



నాదెండ్ల మండలం గణపవరం గ్రామంలో జిల్లా తెలుగు యువత నాయకులు నన్నపనేని టరీష్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గణపవరం గ్రామంలోని తులసి వృద్ధాశ్రమం,చిలకలూరిపేట పట్టణంలోని ప్రశాంతి వృద్ధుల ఆశ్రమంలో అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా నెల్లూరి సదాశివరావు మాట్లాడుతూ, ప్రత్తిపాటి పుల్లారావు నిరాడంబర జీవితం గడుపుతూ పేదల పక్షపాతిగా నిలిచారని తెలిపారు. నన్నపనేని టరీష్ మాట్లాడుతూ, పేదలకు కంటి వెలుగు ప్రసాదిస్తూ రైతుల అభ్యున్నతికి కృషి చేస్తూ, ప్రజల కష్టసుఖాలే తన ధ్యేయంగా భావించే నాయకుడు ప్రత్తిపాటి పుల్లారావు గారేనని కొనియాడారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ సమన్వయకర్త నెల్లూరు సదాశివరావు, మార్కెట్ యార్డ్ ఛైర్మన్ షేక్ కరిముల్లా, చల్లగుండ్ల శివ బాబు పెదవల్లి రామారావు అనుమంచి రమణ కుమీర్, ఆరేమల్లి, రియాజ్, పోపూరి అజయ్, అమరమణి,శరత్ తదితరులు మరియు కార్యకర్తలు పాల్గొన్నారు.

# విద్యార్థులకు పుస్తకాల పంపిణీ



**రాజుపాలెం, మే 29, ప్రభాతవార్త**

రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ ఛైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు, కెఎన్ఆర్ విద్యా సంస్థలు ఆధ్వర్యంలో జరిగిన ఎన్టీఆర్ జయంతి వేడుకల్లో డైరెక్టర్స్ కోనేటి నరసింహారావు, బాడిస మస్తాన్ రావు ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలుగు తెర వెలుగు, నాయకుడిగా తెలుగు ప్రజ మీద తనదైన ముద్రవేసిన మహోన్నత మనిషి నందమూరి తారకరామారావు అంటే సినిమాలకు, రాజకీయాలకు అతీతమైన విలక్షణమైన వ్యక్తిత్వం అన్నారు. దేశభక్తితో పాటు తెలుగు భాష పట్ల అవ్యాజమైన ప్రేమ కలిగిన వ్యక్తి. తెలుగు వాడినంటూ గర్వంగా చెప్పుకున్న వ్యక్తి ఎన్టీఆర్ అనిఅన్నారు.ఎన్టీఆర్ వ్యక్తిత్వం చిరస్మరణీయమైనదని,భవిష్యత్ తరాలకు ఆదర్శనీయమైందన్నారు.పల్నాడు జిల్లా రాజుపాలెం మండలం కొండమోడులోని దీనమ్మ అండ్‌రూరల్ డెవలప్మెంట్ అనాథ పిల్లల వృద్ధుల అనాథాశ్రమంలో డిగ్రీ కళాశాల డైరెక్టర్ కోనేటి నరసింహారావు, బాడిశ మస్తాన్ రావు ఆధ్వర్యంలో విద్యార్థులకు ఉచిత పుస్తకాలు పంపిణీ చేశారు. అనంతరం కేక్ కట్ చేసి అన్నదాన కార్యక్రమం జరిపారు. ఈ కార్యక్రమానికి కళాశాల అధ్యాపకులు సాధినేని నరసింహారావు, తెలగపల్లిగోపికృష్ణ,ఆలూరి ప్రసన్నకుమార్, కోనేటి ప్రసన్న,తెలుగుదేశం పార్టీ నాయకులు ,కూటమి నాయకులు, కార్యకర్తలు, ఆశ్రమ ఛైర్మన్ గరికపాటి శంకర్రావు తదితరులు పాల్గొన్నారు.

# జాతీయస్థాయి చౌక్ బాల్ పోటీలకు

## ఆంధ్రప్రదేశ్ జట్టు

**చిలకలూరిపేట, మే 29, ప్రభాతవార్త**

ఇండియన్ చౌక్ బాల్ అసోసియేషన్ వారి ఆధ్వర్యంలో గోవా రాష్ట్రంలో జరిగే మహిళ , పురుషుల చౌక్ బాల్ పోటీలు మే 29 నుండి 31 వరకు జరుగుతాయని అసోసియేషన్ రాష్ట్ర సెక్రటరీ ఎస్ సుధాకర్ రావు, ఛైర్మన్ చేబ్రోలు మహేష్ తెలిపారు. ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన పురుష , మహిళ జట్లు ఈ టోర్నమెంట్లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుండి ప్రాతినిధ్యం వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ సీఈవో శివరాం , కోచ్ శివాజీ, సురేష్ మేనేజర్లు సంధ్య, శ్రావణి తదితరులు పాల్గొన్నారు.



6MN 6 PG-GNT_6MN 6 PG-GNT.qxd 5/30/2026 12:19 AM Page 1



## స్థిరమైన జీవితం కోసం విద్య అవసరం



నిజాంపట్నం, మే 29, ప్రభాతవార్తః ప్రతి ఒక్కరూ స్థిరమైన జీవితం కావాలనుకుంటే విద్య ఎంతో అవసరమని సిడిపిఒ అనసూయ అన్నారు. శుక్రవారం మండలంలోని ముత్తుపల్లి గ్రామపంచాయితీ వద్ద నిర్వహించిన కిశోరి వికాసం కార్యక్రమంలో భాగంగా 11-18 వయస్సు కల బాలబాలికలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నైపుణ్యాల అభివృద్ధి, వ్యక్తిత్వ వికాసం, కెరీర్‌ల ఎంపికకు విద్య అవసరమన్నారు. సమాజంలో గౌరవంగా నిలబడటానికి విద్య ఎంతో అవసరమనా న్నరు. విద్యతోపాటు వినయం, సంస్కారం, పెద్దలపట్ల గౌరవం నేర్చుకోవా లన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ వెంకటరత్నం తదితరులు పాల్గొన్నారు.

## కొల్లూరులో శాంతి భద్రతల ఏర్పాటుకు కమిటీలు ఏర్పాటు చేయాలి

### :కొండపల్లి వెంకటేశ్వరరావు



రేపల్లె, మే 29, ప్రభాతవార్త:వేమూరు నియోజకవర్గంలోని కొల్లూరులో రెండు సామాజికవర్గాల మధ్య చోటుచేసుకున్న ఘర్షణ విచారకరమని శాంతి భద్రతలను దృష్టిలో ఉంచుకుని శాంతి కమిటీలు ఏర్పాటు చేయాలని రేపల్లె చైతన్య వేదిక అధ్యక్షుడు కొండపల్లి వెంకటేశ్వరరావు శుక్రవారం రేపల్లె డిఎస్పీ ఆవుల శ్రీనివాసరావును కోరారు.కొల్లూరు పెద్దలు పోలీసుల సహకారంతో శాంతి కమిటీలు ఏర్పాటు చేసుకుని ఘర్షణలు పునరావృతంకాకుండా చూసుకోవాలని సూచించారు.పల్నాడులో బ్రహ్మనాయుడు చేపట్టిన సహపంక్తి భోజనాల మాదిరిగా సామరస్య కార్యక్రమాలు నిర్వహించాలని కొండపల్లి వెంకటేశ్వరరావు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో వెలుగోటి ధర్మారావు,తుపాకుల శ్రీనివాసరావు,గోరికపూడి ప్రసాద్,బండారు విల్సన్,ఎం.నరసింహస్వామి తదితరులు పాల్గొన్నారు.

## ఈదురుగాలులతో భయభ్రాంతులకు గురైన ప్రజలు

నిజాంపట్నం, మే 29, ప్రభాతవార్తః మండలంలోని వివిధ గ్రామాలలో శుక్రవారం 10.30 నుంచి అర్ధరా త్రి 2 గంటల వరకు వీచిన ఈదురుగాలులకు ప్రజలు భయభ్రాంతులకు గురయ్యారు. గంటలకు 100 కి.మీ పైగా వేగంతో వీచిన ఈదురుగాలులకు అనేక చోట్ల విద్యుత్ వైర్లు తెగిపోయాయి. అక్కడక్కడా చెట్ల కొమ్మలు విరిగిపడ్డాయి. ఈదురు గాలులు ప్రారంభమైన వెంటనే విద్యుత్ శాఖ అధికారులు విద్యుత్ సరఫరాను నిలిపివేశారు. ఫలితంగా ఎక్కడా ప్రమాదం సంభవించలేదు. మండల కేంద్రమైన నిజాంపట్నం పంచాయితీ కార్యాలయం సమీపంలోని ఓ ఇంటి పై భాగంలో వేసిన ఇనుప రేకులతో కూడిన ఫ్రేమ్ సమీపంలో చెరువు గట్టు వద్దకు వెళ్ళిపడ్డాయి. ఆ సమయంలో ఎవరూ రహదారిపై ఎవరూ లేకపోవటం అదృష్టం. అంతేకాక ఇనుప రేకులు, ఫ్రేం పడిన ప్రక్కనే విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఉంది. ఇనుప రేకుల ఫ్రేం విద్యుత్ ట్రాన్స్‌ఫారంపై పడితే చాలా పెద్ద ప్రమాదం జరిగేది. ప్రక్కనే పడటంతో ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. శుక్రవారం మధ్యాహ్నం వరకు విద్యుత్ కేబుల్స్ మరమ్మతులు నిర్వహిస్తూనే ఉనా న్నరు.

## కోర్టు ఆవరణలో చలివేంద్రం ఏర్పాటు



రేపల్లె, మే 29, ప్రభాతవార్త:వేసవిని దృష్టిలో ఉంచుకుని మజ్జిగ,మంచినీటిని అందించే చలివేంద్రాలను ఏర్పాటు చేయడం అభినందనీయమని రేపల్లె అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి వి.గీతా భార్గవి అన్నారు.శుక్రవారం రేపల్లె కోర్టు ఆవరణలో రేపల్లె అడ్వకేట్స్ వెల్ఫేర్ అసోసియేషన్,రేపల్లె ఆర్య వైశ్య మహిళా సంఘం సంయుక్తంగా ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ప్రారంభించిన సందర్భంగా గీతా భార్గవి మాట్లా డుతూ చలివేంద్రాల వలన ప్రజలకు ప్రయోజనమని చెప్పారు.ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మేకా పూర్ణచంద్రరావు,కోశాధికారి గుంటూరు విజయకుమారి,లైబ్రరీ సెక్రటరీ జహంగీర్ బేగ్,మోర్ల కృష్ణారామ్, కేసన గోపాల రావు, ఒడుగు రాంబాబు, కొలుసు వీరరాఘవులు, టిఎస్ దీనరాజు,ఆర్యవైశ్య మహిళా సంఘం నాయకులు పొన్నూరు గౌరీరామకుమారి,మల్లేశ్వరి,మెడతాటి విజయ,డి.రత్నకుమారి,రేపల్లె టౌన్ సిఐ బి.అశోక్‌బాబు,ఎస్ఐ రాజ్యలక్ష్మి,కోర్టు,పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## కేంద్రం తీరుపై సిపిఎం నిరసన



రేపల్లె, మే 29, ప్రభాతవార్త:కేంద్ర ప్రభుత్వం రాజకీయంగా ప్రత్యర్ధులను భయపెట్టేందుకు కేంద్ర దర్యాప్తు సంస్థలను దుర్వినియోగం చేస్తున్నదని రేపల్లె నెహ్రూ విగ్రహం సెంటరులో శుక్రవారం సిపిఎం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా సిపిఎం రేపల్లె పట్టణ కార్యదర్శి సిహెచ్.మణిలాల్ మాట్లాడుతూ ఇటీవల జరిగిన 5 రాష్ట్రాల ఎన్నికల అనంతరం రాజకీయ ప్రత్యర్ధులను లక్ష్యం చేసుకుని కేంద్ర దర్యాప్తు సంస్థలను ప్రయోగిస్తున్నదని విమర్శించారు.కేరళ మాజీ సిఎం విజయన్‌పై ఈడి దాడులు చేయడాన్ని సిపిఎం తీవ్రంగా ఖండిస్తున్నదని చెప్పారు.కేరళలో 10 చోట్ల,బెంగళూరులో 2 చోట్ల ఏకకాలంలో సోదాలు జరిపినా ఎటువంటి అధారాలు లభించలేదన్నారు.ప్రజానేతగా ఎదిగిన విజయన్‌పై బిజెపి,కాంగ్రెస్ నిరాధారమైన ఆరోపణలు చేసాయని మణిలాల్ స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో సిపిఎం నేతలు వై.కిషోర్,కె.రమేష్,కె.ఆశీర్వాదం,సిహెచ్.ప్రకాష్,జె.దర్మరాజు,జి.దానియేలు,ఎం.వెంకటేశ్వరరావు,వి. మావో తదితరులు పాల్గొన్నారు.

## రేపల్లె రెవెన్యూ డివిజన్‌లో 238.6 సెం.మీ వర్షపాతం

రేపల్లె, మే 29, ప్రభాతవార్త:రేపల్లె రెవెన్యూ డివిజన్‌లో గురువారం రాత్రి నుండి శుక్రవారం ఉదయం 8 గంటల వరకు 238.6 సెం.మీ వర్షపాతం నమోదైంది.చుండూరు మండలంలో 46.8 సెం.మీ,అమృతలూరు మండలంలో 26.4 సెం.మీ,వేమూరు మండలంలో 43.6 సెం.మీ,కొల్లూరు మండలంలో 28.2 సెం.మీ,భట్టి ప్రోలు మండలంలో 13 సెం.మీ,చెరుకుపల్లి మండలంలో 16.4 సెం.మీ,నిజాంపట్నం మండలంలో 22.4 సెం.మీ,నగరం మండలంలో 28.6 సెం.మీ,రేపల్లె మండలంలో 13.2 సెం.మీ వర్షపాతం నమోదైంది.భారీ ఈదురు గాలుల కారణంగా చాలా చోట్ల చెట్లు పడిపోయాయి.రవాణా వ్యవస్థకు ఇబ్బందులు ఏర్పడ్డాయి.విద్యుత్ స్తంభాలు పడిపోయాయి. విద్యుత్ వైర్లు తెగిపోయాయి.విద్యుత్ సరఫరా పునరుద్ధరణకు గంటల తరబడి ఆలస్యం ఏర్పడింది.

## కిశోర బాలికలకు అవగాహన



రేపల్లె, మే 29, ప్రభాతవార్త:మండలంలోని బేతపూడిలో శుక్రవారం మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కిశోర బాలికల కోసం భవిష్యత్ వృత్తి అవకాశాల అన్వేషణ అనే అంశంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.విద్య ప్రాముఖ్యత,లభించే అవకాశాలు,ప్రభుత్వ,ప్రైవేట్ ఉద్యోగాలు,స్వయం ఉపాధి,నైపుణ్యాభివృద్ధి తదితర అంశాలపై అవగాహన కల్పించారు.విద్యతో పాటు కమ్యూనికేషన్ నైపుణ్యాలు,నాయకత్వ లక్షణాలు,సమయ పాలన, ఆత్మవిశ్వాసం పెంపుదల అంశాల గురించి వివరించారు.బాల్య వివాహాలు,పాఠశాల మానివేత,లింగ వివక్ష వంటి సామాజిక సమస్యలపై అప్రమత్తంగా ఉండాలని ప్రతి బాలిక విద్యావంతురాలై ఆర్థిక స్వాలంబన సాధించాలని రేపల్లె ఐసిడిఎస్ సిడిపివో ఎం.సుచిత్ర కోరారు.ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ జ్యోతిలక్ష్మి,అంగన్‌వాడీ కార్యకర్తలు,కిశోర బాలికలు పాల్గొన్నారు.

## జాబ్ మేళాలో 182 మంది ఎంపిక



రేపల్లె, మే 29, ప్రభాతవార్త:పట్టణంలోని శారద ఐటిఐ కళాశాలలో శుక్రవారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో జాబ్ మేళా నిర్వహిచారు.360 మంది అభ్యర్థులు హాజ రు కాగా 182 మంది అభ్యర్థులు ఎంపికయ్యారు. జయలక్ష్మీ ఆటోమోటివ్స్,మోడ్రన్ సెక్యూరిటీ,ఐసి ఐసిఐ బ్యాంక్,క్యాప్సి టన్ సర్వీసెస్,జీప్టో,నవత, టివిఎస్ సుందరం,వోల్టాస్,అపోలో టైర్స్,కోల్గేట్,హెట్రో డ్రగ్స్,మాస్టర్ మైండ్స్,రిలయన్స్ జియో ,ఇన్నోవ్ సోర్స్ సర్వీస్ ప్రైవేట్ లిమిటెడ్,ఫ్లెక్సీ టెక్ సొల్యూషన్స్,మదర్ సన్ తదితర కంపెనీల హెచ్‌ఆర్‌లు ఇంటర్వ్యూలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఎలక్ట్రిసిటీ రిటైర్డ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ అధ్యక్షుడు వెంకటేశ్వరరావు,ఇ.హారిక,స్కిల్ డెవలప్‌మెంట్ అధికారి ఎం.మాధవి,ప్లేస్‌మెంట్ ఆఫీసర్ జిల్లెళ్ళమూడి సురేష్‌కుమార్,రేపల్లె కో ఆర్డినేటర్ చెరుకూరి రవికుమార్,రేపల్లె శారద ఐటిఐ కళాశాల కరస్పాండెంట్ బడుగు వెంకట నారాయణ తదితరులు పాల్గొన్నారు.

## వడదెబ్బకు ఆయుర్వేద మందులు పంపిణీ

నగరం, మే 29, ప్రభాతవార్త: ఆయుర్వేద మందులు వాడి ఆరోగ్యం వంతుల అవ్వాలని నగరం ఆయుర్వేద వైద్యాధికారి టి. మాధురి అన్నారు. శుక్రవారం స్థానిక మండల పరిధిలోని ఎస్టీ కాలనీలో వడదెబ్బ నివారణకు ఆయుర్వేద మందులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆయుర్వేద వైద్యంలో ప్రస్తుతం వేసవి కాలం దృష్ట్యా వడగాలులు వేస్తున్న తరుణంలో ప్రజలు ఎంతో ఇబ్బందులు పడటం జరుగుతుందని, వడదెబ్బ తగిలిన వారికి ఆయుర్వేద వైద్యంలో శరీర ఉష్ణోగ్రతను తగ్గించి చల్లబరిచే ఎన్నో రకాల మందులు ఉన్నాయని తెలియజేశారు. శరీరానికి ఎక్కువగా కొబ్బరి నీళ్ల, మంచినీరు తీసుకోవాలని, శీతల పానీయాలు, కూలింగ్ వాటర్ ఎవరు కూడా తీసుకోవద్దని అవి శరీరానికి హాని కలిగిస్తాయని తెలియజేశారు. ప్రతి ఒక్కరూ ఆయుర్వేద

## విరిగిన ధ్వజస్థంభం



ములుకుదురు(పొన్నూరు), మే 29, ప్రభాతవార్త: గురువారం రాత్రి విపరీతంగా వీచిన గాలి, వానకు మండల పరిధి ములుకుదురు గ్రామంలో వేంచేసి యున్న శ్రీ చెన్నకేశవస్వామివారి దేవాలయం ధ్వజస్థంభం విరిగిపోయింది. ఒక్కసారిగా గాలి సుడిగుండంలా సుడి తిరగడంతో ధ్వజస్థంభం ఫట్‌మని విరిగిపోయింది. రాత్రి వేళ కాబట్టి ఆ ప్రాంతంలో ఎవరూ లేకపోవడంతో పెనుప్రమాదం తప్పిందనే చెప్పుకోవాలి. పగలు అయితే ధ్వజస్థంభం ప్రాంతంలో గ్రామస్తులు, వృద్ధులు, యువకులు కూర్చోవడం, లేదా ఏదైనా ఆటలు ఆడుకోవడం వంటివి చేస్తుండేవారని గ్రామస్తులు చెప్తున్నారు. అంతేకాకుండా స్వామివారి దర్శనం కోసం వచ్చే భక్తుల సంఖ్య కూడా ఉండేది. ఎలాంటి ప్రాణ నష్టం సంభవించకపోవడంతో గ్రామస్తులు ఊపిరి పీల్చుకున్నారు. ధ్వజ స్థంభం విరిగిన విషయం తెలుసుకున్న గుంటూరు పార్లమెంట్ రైతు విభాగం ప్రధానకార్యదర్శి బొర్రు రామారావు సంఘటనా స్థలానికి వచ్చి ధ్వజస్థంభం విరిగిన ప్రాంతాన్ని పరిశీలించారు. ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్రకుమార్ దృష్టికి తీసుకెళ్ళి, దేవాదాయశాఖాధికారులతో మాట్లాడి తిరిగి ధ్వజస్థంభాన్ని ఏర్పాటు చేసేందుకు ప్రయత్నిద్దామని అర్చకస్వాములతో బొర్రు రామారావు చెప్పారు.

## వ్యాపారులు నిబంధనలు పాటించాలి

పొన్నూరు మే 29 ప్రభాతవార్త : రోడ్డు మార్జిన్లలో వ్యాపారాలు చేసే వ్యాపారస్తులు ట్రాఫిక్ నిబంధనలను పాటించాలని, ప్రజలకు, ప్రయాణికులకు ఇబ్బందులు కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని అర్బన్ సీఐ రేవు శ్రీనివాస కిషోర్ కుమార్ హెచ్చరించారు. అర్బన్ సీఐ గా నూతనంగా బాధ్యతలు చేపట్టిన కిషోర్ కుమార్ పట్టణంలోని ప్రధాన వీధుల్లో పర్యటించారు. గాంధీ బొమ్మ సెంటర్, కసుక్రరు రోడ్డు, ఎస్ పి పి రోడ్డు, ఐలాండ్ సెంటర్, బాపట్ల రోడ్డు, రేపల్లె బస్టాండ్ తదితర ప్రాంతాల్లో తమ సిబ్బందితో పర్యటించి రోడ్డును ఆక్రమించి వ్యాపారాలు నిర్వహిస్తున్న వ్యాపారులను హెచ్చరించారు. రోడ్లను ఆక్రమించి వ్యాపారాలు కొనసాగిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. నిర్దేశించిన ప్రదేశంలో మాత్రమే వ్యాపారులు తమ వ్యాపారాన్ని కొనసాగించాలన్నారు. నిబంధనలకు వ్యతిరేకంగా ప్రవర్తిస్తే చర్యలు తప్పవు అన్నారు. ప్రజలకు, ప్రయాణికులకు ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా చూడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. కొంతమంది వ్యాపారులు నిర్లక్ష ్యంగా వ్యవహరిస్తున్నారని, ఇది సరైన విధానం కాదన్నారు. నిర్దేశించిన ప్రదేశాన్ని దాటి వ్యాపారాలు కొనసాగిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. వాహన చోదకులు రహదారి నిబంధనలు పాటించి ప్రశాంతంగా ప్రయాణం సాగించే విధంగా చూసుకోవాలన్నారు. నిబంధనలు అతిక్రమించిన వారిపై జరిమానాలు విధిస్తామన్నారు. సిఐ వెంట అర్బన్ ఎస్సైలు బలగాని జగన్మోహనరావు, అవ్వారు లక్ష్మి ్మ, సిబ్బంది ఉన్నారు.

## తెదేపా బలోపేతానికి ప్రజా సంక్షేమానికి మహానాడు మార్గదర్శకం:ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్





కొల్లిపర, మే 29, ప్రభాతవార్త:ప్రజల సంక్షేమం దృష్ట్యా గత అనుభవాలను, నేటి పరిస్థితులను మిళితం చేసుకుని పార్టీ నాయకత్వాన్ని బలోపేతం చేసేందుకు మహానాడు కార్యక్రమాలు ఉపయోగపడ ుతున్నాయని మాజీ మంత్రి, ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ అన్నారు.కొల్లిపర ఆర్యవైశ్య కళ్యాణ మండపం,కుంచవరం శ్రీ వారాహి అమ్మవారి ఆవరణలోని కళ్యాణ మండపంలో రెండో రోజుల పాటు మహానాడు కార్యక్రమాలు ప్రతిష్టాత్మకంగా జరిగాయి. కుంచవరంలో దుగ్గిరాల మార్కెట్ యార్డ్ మాజీ ఛైర్మన్ వంగా సాంబిరెడ్డి,కొల్లిపరలో మండల టిడిపి అధ్యక్షుడు భీమవరం చిన కోటిరెడ్డి ఆధ్వర్యంలో మహానాడు కార్యక్రమాలను తిలకించారు. ఈ సందర్భంగా ఆలపాటి రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ గతంలో 3 రోజుల పాటు మహానాడు కార్యక్రమాలు జరిగేవని భారత ప్రధాన మంత్రి నరేంద్రమోదీ పొదుపు సూచన ప్రకారం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేష్ సాంకేతిక పరిజ్ఞానంతో హైబ్రిడ్ విధానంలో రెండు రోజుల పాటు మహానాడు కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు.ఏయే వర్గాలను కాపాడాలి, ఏ విధంగా అభివృద్ధి చేయాలో సమగ్రమైన విధానాన్ని చంద్రబాబు నాయుడు అవలంభిస్తున్నారని చెప్పారు.కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక ఎన్నికలకు ముందు ఏవైతే వాగ్దానాలు చేసారో వాటిని నెరవేరుస్తూ ప్రజల ఆదరణ పొందడం ప్రశంసనీయమని తెలిపారు.శాంతి భద్రతలను పరిరక్షించేందుకు,ప్రతి కుటుంబం సంక్షేమానికి చర్యలు తీసుకుంటున్నారని చెప్పారు. యువతకు ఉపాధి కల్పించేందుకు, మహిళల సంక్షేమానికి ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తున్నదని చెప్పారు. లక్ష మంది మహిళలు పొదుపు సంఘాలలో ఉండి రూ.లక్ష నుంచి రూ.10 లక్షలు తీసుకుంటున్నారంటే మహిళల సంక్షేమానికి తెలుగుదేశం ఏవిధంగా కట్టుబడి ఉందో ప్రతి ఒక్కరూ అర్ధం చేసుకోవాలని ఆయన కోరారు.ప్రతి ఒక్కరికీ అందుబాటులో ఉండే కూటమి పాలనపై ప్రజల ఆదరణ పెరుగుతున్నదని ఆయన చెప్పారు. తొలుత స్వర్గీయ ఎన్టీరామారావు చిత్రపటానికి ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ పూలమాలలు వేసి కేక్ కట్ చేశారు.మహానాడు ప్రత్యక్ష ప్రసారాలను వీక్షించారు.ఈ కార్యక్రమాలలో తెదేపా నాయకులు గుదిబండి గోవర్ధన్‌రెడ్డి, ఉయ్యూరు శ్రీనివాస్‌రెడ్డి,కంచర్ల అమృతరాజు,ఆరిమల వెంకటరెడ్డి,విప్పల రమేష్‌రెడ్డి,నక్క సంసోను,ఆరిమండ రాధాకృష్ణారెడ్డి,లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## సమగ్ర బీసీ కులగణన పూర్తయ్యాకే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలి

### - ప్రముఖ బీసీ నేత తాడిబోయిన హరిప్రసాద్ డిమాండ్



తెనాలి మే29(ప్రభాతవార్త):2027వ సంవత్సరంలో నిర్వహించే సమగ్ర జనగణన లో ఓబీసీ కులగణన వివరాలు శాస్త్రీయ బద్దంగా గెజెట్ నోటిఫై అయిన తరువాత మాత్రమే ఆంధ్రప్రదేశ్ లో స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించేలా రాష్ట్రప్రభుత్వంకు డెడికేటెడ్ కమిషన్ మధ్యంతర నివేదిక ద్వారా సిఫార్సు చేయాలని, తెనాలి నియోజకవర్గ టిఎన్టియుసి అధ్యక్షులు, ప్రముఖ బీసీ సంఘ నాయకులు,తాడిబోయిన హరిప్రసాద్,ఆంధ్రప్రదేశ్ బీసీ కమిషన్ ఛైర్మన్ రాజీవ్ రంజన్ మిశ్రా కు విజ్ఞప్తి చేశారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 25 ఉన్న బీసీ లకు,విద్యా, ఉపాధి రిజర్వేషన్ లను 44 కు పెంచేందుకు రాష్ట్ర ప్రభుత్వానికి కమిషన్ సిఫార్సు చేయాలని కోరారు. ఏపీ బీసీ జాబితాలో ఉన్న ఎస్ఎస్టీ,డిఎస్టీ కులాలను గుర్తించినందున ఆయా కులాలకు ప్రత్యేక రిజర్వేషన్లు కల్పించాలని,ఈ దిశగా కమిషన్ తగు సిఫారసులను చేయాలని కోరారు. ఆంధ్రప్రదేశ్ ర్నాష్టంలో గత దశాబ్దకాలంగా బీసీ ఉద్యోగులకు సీనియారిటీ,ప్రమోషన్లు అమలులో తీవ్రఅన్యాయం జరుగుతోందని హరిప్రసాద్, చైర్మన్ కు ఫిర్యాదు చేసారు. ఏపీ రాష్ట్ర సర్వీస్ లలో బీసీ ఉద్యోగ ప్రాతిన్నిధ్యపై,ప్రమోషన్ ల అమలు తీరుపై సమగ్ర అధ్యయనం,విచారణ జరిపి నివేదిక ఇవ్వాలని హరిప్రసాద్ కోరారు.సుప్రీంకోర్టు మార్గదర్శకాలను అనుసరించి ట్రిబుల్ టెస్ట్ మార్గదర్శకాలు కమిషన్ నివేదికలో ప్రస్ఫుటం అయ్యేలా చర్యలు తీసుకోవాలని హరిప్రసాద్ కోరారు.ఈ సందర్భంగా 9 ప్రధానఅంశాలతో కూడిన వినతిపత్రాన్ని ఆంధ్రప్రదేశ్ బీసీ కమిషన్ చైర్మన్ రాజీవ్ రంజన్ మిశ్రా కు తాడిబోయిన హరిప్రసాద్ అందజేశారు.

## భారీవర్షానికి విరిగిన చెట్లను తొలగించిన మున్సిపల్ యంత్రాంగం



తెనాలి మున్సిపాలిటీ మే29(ప్రభాతవార్త):మున్సిపల్ కమిషనర్ రామ అప్పలనాయుడు,శుక్రవారం పట్టణంలోని పలు ప్రాంతాల్లో పర్యటించారు. పట్టణపరిధిలో గురువారం రాత్రి కురిసిన వర్షం, ఈదురు గాలులకు చెంచుపేట, ఓవర్ బ్రిడ్జి పైన,రామలింగేశ్వరపేట, తో పాటు పలు ప్రాంతాల్లో విరిగి పడిన చెట్లను పరిశీల్నిచారు. యుద్ధ ప్రాతిపదికన జెసిపి, వన విభాగ కార్మికులను పిలిపించి వెంటనే చెట్ల కొమ్మలను నరికించి తీయించారు. చెట్లకొమ్మలను వెంటనే ట్రాక్టర్ ద్వారా తరలించారు.వర్షాలు ఈదురుగాలులు వస్తున్న నేపథ్యంలో శానిటేషన్ ఇంజనీరింగ్ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఆయన సూచించారు. పట్టణంలో ఈదురుగాలులకు ఇంకా ఎక్కడైనా చెట్లు పడి ఉంటే వెంటనే వాటిని తొలగించాలని ఆదేశించారు. ఈదురుగాలులకు చెత్త,చెదారం గాలికి కాలువలలోకి కొట్టుకు వస్తుందని ఈ విషయాన్ని గమనించి మురుగు నీటిపారుదుల కాలువలను పరిశీలించి నీటిపారుదులకు ఆటంకం లేకుండా చూడాలని సూచించారు. కాలువలలో చెత్త, ఇతర వ్యర్థాలు వెంటనే తొలగించాలని అన్నారు.కమీషనర్ వెంట అసిస్టెంట్ ఇంజనీర్ ఆంజనేయరాజు, శానిటేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

## తెనాలిలో,అర్బన్ స్పెషల్ ఆఫీసర్ సలీంబాషా విస్తృత పర్యటన:

తెనాలి మున్సిపాలిటీ మే29(ప్రభాతవార్త): జిల్లా విద్యాశాఖ అధికారి,తెనాలి అర్బన్ స్పెషల్ ఆఫీసర్ సలీం భాషా శుక్రవారం,తెనాలి పురపాలక సంఘ కార్యాలయానికి విచ్చేశారు.అనంతరం కార్యాలయంలో అన్ని సెక్షన్ల ఉన్నతాధికారులతో సమావేశం ఏర్పాటు చేసి వివిధ అంశాలపై చర్చించారు. అనంతరం మున్సిపల్ మేనేజర్ జయకర్, మున్సిపల్ ఇంజనీర్ పినప శ్రీకాంత్ పలువురు అధికారులతో కలిసి, పట్టణంలోని మార్కెట్ ఏరియా,పరిసర ప్రాంతాలలో పర్యటించారు.ఆయన వెంట అసిస్టెంట్ కమిషనర్ జాస్తి రామారావు,మున్సిపల్ ఇంజనీర్ పినప శ్రీకాంత్, మున్సిపల్ మేనేజర్ జయకర్, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ మొవ్వ ఏసుబాబు,ఏవో నీరజాక్ష ప్రసాద్, అసిస్టెంట్ సిటీ ప్లానర్ వాణి, రెవెన్యూ ఆఫీసర్ రాంప్రసాద్ మరియు పురపాలక సిబ్బంది పాల్గొన్నారు.

## జగన్ హయాంలోనే బ్రాహ్మణులకు గుర్తింపు

### - వైసిపి బ్రాహ్మణ నేత పురుషోత్తమశర్మ:



తెనాలి మే29(ప్రభాతవార్త): వైస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి జ్వాలాపురం శ్రీకాంత్ ఆదేశాల మేరకు, వైస్సార్ కాంగ్రెస్ పార్టీ బ్రాహ్మణ విభాగం,నియోజక వర్గాల వారీగా,బ్రాహ్మణులు ఎదుర్కొంటున్న సమస్యలు, మనిఫెస్టోలో పెట్టాల్సిన అంశాల గురించి,బ్రాహ్మణ పెద్దలు,మేధావులు, సూచనలు సలహాలు ఇవ్వవలసిందిగా,వైస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర బ్రాహ్మణ అధ్యయన కమిటీ సభ్యులు పోతావఝుల పురుషోత్తమ శర్మ ఒక ప్రకటనలో కోరారు. ప్రస్తుత సమాజంలో బ్రాహ్మణ్యం అనేక మార్పులు, సవాళ్లు, అపార్థాలు మధ్య తన స్థానాన్ని నిలబెట్టుకునే ప్రయత్నం చేస్తోంది. ఇవి కేవలం ఒక వర్గానికే సంబంధించినవి కాకుండా, సంస్కృతి-ఆధ్యాత్మికత-విలువల పరిరక్షణకు సంబంధించినవి అని పురుషోత్తమ శర్మ పేర్కొన్నారు. వృత్తి మార్పులు -ఆర్థిక అస్థిరత, సాంప్రదాయంగా వేదాధ్యయనం,పౌరోహిత్యం, దేవాలయసేవలు బ్రాహ్మణుల ప్రధాన జీవనాధారాలు.

**బ్రాహ్మణ్యం అంటే కేవలం జన్మ కాదు;**

జ్ఞానం,వినయం, ధర్మాచరణ, సేవాభావం అనే విలువల సమాహారం అని భారతీయ దార్శనికత చెబుతుంది. సమాజంలోని ప్రతి వర్గాన్ని గౌరవిస్తూ, పరస్పర అవగాహనతో ముందుకు సాగుతూ,సంస్కృతి పరిరక్షణ కాపడుతున్న బ్రాహ్మణ్యాన్ని అన్ని విధాలుగా ఆదుకోవాలని కోరారు. ఫీజు రియింబుర్సుమ్మెట్, ఆరోగ్య సేవలు, నిరుద్యోగ భృతి, సామాజిక పెన్షన్స్, విదేశీ విద్య, జిల్లాల వారీగా బ్రాహ్మణ భవన్ లు, నామినేటెడ్ పోస్టుల్లో బ్రాహ్మణ్యానికి తగిన గుర్తింపు గౌరవం ఇవ్వాలని కోరారు. అదే విధంగా త్వరలో జరుగబోవు స్థానిక సమస్యల ఎన్నికల్లో, బ్రాహ్మణ్యానికి ప్రతి మున్సిపాలిటీ, కార్పొరేషన్ లో నాలుగు వార్డ్ లు కేటాయించాలని కోరారు.డాక్టర్ వై ఎస్ రాజశేఖరరెడ్డి హయంలో, మరియు వారి కుమారుడు వైఎస్.జగన్మోహన రెడ్డి హయం లో బ్రాహ్మణ్యానికి తగిన గుర్తింపు,గౌరవం లభించాయని, ప్రస్తుతం ఆ పరిస్థితి లేదని ఆవేదన వ్యక్తం చేశారు.ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు 69వ వర్ధంతి సందర్భంగా, వైస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వైఎస్.జగన్ మోహనరెడ్డి ని, రాష్ట్ర బ్రాహ్మణ సంఘ ప్రతినిధులు కలిసిన విషయాన్ని గుర్తు చేసుకున్నారు.జగన్మోహన రెడ్డి, బ్రాహ్మణుల పట్ల చూపిన ఆదారాభిమానాలు, గౌరవ మర్యాదలు, మర్చిపోలేనివిగా పురుషోత్తమ శర్మ తెలిపారు.

## రైతులు వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చుకోవాలి

### :జిల్లా వ్యవసాయాధికారి పద్మావతి



కొల్లిపర మే29(ప్రభాతవార్త): రైతులు వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారి పద్మావతి పేర్కొన్నారు. శుక్రవారం మండల పరిధిలోని అత్తోట గ్రామంలో పీఎండిఎస్ సాగుపై జిల్లా వ్యవసాయాధికారి పద్మావతి ప్రకృతి వ్యవసాయ ఏడిఏ రాజకుమారితో కలిసి పరిశీలించారు. పిఎండిఎస్ పంటలపై రైతులకు పలు సూచనలు సలహాలను ఇచ్చారు. అనంతరం జిల్లా వ్యవసాయ అధికారి పద్మావతి మాట్లాడుతూ, రసాయనిక ఎరువులను మోతాదుకు మించి వాడటం వలన రైతులకు అధిక దిగుబడి,ఫలసాయం తగ్గిపోతుందని, తద్వారా రైతులు నష్టపోతున్నారని అంతేకాకుండా పంటలకు తెగుళ్ల కూడా ఆశిస్తున్నాయన్నారు. ప్రకృతి వ్యవసాయం ద్వారా పంటలను పండిస్తే నాణ్యమైన దిగుబడులను ఉత్పత్తులను పొందవచ్చు అన్నారు.

ఏడిఏ రాజకుమారి మాట్లాడుతూ ప్రతి రైతు తమ వ్యవసాయ భూముల్లో పిడిఎంఎస్ డబుల్ కిట్లను తప్పనిసరిగా నాటుకోవాలన్నారు. పిడిఎంఎస్ పంటల వలన నేలలో తేమ నిలిచి ఉండటంతో పాటు అధిక ఉష్ణోగ్రతలు వేడిగాలుల ప్రభావం తగ్గుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ అధికారులు అభ్యుదయ రైతులు పాల్గొన్నారు.

## నేడు బాపట్ల మండలంలో ఇంచార్జి మంత్రి పర్యటన

### - వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు

### - సూర్యలంక బీచ్‌లో సాయంత్రం ప్రెస్‌మీట్



బాపట్ల, మే 29: ప్రభాతవార్త ప్రతినిధి: బాపట్ల మండలంలో శనివారం జిల్లా ఇంచార్జి మంత్రి, రాష్ట్ర గృహనిర్మాణ, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి పర్యటించనున్నారు. మండల పరిధిలోని పలు ప్రాంతాల్లో రూపాంతరం చెందిన, నూతనంగా చేపట్టనున్న పలు అభివృద్ధి, సంక్షేమ పథకాల ప్రారంభోత్స వాలు, శంకుస్థాపనల్లో ఆయన పాల్గొంటారని జిల్లా కలెక్టర్ డాక్టర్ వి.వినోద్ కుమార్ శుక్రవారం తెలిపారు. సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మంత్రి పార్థసారథి పర్యటన శనివారం సాయంత్రం నుంచి ప్రారంభం అవుతుందన్నారు. అనంతరం సూర్యలంక బీచ్ వేదికగా మీడియా ప్రతినిధులతో ప్రెస్ మీట్ (పత్రికా విలేకరుల సమావేశం) జరుగుతుందని ఆయన తెలిపారు.ఈ పర్యటనలో ఇంచార్జి మంత్రితో పాటు బాపట్ల నియోజకవర్గ శాసనసభ్యులు (ఎమ్మెల్యే) వేగేశన నరేంద్ర వర్మ రాజు, బాపట్ల పార్లమెంట్ సభ్యులు (ఎమ్మెల్యే) వయా లోకసభ ప్యానెల్ స్పీకర్ తెన్నేటి కృష్ణప్రసాద్, స్థానిక ప్రజాప్రతినిధులు, వివిధ ప్రభుత్వ శాఖల ఉన్నతాధికారులు పాల్గొంటారన్నారు..

## ఆర్‌ఓబీ గోడలపై ఆకర్షణీయ చిత్రాలు



బాపట్ల, మే 29. ప్రభాతవార్తాప్రతినిధి: బాపట్ల కలెక్టరేట్ పరిధిలోని ఆర్‌ఓబీ వంతెన గోడలపై ఏర్పాటు చేస్తున్న ఆకర్షణీయ పెయింటింగ్స్‌ను జిల్లా కలెక్టర్ డాక్టర్ వి. వినోద్ కుమార్ శుక్రవారం పరిశీలించారు. బాపట్లపొన్నూరు ప్రధాన రహదారిలోని వంతెన గోడలపై ఎయిర్ ఫోర్స్ స్టేషన్ ప్రత్యేకత, సూర్యలంక సముద్రతీర అందాలను ప్రతిబింబించేలా చిత్రాలు రూపొందిస్తున్నారు. నగర సౌందర్యం మరింత మెరుగ్గా కనిపించేలా చిత్రాల్లో కొన్ని మార్పులు చేయాలని అధికారులకు సూచించారు.కలెక్టరేట్ మార్గంలో పచ్చదనంకలెక్టరేట్‌కు వెళ్లే ప్రధాన రహదారి పక్కన నిర్మించిన గోడ వెంబడి పెద్ద ఎత్తున మొక్కలు నాటాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. ప్రతి మొక్క మధ్య నాలుగు మీటర్ల దూరం ఉండేలా ప్రణాళికాబద్ధంగా చర్యలు చేపట్టాలని తెలిపారు. మొక్కల సంరక్షణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, వాటికి ట్రీ గార్డులు ఏర్పాటు చేయాలని సూచించారు.పరిశుభ్రతకు ప్రాధాన్యంజిల్లాలోని ప్రముఖ పర్యాటక కేంద్రంగా ఉన్న జీడిపప్పు పరిశోధనాలయ పరిసరాలను ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉంచాలని కలెక్టర్ ఆదేశించారు. పర్యాటకుల సంఖ్య పెరుగుతున్న నేపథ్యంలో పరిశుభ్రతపై నిరంతర పర్యవేక్షణ అవసరమన్నారు.ఈ కార్యక్రమంలో జీడిపప్పు పరిశోధనాలయ ఎంటమాలజీ శాస్త్రవేత్త డాక్టర్ జి. స్రవంతి, మున్సిపల్ డీఈ కృష్ణారెడ్డి, పురపాలక సిబ్బంది పాల్గొన్నారు.

## స్వచ్ఛ స్వర్ణపురిలో అధికారులు కూడా భాగస్వాములు కావాలి

### - మునిసిపల్ కమిషనర్ పిన్నిబోయిన పోతురాజు

పొన్నూరు, మే 29, ప్రభాతవార్త: పొన్నూరు మునిసిపాలిటీని స్వచ్ఛ స్వర్ణపురిగా మార్చేందుకు ప్రజలు, స్వచ్ఛంద సంస్థలు, ప్రజాప్రతినిధులతో పాటు మునిసిపల్ అధికారులు, సిబ్బంది కూడా భాగస్వాములు కావాలని మునిసిపల్ కమిషనర్ పిన్నిబోయిన పోతురాజు పిలుపునిచ్చారు. నిన్న, మొన్నటి వరకు ప్రజలు, ప్రజాప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు. అయితే



శుక్రవారం మాత్రం మునిసిపాలిటీలో వివిధ విభాగాలకు చెందిన అధికారులందరూ ఆపరేషన్ క్లీన్ స్వీప్ కార్యక్రమంలో పాల్గొని రోడ్లను శుభ్రం చేశారు. ఈ సందర్భంగా పోతురాజు మాట్లాడుతూ పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు. పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు మునిసిపాలిటీ పరిధిలో ఉన్న వివిధ విభాగాల అధికారులు కూడా పాల్గొనడం అభినందనీయమన్నారు. స్వచ్ఛందంగా ముందుకు వచ్చి క్లీన్ స్వీప్‌ను విజయవంతం చేయాలన్నారు. పొన్నూరులోన బాపట్ల బస్టాండ్ నుంచి నేతాజీనగర్ అడ్డరోడ్డు వరకు రోడ్లను శుభ్రం చేశారు. రోడ్ల పక్కన ఉన్న చెత్తా చెదారాలను తొలగించారు. వీధుల్లో పేరుకుపోయిన ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించారు. కార్యక్రమంలో పట్టణ ప్రణాళికాధికారి రఘురాం, రెవెన్యూఅధికారి వెంకటేశ్వరరావు,నాయకులు ఆకుల సాంబశివరావు,గురుబాలు,మెప్మా,సచివాలయాల సిబ్బంది పాల్గొన్నారు.

6MN 5 PG-GNT_6MN 5 PG-GNT.qxd 5/30/2026 12:19 AM Page 1



## అమేజాన్ ఫ్యాషన్ వార్డ్ రోబ్ రిఫ్రెష్ సేల్ ప్రారంభం

విజయవాడ, మే 29, ప్రభాతవార్త :అమెజాన్ ఫ్యాషన్ విభాగం మే 28 నుంచి జూన్ 2 వరకు వార్డ్ రోబ్ రిఫ్రెష్ సేల్ నిర్వహిస్తోంది. ఈ సేల్‌లో 1500కి పైగా ప్రముఖ బ్రాండ్లకు చెందిన 4 లక్షలకుపైగా స్టైల్స్‌పై 50 శాతం నుంచి 80 శాతం వరకు తగ్గింపులు అందుబాటులో ఉన్నాయి. రాంగ్, పుమా, మాయబెల్లినే, అమెరికన్ టూరిస్టర్ వంటి బ్రాండ్ల ఉత్పత్తులపై ప్రత్యేక ఆఫర్లు లభిస్తున్నాయి. ప్రైమ్ సభ్యులకు అదనంగా క్యాష్‌బ్యాక్, కూపన్ డిస్కౌంట్లు కూడా ప్రకటించారు. అలాగే ఏఐ ఆధారిత రూఫస్ట్ షాపింగ్ అసిస్టెంట్ అమేజాన్ లెన్స్ వంటి ఫీచర్ల ద్వారా కస్టమర్లు తమకు నచ్చిన ఫ్యాషన్ స్టైల్స్‌ను సులభంగా కనుగొనే అవకాశం కల్పించారు.

## కిడ్నీ జబ్బుతో దళితుడు మృతి



ఎ కొండూరు, మే 29, ప్రభాతవార్త :ఎన్‌టిఆర్ జిల్లా ఎ కొండూరు మండలం చీమలపాడు హరిజనవాడకు చెందిన జంపాని పిచ్చయ్య(45) కిడ్నీ వ్యాధితో బాధపడుతూ శుక్రవారం ప్రభుత్వాసుపత్రిలో మృతి చెందాడు. గత 8 సంవత్సరాలుగా ఈ మహమ్మారి కిడ్నీ జబ్బుకు రూ.5లక్షలు ఖర్చు చేసినా చివరకు ప్రాణం దక్కించుకోలేక పోయామని భార్య పిచ్చమ్మ కన్నీరుమున్నీరుగా విలపించింది. మృతుడు కుటుంబానికి వెంటనే నష్టపరిహారం అందించి ఆదుకోవాలని సిపిఎం పార్టీ మండల కార్యదర్శి పానెం ఆనందరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అలాగే కిడ్నీ ప్రభావిత తండా గ్రామాల్లో జలజీవన్ మిషన్ పథకం ద్వారా అందిస్తున్న కృష్ణాశుద్ధి జలాలను గ్రామ పంచాయతీ పైప్‌లైన్‌తో సంబంధం లేకుండా ప్రత్యేక పైప్‌లైన్ ఏర్పాటు చేసి కృష్ణావాటర్ సరఫరా చేయాలని కిడ్నీ రోగులకు పోషకాహారం ఎ కొండూరులో కిడ్నీ ఆసుపత్రి నిర్మించి ఉచితంగా మందులు పంపిణీ చేసి ఆదుకోవాలని పి.ఆనందరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

## ఫైర్‌స్టేషన్‌లు ఉన్నా ఉపయోగం సున్నా.. అగ్నిబాధితుల ఆక్షేపణ

ఎ కొండూరు, మే 29, ప్రభాతవార్త :ఎన్‌టిఆర్ జిల్లా తిరువూరు మైలవరం నియోజకవర్గాల్లో విస్సన్నపేటలో నామ్‌కేవాస్తేగా ఉన్న ఫైర్‌స్టేషన్లలో పనిచేస్తున్న ఫైర్ ఆఫీసర్లు, సిబ్బంది విధి నిర్వహణలో ప్రదర్శిస్తున్న అలసత్వాన్ని ఆయా మండలాల ప్రజలు అగ్ని బాధితులు విమర్శించారు. తిరువూరు విసన్నపేట మైలవరంలో ఉన్న ఫైర్‌స్టేషన్ ఆఫీసర్లు సిబ్బంది ఏ మాత్రం స్పందించడం లేదని ఒకవేళ స్పందించిన మైలవరం సిబ్బంది విసన్నపేట సిబ్బంది తిరువూరు స్టేషన్‌కు ఫోన్ చేయండని ఉచిత సలహాల వ్యవహారంగా ఉందని వీరు సంబంధిత అగ్నిప్రమాద ప్రాంతాలకు చేరుకునే సరికి ప్రజల ఆస్తి భస్మీపటలమవుతుందని చివరకు ఈ ఫైర్ స్టేషన్‌ల సిబ్బంది వెళ్లే లోపునే బూడిద మిగులుతుందని బాధితులు ఆవేదన చెందుతున్నారు. ఎండాకాలంలో ఏడాదిలో జరిగే అగ్ని ప్రమాదాల నివారణకు కూడా ఆయా ఫైర్ ఆఫీసర్లు స్పందించకపోవడం శోచనీయం ఇకనైనా తిరువూరు విసన్నపేట మైలవరం పట్టణాల్లో ఉన్న ఫైర్ ఆఫీసర్లు సిబ్బంది నిర్లక్ష్య వైఖరిపై తగు చర్యలు తీసుకుని ప్రతి మండల కేంద్రంలో ఫైర్ స్టేషన్ ఏర్పాటు చేసి ప్రజల ఆస్తులను కాపాడాలని నియోజకవర్గ ప్రజలు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

## కీసరలో డ్రగ్స్ దండయాత్ర 2.0" గ్రామసభ...

కంచికచర్ల మే 29 ప్రభాతవార్త: సమాజం నుంచి డ్రగ్స్ మహమ్మారిని తరిమికొట్టేందుకు ప్రతి ఒక్కరూ కదలిరావాలని గంజాయి తదితర మత్తు పదార్థాలకు యువత, గ్రామస్తులు దూరంగా ఉండాలని ఎన్టీఆర్ పోలీస్ కమిషనరేట్ మండలం కీసర గ్రామంలో శుక్రవారం రూరల్ డీసీపీ బి.లక్ష్మీనారాయణ నందిగామ నందిగామ రూరల్ సిఐ వైవీవీఎల్ నాయుడు ఆధ్వర్యంలో గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా రూరల్ డీసీపీ మాట్లాడుతూ గంజాయి తదితర మత్తు పదార్థాలకు సంబంధించిన సమాచారం తెలిసినా వెంటనే పోలీసులు తెలియజేయాలని ప్రజలను కోరారు. డ్రగ్స్ నిర్మూలనలో ప్రజల భాగస్వామ్యం ఎంతో కీలకమని పేర్కొన్నారు. గత కొన్ని రోజులుగా



విజయవాడ పోలీస్ కమిషనరేట్ పరిధిలో నిర్వహిస్తున్న డ్రగ్స్ పై దండయాత్ర 2.0" కార్యక్రమంలో భాగంగా గంజాయి సేవిస్తున్న ఆరిని డ్రగ్ టెస్ట్‌ల ద్వారా గుర్తించి కౌన్సిలింగ్ నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రజలు రోడ్డు భద్రతా నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని, ద్విచక్ర వాహనాదరులు హెల్మెట్ ధరించాలని సూచించారు. అలాగే పోక్సో చట్టం సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణానికి కట్టుబడి ఉంటామని గ్రామస్తులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా కీసర గ్రామాన్ని డ్రగ్స్ రహిత గ్రామం గా గుర్తించినట్లు రూరల్ డీసీపీ ప్రకటించారు. ఈ కార్యక్రమంలో కంచికచర్ల ఎస్సై పి.విశ్వనాథ్, ఎస్సై -2 నాని నరేంద్ర ఏఎస్ఐ నాగేశ్వరరావు పోలీస్ సిబ్బంది గ్రామ నాయకులు పరిటాల రాము, యర్రగొర్ల రామాంజనేయులు, ముక్కుపాటి వేణు, కీసర గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రాణాలకు తెగించి ప్రజలకు వెలుగులు : విద్యుత్ ఉద్యోగుల సాహసం...

- ఈదురు గాలులకు విరిగిన స్తంభాల పునరుద్ధరణ

రేయింబవళ్లు శ్రమించిన కంచికచర్ల మండలం లైన్‌మెన్ సిబ్బంది

కంచికచర్ల మే 29 ప్రభాతవార్త ప్రతినిది: ఈదురు గాలులు వచ్చి వర్షం పడితే 24 గంటలు శ్రమించి మీ ఇళ్లలో వెలుగులు నింపేందుకు మేమున్నాం అంటున్న కంచికచర్ల మండల లైన్‌మెన్ సిబ్బంది. గురువారం కురిసిన భారీ వర్షం ఈదురుగాలులకు విరిగి పోయిన విద్యుత్ స్తంభాలను ప్రాణాలకు తెగించి పునుదర్దరిస్తూ వీరు రియల్ హీరోలుగా నిలిచారు. గురువారం సాయంత్రం కురిసిన కుండపోత వర్షానికి కీసర గండేపల్లి, పెండ్యాల పరిసన ప్రాంతాల్లో పలు విద్యుత్ స్తంభాలు నేరకొరిగాయి. దీంతో మూడుగ్రామాల్లో అంధకారం అలుము కంఉది. విషయం తెలుసుకున్న కీసర లైన్‌మన్‌గోపాలకృష్ణ, గండేపల్లి లైన్‌మన్ నరసింహరావు, పెండ్యాల లైన్‌మన్ నగపి, రామారావు, రవితేజలు వెంటనే స్పందించారు. నేడు మండుటెండను సైతం లెక్క చేయకుండా సిబ్బందితో కలిసి ఫీల్డ్‌లోకి దిగారు. విరిగి పోయిన



స్తంభాలను తొలగించి కొత్త స్తంభాలు ఏర్పాటు చేశారు. స్తంభం పైకి ఎక్కి తీగలు లాగుతూ లైన్ క్లియర్ చేసి, ప్రజలకు విద్యుత్ అంతరాయం కలగకుండా శ్రమించారు. వీరి శ్రమతోశుక్రవారం మద్యాహ్నం సమయానికే మూడు గ్రామాల్లో విద్యుత్ సరఫరా పునరుద్ధరించబడింది. ప్రజలకు 24 గంటలూ అందుబాటులో ఉండటమే మా విధి. ఎండ, వర్షం అని చూస్తే కరెంట్ ఎలా వస్తుంది? పండుగైన పబ్బమైనా లైన్‌లోనే ఉంటాం. అని లైన్‌మెన్‌సిబ్బంది వినమ్రంగా చెబుతున్నారు. కరెంట్‌పోతే నిమిషంలో ఫోన్ చేసే జనం కరెంట్ ఇచ్చేందుకు లైన్‌మన్ పడిన కష్టాన్ని మాత్రం గుర్తించరు. కానీ గోపాలకృష్ణ, నరసింహారావు, గోపి, రామారావు, రవితేజ లాంటి ఉద్యోగుల నిస్వార్థ సేవ వల్లే మన ఇళ్లలో వెలుగులు విరజిమ్ముతున్నాయి. ప్రాణాలకు తెగించి విధులు నిర్వహిస్తూ సేవ చేస్తున్న వీరి సేవలను మూడు గ్రామాల ప్రజలు కొనియాడుతున్నారు.

## 33 శాతం మహిళా రిజర్వేషన్లలో బీసీ మహిళల వాటా తేల్చండి

- కేసన శంకరరావు

మంగళగిరి, మే 29, ప్రభాతవార్త : తెలుగుదేశం పార్టీ మహానాడులో పార్లమెంటు బిల్లుతో సంబంధం లేకుండా పార్టీ పరంగా చట్టసభలలో 33 శాతం మహిళలకు రిజర్వేషన్లు మొట్టమొదటిసారిగా 2029 నుండే ఏపీలో అమలు జరుపుతామన్న చారిత్రరాత్మక నిర్ణయాన్ని ప్రకటించిన జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేష్ కు మహిళా లోకం తరఫున ధన్యవాదాలు తెలియజేస్తూ, ఆ 33 శాతం రిజర్వేషన్లలో బీసీ మహిళల సబ్ కోటా సంగతి తేల్చాలంటూ ఆంధ్ర ప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కేసన శంకరరావు కోరారు. శుక్రవారం స్థానిక మంగళగిరి రాష్ట్ర కార్యాలయంలో జరిగిన మీడియా సమావేశంలో ఆ మేరకు లోకేష్ కు విజ్ఞప్తి చేశారు.ఇంకా వారు 1996 నుండి మహిళా రిజర్వేషన్లలో బీసీ మహిళ ఉపకోటా తేల్చనందుకే కదా ఈ 30 ఏళ్ల పాటు కేంద్రపాలకులు బిల్లును ఆటకెక్కించిందన్నారు. నాటి నుండి నేటి వరకు బిసి మహిళల సబ్ కోటా కోసం గల్లి నుండి ఢిల్లీ వరకు అన్ని ఓబీసీ సంఘాలు మహిళా సంఘాలు ఉద్యమిస్తున్న సంగతి లోకేష్ కి తెలియంది కాదన్నారు. ఎట్టకేలకు 2023 లో 33 శాతం చట్టసభలలో మహిళా రిజర్వేషన్ల బిల్లు చట్టం చేశారే గాని, ప్రధాని నరేంద్ర మోడీ నాయకత్వంలోని ఎన్డీఏ కూటమి ప్రభుత్వం కూడా ఓబీసీ మహిళల సంగతి తేల్చలేదన్నారు. ఎట్టి పరిస్థితులలోనూ బీసీ మహిళలకు సబ్ కోటా ఇవ్వకుండా మహిళా రిజర్వేషన్ చట్టాన్ని అమలు జరపడం బీసీ సమాజానికి ఆమోదయోగ్యం కాదన్నారు. ఆనాడు యుగపురుషుడు అన్న ఎన్టీఆర్ మహిళలకు పురుషులతో సమానంగా ఆస్తి హక్కు కల్పించి దేశానికి దిక్సూచి అయినట్లే, ఈనాడు తండ్రీ కొడుకులైన బాబు లోకేష్ లు చట్టసభలలో మహిళా రిజర్వేషన్లు ప్రకటించి భారత దేశానికే ఆదర్శంగా నిలిచారన్నారు. మహిళల జనాభాలో సగానికి పైగా ఉన్న బీసీ మహిళలకు 33 శాతం మహిళా రిజర్వేషన్లలో 3వ వంతు అనగా 11 శాతం ఉపకోటా కేటాయించి, సంపూర్ణ మహిళా సాధికారితకు తోడ్పడాలన్నారు. ఈ మీడియా సమావేశంలో రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కుమ్మర క్రాంతి కుమార్,రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అన్నవరపు నాగమల్లేశ్వరరావు, రాష్ట్ర యువజన అధ్యక్షులు పారేపల్లి మహేష్, రాష్ట్ర నాయకులు కోలా అశోక్, శివరాం బాబాజీ, మేకా వెంకటేశ్వరరావు, గుంటుపల్లి ఉమామహేశ్వరరావు,ఎం. పూర్ణచంద్రరావు, గుంటూరు జిల్లా నాయకులు ఆలా శివాజీ, తిరువీధుల కిరణ్, జొన్నాదుల వెంకటకృష్ణ, కె ధనుంజయ రావు, దా నా గౌడ్ పలువురు బీసీ నాయకులు పాల్గొని ప్రసంగించారు.

## పుట్టా విశ్వనాథ్ పదవీ విరమణ సంబరాలు



గుంటూరు కల్చరల్,మే 29,ప్రభాతవార్త : స్థానిక గుంటూరు శామలానగర్ డి.డి.జి మరియు స్టాఫ్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ స్టేట్ వింగ్,ఎన్‌సిసి డైరెక్టరేట్ (ఏపి అండ్ టి), గుంటూరులో పుట్టా విశ్వనాథ్ పలు హోదాల్లో పనిచేసి సూపరింటెండెంట్‌గా పదవీ విరమణ చేశారు.కార్యక్రమంలో ముఖ్యఅతిధులుగా ఆంధ్రప్రదేశ్ నాన్ గెజిటెడ్ అధికారుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు అలపర్తి విద్యాసాగర్,ఏపి ఎన్జీవో సంఘం రాష్ట్ర అధ్యక్షులు గారుఘంట సాల శ్రీనివాసరావు అసిస్టెంట్ డైరెక్టర్ ఎన్‌సిసి డైరెక్టరేట్ గుంటూరు రాజశేఖర్ రెడ్డి,ఐపిఆర్ డిపార్ట్ మెంట్ పి.సుదర్శనరావు,జాయింట్ సెక్రటరీ ఏపిఎన్‌జీవో గుంటూరు సయ్యద్ జానీభాషా, ప్రధానకార్యదర్శి యువకళావాహిని,జి.మల్లికార్జునరావు,ఆరాధన ఆర్ట్స్,గుంటూరు డి.తిరుమలేశ్వరరావు, విశ్రాంత బ్రేక్ ఇన్‌స్పెక్టర్ బి.మధుసూదనరావు,శ్రేయోభిలాషులు,స్నేహితులు, కుటుంబ సభ్యులు అనేకమంది పాల్గొని పుట్టా విశ్వనాథ్ తిరుగాడే ఒక లైబ్రరీ అని కొనియాడారు.విద్యాసాగర్ మాట్లాడుతూ ఎన్‌సిసి అంటేనే ఒక క్రమశిక్షణతో కూడిన ఒక సంస్థ అని పుట్టా విశ్వనాథ్ సంస్థ కోసం చేసిన సేవలు అభినందనీయం అని యువతకు స్ఫూర్తిదాయమని అన్నారు.అనంతరం అతిధులు, ఎన్‌సిసి వారు ఘనంగా సత్కరించారు.మధ్యాహ్న విందులో అందరూ పాల్గొన్నారు.

## రవీంద్రభారతిలా... నార్ల ఆడిటోరియం !

- 26 ఏళ్ల కల సాకారం దిశగా ఆడిటోరియం పునర్నిర్మాణం
- గుంటూరుకు సాంస్కృతిక తలమానికంగా నార్ల ఆడిటోరియం
- ప్రజా భాగస్వామ్యంతో పూర్తి కానున్న ప్రతిష్టాత్మక ప్రాజెక్టు

గుంటూరు మే 29 ప్రభాత వార్త ప్రతినిధి : గత 26 సంవత్సరాలుగా అసంపూర్తిగా నిలిచిపోయిన నార్ల వెంకటేశ్వరరావు ఆడిటోరియం పునర్నిర్మాణ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. 1999లో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు శంకుస్థాపన చేసిన ఈ ప్రాజెక్టు, అన్నమయ్య సేవా సమితి ఆధ్వర్యంలో పీపీపీ విధానంలో పూర్తి కానుంది.గుంటూరుకు సాంస్కృతిక, సాహిత్య, కళారంగాలకు కేంద్రబిందువుగా నిలిచేలా ఈ ఆడిటోరియాన్ని అభివృద్ధి చేయనున్నారు. ప్రాజెక్టు పూర్తయిన తర్వాత గుంటూరు నగరానికి ప్రముఖ సాంస్కృతిక వేదిక అందుబాటులోకి రానుండగా, గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్‌కు కనీస హామీ ఆదాయం, రెవెన్యూ



షేరింగ్, లైసెన్స్ ఫీజుల రూపంలో ఆదాయం సమకూరనుంది. నార్ల వెంకటేశ్వరరావు ఆడిటోరియం పునర్నిర్మాణ కార్యక్రమంలో పాల్గొన్న కేంద్ర గ్రామీణాభివృద్ధి , కమ్యూనికేషన్స్ శాఖల సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ మాట్లాడుతూ 26 సంవత్సరాలుగా పూర్తి కాకుండా నార్ల వెంకటేశ్వరరావు ఆడిటోరియం ప్రాజెక్టు నేడు కార్యరూపం దాల్చడం గుంటూరు నగరానికి శుభపరిణామని అన్నారు.దాదాపు రూ.10 కోట్ల నుంచి రూ.15 కోట్ల వరకు వ్యయం చేసి ప్రజల కోసం ముందుకొచ్చిన అన్నమయ్య సేవా సమితి సేవాభావం అభినందనీయమని అన్నారు. సమాజంలో విశ్వసనీయత, సేవా దృక్పథం సంపాదించుకున్న అన్నమయ్య సేవా సమితి ఈ బాధ్యతను స్వీకరించడం సంతోషకరమని అన్నారు.హైదరాబాద్‌కు రవీంద్రభారతి ఎలాగో గుంటూరుకు నార్ల వెంకటేశ్వరరావు ఆడిటోరియం అలాంటి గుర్తింపు పొందాలని ఆకాంక్షి ంచారు. కళా, సాహిత్య, సాంస్కృతిక కార్యక్రమాలకు ఈ ఆడిటోరియం ప్రధాన వేదికగా రూపుదిద్దుకోవాలని కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గల్లా మాధవి మాట్లాడుతూ 25 సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న శ్రీ నార్ల వెంకటేశ్వరరావు ఆడిటోరియం ప్రాజెక్టు నేడు కార్యరూపం దాల్చడం సంతోషకరమని అన్నారు.ఈ ప్రాజెక్టును ముందుకు తీసుకెళ్లేందుకు కౌన్సిల్‌లో 23 సార్లు ప్రతిపాదించి చర్చించడం జరిగిందని గుర్తు చేశారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఈ ప్రాజెక్టుకు కొత్త ఊపు వచ్చిందని అన్నారు.ఇది కేవలం ఆడిటోరియం మాత్రమే కాదు... గుంటూరు నగరానికి సాంస్కృతిక గుర్తింపుగా నిలవబోతోందని అన్నారు. ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ గుంటూరుకు మంచి రోజులు వచ్చాయని 25 సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న శ్రీ నార్ల వెంకటేశ్వరరావు ఆడిటోరియం పూర్తి దిశగా అడుగులు వేయడం సంతోషకరమని అన్నారు నార్ల వెంకటేశ్వరరావు కేవలం గుంటూరుకే కాదు.. దేశానికి తలమానికం. రాజకీయ, సామాజిక, సాంస్కృతిక రంగాల్లో ఆయన సేవలు చిరస్మరణీయమని అన్నారు. పత్రికా సంపాదకుడిగా వృత్తి ధర్మానికి కట్టుబడి నిలిచిన అరుదైన వ్యక్తిత్వం నార్ల వెంకటేశ్వరరావు అని కొనియాడారు.

## మే 31న ..యాదవ మహా ధర్నా..

మంగళగిరి, మే 29, ప్రభాతవార్త :ఈ నెల 31వ తేదీన మంగళగిరిలో యాదవ మహా ధర్నా నిర్వహిస్తున్నామని ఆంధ్రప్రదేశ్ యాదవ సంఘం రాష్ట్ర కార్యదర్శి పాశం శ్రీకృష్ణదేవరాయలు తెలిపారు. యాదవ జాతికి యాదవ కుటుంబ సభ్యులకు అండగా ఆంధ్రప్రదేశ్ యాదవ సంఘం ఉంటుందని భరోసా ఇవ్వటమే మన యాదవ సంఘం లక్ష ్యం అని పేర్కొన్నారు. అందులో భాగంగా ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలో యాదవ కార్పొరేషన్ కు 6000 కోట్ల నిధుల కొరకు, రాజధాని ప్రాంతం లో 10 ఎకరాల భూమిలో 100 కోట్లతో యాదవ భవనం మరియు యాదవ విద్యార్థుల కొరకు హాస్టల్ వసతి గృహ భవన నిర్మాణం కోసం, ఆవులు గేదెలు మేకల కొనుగోలు కోసం హామీ లేని సబ్సిడీ రుణాలు కొరకు డిమాండ్ చేస్తూ మన యాదవ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కుర్రా శ్రీనివాస్ యాదవ్ ఆధ్వర్యంలో మే నెల 31వ తేదీన ఆదివారం అమరావతి రాజధాని ప్రాంతం మంగళగిరిలో జరిగే యాదవ మహా ధర్నా కార్యక్రమంలో వేలాది మంది యాదవ కుటుంబ సభ్యులు పాల్గొని ధర్నాను జయప్రదం చేయవలసిందిగా పాశం శ్రీకృష్ణదేవరాయలు కోరారు. ప్రతి గ్రామంలో ఆంధ్రప్రదేశ్ యాదవ సంఘం కమిటీలు, ప్రతి మండలంలో కనీసం 200 మంది తో కమిటీలు వేసి, యాదవ సంఘం నిర్మాణం బలంగా చేయాలి. ఆ మండ్నల లో నివసిస్తున్న యాదవ కుటుంబ సభ్యుల సమస్య ల పై పోరాటం చేయుటకు మేము చేస్తున్న ప్రయత్నం లో మీరు కూడా భాగస్వామ్యం కావాలని మనవి చేస్తున్నాము. యాదవ కుటుంబ సభ్యుల సమస్య ల పై పోరాటం చేయుటకు ఆంధ్రప్రదేశ్ యాదవ సంఘం అన్నివేళలాఎల్లప్పుడు ముందుంటుందని భరోసా ఇవ్వడమే సంఘం లక్ష ్యం అని పాశం శ్రీకృష్ణదేవరాయలు తెలిపారు.

## విద్యుత్‌శాఖ ఆధ్వర్యంలో కంట్రోల్‌రూమ్ ఏర్పాటు

పొన్నూరు, మే 29, ప్రభాతవార్త: వేసవిలో అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్న నేపథ్యంలో విద్యుత్ లైన్లు, విద్యుత్ నియంత్రికలు దెబ్బతిని విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడే అవకాశం ఉందని, ఈ విషయాన్ని వినియోగదారులు గుర్తించాలని తెనాలి ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ అక్కల సత్యనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. ఎక్కడైనా విద్యుత్ లైన్లు తెగిపడి ఉన్నా, వాటిని తాకకుండా మీ ప్రాంతంలోని ఉపకేంద్రానికి, మీ ప్రాంత విద్యుత్ అధికారికి, డివిజన్ కంట్రోల్ రూమ్ నెంబరు:9440817535కు తెలియజేయాలన్నారు. పొన్నూరు మునిసిపల్ పరిధిలో అంతరాయం ఏర్పడితే అసిస్టెంట్ ఇంజనీర్ సెల్ నెం:9440812320, పొన్నూరు రూరల్ పరిధిలో అసిస్టెంట్ ఇంజనీర్ సెల్ నెం:9440812322,కాకుమాను మండల పరిధిలో అసిస్టెంట్ ఇంజనీర్ సెల్ నెం:9440812323, పెదనందిపాడు మండల పరిధిలో అసిస్టెంట్ ఇంజనీర్ సెల్ నెం:9440812324కు సంప్రదించాలని అక్కల సత్యనారాయణ సూచించారు.

## ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు మౌళిక వసతులు ఏర్పాటు:మండల ప్రత్యేకాధికారి అభినవ్



కొల్లిపర మే29(ప్రభాతవార్త): ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు తగిన మౌలిక వసతులు కల్పిస్తున్నట్లు మండల ప్రత్యేక అధికారి ఎన్ అభినవ్ పేర్కొన్నారు. శుక్రవారం మండల కేంద్రమైన కొల్లిపరలు మన ప్రభుత్వ బడి పిలుస్తోంది కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి అభినవ్ మరియు ఇతర అధికారులు, ఉపాధ్యాయులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా అభినవ్ మాట్లాడుతూ కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యను అందిస్తున్నట్లు అదే విధంగా మౌలిక వసతుల కల్పన పై ప్రత్యేక దృష్టి పెట్టినట్లు తెలిపారు. ఎంపీడీవో విజయలక్ష్మి ్మ మాట్లాడుతూ తల్లిదండ్రులను తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలకు పంపడం వలన అనేక ప్రభుత్వపరమైన ఉపయోగాలు పథకాలు అందుతాయి అన్నారు. ఎంఈఓ శ్రీలక్ష్మి ్మ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్యను అందిస్తున్నట్లు తెలిపారు. ఎంఈఓ ఝాన్సీలత మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రాల్లోని పిల్లలను సమీప ప్రాథమిక పాఠశాలల్లో చేర్పించటానికి ప్రాధాన్యతఇస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవోలు భార్గవ్, దానయ్య పరిపాలనాధికారి కిషోర్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## భారీ వర్షాలతో నేలకొరిగిన వాణిజ్య పంటలు

:ఆందోళన చెందుతున్నరైతులు:

కొల్లిపర మే29(ప్రభాతవార్త): కొల్లిపర మండలంలో గురువారం రాత్రి నుండి శుక్రవారం తెల్లవారుజాము వరకు కురిసిన భారీ వర్షాలు ఈదురు గాలులకు అరటి బొప్పాయి మునగ పంటలు నేలకొరిగాయి. దీంతో అన్నదాతలకు విపరీతమైన పంట నష్టం వాటిల్లింది. మండల పరిధిలోని కొల్లిపర, వల్లభాపురం,మున్నంగి, అన్నవరం, అన్నవరం గౌడ పాలెం,తూములూరు,తదితర గ్రామాల్లోని మెట్ట భూములు సాగుతున్న వాణిజ్య పంటలైన బొప్పాయి అరటి తమలపాకు తోటలు మునగ పంటలకు భారీగా నష్టం వాటిల్లింది.శుక్రవారం ఉద్యానవన శాఖ అధికారి శ్రీ నిత్య పలు గ్రామాల్లోని నేలకొరిగిన పంటలను పరిశీలించి రైతుల పేర్లు నమోదు చేసుకున్నారు. భారీ వర్షానికి రోడ్లన్నీ జలమయమయ్యాయి. ఇన్నాళ్లు ఎండవేడికి బాధపడుతున్న ప్రజలు నేడు కురిసిన వర్షానికి వాతావరణం చల్లబడటంతో ఊపిరి పీల్చుకున్నారు.

## పెంచిన ఎరువుల ధరలను తగ్గించాలి రైతు సంఘాల డిమాండ్



పెదనందిపాడు మే 29(ప్రభాతవార్త) రైతు సంఘం, కౌలు రైతు సంఘం రాష్ట్ర నాయకుల పిలుపులో భాగంగా, శుక్రవారం పెదనందిపాడు మండలం లో ని పుసులూరు లో ,పెంచిన ఎరువుల ధరలను తగ్గించాలని కోరుతూ, రైతు సంఘం కౌలు రైతు సంఘం ఆధ్వర్యంలో ప్రభుత్వ ఉత్తర్వుల ప్రతులను దగ్ధం చేసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కందుల శ్రీనివాసరావు మాట్లాడుతూ, రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర లభించక ,పెట్టిన పెట్టుబడులు రాక ,రైతులు అప్పుల పాలై లబో దిబోమని విలపిస్తుంటే, గోరు జట్ట పై రోకలి పోటులా ఇటీవల కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఎరువుల ధరలను పెంచుతూ ఉత్తర్వులు జారీ చేశాయని , యూరియాపై నియంత్రణ విధించారని, ఇది రైతులకు తీవ్ర నష్టం కలిగిస్తుందని అన్నారు. ఎరువుల ధరలను వ్యతిరేకిస్తూ ఈ నెల 14 వ తేదీన విజయవాడ లోని ఫ్యాక్ట్ ఎరువుల ఫ్యాక్టరీ వద్ద రైతు సంఘం, కౌలు రైతు సంఘాల ఆధ్వర్యంలో నిరసన తెలియజేయడం జరిగిందని తెలిపారు.కాంప్లెక్స్ ఎరువుల బస్తాకు 125 రూ.ల నుండి 300 వరకు పెంచడం అన్యాయమని అన్నారు. ఎరువుల బ్లాక్ మార్కెట్ ను అరికట్టి , సహకార సంఘాల ద్వారా 50 శాతం సబ్సిడీ పై రైతులకు ఎరువులు అందించి ఆదుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమం లో టి.నాగేశ్వరరావు, టి..ప్రభాకరరావు,వై.వీరాంజనేయులు, ఎల్.నాగేశ్వరరావు, ఎస్. పున్నయ్య, డి.సుందరరావు తదితరులు పాల్గొన్నారు.

## కమ్యూనికేషన్ సామర్థ్యాలను అభివృద్ధి చేసుకోవాలి..

వట్టిచెరుకూరు, మే 29, ప్రభాతవార్త: కిషోరి బాలబాలికలందరు కమ్యూనికేషన్ సామర్థ్యాలను అభివృద్ధి చేసుకోవడంలో ముందుండాలని వట్టిచెరుకూరు, పుల్లడిగుంట ఐసిడిఎస్ సెక్టార్ సూపర్వైజర్లు మాధవి, చిన్నమ్మాయి పేర్కొన్నారు. మండలంలోని పుల్లడిగుంట, వట్టిచెరుకూరు సెక్టార్ పరిధిలోని అన్ని అంగన్ వాడి కేంద్రాలలో శుక్రవారం కిషోరి వికాసం వేసవి శిక్షణ తరగతుల్లో భాగంగా సెషన్9 విద్యా మరియు కెరీర్ ప్రాముఖ్యతపై కిషోరి బాలబాలికలకు అవగాహన సదస్సులు నిర్వహించారు. ఈ సదస్సులో ఐసిడిఎస్ సూపర్వైజర్లు చిన్నమ్మాయి, మాధవి ముఖ్య అతిథులుగా పాల్గొని మాట్లాడుతూ.. నైపుణ్యాలను మెరుగుపరచడం కోసం



బాలబాలికలకు ఆచరణాత్మక దిశానిర్దేశం అందించి, వారి కమ్యూనికేషన్ సామర్థ్యాలను, విద్యను అభివృద్ధి చేయడమే కిషోర్ వికాసం వేసవి శిక్షణ తరగతుల ప్రాముఖ్యం అన్నారు. ముఖ్యంగా నైపుణ్యాలు, వ్యక్తిత్వ లక్షణాలు, గుణాలు మరియు వ్యక్తిగత ప్రవర్తన, తదితర విషయాలలో చాలా జాగ్రత్తలు పాటించాలని సూచించారు. కొన్ని అవంతరాల వలన విద్య ఆగిపోయిన వారికి దూరవిద్య ద్వారా చదువును కొనసాగించే అవకాశం ప్రభుత్వం కల్పించిందని, దానిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మహిళా సంరక్షణ కార్యదర్శిలు విక్టోరియా, లక్ష్మీ ్మపార్వతి, అంగన్వాడీ కార్యకర్త సుజాత, హెల్పర్లు పాల్గొన్నారు.

## వ్యవసాయ శాస్త్రవేత్తల సూచనల మేరకు ఎరువులను వాడాలి

: ఆత్మ పిడి వెంకటేశ్వర్లు.



వట్టిచెరుకూరు, మే 29, ప్రభాతవార్త : వ్యవసాయ శాస్త్రవేత్తల సూచనల మేరకు రైతులు తమ పంట భూములలో ఎరువులను వాడుకోవాలని ఆత్మ ప్రాజెక్ట్ డైరెక్టర్ జి.వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. గుంటూరు జిల్లా, పెదకాకాని మండలం, నంబూరు గ్రామ రైతు సేవ కేంద్రంలో వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ ఆధ్వర్యంలో గురువారం ఎరువుల వాడకం, ఎరువు కార్డులపై రైతులకు అవగాహన సదస్సు జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆత్మ పిడి వెంకటేశ్వర్లు హాజరై మాట్లాడుతూ..రైతులందరూ యూరియాను అవసరానికి మించి వాడరాదని, వ్యవసాయ శాస్త్రవేత్తలు సూచనల మేరకు తగు మోతాదులో వాడాలని సూచించారు. యూరియాను ఎక్కువగా వినియోగించడంతో భూములు చౌడుబారీ నిస్సారంగా అయ్యే ప్రమాదం ఉందన్నారు. యూరియాకు బదులుగా నానో ఎరువులైన నానో యూరియా, డిఏపిను వాడుకోవాలని తెలిపారు. అలాగే బయో ఎరువులైన పీఎస్బీ, కేఆర్బీ ఎరువులను దుక్కిలో వాడుకోవచ్చని పేర్కొన్నారు. గుంటూరు డివిజన్ అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్ అధికారి ఎన్.మోహన్రావు మాట్లాడుతూ రాబోయే ఖరీఫ్ సీజన్లో ఎరువుల పంపిణీలో రైతులకు ఎరువుల కార్డు ఇవ్వటం జరుగుతుందన్నారు. ఎరువుల కార్డు లేని రైతులకు ఎరువులు ఇవ్వబడవని తెలిపారు. కావున రైతులందరు ఎరువుల కార్డు తప్పనిసరిగా తీసుకోవాలని వివరించారు. అనంతరం రైతులకు ప్రకృతి సేద్యానికి సంబంధించిన పీయండీఎస్ కిట్లు, పచ్చిరొట్ట ఎరువులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నీటిసంఘ ప్రెసిడెంట్ జొన్నల మురళీకృష్ణారెడ్డి,రైతుసేవా కేంద్రాల సిబ్బంది, స్థానిక ఆదర్శ రైతులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

## వైకాపా శవ రాజకీయాలు మానుకోవాలి..

- టిడిపి మండల అధ్యక్షుడు సాంబశివరావు.

వట్టిచెరుకూరు, మే 29, ప్రభాతవార్త : వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ శవ రాజకీయాలు మానుకోవాలని మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు మర్రి సాంబశివరావు హితవు పలికారు. ఈ సందర్భంగా మండల పార్టీ అధ్యక్షులు మర్రి సాంబశివరావు శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ మండలంలోని శివారు గ్రామం కారంపూడిపాడులో చందు వెంకటేశ్వరరావుకు పింఛన్ ఆపడం వల్లే మరణించాడని వైకాపా ఆరోపించడం సరికాదని విమర్శించారు. గతంలో మృతుడు వెంకటేశ్వరరావు తనకున్న ఆర్థిక, రాజకీయ, స్థానిక బలంతో అక్రమంగా సదరం సర్టిఫికెట్ పుట్టించుకుని పింఛన్ పొంది తున్నానని, విచారణ



అధికారుల ఎదుట స్వయంగా అంగీ కరించారని వెల్లడించారు. ఏ వైద్యశాలలోనూ ఆయన వైద్యసాయం పొందలేదని పేర్కొన్నారు. కారంపూడిపాడు గ్రామానికి చెందిన సందు వెంకటేశ్వరరావు మరణం గురించి సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారం వైసిపి నాయకుల కుట్రని, ఆధారాలు లేని అద్భుత కల్పనని, గతంలో దొడ్డిదారిలో సదరన్ సర్టిఫికెట్ పొందారని, అతనికి ఎటువంటి కిడ్నీలకు సంబంధించిన వ్యాధి లేకపోయినా ప్రభుత్వాన్ని, ప్రభుత్వ అధికారులను మోసం చేస్తూ అక్రమంగా పెన్షన్ పొందుతున్నాడని వివరించారు. ఈ విషయమై గ్రామానికి చెందిన మా పార్టీ నేతలు కొందరు విచారించమని స్పందనలో అర్జీ ఇవ్వడం జరిగిందన్నారు. ఇతనితో పాటు గ్రామానికి చెందిన మరి కొంతమందిపై కుడా ఫిర్యాదు చేయడం జరిగిందని వెల్లడించారు. వెంకటేశ్వరరావు రెండు రోజుల క్రితం డయాలసిస్ వ్యాధితో గుంటూరు ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతూ మరణించాడని గ్రామానికి చెందిన కొందరు వ్యక్తులు సోషల్ మీడియాలో అసత్య ప్రచారాలు చేయటం జరిగిందన్నారు. విలేకరుల సమావేశంలో ప్రతిపాడు నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షులు నాగిశెట్టి నాగరాజు, వట్టిచెరుకూరు, కారంపూడిపాడు గ్రామ టిడిపి అధ్యక్షులు ఏదుపాటి శివయ్య, శ్రీను, తదితర టిడిపి నేతలు కార్యకర్తలు పాల్గొన్నారు.

## నిరంతర సామాజిక పోరాట యోధుడు మందకృష్ణ మాదిగ

- స్వర్ణాంధ్ర ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు ఏసుబాబు మాదిగ

గుంటూరు విద్య మే 29 ప్రభాతవార్త: దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా కల్పించాలనే ప్రధాన డిమాండ్తో ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు పద్మశ్రీ కృష్ణ మాదిగ చేస్తున్న అలుపెరగని పోరాటం దళిత జాతుల రాజ్యాధికార పోరాటానికి మరో నిదర్శనం అని , దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా అంశంపై కృష్ణ మాదిగ రూపొందించిన నివేదికను“జస్టిస్” కేజీ బాలకృష్ణన్ ను న్యూఢిల్లీలో కలిసి అందించడం దళిత క్రైస్తవులలో ఆత్మవిశ్వాసాన్ని నింపుతుందని స్వర్ణాంధ్ర ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు ఏసుబాబు మాదిగ పేర్కొన్నారు. దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా కల్పించే అంశంపై అధ్యయనం చేయడం కోసం కేంద్ర ప్రభుత్వం చేత నియమించబడినటువంటి ప్రత్యేక కమిటీ చైర్మన్ జస్టిస్ కేజీ బాలకృష్ణన్ కి న్యూఢిల్లీలో ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు పద్మశ్రీ మందకృష్ణ మాదిగ తన నివేదికను సమర్పించడం దళిత క్రైస్తవులలో ఆనందాన్ని నింపుతుందన్నారు. 200 పైగా పేజీలతో కూడిన ఈ నివేదికలో దళిత క్రైస్తవులకు సంబంధించిన విద్యా,వైద్య, సామాజిక ,సాంస్కృతిక , ఆర్థిక పరిస్థితులను పేర్కొంటూ వారికి ఎస్సీ హోదా మరియు రాజ్యాంగ హక్కులను కల్పించాలని కమిటీకి ఎం ఆర్ పి ఎస్ తరుపున విజ్ఞప్తి చేశారనీ ఆయన పోరాట సేవలు నిరంతరం దళిత సమాజానికి దళిత జాతికి ఎంతో అవసరమని ఏసుబాబు మాదిగ ప్రశంసల జల్లు కురిపించారు. దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా దక్కేంతవరకు స్వర్ణాంధ్ర ఎమ్మార్పీఎస్ మద్దతుగా నిలుస్తుందని ఏసుబాబు మాదిగ పేర్కొన్నారు.

## జనగణన ప్రక్రియ నూరు శాతం పూర్తవ్వాలి

: జిల్లా జనగణన అధికారి డాక్టర్ జగన్నాధపూరి

కొల్లిపర మే29(ప్రభాతవార్త): కొల్లిపర మండలంలో జన గణన ప్రక్రియ నూరు శాతం పూర్తవ్వ టానికి ఎన్యూమరేటర్ లదే బాధ్యతని జిల్లా జనగణన అధికారి డాక్టర్ జగన్నాధపురి పేర్కొన్నారు. శుక్రవారం మండల కేంద్రం కొల్లిపర తహసీల్దార్ కార్యాలయంలో ఎన్యూమరేటర్లతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఏఎస్ఓ మనోహర్ రెడ్డి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా జగన్నాధ పూరి మాట్లాడుతూ జనగణన పై ప్రజలకు అవగాహన కల్పించాలని, జనగణన వివరాలను పక్కాగా నమోదు చేయించాలన్నారు. ప్రతి ఇంటిని సందర్శించి,కుటుంబ సభ్యుల వివరాలు, విద్య,ఉపాధి, నివాస పరిస్థితులు, తదితర అంశాలను నమోదు చేయాలన్నారు.



మెట్లపూజలు నిర్వహిస్తున్న భక్తులు

## దుర్గమ్మ ఆలయంలో భక్తుల రద్దీ

**ఇంద్రకీలాద్రి, మే 29 ప్రభాతవార్త:** దుర్గమ్మని దర్శించుకోడానికి శుక్రవారం భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. వారికి త్వరితంగా దర్శనమయ్యేలా చైర్మన్ రాధాకృష్ణ, ఇఒ వికె శీనా నాయక్, పాలకమండలి సభ్యులు చర్యలు తీసుకున్నారు. క్యూలైన్లలో భక్తులకు మంచినీరు, మజ్జిగ పంపిణీ చేశారు.

**నిత్యాన్నదాన పథకానికి విరాళం:** దుర్గమ్మ ఆలయంలో జరుగుతున్న నిత్యాన్నదాన పథకానికి విజయవాడకు చెందిన జి హరిబాబు తమ కుటుంబం తరఫున రూ.1,01,116ల విరాళాన్ని శుక్రవారం అందించారు. దాతలకు దుర్గమ్మ చిత్రపటం, ప్రసాదం, శేషవస్త్రం అందించారు. వేదపండితులు వేదాశీర్వచనాలు పలికారు.

**దుర్గమ్మ సేవలో విఐపిలు:** దుర్గమ్మని శుక్రవారం పలువురు విఐపిలు దర్శించుకున్నారు. రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి హరిహర నాద శర్మ, చత్తీస్‌ఘడ్ ప్రధాన న్యాయమూర్తి రమేష్ కుమార్ సిన్హా, రాష్ట్ర మంత్రి ఎస్.సవిత దర్శించుకున్నారు. వారికి దుర్గమ్మ చిత్రపటం, ప్రసాదం, శేషవస్త్రం అందించారు. వేదపండితులు వేదాశీర్వచనాలు పలికారు.





చత్తీస్‌గఢ్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి రమేష్‌కుమార్ సిన్హాకి, ఎపి హైకోర్టు జడ్జి హరిహరనాథశర్మకి దుర్గమ్మ చిత్రపటం అందిస్తున్న దృశ్యం

## మహానాడులో టిడిపికి భారీగా విరాళాలు

**విజయవాడ, మే 29 ప్రభాతవార్త ప్రతినిధి:** తెలుగుదేశం పార్టీ మహానాడు వైభవంగా జరిగింది. అయితే ప్రతి ఏడాది నిర్వహించే మహానాడును ఈ ఏడాది పొదుపు చర్యల్లో భాగంగా హైబ్రిడ్ పద్ధతిలో నిర్వహించారు. రెండు రోజుల పాటు సాగిన మహానాడు గురువారం ముగిసింది. అయితే ప్రతి ఏడాది మాదిరిగానే మహానాడులో పలువురు నేతలు పార్టీకి విరాళాలు అందజేశారు. ఈ ఏడాది కూడా టిడిపికి మహానాడు సందర్భంగా భారీగా విరాళాలు అందాయి. రెండు రోజులప ఆటు నిర్వహించిన మహానాడులో టిడిపి రూ.25.61 కోట్ల విరాళాలు అందాయి. తొలిరోజైన బుధవారం రూ.13.17 కోట్లు వచ్చాయి. పార్టీ నేతలు, కార్యకర్తల అభిమానులు ఈ విరాళాలు అందజేశారు. దాతలు పేర్లను సీఎం చంద్రబాబు మహానాడు వేదికగా ప్రకటించారు. ఈ సందర్భంగా వారిని అభినందించారు.అయితే మహానాడులో అత్యధికంగా విరాళం అందించినవారిలో ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి దంపతులు నిలిచారు. ఒక్క వేమిరెడ్డి దంపతులే రూ.5 కోట్లు విరాళంగా అందించారు. ఈ ఏడాది మహానాడులో అత్యధిక విరాళం అందించింది వీరే, తొలి రోజు అత్యధిక విరాళాలు అందించినవారిలో ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి రూ.1.50 కోట్లు రాజ్యసభ సభ్యుడు సానా సతీశ్ రూ.1.50 కోట్లు ప్రకటించారు. మంత్రులు టీజీ భరత్ రూ.కోటి, బీసీ జనార్దన్‌రెడ్డి రూ.కోటి తెదేపా రాష్ట్ర ఉపాధ్యక్షుడు భాష్యం రామకృష్ణ రూ.కోటి విరాళం ఇచ్చారు.

## కెఎన్‌ఆర్ బ్యాంకు లావాదేవీలపైనా విచారణ

- స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభి

**విజయవాడ, మే 29 ప్రభాతవార్త ప్రతినిధి:** గతంలో జగన్‌కు పిఎగా పనిచేసిన కెఎన్‌ఆర్‌కు సంబంధించిన బ్యాంకు ఖాతాలు లావాదేవీలు చేస్తూ అవాక్కవాల్సి ందేనని స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్ అన్నారు. ఎవరి ఖాతాల్లోకి ఎన్ని రూ.కోట్లు వెళ్లాయో ఒక్కొక్కటీ బయటకు వస్తున్నాయని తెలిపారు. మంగళగిరిలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ పి4 పథకం ద్వారా పేదలను ఆదుకునేందుకు సిఎం చంద్రబాబు ఆలోచన చేశారని అన్నారు. గొడ్డలి పార్టీకి కూడా ఒక పి4 ఉందని, అదే పవన్, ప్రాపర్టీ, పైసా, పార్ట్‌నర్‌షిప్ అని ఎద్దేవా చేశారు. అడ్డగోలుగా ఆస్తులు సంపాదించడం. ఖజానాలో సొమ్ములు నింపుకోవడమే గొడ్డలి పార్టీ పి4. పవన్, ప్రాపర్టీ, పైసా, పార్ట్‌నర్‌షిప్ ద్వారా అనేక మంది లబ్ధిపొందారు. కెఎన్‌ఆర్ భార్యకు సంబంధించిన బ్యాంకు ఖాతా పరిశీలిస్తే రూ.20 కోట్ల లావాదేవీలు జరిగాయి. ఒక సాధారణ పీఏ అర్ధాంగి బ్యాంకు ఖాతాలోకి రూ.20 కోట్లు ఎలా వచ్చాయో చెప్పాలి. తిరుపతి, జగ్గయ్యపేట, దర్శి, బోగాపురం ప్రాంతాల్లో ఎకరాలకు ఎకరాలే ఉన్నాయి. బెంగళూరు, హైదరాబాద్, విజయవాడ, కడప, తిరుపతిలో హైక్లాస్ అపార్టుమెంట్లు, విల్లాలు ఉన్నాయి. ఆంధ్రా తెలంగాణ, కర్ణాటకలో ఆస్తులు విస్తరించాయి. జర్నలిస్టుగా ఉంటూ చిన్న వ్యాపారాలు చేసి సంపాదించారని బకాయిస్తున్నారు. సొంత ఇల్లు కూడా లేని సీనియర్ జర్నలిస్టులు వందలమంది ఉన్నారు. సాధారణ పిఏగా ఉన్న వ్యక్తి ఇన్ని కోట్లు బంగారం ఎలా సంపాదించారు. రూ.కోట్ల ఆస్తులు ఎలా సంపాదించారని బుకాయిస్తున్నారు. సొంత ఇల్లు కూడా లేని సీనియర్ జర్నలిస్టులు వందలమంది ఉన్నారు. సాధారణ పిఏగా ఉన్న వ్యక్తి ఇన్ని కోట్లు బంగారం ఎలా సంపాదించవచ్చో నేర్పించేందుకు కెఎన్‌ఆర్ ట్రైనింగ్ సెంటర్ పెట్టుకోవచ్చు అని పట్టాభి విమర్శించారు.

# విద్యార్థుల భద్రతకోసం వసతి గృహాల్లో సిసికెమేరాలు

- సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా బాలవీరాంజనేయస్వామి

**విజయవాడ, మే 29 ప్రభాతవార్త:** ప్రభుత్వ వసతి గృహాల్లో ఉంటున్న విద్యార్థినీవిద్యార్థుల భద్రత కోసం వసతి గృహాల్లో సిసికెమెరాలు ఏర్పాటు చేస్తున్నట్లు సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి తెలిపారు. ఇటీవల వెల్లడైన ఇంటర్, పదవ తరగతి పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనవరచిన సంక్షేమ వసతి గృహాలు, గురుకుల విద్యాలయం వసతి గృహాల్లోని విద్యార్థులకు విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో శుక్రవారం సన్మానం చేసారు. ఈకార్యక్రమానికి ముఖ్యఅతిధిగా హాజరైన మంత్రి మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ విద్యార్థులను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం అన్ని విధాల సహకరిస్తుందన్నారు. వసతి గృహాల్లో మెరుగైన వసతుల కల్పనకు పెద్ద ఎత్తున నిధులు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. ఎస్సి, ఎస్టీ, బిసి విద్యార్థులను ఉన్నత శిఖరాలకు చేర్చటమే తమ ప్రభుత్వ లక్ష్యమని, ఇందుకోసం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్ని విధాల సహకరిస్తున్నట్లు చెప్పారు. వెనుకబడిన సామాజికవర్గాలకు చెందిన పేదవిద్యార్థులకు నాణ్యమైన




విద్యార్థులను సత్కరిస్తున్న మంత్రి

విద్యను అందించేందుకు ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషిచేస్తున్నట్లు మంత్రి వివరించారు. వసతి గృహాల్లో శానిటేషన్, నాణ్యమైన ఆహారం, వసతుల మెరుగుదలపై ప్రతివారం ముఖ్య మంత్రి సమీక్ష నిర్వహిసు _న్నట్లు తెలిపారు. నారా లోకేష్ ప్రవేశపెట్టిన 100 రోజుల యాక్షన్ ప్లాన్ ఫలితంగా గురుకులాలు, హాస్టళ్ళలో చదువుతున్న విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలు సాధించారని మంత్రి వివరించారు. రాష్ట్ర వ్యాప్తంగా 3.53లక్షల మంది ఎస్సీ విద్యార్థులకు రూ.917కోట్లు, 2.51 లక్షల మంది ప్రిమెట్రిక్ విద్యార్థులకు రూ.320 కోట్లు విడుదల చేసినట్లు తెలియచేసారు. విద్యార్థుల భద్రత కోసం వసతి గృహాల్లో సిసికెమెరాలు ఏర్పాటు చేయటంతో పాటు శానిటేషన్ కోసం అవుట్‌సోర్సింగ్ వ్యవస్థ, ఆరోగ్యపరిరక్షణకోసం ఆధునిక సేవలను అందుబాటులోకి తెచ్చినట్లు మంత్రి వివరించారు. ఐఐటి, నీట్ కోచింగ్ కేంద్రాల సంఖ్యను 10కు పెంచి కొత్తగా ఎక్సలెన్స్ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ఈఏడాది 187మంది విద్యా ర్థులు వివిధ జాతీయస్థాయి ప్రవేశ పరీక్షల్లో అర్హత సాధించారని మంత్రి డోలా వివరించారు. ఈసందర్భంగా ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు నగదుబహుమతులు, మోమెంటోలు అందించి సత్కరించారు. ఉత్తమ ఫలితాలు సాధించిన ప్రిన్సిపాళ్ళు, ఉపాధ్యాయులను సత్కరించారు. ఈకార్యక్రమంలో సాంఘీక గిరిజన సంక్షేమశాఖ కార్యదర్శి యం.యం.నాయక్, ఏపిఎస్‌డబ్ల్యుఆర్ఈఐఎస్ కార్యదర్శి ప్రసన్నవెంకటేష్, సాంఘీక సంక్షేమశాఖ డైరెక్టర్ బి.లావణ్యవేణి, తదితరులు పాల్గొన్నారు.

## పోగొట్టుకున్న ఫోన్లు తిరిగి చేతికి

- 570 మొబైళ్లను బాధితులకు అందజేసిన పోలీసులు



**నెల్లూరు క్రైం, మే 29 ప్రభాతవార్త:** పోలీస్ శాఖ ప్రజలకు మరింత చేరువ కావాలనే లక్ష్యంతో పనిచేస్తోందని జిల్లా ఎస్పీ డా.అజిత వేజెండ్ల తెలిపారు. శుక్రవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో పోగొట్టుకున్న, చోరీకి గురైన రూ.1 కోటి 14 లక్షల విలువ గల 570 మొబైల్ ఫోన్లను రికవరీ చేసి బాధితులకు స్వయంగా అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఇప్పటివరకు తొమ్మిది విడతలలో మొత్తం 5010 మొబైల్ ఫోన్లను రికవరీ చేసి బాధితులకు అప్పగించినట్లు వెల్లడించారు. వీటి విలువ సుమారు రూ.10 కోట్లు ఉంటుందని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సిఈఐఆర్ పోర్టల్ ప్రజల విశ్వాసాన్ని సంపాదిస్తూ సమర్థవంతంగా పనిచేస్తోందన్నారు. జిల్లా సైబర్ క్రైమ్ బృందం, స్థానిక పోలీసులు సమన్వయంతో పనిచేస్తూ ఇతర జిల్లాలు, ఇతర రాష్ట్రాల్లో ఉన్న మొబైల్ ఫోన్లను కూడా ట్రేస్ చేసి బాధితులకు తిరిగి అందిస్తున్నామని పేర్కొన్నారు. ప్రస్తుతం ప్రతి వ్యక్తి జీవితంలో మొబైల్ ఫోన్ కీలక సాధనంగా మారిందని, వ్యక్తిగత సమాచారం, బ్యాంకింగ్ సేవలు, విద్య, ఉద్యోగాలు, వ్యాపార కార్యకలాపాలు అన్నీ మొబైల్ ఫోన్ ద్వారానే జరుగుతున్నాయని చెప్పారు. ఫోన్ పోగొట్టుకున్నప్పుడు ప్రజలు తీవ్ర ఆందోళనకు గురవుతారని, అలాంటి ప్రతి బాధితుడికి అండగా నిలవడమే పోలీస్ శాఖ లక్ష్యమన్నారు. మొబైల్ ఫోన్ పోగొట్టుకున్న వెంటనే సిఈఐఆర్ పోర్టల్‌లో ఫిర్యాదు నమోదు చేయాలని సూచించారు. ఐఎంఈఐ నంబర్, మొబైల్ కొనుగోలు బిల్ లేదా బాక్స్, గుర్తింపు కార్డు, కంప్లైంట్ కాపీ, ఓటిపి కోసం కొత్త మొబైల్ నంబర్ వంటి వివరాలతో ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. బస్టాండ్లు, రైల్వే స్టేషన్లు వంటి ప్రాంతాల్లో తక్కువ ధరలకు మొబైల్ ఫోన్లు అమ్మే వారిపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. బిల్లులు లేకుండా విక్రయించే మొబైల్ ఫోన్లను కొనుగోలు చేయవద్దని, సెల్‌ఫోన్ దుకాణాల నిర్వాహకులు సరైన ఆధారాలు లేకుండా సెకండ్ హ్యాండ్ ఫోన్లను కొనుగోలు చేయరాదని సూచించారు. అనుమానాస్పద వ్యక్తులు లేదా మొబైల్ విక్రయాలపై సమీప పోలీస్ స్టేషన్ లేదా డయల్ 100/112కు సమాచారం అందించాలని కోరారు. పోగొట్టుకున్న సెల్ ఫోన్లను రికవరీ చేసి బాధితులకు అందించడంలో ప్రతిభ కనబరిచిన అన్ని ఎస్‌హెచ్ఓ, సైబర్ విభాగం సీఐ యం. పూర్ణ చంద్రరావు, డిసిఆర్బి సీఐ రామారావు తదితర సైబర్, సోషల్ మీడియా బృందాన్ని జిల్లా ఎస్పీ అభినందించారు. సాంకేతిక పరిజ్ఞానంలో నైపుణ్యం కలిగిన పోలీస్ అధికారులు, సిబ్బందితో ప్రత్యేక బృందం నిరంతరం పనిచేస్తోందన్నారు. తమ పోగొట్టుకున్న మొబైల్ ఫోన్లు తిరిగి లభించడంతో బాధితులు జిల్లా పోలీస్ శాఖకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.

## కర్ణాటక మాజీ మంత్రి వెంకటరమణప్ప కన్నుమూత





**పావగడ, మే 29 ప్రభాతవార్త:** తుమకూరు జిల్లా పావగడ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు మాజీ మంత్రి వెంకట రమణప్ప(80) శుక్రవారం తెల్లవారుజామున గుండెపోటుతో మృతి చెందారు. కొద్ది రోజుల క్రితం నుంచి అనారోగ్యంతో ఉన్న వెంకట రమణప్పను చికిత్స కోసం బెంగళూరులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించగా ఆసుపత్రిలోనే శుక్రవారం తెల్లవారుజామున కన్నుమూశారు. మాజీ మంత్రి వెంకటరమణప్పకు భార్య శారదమ్మ కూడా ఆరు సంవత్సరాల క్రితమే అనారోగ్యంతో మృతి చెందారు. ఇతనికి ఇద్దరు కుమారులు, ఒక కూతురు ఉన్నారు. ప్రస్తుతం చిన్న కుమారుడు హెచ్‌వి వెంకటేష్ పావగడ ఎమ్మెల్యేగా పనిచేస్తున్నారు. ఇకపోతే.. సామాన్య కార్యకర్తగా కాంగ్రెస్ పార్టీలో చేరి పొన్న సముద్రం గ్రామపంచాయతీ మెంబర్ గా, మరదానసహల్లి విఎస్ఎస్ఎన్ సొసైటీ అధ్యక్షునిగా పనిచేసి అంచెలంచెలుగా ఎదుగుతూ పార్టీలో గుర్తింపు తెచ్చుకొని నాలుగు సార్లు ఎమ్మెల్యేగా, రెండుసార్లు మంత్రిగా పనిచేసి పార్టీలో తిరుగులేని నాయకుడిగా తనదైనశైలిలో ప్రత్యేక గుర్తింపు పొందారు. 1989లో మొదటిసారి ఎమ్మెల్యేగా గెలుపొందారు. 1999లో రెండవసారి ఎమ్మెల్యేగా గెలుపొందారు. 2008లో కాంగ్రెస్ పార్టీ నుంచి టిక్కెట్ దక్కకపోవడంతో స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసి విజయం సాధించారు. అప్పటి ముఖ్యమంత్రి బి.ఎస్ యడియూరప్ప బిజెపి ప్రభుత్వంలో మొదటిసారిగా మంత్రి పదవి చేపట్టి చిన్న పరిశ్రమల శాఖ, పట్టు పరిశ్రమ శాఖ మంత్రిగా పనిచేశారు. 2018లో కాంగ్రెస్ పార్టీ నుంచి ఎమ్మెల్యేగా గెలుపొంది హెచ్‌డి కుమారస్వామి నేతృత్వంలో ఏర్పడిన కాంగ్రెస్ జెడిఎస్ కూటమి ప్రభుత్వంలో కార్మిక శాఖ మంత్రిగా కొద్ది నెలలు పనిచేశారు. పావగడ పట్టణంలోని గురుభవన మైదానంలో మాజీ మంత్రి వెంకటరమణప్ప పార్థీవ దేహాన్ని ప్రజలు అంతిమదర్శనం పొందారు. వెంకటరమణప్ప అభిమానులు కన్నీటి పర్యంతమయ్యారు. శనివారం సొంత గ్రామం హనుమంతుని పల్లిలో అంతిమ సంస్కారాలు నిర్వహించనున్నారు. మాజీ మంత్రి వెంకటరమణప్ప మృతి కాంగ్రెస్ పార్టీకి తీరనిలోటని పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు పేర్కొంటూ సంతాపాన్ని వ్యక్తపరిచారు. అదే విధంగా మాజీ మంత్రి వెంకటరమణప్ప పార్థీవదేహాన్ని శుక్రవారం సందర్శించి జిల్లా కలెక్టర్ శుభకళ్యాణ్, ఎస్పీ అశోక్‌లతోపాటు జిల్లా, తాలూకా స్థాయి అధికారాలు నివాళి అర్పించి సంతాపాన్ని వ్యక్తపరిచారు.



## స్వచ్ఛమైన ఓటర్ల జాబితా రూపకల్పనకు రాజకీయ పార్టీలు సహకరించాలి

- తిరుపతి జిల్లా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్

**తిరుపతి, మే 29 ప్రభాతవార్త ప్రతినిధి:** తిరుపతి జిల్లాలో స్వచ్ఛమైన నిర్దిష్టమైన ఓటర్ల జాబితా రూపకల్పనకు అన్ని రాజకీయ పార్టీలు సహకరించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సలిజామల వెంకటేశ్వర్ కోరారు. ఓటర్ల జాబితాను స్వచ్ఛంగా నిర్దిష్టంగా రూపొందించేందుకు అన్ని పార్టీలు సహకరించాలని తెలిపారు. భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియ 2026 భాగంగా 2002 ఓటర్ల జాబితాలోని ఓటర్ల జాబితా ప్రస్తుత ఓటర్ల జాబితాకి సంబంధించిన ఓటర్ల జాబితా మ్యాపింగ్ ప్రక్రియను బిఎల్‌ఓలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ ప్రత్యేక కార్యక్రమం ద్వారా ఓటర్ల జాబితాలోని తప్పులను సరిదిద్దడం, కొత్త ఓటర్లను నమోదు చేయడం, మరణించిన, వేరే ప్రాంతాలకు తరలిపోయిన వారి పేర్లను తొలగించడం ఓటరు జాబితా తయారీ అత్యంత కీలకమైన ప్రక్రియ అని, ఎలాంటి తప్పులు లేకుండా పారదర్శకమైన జాబితా రూపకల్పనకు పార్టీలు తమ వంతు సహకారం అందించాలని అన్నారు. శుక్రవారం తిరుపతి జిల్లా కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో డిఆర్‌ఒ నరసింహులుతో కలిసి జిల్లాలోని గుర్తింపు పొందిన అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులతో భారత ఎన్నికల సంఘం మార్గదర్శకాలు మేరకు స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (సర్) పై కార్యక్రమంపై సమావేశం నిర్వహించారు. ఇంటింటా సర్వే చేసే బూత్ లెవల్ అధికారులతో సమన్వయం చేసుకోవాలని తెలిపారు. ఇళ్ళ సర్వే, ముసాయిదా ఓటర్ల జాబితా ప్రకటన, అభ్యంతరాల స్వీకరణ మరియు తుది జాబితా ప్రచురణ తేదీల గురించి పార్టీలకు వివరించడం జరిగింది. ఫారంలు సమర్పించిన ఓటర్లందరూ ముసాయిదా జాబితాలో చేర్చడం జరుగుతుందన్నారు. ప్రజాస్వామ్యం బలోపేతం కోసం ఓటర్ల జాబితాల స్వచ్ఛతను కాపాడడం కోసం ప్రతి పౌరుడి బాధ్యత అని ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా అమలు చేద్దామన్నారు. అందరి సమన్వయంతో ఓటర్ల జాబితా కోసం కృషిచేస్తున్నామని, అన్ని రాజకీయ పార్టీలు సహకరించాలని తెలిపారు.



## ఇవిఎంల గోడౌన్ తనిఖీ

**తిరుపతి, మే 29 ప్రభాతవార్త ప్రతినిధి:** తిరుపతి జిల్లాకు సంబంధించి ఇవిఎంలను భద్రపరిచిన గోదాము వద్ద 24గంటలూ నిరంతరం నిఘా, పటిష్టమైన భద్రత ఉండాలని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ సలిజామల వెంకటేశ్వర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ఎన్నికల కమీషన్ ఆదేశాల మార్గదర్శకాలు ఆదేశాల మేరకు త్రైమాసిక తనిఖీల్లో భాగంగా తిరుపతి జిల్లాలోని రేణిగుంట విమానాశ్రయం సమీపంలోని సెంట్రల్ వేర్ హౌసింగ్ గోడౌన్ నందు భద్రపరచబడిన ఇవిఎం స్ట్రాంగ్ రూమ్, సిడబ్ల్యూసి గోదామును శుక్రవారం జిల్లా కలెక్టర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా గోదాములో భద్రపరిచిన ఇవిఎం యంత్రాలు బియులు, సియూలు, వివి ప్యాట్‌లను, అక్కడి భద్రతా ఏర్పాట్లను, సిసి కెమెరాలు, సీలింగ్ తదితరాలను జిల్లా కలెక్టర్ క్షుణ్ణంగా పరిశీలన చేసారు. ఇవిఎం గోడౌన్ రిజిస్టర్ నందు సంతకం చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల సెల్ సూపరింటెండెంట్ భాగ్యలక్ష్మి ్మ, రేణిగుంట తహసిల్దార్ శ్యాంప్రసాద్, పవన్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## 'అక్షరాస్యతలో అగ్రస్థానంలో నిలబెడదాం'

**తిరుపతి, మే 29 ప్రభాతవార్త ప్రతినిధి:** తిరుపతి జిల్లాను అక్షరాస్యతలో అగ్రస్థానంలో నిలబెట్టడానికి అన్ని శాఖలు కలిసి కట్టుగా కృషి చేయాలని జిల్లా రెవిన్యూ అధికారి నరసింహులు పిలుపునిచ్చారు. కలెక్టరేట్‌లో శుక్రవారం మధ్యాహ్నం అక్షర ఆంధ్ర ఉల్లాస్ కార్యక్రమం జిల్లా సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ప్రతీ ఒక్కరి సమిష్టి కృషితో జిల్లాలో నిరక్షరాస్యత నిర్మూలించవచ్చు అన్నారు. తిరుపతి జిల్లాలో ఈ ఏడాది మొత్తం 86,345 మంది నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా మార్చడమే లక్ష్యం అని, దీనికి అన్ని శాఖల సహకారం అందించాలన్నారు. జిల్లా అభివృద్ధికి నిరక్షరాస్యత ఒక పెద్ద అవరోధంగా మారిందని దానిని అధిగమించే అందుకు డ్వాక్రాసంఘాలలో, ఉపాధి హామీ నిరక్షరాస్యులను ప్రతీ మహిళను అక్షరాసులుగా తీర్చిదిద్దాలని అన్నారు. జూన్ 30 వరకు నిరక్షరాసులను వాలంటీర్లను గుర్తించి అక్షర ఆంధ్ర యాప్‌లో నమోదు చేస్తారు. జులైలో తరగతులు ప్రారంభించి మార్చి 2027 వరకు నిర్వహించనున్నారు. వయోజనులకు చదవడం, రాయడంతో పాటు చరవాణి వినియోగం, బ్యాంకు లావాదేవీలు, సైబర్ నేరాలపై అవగాహన పెంపొందించడం, డిజిటల్ లావాదేవీలు, చట్టాలు ఆరోగ్యంపై అవగాహనతో పాటు ప్రజాప్రయోజనకర యాప్‌ల పై అవగాహన కల్పించేలా బోధించనున్నారు. అక్షరాంధ్ర ఉల్లాస్ పథకాన్ని విజయవంతం చేయడం లక్ష్యం అక్షరాంధ్ర యాప్‌లో పేర్ల నమోదును ప్రారంభించాం క్షేత్రస్థాయిలో అధికారులు సిబ్బందికి అవగాహన సమావేశాలు నిర్వహిస్తామన్నారు. వాలంటీర్లను ఎంపిక చేసి శిక్షణ ఇస్తామని వయోజన విద్య నోడల్ ఆఫీసర్ ఎన్.ప్రసాద్ తెలిపారు.

# దళిత, గిరిజనులపై దాడులు, హత్యలు, అత్యాచారాలు పెరిగిపోతున్నాయి

- ఒంగోలులో బికెఎంయు జాతీయ కౌన్సిల్ సమావేశాల్లో ప్రధాన కార్యదర్శి గుల్జార్ సింగ్ గోరియా

**ఒంగోలు (కలెక్టరేట్), మే 29 ప్రభాతవార్త:** దేశవ్యాప్తంగా దళితులు, గిరిజనులు, పేద వర్గాలపై దాడులు, హత్యలు, అత్యాచారాలు పెరుగుతున్నాయని, వారికి తగిన రక్షణ కల్పించడంలో కేంద్ర ప్రభుత్వం విఫలమైందని భారతీయ ఖేత్ మజ్దూర్ యూనియన్ (బికెఎంయు) జాతీయ ప్రధాన కార్యదర్శి గుల్జార్ సింగ్ గోరియా విమర్శించారు. ఒంగోలులో జరిగిన బీకేఎంయూ జాతీయ కౌన్సిల్ సమావేశాల్లో ఆయన మాట్లాడుతూ మణిపూర్ సహా పలు రాష్ట్రాల్లో గిరిజనులు, మహిళలపై జరిగిన ఘటనలు ఆందోళనకరమని పేర్కొన్నారు. దేశంలో పేదరికం, నిరుద్యోగం, ధరల పెరుగుదల తీవ్రంగా పెరిగాయని, సామాన్య ప్రజల జీవన ప్రమాణాలు దిగజారుతున్నాయని అన్నారు. కేవలం ఉచిత బియ్యం పంపిణీతో పేదరికం నిర్మూలన సాధ్యంకాదని, నిత్యావసర వస్తువుల ధరల నియంత్రణ, ఉపాధి అవకాశాల కల్పనపై ప్రభుత్వం దృష్టి సారించాలని సూచించారు. పెట్రోల్, డీజిల్, వంటగ్యాస్ ధరల పెరుగుదల వల్ల ప్రజలపై అదనపు భారం పడుతోందని విమర్శించారు. దళితులు, గిరిజనులు, బిసిలు, ఇతర వెనుకబడిన వర్గాలకు రిజర్వేషన్లు పూర్తిస్థాయిలో అమలు కావడం లేదని ఆరోపించారు. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరణ చేయడం వల్ల పేద యువతకు ఉద్యోగ అవకాశాలు తగ్గిపోతున్నాయని పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా లక్షకు పైగా ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలు మూతపడటం విద్యా రంగానికి పెద్ద దెబ్బ అని అన్నారు. విద్యార్థుల పుస్తకాలు, విద్యా సామగ్రి, ఫీజులపై పన్నుల భారం పెరగడంతో పేద కుటుంబాల పిల్లలు చదువుకు దూరమవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. విశ్వవిద్యాలయాల్లో కూడా వివక్షత పెరుగుతోందని, దళిత, గిరిజన విద్యార్థులపై వేధింపులు జరుగుతున్నాయని ఆరోపించారు. ఆర్ఎస్ఎస్ భావజాలాన్ని గ్రామీణ ప్రాంతాల్లో విస్తరింపజేస్తూ ప్రజలను విభజించే ప్రయత్నాలు జరుగుతున్నాయని విమర్శించారు. గిరిజన ప్రాంతాల్లో సహజ వనరులపై హక్కులు కోల్పోతున్న పరిస్థితి నెలకొందని, అడవులపై ఆధారపడి జీవించే ఆదివాసీల జీవన విధానం ప్రమాదంలో పడిందన్నారు. ప్రభుత్వ భూములను పేదలకు పంపిణీ చేయకుండా కార్పొరేట్ సంస్థలకు కేటాయించడం వల్ల సామాజిక అసమానతలు పెరుగుతున్నాయని పేర్కొన్నారు. పేదలకు ఇళ్ల స్థలాలు, సాగుభూములు అందించడంలో ప్రభుత్వాలు చిత్తశుద్ధితో వ్యవహరించడం లేదన్నారు. నల్లధనాన్ని వెలికితీసి ప్రజల ఖాతాల్లో డబ్బులు జమ చేస్తామని ఇచ్చిన హామీలు అమలు కాలేదని విమర్శించారు. దేశ సంపద కొద్దిమంది కార్పొరేట్ సంస్థల చేతుల్లో కేంద్రీకృతమవుతోందని, ఇది ప్రజాస్వామ్యానికి ప్రమాదకరమని వ్యాఖ్యానించారు. వ్యవసాయ కార్మికులు, కౌలు రైతులు, అసంఘటిత రంగ కార్మికులు తీవ్రమైన ఆర్థిక సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నారని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో దళిత, గిరిజన కాలనీల్లో ఇప్పటికీ తాగునీరు, రహదారులు, మురుగునీటి పారుదల, విద్య, వైద్య సదుపాయాలు అందుబాటులో లేవన్నారు. ఉపాధి హామీ పథకానికి తగిన నిధులు కేటాయించి గ్రామీణ పేదలకు ఏడాది పొడవునా పని కల్పించాలని డిమాండ్ చేశారు. పేదలు పోరాటాల ద్వారా సాధించుకున్న అనేక కార్మిక, సామాజిక హక్కులను క్రమంగా బలహీనపరిచే చర్యలు జరుగుతున్నాయని ఆరోపించారు. దళితులు, గిరిజనులు, మహిళలు, వ్యవసాయ కార్మికులు సంఘటితమై తమ హక్కుల కోసం పోరాడాలని పిలుపునిచ్చారు. ప్రతి గ్రామంలో వ్యవసాయ కార్మిక సంఘం యూనిట్లను ఏర్పాటు చేసి ఉద్యమాలను విస్తృతం చేయాలని సూచించారు. రాజకీయాల్లో కూడా కార్మిక వర్గాల ప్రాతినిధ్యం పెరగాలని, స్థానిక సంస్థల నుంచి శాసనసభల వరకు పేద వర్గాల స్వరం వినిపించేలా కృషి చేయాలని కోరారు. ఈ సమావేశంలో బికెఎంయు జాతీయ అధ్యక్షులు ఎన్. పెరియస్వామి, సిపిఐ జాతీయ కార్యదర్శి అనీ రాజా, జాతీయ, రాష్ట్ర నాయకులు, వివిధ రాష్ట్రాల ప్రతినిధులు, ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు పాల్గొన్నారు.

### ఎడి పి.కిరణ్ కుమార్‌కు ఘన వీడ్కోలు

**విజయవాడ, మే 29 ప్రభాతవార్త ప్రతినిధి:** సమాచార, పౌర సంబంధాల శాఖ డైరెక్టరేట్‌లో అడిషనల్ డైరెక్టర్‌గా విధులు నిర్వర్తించి పదవీ విరమణ చేస్తున్న పి.కిరణ్ కుమార్‌ను సీఆర్ మీడియా అకాడమీ తరపున మేనేజర్ ఎం.భాస్కర్ నారాయణ, సిబ్బంది శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు పదవీ విరమణ శుభాకాంక్షలు తెలియజేశారు. డైరెక్టరేట్ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో పి.కిరణ్ కుమార్ సమాచార శాఖలో పలు కీలక బాధ్యతలు నిర్వర్తిస్తూ విశిష్ట సేవలు అందించారని కొనియాడారు. మీడియా, ప్రజా సంబంధాల రంగంలో ఆయన అనుభవం, సేవా దృక్పథం యువ అధికారులకు ఆదర్శమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా పి.కిరణ్ కుమార్ మాట్లాడుతూ, తన సేవా కాలంలో సహకరించిన అధికారులు, సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సీఆర్ మీడియా అకాడమీ జూనియర్ అసిస్టెంట్ లవరాజు పీఎస్ శ్రీనివాస జీవన్, సిబ్బంది ఆదిత్య జె.రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## దెబ్బతిన్న విద్యుత్ లైను యుద్ధ ప్రాతిపదికన పునరుద్ధరణ



**తిరుపతి, మే 29 ప్రభాతవార్త ప్రతినిధి:** ఎస్‌పిడిసిఎల్ పరిధిలోని నెల్లూరు, కడప జిల్లాల్లో గురువారం రాత్రి బలమైన గాలి, వర్షం కారణంగా పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. కడప జిల్లాలోని కొండాపురం, మైదుకూరు, మైలవరం, జమ్మలమడుగు, ప్రొద్దుటూరు గ్రామీణ, దువ్వూరు, రాజుపాలెం, చాపాడు మండలాల్లోని 28 గ్రామాల్లోనూ, నెల్లూరు జిల్లాలోని కావలి గ్రామీణ, కొండాపురం, కోవూరు, ముత్తుకూరు, జలదంకి, దగదర్తి, అల్లూరు మండలాల్లోని 15 గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడిందని తెలియజేశారు. బలమైన గాలి, వర్షం కారణంగా ఈ రెండు జిల్లాల్లో 26 ఫీడర్లు, 114 కిలోమీటర్ల మేరకు విద్యుత్ లైన్లు, 213 స్తంభాలు, 131 ట్రాన్స్‌ఫార్మర్లు దెబ్బతిన్నాయన్నారు. తద్వారా ఈ రెండు జిల్లాల్లో 19 మండలాలల్లోని 35 గ్రామాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడగా, ఆయా సర్కిళ్ల సూపరింటెండింగ్ ఇంజనీర్ల పర్యవేక్షణలో విద్యుత్ శాఖ అధికారులు, సిబ్బంది శుక్రవారం మధ్యాహ్నానికి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించినట్లు ఎస్‌పిడిసిఎల్ సిఎండి శివశంకర్ లోతేటి తెలిపారు.



# దర్జాగా ఫైనల్లో గుజరాత్

## గిల్ సూపర్ సెంచరీ

*క్వాలిఫయర్-1లో మిస్సయితే, క్వాలిఫయర్-2లో అందుకుంది. రాజస్థాన్ రాయల్స్ ఆశలను గల్లంతు చేస్తూ గుజరాత్ టైటాన్స్ దర్జాగా ఫైనల్లో ప్రవేశించింది. మొదట పేస్ చతుష్టయం రబడ, హోల్డర్, సిరాజ్, ప్రసిద్ధ్... రాజస్థాన్‌ను 214 పరుగులకే కట్టడి చేయగా... ఆ తర్వాత శుభ్‌మన్ గిల్ సెంచరీకి తోడు సాయి సుదర్శన్ మెరుపులతో లక్ష్యాన్ని ఆడుతూ పాడుతూ అందుకుంది. గుజరాత్ టైటాన్స్‌పై 8 వికెట్ల తేడాతో నెగ్గి ఫైనల్‌కు చేరుకుంది. ఆదివారం ఆర్సీబీతో ట్రోఫీ పోరుకు రెడీ అయింది.*

**న్యూచండీఘర్:**ఫైనల్ చేరాలంటే తప్పక గెలవాల్సిన మ్యాచ్‌లో గుజరాత్ టైటాన్స్ ఆల్‌రౌండ్‌షో చేసింది. రాయల్స్ ఉంచిన 215 లక్ష్యాన్ని ఛేధించేందుకు క్రీజ్‌లోకివచ్చిన శుభమన్ గిల్(53 బంతల్లో 104; 15 ఫోర్లు, 3సిక్స్‌లు),సాయి సుదర్శన్(32 బంతుల్లో 58, 8 ఫోర్లు, ఓ సిక్స్) తమ మోటో ఏంటో తొలి ఓవర్లో 19 రన్స్ పిండుకోవడం ద్వారా నిరూపించాడు. అక్కడి నుండి వీరిద్దరూ జోరుకు ఎదురులేకపోయింది. 6ఓవర్లకు 69 రన్స్‌కు, 8.4 ఓవర్లకు వంద మార్కును దాటించారు. చూస్తుండగానే జీటీ స్కోరు 11.5 ఓవర్లలో 150 రన్స్ దాటింది. ఈ క్రమంలో గిల్ 30 బంతుల్లో, సాయి 23బంతుల్లో హాఫ్ సెంచరీలు పూర్తిచేశారు. అదే జోరు కొనసాగిస్తూ తొలి వికెట్‌కు 12.5 ఓవర్లలో 167 పరుగులు జోడించి గెలుపు పక్కా చేశారు. ఈ జోడీని చివరకు బ్రిజేష్ విడదీశాడు. గిల్ 47బంతుల్లో సెంచరీ చేసిన తర్వాత అర్చర్ బౌలింగ్‌లో వెనుదిరిగాడు. మిగతా పనిని సుందర్(16), బట్లర్(9నాటౌట్), తేవాటియా(17 నాటౌట్) పూర్తి చేశారు. మరో 8 బంతులు జీటీకి 7 వికెట్ల ఘనవిజయాన్ని అందుకుంది.

**మరోసారి ఆ 15 ఏళ్ల యూనివర్సల్ బేబీ బాస్ దిక్కయ్యాడు. ముల్లన్ పూర్ స్టేడియంలో రాజస్థాన్‌తో కీలక మ్యాచ్‌లో ఒక వైపు వికెట్లు పడుతున్నా... మరో ఎండ్‌లో కొరకరాని కొయ్యగా మారాడు. తన శైలికి భిన్నంగా బంతులను కాచుకుంటూనే రాజస్థాన్ బౌలర్లను చితక్కొట్టాడు. ముల్లాన్‌లో వరుసగా రెండోసారి సెంచరీని తృటిలో మిస్సయ్యాడు. 47 బంతుల్లో 96 రన్స్ సాధించాడు. అందులో 8 ఫోర్లు, 7 సిక్స్‌లు ఉన్నాయి. కేవలం నాలుగు పరుగుల తేడాతో సెంచరీ చేజారినా జట్టుకు బలమైన పునాది వేశాడు. దీంతో రాజస్థాన్ 20 ఓవర్లలో 6 వికెట్లకు 214 రన్స్‌కు చేరుకుంది. అలాగే ఈ ఐపీఎల్ సీజన్‌లో వైభవ్ మొత్తం పరుగులు 776కు, మొత్తం సిక్స్‌లు 72కు చేరుకున్నాయి.**

టాస్ నెగ్గి మొదట బ్యాటింగ్‌కు దిగిన రాయల్స్‌కు ఆరంభంలోనే మైండ్ బ్లాంక్ అయ్యే షాక్ తగిలింది. జైస్వాల్ (1)ను ఇన్నింగ్స్ ఫస్ట్ ఓవర్లో సిరాజ్, ధ్రువ్ జురెల్ (7)ను రెండో ఓవర్లో కగిసో రబాడ అవుట్ చేయడంతో 9 రన్స్‌కే 2 వికెట్లు కోల్పోయింది.

**రియాన్ పరాగ్, దాసున్ షనక ఫెయిల్**

థర్డ్ డౌన్‌లో వచ్చిన రవీంద్ర జడేజా(35 బంతుల్లో 45; 5 ఫోర్లు, ఒక సిక్స్) మరో ఎండ్‌లో ఉన్న వైభవ్ సూర్యవంశీతో కలిసి ఇన్నింగ్స్ చక్కదిద్దే ప్రయత్నం చేశాడు. మూడో వికెట్‌కు 73 పరుగులు జోడించి రాయల్స్ ఇన్నింగ్స్‌ను దారిలో పెట్టారు. ఈ దశలో దురదృష్టవశాత్తూ చేతికి గాయం కావడంతో జడేజా రిటైర్డ్ హర్ట్‌గా వెనుతిరిగాడు. ఆ తర్వాత వచ్చిన కెప్టెన్ రియాన్ పరాగ్ రాగానే ఫోర్, సిక్స్ కొట్టి మంచి ఊపు మీద కనిపించినప్పటికీ.. 11 రన్స్ మాత్రమే చేసి జేసన్ హోల్డర్ బౌలింగ్ లో అవుట్ అయ్యాడు. దాసున్ షనక(3), జోఫ్రా ఆర్చర్ (7) కూడా చేతులెత్తేయడంతో రాజస్థాన్ కష్టాలు రెట్టింపయ్యాయి.

**సెంచరీ మిస్ చేసుకున్న వైభవ్**

ఒకవైపు వికెట్లు పడుతున్నా..వైభవ్ మాత్రం గుజరాత్ బౌలర్లపై బాదుడు కంటిన్యూ చేశాడు. 31 బంతుల్లో హాఫ్ సెంచరీ పూర్తి చేసిన తర్వాత మరింత దాటిగా ఆడాడు. 17వ ఓవర్లో సుందర్ బౌలింగ్‌లో రెండు సిక్స్‌లతో సెంచరీకి చేరువయ్యాడు. అయితే కేవలం 4 రన్స్ తేడాతో మరోసారి సెంచరీ మార్క్‌ను మిస్ చేసుకున్నాడు. రబాడ బంతికి భారీ షాట్ ఆడే ప్రయత్నంలో అవుటయ్యాడు. మళ్లీ క్రీజులోకి వచ్చిన జడేజా రాజస్థాన్ స్కోర్ బోర్డును పరిగెత్తించాడు. పక్కా ప్లానింగ్ తో ఆడిన జడ్డూ 45 రన్స్ చేసి జట్టు భారీ స్కోర్ చేయడంలో కీ రోల్ ప్లే చేశాడు.

**ఫెరీరా విధ్వంసం, చివరి ఓవర్లో 27 రన్స్**

స్పిన్నర్ రషీద్ ఖాన్ వేసిన ఇన్నింగ్స్ లాస్ట్ ఓవర్లో డోనోవన్ ఫెరీరా(11బంతుల్లో 38) విధ్వంసం సృష్టించాడు. ఆ ఓవర్లో వరుసగా 6, 6, 6, 2, 6 బాదేశాడు. ఒకే ఓవర్లో ఏకంగా 27 రన్స్ పిండుకోవడంతో రాజస్థాన్ స్కోరు 214కు చేరింది.



ఆట



# మెస్సీపై వీడిన సస్పెన్స్

## ఫిఫా వరల్డ్‌కప్‌కు అర్జెంటీనా జట్టు ప్రకటన

**బ్యూనర్ఎయిర్స్:** స్టార్ ఫుట్‌బాలర్ లియోనెల్ మెస్సీ ఫిఫా ప్రపంచకప్ ఆడడంపై ఉత్కంఠ వీడింది. గాయంతో మెస్సీ జూన్ 11 నుంచి ప్రారంభం కానున్న ఫిఫా ప్రపంచ కప్‌లో ఆడేది అనుమానమేన్న వార్తలు వచ్చాయి. వాటికి తెరదించుతూ ఫిఫి ప్రపంచకప్‌కు తమ జట్టును అర్జెంటీనా ప్రకటించింది. మెస్సీకి సారథ్య బాధ్యతలు అప్పగించింది. 2022లో మెస్సీ సారథ్యంలోనే అర్జెంటీనా... ఫుట్‌బాల్ ప్రపంచకప్ అందుకుంది.

26 మంది సభ్యులతో కూడిన జట్టును అర్జెంటీనా కోచ్ లియోనిల్ స్కలోని వెల్లడించారు. ఇటీవల ఇంటర్‌మియామీ తరఫున మ్యాచ్ ఆడుతూ మెస్సీ గాయపడ్డాడు. అయితే గాయం నుంచి కోలుకుని మెస్సీ పూర్తిగా అందుబాటులో ఉన్నారని, జట్టుకు నాయకత్వం వహించనున్నారని స్కలోని స్పష్టం చేశారు. దీంతో మెస్సీ రికార్డు స్థాయిలో ఆరోసారి ఫిఫా ప్రపంచకప్‌లో బరిలోకి దిగనున్నాడు. ఇప్పటికే 8 సార్లు బాలన్ డిఓర్ గెలిచిన మెస్సీపై అభిమానుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. నాలుగేళ్ల క్రితం ఖతార్ వేదికగా జరిగిన అర్జెంటీనాకు ప్రపంచకప్ అందించిన మెస్సీ మరోసారి మ్యాజిక్ చేస్తాడని ఆశిస్తున్నారు. ఈసారి కూడా అదే జోరును కొనసాగించాలని జట్టు లక్ష్యంగా పెట్టు కుంది. అయితే రియల్ మాడ్రిడ్ యువ ఆటగాడు ఫ్రాంకో మస్తాంటునోకు జట్టులో చోటు దక్కలేదు. ఈ ఏడాది ఫిఫా ప్రపంచకప్‌కు అమెరికా, కెనడా, మెక్సికో సంయుక్తంగా ఆతిథ్యం ఇస్తున్నాయి. గ్రూప్-జీలో ఉన్న అర్జెంటీనా తమ తొలి మ్యాచ్‌ను జూన్ 17న కన్సాస్ సిటీ వేదికగా అల్జీరియాతో ఆడనుంది. అదే గ్రూప్‌లో అల్జీరియా, ఆస్ట్రియా, జోర్డాన్ జట్లు ఉన్నాయి.

**అర్జెంటీనా జట్టు : గోల్‌కీపర్స్:** మార్టినేజ్, జిరోనిమా, జువాన్ ముసో; **డిఫెండర్స్:** గొంజాలో మాంటిల్, మోలినా, లిసాండ్రో మార్టినేట్, నికోలస్, లియోనార్డో, క్రిస్టియానా రొమారియో, మెదీనా, నికోలస్ ఫికో; **మిడ్‌ఫీల్డర్లు:** లియాండ్రో, రోడ్రిగో డీపాల్, పాలేసియస్, ఎంజో ఫెర్నాండేజ్, మాక్ అలిస్టర్, జియోవాని, బార్కో; **స్ట్రైకర్లు:** లియోనిల్ మెస్సీ (కెప్టెన్), నికోలస్ పాజ్, థియాగో అల్మడా, గొంజాలెజ్, జులియన్ అల్వరేజ్, గులియానో సిమోని, లౌతారో మార్టినేజ్, జోస్ లోపేజ్.

## గుకేశ్ ఓటమి; రెండో స్థానంలో ప్రజ్ఞానంద

**ఓస్లో:** నార్వే చెస్ టోర్నీలో ప్రపంచ ఛాంపియన్, భారత యువ గ్రాండ్‌మాస్టర్ గుకేష్‌కు నిరాశ ఎదురైంది. ప్రపంచ నంబర్ వన్ కార్ల్‌సన్ చేతిలో గుకేశ్ ఓటమి పొంది మొత్తం 3.5 పాయింట్లతో పట్టికలో అట్టడుగు స్థానానికి చేరాడు. మరోవైపు భారత గ్రాండ్‌మాస్టర్ ప్రజ్ఞానంద వరుసగా మూడో విజయం అందుకున్నాడు. జర్మనీకి చెందిన విన్సెంట్ కీమర్‌పై విజయం సాధించి 6 పాయింట్లతో రెండో స్థానాన్ని నిలబెట్టుకున్నాడు. టోర్నమెంట్‌ను నెమ్మదిగా ప్రారంభించిన కార్ల్‌సెన్ మొత్తం 4.5 పాయింట్లతో నాలుగో స్థానానికి చేరుకున్నాడు.

ప్రపంచ ఛాంపియన్‌గా నిలిచిన తర్వాత గుకేశ్‌కు ఈ టోర్నీ కఠిన పరీక్షగా మారింది. ఫ్రాన్స్‌కు చెందిన అలీరెజా 8.5 పాయింట్లతో అగ్రస్థానంలో కొనసాగుతున్నాడు. గుకేశ్ కొన్ని సందర్భాల్లో దూకుడుగా ఆడే ప్రయత్నం చేయడం అవకాశంగా మారిందని కార్ల్‌సన్ తెలిపాడు.



## ఫ్రెంచ్ ఓపెన్‌లో సంచలనం

**పారిస్:**ఫ్రెంచ్ ఓపెన్‌లో మరో సంచలనం నమోదైంది. ఐదో సీడ్ బెన్ షెల్టన్(అమెరికా) రెండో రౌండ్‌లోనే టోర్నీనుంచి నిష్క్రమించాడు.ప్రపంచ 62వ ర్యాంకర్ రఫెల్ కోలిగ్నాన్(బెల్జియం) అద్భుత ప్రదర్శనతో షెల్టన్‌ను 6-4, 7-5, 6-4 తేడాతో ఓడించి మూడో రౌండ్‌లో ప్రవేశించాడు. తొలిసెట్ నుంచే కొలిగ్నాన్..షెల్టన్‌పై ఆధిపత్యం చెలాయించాడు. అమెరికన్ ఆటగాడికి ఎలాంటి అవకాశం ఇవ్వకుండా వరుస సెట్లలో నెగ్గాడు. ఈ విజయంతో గత ఏడాది యూఎస్ ఓపెన్‌లో మూడోరౌండ్‌కు చేరిన కొలిగ్నాన్ మరోసారి సత్తా చాటాడు. కాగా షెల్టన్‌కు ఇది నిరాశజనకంగా మారింది. 2023లో వింబుల్డన్ తర్వాత గ్రాండ్ స్లామ్ టోర్నీల్లో మూడో రౌండ్‌కు ముందే షెల్టన్ నిష్క్రమించడం ఇదే తొలిసారి.

## సింగపూర్ ఓపెన్‌లో సింధూకు నిరాశ; క్వార్టర్స్‌లోనే నిష్క్రమణ

**సింగపూర్:**భారత్ స్టార్ ప్లేయర్ పీవీ సింధూకు సింగపూర్ ఓపెన్‌లో నిరాశ ఎదురైంది. మహిళల సింగిల్స్ క్వార్టర్‌ఫైనల్లో ప్రపంచ నంబర్‌వన్ ఆన్ సెయంగ్(దక్షిణ కొరియా) చేతిలో వరుస గేమ్‌ల్లో ఓటమిపాలైంది. 48 నిమిషాల పాటు సాగిన ఈ మ్యాచ్‌లో ఆన్ సెయంగ్ 21-17, 21-14తో విజయం సాధించి సెమీఫైనల్‌కు చేరుకుంది. మ్యాచ్ ఆరంభం నుంచి సింధు దూకుడుగా ఆడుతూ ప్రత్యర్థిపై ఒత్తిడి తీసుకురావడానికి ప్రయత్నించింది. తొలి గేమ్‌లో ఒక దశలో స్కోరును 13-14కు దగ్గర చేసినా, కీలక సమయాల్లో ఆన్ సెయంగ్ చూపించిన కచ్చితత్వం సింధును వెనక్కి నెట్టింది. నెట్ వద్ద ఆన్ ఆధిపత్యం, వేగవంతమైన రిటర్న్లు ఆమెకు తొలి గేమ్‌ను అందించాయి. రెండోగేమ్‌లో ఆన్ 6-0తో ఆధిక్యంలోకి వెళ్లడంతో సింధుపై ఒత్తిడి పెరిగింది. అయినా భారత షట్లర్ పుంజుకుని స్కోరును 12-14కు తీసుకొచ్చి పోరును ఆసక్తికరంగా మార్చింది. కానీ చివర్లో చేసిన కొన్ని అనవసర తప్పిదాలు సింధూ అవకాశాలను దెబ్బతీశాయి. ఈ ఓటమితో ఒలింపిక్ చాంపియన్ ఆన్ సెయంగ్‌పై సింధూకు వరుసగా తొమ్మిదో పరాజయం ఎదురైంది.



కాగా ఆల్‌ఇంగ్లాండ్ రన్నరప్ లక్ష్యసేన్ పురుషుల సింగిల్స్ క్వార్టర్ ఫైనల్లో కొకి వటాంబే(జపాన్) చేతిలో 19-21, 21-15, 15-21తో ఓడి ఇంటదారి పట్టాడు. పురుషుల డబుల్స్ జోడీ సాత్విక్-చిరాగ్;మిక్స్‌డ్ డబుల్స్ జోడీ ధృవ్- తనీషాప్రత్యర్థులపై గెలుపుతో సెమీఫైనల్లో ప్రవేశించారు.

# వారాంతంలో సెన్సెక్స్, నిఫ్టీకి భారీ నష్టాలు

## 5 లక్షలకోట్ల ఇన్వెస్టర్ల సంపద ఆవిరి




**ముంబయి, మే 29:** ఈక్విటీ సూచీలు వారాంతంలో భారీ నష్టాలను చవిచూసాయి. భౌగోళిక ఉద్రిక్తతలు తగ్గడంలో నెలకొన్న అనిశ్చితి కీలకంగా కనిపిస్తోంది. వరుసగా మూడోసారి కూడా నష్టాలే చవిచూసాయి. సాధారణస్థాయికి తగ్గిన రుతుపవనాలు వంటివి కారణం అయినట్లు అంచనా. మధ్యప్రాచ్యం శాంతి ఒప్పందంపైనే ఇన్వెస్టర్లు ఎక్కువ ఫోకస్ పెట్టారు. లేనిపక్షంలో ముడిచమురుధరలపై ప్రభావం చూపిస్తుందన్నది తెలిసిందే. చివరి అర్ధగంటలో అమ్మకాల వత్తిడి పెరిగింది. బిఎస్‌ఇలో ఇన్వెస్టర్ల సంపద రూ.5 లక్షలకోట్లు క్షీణించింది. ఎంఎస్‌సిఐ సూచీలో ఫెడరల్‌బ్యాంకు, ఎంసిఎక్స్ ఎక్స్ఛేంజి, నాల్కో, ఇండియన్ బ్యాంకులను తన గ్లోబల్ స్టాండర్డ్ సూచీలో చేర్చడం కూడా ఒక కారణం అయింది. అదే సమయంలో హ్యుండై మోటార్స్, జుబిలియంట్ ఫుడ్‌వర్క్స్, కళ్యాణ్ జ్యూయెలర్స్, రైల్ వికాస్ నిగమ్‌లను ఎంఎస్‌సిఐ తొలగించింది. బిఎస్‌ఇ సెన్సెక్స్ 1092.06 పాయింట్లు క్షీణించి 74,775.74 పాయింట్లవద్ద స్థిరపడితే నిఫ్టీ 50 సూచీ 359.40 పాయింట్లు దిగజారి 23,547 పాయింట్ల వద్దకు చేరింది.

గడచిన మూడు సెషన్లలోసెన్సెక్స్ 2.23శాతం, నిఫ్టీ 2.01శాతం క్షీణించాయి. రిలయన్స్ ఇండస్ట్రీస్ 2.17 శాతం, హెచ్‌డిఎఫ్‌సి 1.86, ఐసిఐసిఐబ్యాంకు 1.28శాతంచొప్పున నిఫ్టీలో ఎక్కువ వెనుకబడ్డాయి. మార్కెట్లలో బిఎస్‌ఇ మిడ్‌క్యాప్ సూచీ 1.25 శాతం, స్మాల్‌క్యాప్ సూచీ 0.61 శాతం చొప్పున క్షీణించినట్లు స్పష్టం అయింది. బిఎస్‌ఇలో మొత్తం 1670 షేర్లు లాభాల్లో వెళితే 2599 షేర్లు క్షీణించాయి. 212 కంపెనీల షేర్లు మాత్రం ఎలాంటి మార్పులు లేకుండా కొనసాగాయి. ఇక విదేశీ కరెన్సీ మార్కెట్‌లో భారత్ రూపాయి డాలర్‌తో చెలామణి 95.99వద్ద కదలాడింది. అంతకుముందురోజు 95.58కంటే మరికొంత క్షీణించింది. ఎంసిఎక్స్‌లో పసిడి ఫ్యూచర్ ధరలు 0.59శాతం క్షీణించి రూ.1.56 లక్షలకు చేరాయి. కమోడిటీ మార్కెట్లలో బ్రెంట్‌ముడి చమురు జులై నెల సెటిల్‌మెంట్ ధరలు 1.54 శాతం క్షీణించి బ్యారెల్‌కు 92.27డాలర్లుగా కొనసాగాయి. సెన్సెక్స్‌లో టెక్‌మహీంద్ర, హెచ్‌సిఎల్, ఎల్‌అండ్‌టి, ఇన్ఫోసిస్ షేర్లు మినహా అన్నిషేర్లు నష్టపోయాయి. పవర్‌గ్రిడ్‌కార్పొరేషన్, ఇండిగో, ఎన్టీపీసీ, మహీంద్ర అండ్ మహీంద్ర, టాటాస్టీల్ షేర్లు ఎక్కువ నష్టాలు చవిచూసాయి. అంతర్జాతీయ మార్కెట్‌లో బంగారం ఔన్స్‌ధర 4530 వద్ద కొనసాగింది. ఇక విదేశీ పోర్టుఫోలియో ఇన్వెస్టర్లు మార్కెట్లనుంచి1040కోట్లు విత్‌డ్రాచేసారు.



# 91.97లక్షల కోట్లతో ఆర్బీఐ ఆస్తి అప్పుల పట్టీ

**ముంబయి, మే 29:** భారతీయ రిజర్వ్ బ్యాంక్ ఆస్తిఅప్పుల పట్టీ ఈ ఆర్థిక సంవత్సరంలో రికార్డు స్థాయి వృద్ధి నమోదుచేసింది. దేశీయ పెట్టుబడులు, పసిడి నిల్వలు, విదేశీ పెట్టుబడులు భారీగా పెరగడంతో, ఆర్బీఐ బ్యాలెన్స్ షీట్ పరిమాణం 20.6 శాతం పెరిగి రూ. 91.97 లక్షల కోట్లకు చేరింది. శుక్రవారం విడుదల చేసిన వార్షిక నివేదికలో ఆర్బీఐ వివరాలను వెల్లడించింది. కేంద్ర ప్రభుత్వానికి రికార్డు స్థాయిలో రూ. 2.87 లక్షల కోట్ల డివిడెండ్‌ను ప్రకటించింది.

నివేదిక ప్రకారం 2026 మార్చి 31 నాటికి ఆర్బీఐ బ్యాలెన్స్ షీట్, అంతకుముందు ఏడాదితో పోలిస్తే రూ. 15.72 లక్షల కోట్ల మేర పెరిగింది. గత ఏడాది ఇదే సమయానికి బ్యాలెన్స్ షీట్ విలువ రూ. 76.25 లక్షల కోట్లుగా ఉంది. ఈ వృద్ధిరేటు గత ఆర్థిక సంవత్సరం 8.2 శాతంతో పోలిస్తే చాలా ఎక్కువ. తాజా వృద్ధితో ఆర్బీఐ ఆస్తిఅప్పులపట్టీ పరిమాణం దేశ జీడీపీలో 26.4 శాతానికి సమానంగా ఉంది. దేశీయ పెట్టుబడులు 44.9 శాతం, పసిడి నిల్వలు 63.8 శాతం, విదేశీ పెట్టుబడులు 7.9 శాతం పెరిగాయి. దీనివల్ల మొత్తం ఆస్తులలో దేశీయ ఆస్తుల వాటా గతేడాది 25.7 శాతం నుంచి 29.1 శాతానికి పెరిగింది.

విదేశీ ఆస్తుల వాటా 74.3 శాతం నుంచి 70.9 శాతానికి తగ్గింది. విదేశీ ఆస్తుల కన్నా దేశీయ ఆస్తులు వేగంగా పెరిగినట్లు ఇది సూచిస్తోంది. ఈ ఏడాది ఆర్బీఐ తన ఎకనామిక్ క్యాపిటల్ ఫ్రేమ్‌వర్క్‌లో భాగంగా రూ. 1.09 లక్షల కోట్లను తక్షణావసరాల నిధికి బదిలీ చేసింది.

కేంద్రానికి ప్రకటించిన రూ. 2.87 లక్షల కోట్ల డివిడెండ్, ప్రస్తుతం పశ్చిమాసియా సంక్షోభం వల్ల ఎదురవుతున్న ఆర్థిక సవాళ్లను ఎదుర్కోవడానికి ప్రభుత్వానికి ఎంతగానో దోహదపడనుంది. గత కొన్ని సంవత్సరాలుగా ఆర్బీఐ బ్యాలెన్స్ షీట్ క్రమంగా పెరుగుతూ వస్తోంది. 2023లో రూ. 63.45 లక్షల కోట్లుగా ఉన్న బ్యాలెన్స్ షీట్, 2024లో రూ. 70.47 లక్షల కోట్లకు, 2025లో రూ. 76.25 లక్షల కోట్లకు పెరిగి, తాజాగా రూ. 91.97 లక్షల కోట్లస్థాయిని బ్రేక్‌చేసింది.

# డేటా సెంటర్లలో గ్లోబల్ టాప్ అమెరికా

**న్యూఢిల్లీ, మే 29:** డిజిటల్ ఆర్థిక వ్యవస్థకు వెన్నుదన్నుగా నిలుస్తున్న డేటా సెంటర్ల రంగంలో అమెరికా అగ్రస్థానంలో ఉంది. ప్రపంచవ్యాప్తంగా ఉన్న మొత్తం డేటా సెంటర్లలో సగం అమెరికాలోనే ఉండటం డిజిటల్ ప్రపంచంపై ఆ దేశ పట్టును స్పష్టం చేస్తోంది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, క్లౌడ్ కంప్యూటింగ్, డేటా స్టోరేజ్‌కు విపరీతమైన డిమాండ్ పెరుగుతున్న నేపథ్యంలో, ఈ ఆధిక్యం మరింత ప్రాధాన్యం సంతరించుకుంది. ప్రపంచవ్యాప్తంగా 11,700కు పైగా డేటా సెంటర్లు ఉండగా, ఒక్క అమెరికాలోనే 5,427 సెంటర్లు ఉన్నాయి. ఇది ప్రపంచంలోని మొత్తం డేటా సెంటర్లలో సుమారు 46 శాతానికి సమానం. ఆ తర్వాత 529 సెంటర్లతో జర్మనీ రెండో స్థానంలో, 523 సెంటర్లతో యునైటెడ్ కింగ్‌డమ్ (యూకే) మూడో స్థానంలో ఉన్నాయి. 449 డేటా సెంటర్లతో చైనా నాలుగో స్థానంలో, 337 సెంటర్లతో కెనడా ఐదో స్థానంలో నిలిచాయి. ఇక ఈ జాబితాలో మన దేశం 14వ స్థానంలో ఉంది. భారత్‌లో ప్రస్తుతం 153 డేటా సెంటర్లు ఉన్నాయని నివేదికలు స్పష్టం చేస్తున్నాయి. డేటా సెంటర్లు అంటే కంప్యూటర్ వ్యవస్థలను కలిగి ఉండే మౌలిక సదుపాయాలు. భారీ మొత్తంలో సమాచారాన్ని నిల్వ చేయడానికి, ప్రాసెస్ చేయడానికి, టెలికమ్యూనికేషన్ల కోసం ఇవి అత్యంత అవసరం. స్టాటిస్టా, క్లౌడ్‌సీన్ విడుదల చేసిన ఈ గణాంకాలు కేవలం డేటా సెంటర్ల సంఖ్యను మాత్రమే సూచిస్తాయి. అమెరికాలోని కొన్ని హైపర్‌స్కేల్ సెంటర్లు ఇతర దేశాల్లోని చిన్న సెంటర్ల కంటే ఎన్నో రెట్లు ఎక్కువ కంప్యూటింగ్ శక్తిని కలిగి ఉంటాయి. వచ్చే ఐదేళ్లలో ప్రపంచవ్యాప్తంగా దాదాపు 100 గిగావాట్ల కొత్త డేటా సెంటర్ సామర్థ్యం తోడవుతుందని నిపుణుల అంచనా. అమెరికాలోని వర్జీనియా, టెక్సాస్, కాలిఫోర్నియా వంటి రాష్ట్రాల్లో డేటా సెంటర్లు కేంద్రీకృతం కావడం వల్ల విద్యుత్, నీటి వినియోగం, గ్రిడ్ స్థిరత్వంపై ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి.




# 7.51 బిలియన్ డాలర్లు క్షీణించిన ఆర్బీఐ ఫోరెక్స్ ఖజానా

**ముంబయి, మే 29:** భారతీయ రిజర్వుబ్యాంకు ఈనెల 22తో ముగిసిన వారానికిగాను విదేశీ కరెన్సీ రిజర్వు వివరాలను వెల్లడించింది. 7.51 బిలియన్ డాలర్లు క్షీణించి మొత్తం నిల్వలు 681.38 బిలియన్ డాలర్లుగా ఉన్నట్లు వెల్లడించింది. భారత్‌రూపాయి దారుణంగా పడిపోవడం కూడా ఇందుకు కొంత కారణం అయింది. ఫోరెక్స్ రిజర్వులు బంగారం నిల్వలపరంగాను, విదేశీ కరెన్సీ ఆస్తులపరంగాను చోటుచేసుకున్నట్లు ఆర్బీఐ అంచనావేసింది. బంగారంనిల్వలు కూడా 4.53బిలియన్ డాలర్లు క్షీణించి 114.78 బిలియన్ డాలర్లకు చేరాయి. విదేశీ కరెన్సీ ఆస్తులపరంగా 2.8 బిలియన్ డాలర్లు క్షీణించి 543.03 బిలియన్ డాలర్లకు చేరాయి. డాలరేతర కరెన్సీలు యూరో, యెన్, పౌండ్,స్టెర్లింగ్ వంటివాటి మారకం విలువల హెచ్చుతగ్గులను కూడా కరెన్సీ ఆస్తులుగా పరిగణిస్తారని ఆర్బీఐ తెలిపింది. విదేశీప్రయాణాలు కుదించుకోవడం, ఇంధన వినియోగం తగ్గించుకోవడ, బంగారం కొనకుండా ఉండటం వంటి వాటితో పొదుపుచేయాలని ప్రధానిమోడీ కూడా పలుసార్లు దేశ ప్రజలకు విజ్ఞప్తిచేసారు. ఇందుకు ప్రధానకారణం కూడా విదేశీ కరెన్సీ నిల్వలు తగ్గడమే. బంగారం నిల్వలు 4.53 బిలియన్ డాలర్లు తగ్గి 114.786 బిలియన్ డాలర్లుగా ఉన్నాయి. స్పెషల్‌డ్రాయింగ్‌రైట్స్ (ఎస్‌డిఆర్‌లు) 77 మిలియన్ డాలర్లు తగ్గి 18.748 బిలియన్ డాలర్లుగా ఉన్నట్లు సెంట్రల్‌బ్యాంకు వివరించింది. ఐఎంఎఫ్ వద్ద భారత్ రిజర్వుస్థాయి 33 మిలియన్ డాలర్లు క్షీణించి 4.818 బిలియన్ డాలర్లుగా ఉందని ఆర్బీఐ నివేదిక తెలిపింది.






# లక్షకోట్ల డాలర్ల మార్కెట్ క్యాప్ దాటిన మైక్రాన్

**ముంబయి, మే 29:**ప్రపంచ సెమీకండక్టర్ రంగంలో మరో సంచలనం నమోదైంది. ప్రముఖ మెమరీ చిప్ తయారీ సంస్థ మైక్రాన్ టెక్నాలజీ, ట్రిలియన్ డాలర్ల మార్కెట్ క్యాపిటలైజేషన్‌ను బ్రేక్‌చేసింది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సృష్టిస్తున్న ప్రభంజనంతో కంపెనీ షేర్లు రికార్డు స్థాయికి చేరగా, ఈవిజయం వెనుకఉన్న భారత సంతతి సీఈఓ సంజయ్‌మెహ్రోత్రా కృషి ఇపుడు చర్చనీయాంశం అయింది. కాన్పూర్‌లో పుట్టిన మెహ్రోత్రా, సిలికాన్ వ్యాలీ శిఖరాలను అధిరోహించడానికి ముందు ఎన్నో సవాళ్లను ఎదుర్కొన్నారు. బర్కిలీలో ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్‌లో మాస్టర్స్ పూర్తి చేసిన మెహ్రోత్రా, 1988లో శాన్‌డిస్క్ కంపెనీని హరారీ, యువాన్‌లతో కలిసి స్థాపించారు. ఫ్లాష్ మెమొరీ రంగంలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టిన ఈ సంస్థ, 2016లో సుమారు 16 బిలియన్ డాలర్ల డీల్‌తో వెస్ట్రన్ డిజిటల్‌లో విలీనమైంది. ఫోర్బ్స్ కథనం ప్రకారం ఆ తర్వాత ఏడాది, అంటే 2017లో సంజయ్ మెహ్రోత్రా మైక్రాన్ టెక్నాలజీ సీఈఓగా బాధ్యతలు చేపట్టారు.



# మార్కెట్‌లోకి టయోటా ఎలక్ట్రిక్ 'ఎబెల్లా'

**ముంబయి, మే 29:** టయోటా కిర్లోస్కర్ మోటార్ భారత ఆటోమొబైల్ మార్కెట్లోకి తన తొలి పూర్తి స్థాయి ఎలక్ట్రిక్ కారు అర్బన్ క్రూయిజర్ 'ఎబెల్లా'ను విడుదల చేసింది. ఈ మిడ్‌సైజ్ ఎలక్ట్రిక్ ఎస్‌యూవీ టాప్ వేరియంట్ ధరను రూ. 23.60 లక్షలు ఎక్స్‌షోరూమ్‌గా కంపెనీ నిర్ణయించింది. మారుతీ సుజుకీ ఈవిటారా ప్లాట్‌ఫామ్ ఆధారంగా రూపొందిన ఈ కారు మార్కెట్లో ఉన్న హ్యుందాయ్ క్రెటా ఎలక్ట్రిక్, ఎంజీ జెడ్ఎస్ ఈవీ, టాటా కర్వ్ ఈవీలకు గట్టి పోటీ ఇవ్వనుంది. ఇందులో 61 కిలోవాట్ అవర్స్ (కేడబ్ల్యూహెచ్) సామర్థం గల శక్తిమంతమైన బ్యాటరీ ప్యాక్‌ను అమర్చారు. దీన్ని ఒక్కసారి ఛార్జ్ చేస్తే ఏకంగా 543 కిలోమీటర్ల దూరం ప్రయాణించవచ్చని కంపెనీ తెలిపింది. ఈ కారు గరిష్ఠంగా 171 హార్స్ పవర్ శక్తిని, 189 న్యూటన్ మీటర్ల టార్క్‌ను విడుదల చేస్తుంది. స్పోర్టివ్ లుక్‌తో ఉన్న ఈ కారును కేఫ్ వైట్, బ్లూయిష్ బ్లాక్, స్పోర్టింగ్ రెడ్ వంటి ఆకర్షణీయమైన రంగుల్లో విడుదలచేసింది.

కారు లోపలి భాగం బ్లాక్, బ్రౌన్ కలర్ కాంబినేషన్‌తో లగ్జరీ స్థాయిలో ఉంది. ఇందులో పనోరమిక్ సన్‌రూఫ్, 10.1 అంగుళాల ఇన్ఫోటైన్‌మెంట్ డిస్‌ప్లే, వెంటిలేటెడ్ సీట్లు, వైర్‌లెస్ ఛార్జింగ్, జేబీఎల్ సౌండ్ సిస్టమ్, ఎయిర్ ప్యూరిఫైయర్ వంటి ఎన్నో ఆధునిక ఫీచర్లు ఉన్నాయి. ప్రయాణికుల భద్రత కోసం ఈ కారులో ఏకంగా 7 ఎయిర్‌బ్యాగ్‌లు, 360డిగ్రీల కెమెరాతో పాటు ప్రమాదాలను ముందుగానే గుర్తించి ఆపే లెవెల్ 2 ఏడీఏఎస్ సాంకేతికతను కూడా అర్బన్ క్రూయిజర్ 'ఎబెల్లా'లో జోడించారు.

Printed and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., and printed at Sy No.658/A , NH-5, Ankireddy Palem, Guntur Dist-522005. Ph:2355939, 2512322(0863), 9848812526. RNI No : APTEL / 2004 / 13725, Editor : *Damerla Sai Baba, Postal Licence/AP/Vj/GTR/57/08-10 *Responsible for selection of News under the PRBAct. Regd.: No.H/SD/337/12-14